
'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 223

శుక్రవారం 28-4-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



గ్రేడ్ 'సి'లో మేఘన, అంజలి

బీసీసీఐ కాంట్రాక్ట్‌ల ప్రకటన.. ఆంధ్ర మహిళా క్రికెటర్లకు చోటు - 12లో



బలహీన నమూనాలతోనే..


అమెరికాలో బ్యాంకింగ్ సంక్షోభంపై ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ - 13లో



అమరులకు ఘన నివాళి

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు మందుపాతర పేల్చిన ఘటనలో అమరులైన పోలీసులు, డ్రైవర్‌కు ప్రజలు ఘనంగా నివాళులర్పించారు.


వివరాలు 6లో ▸



శాంతితోనే సత్సంబంధాలు

సరిహద్దు సమస్యలన్నీ పరిష్కారం అయితేనే సత్సంబంధాలు ఉంటాయని చైనాకు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ తేల్చిచెప్పారు.

వివరాలు 6లో ▸



సిసోడియా కస్టడీ పొడిగింపు

ఢిల్లీ మద్యం స్కామ్ కేసులో ఆప్ నేత మనీశ్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీని కోర్టు మే 12వ తేదీ వరకు పొడిగించింది.

వివరాలు 6లో ▸



'కల్యాణం' ఎవరికో?

దశాబ్దాలుగా కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న కల్యాణ కర్ణాటక ప్రాంతంలో పాగా వేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది.

వివరాలు 6లో ▸

సాధికారత సుస్థిరం

వైఎస్సార్ చేయూత, ఆసరా, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, సున్నా వడ్డీతో మహిళలకు మరింత విస్తృతంగా జీవనోపాధి మార్గాలు

- గ్రామ స్థాయిలో సుస్థిర ఆర్థిక ప్రగతి దిశగా వేగంగా అడుగులు
- మహిళలు తయారు చేసే వస్తువులకు మంచి మార్కెటింగ్
- బహుళజాతి కంపెనీలతో అనుసంధానం
- ఇప్పటివరకూ చేయూత ద్వారా 9 లక్షల మందికి స్వయం ఉపాధి
- ఈ ఏడాది 1,500 లక్షల 'ఉపాధి' పనిదినాలు లక్ష్యం
- రోడ్ల నాణ్యత బాగుండాలి.. కనీసం ఐదేళ్లు నిలిచేలా పనులు
- ఇంజనీర్లు నాణ్యతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు



సాక్షి, అమరావతి: మహిళా సాధికారత దిశగా రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తున్న నేపథ్యంలో వైఎస్సార్ చేయూత, ఆసరా, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, సున్నా వడ్డీ ద్వారా జీవనోపాధి మార్గాలను మరింత విస్తృతం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. చేయూత లబ్ధిదారులకు వరుసగా నాలుగేళ్ల పాటు క్రమం తప్పకుండా ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు గుర్తు చేశారు. ఆసరా, సున్నా వడ్డీ, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం పథకాల కింద కూడా నిర్దేశిత వ్యవధి ప్రకారం ఆర్థిక సాయాన్ని అందిస్తున్నామన్నారు. ఒకవైపు ఆర్థిక సాయంతో పాటు మరోవైపు బ్యాంకుల ద్వారా

మిగతా 2వ పేజీలో ▶

జిల్లాకు రెండు మహిళా సూపర్ మార్కెట్లు

గ్రామీణ ప్రాంతాల్లో నిత్యావసర వస్తువులను మార్కెట్ ధర కంటే తక్కువకే అందించాలన్న లక్ష్యంతో స్వయం సహాయక సంఘాల మహిళల ఆధ్వర్యంలో సూపర్ మార్కెట్లను నెలకొల్పుతున్నట్లు సీఎం జగన్‌కు అధికారులు వివరించారు. జిల్లాకు కనీసం రెండు సూపర్ మార్కెట్లను ఏర్పాటు కానున్నట్లు చెప్పారు. ఇప్పటికే 27 చేయూత మహిళా మార్టులు ఏర్పాటయ్యాయని వివరించారు. ఒక్కో సూపర్ మార్టును నెలకు కనీసం రూ.30 లక్షలు టర్నోవర్ లక్ష్యంగా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. వ్యాపారాన్ని అభివృద్ధి చేసేందుకు డోర్ డెలివరీ, ఆన్‌లైన్ బుకింగ్, వాట్సాప్ బుకింగ్ సౌకర్యాలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. మల్టీ నేషనల్ కంపెనీల భాగస్వామ్యంతో ఉత్పత్తుల్లో కనీసం 8 నుంచి 25 శాతం మార్జిన్ ఉండేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కాకినాడ జిల్లా సామర్లకోటలో 'వస్త్ర' పేరుతో ఏర్పాటైన దుస్తుల తయారీ యూనిట్‌లో 200 మంది మహిళలు ఉపాధి పొందుతున్నారని, ట్రెండ్స్, అజియో లాంటి కంపెనీలతో ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. చిత్తూరు జిల్లా కురుబలకోటలో చింతపండు ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా సుమారు 3 వేల కుటుంబాలకు చేయూత లభిస్తున్నట్లు వివరించారు.

అవినాశ్ అరెస్టుకు సీబీఐ అత్యుత్సాహం

- ఆయన లక్ష్యంగానే దర్యాప్తు సాగుతోంది.. కానీ, కిరాయి హంతకుడు మాత్రం బయట..
- సీబీఐ తీరు చట్ట విరుద్ధమన్న ఎంపీ అవినాశ్ న్యాయవాది
- 'హియర్ సే ఎవిడెన్స్' ఆమోదయోగ్యం కాదు
- కేసు సీబీఐకి బదిలీ తర్వాత దస్తగిరి 2 నెలలపాటు ఢిల్లీలోనే..
- వివేకా కుమార్తె సునీత మాటమార్చారు
- లేఖను ఎందుకు దాచారన్న దానిపై దర్యాప్తు ఏదీ?
- ముందస్తు బెయిల్ ఇవ్వాలని హైకోర్టుకు విజ్ఞప్తి
- వివేకా హత్య కేసులో అవినాశ్ పిటిషన్‌పై వాదనలు



సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కిరాయి హంతకుడు బయట తిరిగేందుకు పూర్తిగా సహకరిస్తున్న కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ).. ఎలాంటి సాక్ష్యాలు, ఆధారాలు లేకుండా కడప ఎంపీ అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేయడానికి అత్యుత్సాహం ప్రదర్శిస్తోందని అతని తరఫు సీనియర్ న్యాయవాది టి. నిరంజన్‌రెడ్డి వాదించారు. అవినాశ్‌ను లక్ష్యంగా చేసుకుని మాత్రమే దర్యాప్తు చేస్తోంది తప్ప.. ఇతర కీలక అంశాలను పట్టించుకోవడం లేదన్నారు. వైఎస్ వివేకా హత్య కేసును సీబీఐ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. ఈ కేసులో సీబీఐ అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ అవినాశ్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సురేందర్ గురువారం మరోసారి

మిగతా 10వ పేజీలో ▶

ఏకపక్షంగా విచారణ

వివేకా హత్యపై సోషల్ మీడియాలో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి వీడియో వైరల్ 10లో

న్యూస్‌రీల్

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ షెడ్యూల్ విడుదల



ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను మే 24 నుంచి జూన్ 1 వరకు నిర్వహించనున్నట్టు బోర్డు వెల్లడించింది. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఇంటర్ ఫస్టియర్, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు సెకండియర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారు.

వివరాలు 3లో ▸

తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుల్లో రూ.19 లక్షలు జప్తు

ANTI-CORRUPTION BUREAU

ఏసీబీ అధికారులు వరుసగా రెండో రోజు గురువారం కూడా తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారు. 7 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, రెండు తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించిన సోదాల్లో రూ.19.28 లక్షల అనధికారిక నగదును స్వాధీనం చేసుకున్నారు.

వివరాలు 2లో ▸

యుద్ధ విమానం స్వదేశీ గర్జన

'సాక్షి'తో డీఆర్‌డీవో చైర్మన్ సమీర్ వి.కామత్



రక్షణ పరిశోధన సాంకేతిక రంగంలోకి కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలను ఆహ్వానిస్తోందని డీఆర్‌డీవో చైర్మన్ సమీర్ వి.కామత్ తెలిపారు. 2028 నాటికి స్వదేశీ యుద్ధ విమానం సిద్ధమవుతుందని చెప్పారు. దీనికి సంబంధించి అనుమతుల కోసం వేచి చూస్తున్నట్లు తెలిపారు. నేవల్ బాలిస్టిక్ మిస్సైల్ ప్రయోగం విజయవంతం కావడం శుభ పరిణామన్నారు. అగ్రదేశాల సరసన నిలిచి ఎలైట్ క్లబ్ ఆఫ్ నేషన్స్‌లో చేరడం గర్వకారణమన్నారు. రక్షణ రంగంలో స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు.

- వివరాలు 14లో





విమానాశ్రయం నమూనా

ప్రయాణ 'వైభోగ'పురం

ఏటా 1.80 కోట్ల మంది ప్రయాణించేలా నిర్మాణం

- రూ.5,000 కోట్లతో అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధి
- మొదటి దశలో ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణించేలా నిర్మాణం.. భారీ విమానాలు దిగేలా 3.8 కి.మీ రన్‌వే
- ఒకేసారి 22 విమానాలు ఆగేలా 22 ఎయిర్‌బ్రిడ్జిలు.. రూ.77 కోట్లతో 50.3 ఎకరాల్లో రెండు గేటెడ్ పునరావాస గ్రామాలు
- 3న సీఎం జగన్ చేతుల మీదుగా నిర్మాణ పనులకు శ్రీకారం
- రెండేళ్లలో అందుబాటులోకి తేవాలన్నదే లక్ష్యం

సాక్షి, అమరావతి: గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఉత్తరాంధ్ర అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది. ఇందులో భాగంగా ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన విజయనగరం జిల్లా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని రెండేళ్లలోనే అందుబాటులోకి తేవాలని లక్ష్యం నిర్దేశించుకుంది. ఏటా 1.80 కోట్ల మంది ప్రయాణించేలా దీన్ని నిర్మించనున్నారు. నిర్మాణ బాధ్యతలను పలు అంతర్జాతీయ విమానాశ్రయాలను నిర్మించిన రికార్డు ఉన్న జీఎంఆర్ గ్రూప్ చేపట్టింది. ఇప్పటికే నిర్మాణానికి అవసరమైన అన్ని అనుమతులను ప్రభుత్వం సాధించింది. వాస్తవానికి అంతర్జాతీయ విమానాశ్రయం పనులు ప్రారంభించాక అందుబాటులోకి తేవడానికి మూడేళ్ల సమయం పడుతుంది. అయితే ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో

మిగతా 5వ పేజీలో ▶

'ఇదేం ఖర్మ'.. జనం ఏరీ!

తన సభలకు జనం రాకపోవడంతో టీడీపీ నేతలపై చంద్రబాబు చిందులు

- పెదకూరపాడు, సత్తెనపల్లి సభలు అట్టర్‌ఫ్లాప్‌తో ఆగ్రహం
- జన సమీకరణపై నేతలు దృష్టిపెట్టడం లేదంటూ క్లాస్
- మద్యం, డబ్బు, తాయిలాలు ఇచ్చినా జనం రావడం లేదంటూ నేతల వివరణ



గుండ్లపాలెంలో జనం లేక వెలవెలబోతున్న చంద్రబాబు సభ

సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్రంలో చురుగ్గా పర్యటనలు చేస్తున్నారు. అయితే ఆయన సభలకు ప్రజల నుంచి స్పందన ఉండటం లేదు. మద్యం, డబ్బు, ఇతర తాయిలాలు ఎరవేసినా పెద్దగా జనం రాకపోయేసరికి చంద్రబాబు టీడీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. అందులోనూ జనం ఎక్కువ ఉండేలా కనిపించడానికి ఇరుకిరుకు సందుల్లో సభలు పెడుతున్నారు. 'కిక్కిరిసిన జన సందోహం' అనే బిల్డప్ ఇద్దామనుకుంటున్న పచ్చ మీడియా ప్రణాళికలు ఫలించడం లేదు. ఆ ఇరుకు సందులు కూడా జనం లేక ఖాళీగా కనిపిస్తున్నాయి. దీంతో చంద్రబాబు టీడీపీ నేతలపై మండిపడ్డట్టు తెలిసింది.

ఇదేం ఖర్మ.. జనం రాకపోయే..

తాజాగా పల్నాడు జిల్లా పెదకూరపాడు, సత్తెనపల్లిల్లో చంద్రబాబు సభలు జనం లేక అట్టర్ ఫ్లాప్‌గా నిలిచాయి. దీంతో టీడీపీ శ్రేణుల్లో మనకు 'ఇదేం ఖర్మ.. జనం రాకపోయే' అనే నిర్వేదం అలముకుంది. ఇది కాస్తా చంద్రబాబు ఆగ్రహానికి కారణమైతే.. తెలుగు తమ్ముళ్లకు ఆవేదనను మిగిల్చింది. ఎప్పటి మాదిరిగానే జనం తక్కువగా వచ్చినా నిండుగా కనిపించేలా పెదకూరపాడులో చిన్న ప్రాంతాన్ని సభకు ఎంపిక చేసుకున్నారు. అయినా ఆ చిన్న ప్రాంతం కూడా నిండేంతగా జనం రాకపోవడంతో చంద్రబాబు నేతలపై చిర్రుబుర్రులాడినట్టు సమాచారం. అదే మాదిరిగా సత్తెనపల్లిలోనూ జనం రాకపోవడంతో ముందుగా అనుకున్న షెడ్యూల్‌కు గంటన్నర ఆలస్యంగా

మిగతా 10వ పేజీలో ▶

అమరావతి గ్రాఫిక్స్ అన్నవారు

ఆ భవనాలపై ఎక్కి దూకండి

- శని విరగడ అవుతుంది
- కొండను తవ్వి ఎలుక బొచ్చు కూడా పట్టుకోలేదు
- నాకు వయసు ఒక నంబరే
- నాకున్న స్పిరిట్ జగన్‌కు లేదు
- జగన్ బొమ్మ ఉండాల్సింది మన గోడలపై కాదు పోలీసు స్టేషన్‌లో
- మేడికొండూరు మండలం గుండ్లపాలెం సభలో చంద్రబాబు

10లో

టైమ్‌లైన్ ప్రకారం ఉద్యోగుల సమస్యల పరిష్కారం

- 1 నుంచి ఒక్కో జీవో వరుసగా విడుదల చేస్తాం
- మార్చి 31 నాటికే ఉద్యోగుల బకాయిల్లో 70% చెల్లించేశాం
- మిగతా 30 శాతం క్లియర్ చేసేందుకు టైమ్‌లైన్ నిర్దేశించాం
- కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై త్వరలో నిర్ణయం
- ఉద్యోగ సంఘాలతో చర్చల అనంతరం మంత్రి బొత్స

2లో

కిడ్నీ రాకెట్‌పై సర్కారు సీరియస్

- విశాఖలోని తిరుమల ఆస్పత్రి సీజ్.. రికార్డులు పరిశీలించి విస్తుపోయిన అధికారులు
- అనుమతులు లేకుండా ఐదేళ్లుగా ఆస్పత్రిలో కార్యకలాపాలు
- కేసు నమోదు చేసిన పోలీసులు

2లో

తెలంగాణ

ఇక నాలుగు నెలలే సమయం

- ఎమ్మెల్యేలు కార్యాచరణ రూపొందించుకోవాలి
- బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవంలో సీఎం కేసీఆర్

10లో

ఇదండీ సంగతి



అబ్బే అదేం కాదు! ఈ నియోజకవర్గం అభ్యర్థి.. ఇంట్లో పని ఏదైనా ఉంటే చేసి పెడతానంటున్నాడు!!

'భౌ'బోయ్.. కరుస్తున్నాయ్!

దేశంలో పెరిగిపోతున్న శునకాల దాడులు

- లోకల్ సర్కిల్స్ సర్వే ప్రకారం 82 శాతం మందికి వీధి కుక్కలతో ప్రమాదం
- ప్రపంచ వ్యాప్తంగా రేబిస్ మరణాల్లో 36 శాతం భారత్ నుంచే..
- మృతుల్లో అధికంగా 15 ఏళ్లలోపు చిన్నారులే
- తమిళనాడు, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, గుజరాత్‌లలో ఎక్కువగా కుక్క కాట్లు
- దేశంలో 6.20 కోట్ల వీధి శునకాలు ఉన్నట్టు అంచనా



సాక్షి, అమరావతి: కమ్యూనిటీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ లోకల్ సర్కిల్స్ సర్వే ప్రకారం దేశవ్యాప్తంగా 82 శాతం మంది ప్రజలు నిత్యం వీధి, పెంపుడు శునకాలతో దాడి ముప్పు పొంచి ఉందని నిత్యం భయపడుతున్నారట. ఇందులో 61 శాతం మంది ఇలాంటి దాడులు సర్వ సాధారణమని చెప్పగా.. ఇది గతంతో పోలిస్తే 31 శాతం పెరుగుదలను చూపిస్తోంది. లోకల్ సర్కిల్స్ దేశవ్యాప్తంగా 326 జిల్లాల్లో 53 వేల మందికిపైగా ప్రజల నుంచి ప్రతి స్పందనలు స్వీకరించింది. వీరిలో 67 శాతం పురుషులు, 33 శాతం మహిళలు ఉన్నారు. ప్రతి 10 మందిలో 8 మంది కుక్కల బెడదను తొలగించడంలో అధికారుల సహకారం దూరమైందని అభిప్రాయపడ్డారు. వీధి కుక్కల నియంత్రణ, పెంపుడు కుక్కల డేటా సేకరణలోనూ నిర్లక్ష్యంగా ఉన్నట్టు సర్వే తెలిపింది. కేవలం 10 శాతం మంది మాత్రమే అధికార యంత్రాంగంపై

మిగతా 2వ పేజీలో ▶

స్టేట్ ఆఫ్ పెట్ హోమ్‌లెస్‌నెస్ ఇండెక్స్ గణాంకాల ప్రకారం.. భారతదేశంలో దాదాపు 6.20 కోట్ల వీధి కుక్కలు ఉన్నట్టు అంచనా. దేశంలో అత్యధిక శునకాలు ఉత్తరప్రదేశ్‌లో ఉన్నాయి. ఆ తరువాత స్థానంలో ఒడిశా, మహారాష్ట్ర, రాజస్థాన్ ఉన్నాయి. ఇప్పటికీ తమిళనాడు, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, గుజరాత్‌లలో ఎక్కువగా వీధి శునకాల దాడులు జరుగుతున్నట్టు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌కు నివేదించింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2019 నవంబర్ నుంచి 2022 వరకు దాదాపు 1.60 కోట్ల వీధి కుక్క కాటు కేసులు నమోదయ్యాయి.

భగీరథ మహర్షికి సీఎం జగన్ నివాళి



భగీరథ మహర్షి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీఎం జగన్

సాక్షి,అమరావతి: భగీరథ మహర్షి జయంతి సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమం, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు, శాసనమండలిలో ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి, ఏపీ సగర, ఉప్పర వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జి.రమణమ్మ, గిద్దలూరు వైఎస్సార్‌సీపీ పరిశీలకులు బంగారు శీనయ్య, విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం చైర్మన్ కర్నాటి రాంబాబు హాజరయ్యారు.

పొదుపు కృషికి 'స్కోచ్ గోల్డ్'

- స్త్రీనిధికి కూడా స్కోచ్ అవార్డు
- అభినందించిన ముఖ్యమంత్రి జగన్



సీఎం జగన్‌కు అవార్డును చూపుతున్న ఉప ముఖ్యమంత్రి బూడి

సాక్షి, అమరావతి: పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించడంతో పాటు వాటిని సద్వినియోగం చేసుకుని అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి గాను 'స్కోచ్ సంస్థ' గోల్డ్ అవార్డు అందజేసింది. అలాగే గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థకు అనుబంధంగా పనిచేస్తున్న స్త్రీ నిధికి కూడా స్కోచ్ అవార్డు దక్కింది. వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి పొదుపు సంఘాల మహిళలకు సులభ విధానంలో రుణాలు అందజేస్తున్నందుకు ఈ అవార్డు లభించింది. ఈ రెండు అవార్డులను గురువారం సీఎం జగన్‌కు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్, సెర్ప్ సీఈవో ఇంతియాజ్ చూపించారు. ఈ సందర్భంగా వారిని ముఖ్యమంత్రి జగన్ అభినందించారు.

ఇండ్‌గ్యాప్ ధ్రువీకరణ ప్రారంభం

- సీఎం వైఎస్ జగన్ సమక్షంలో ఒప్పందం
- రైతుల ఉత్పత్తుల ఎగుమతికి దోహదం



సీఎం జగన్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

సాక్షి, అమరావతి: ఇండ్‌గ్యాప్ ధ్రువీకరణ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రారంభించారు. గురువారం సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో ఇండ్‌గ్యాప్ ధ్రువీకరణ ఒప్పంద పత్రాలను క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ జక్సయ్ షా, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది పరస్పరం మార్చుకున్నారు. గ్యాప్ సర్టిఫికేషన్ ద్వారా రాష్ట్ర రైతులు పంట దిగుబడులను తమకు జారీ చేసిన ధ్రువీకరణ పత్రాల ఆధారంగా ప్రీమియం ధరకు నచ్చిన చోట విక్రయించుకోవచ్చు. దేశీయంగానే కాకుండా అమెరికా సహా వందకు పైగా దేశాలకు ఎగుమతి చేసుకునే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. భారత్‌లో మేలైన వ్యవసాయ విధానాలను బలోపేతం చేసే ఉద్దేశంతో క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇండ్ గ్యాప్ ధ్రువీకరణను అభివృద్ధి చేసింది. గ్యాప్ సర్టిఫికేషన్‌లో భాగంగా పండ్లు, కూరగాయలు, సంయోగ పంటలు, తేయాకు, గ్రీన్ కాఫీ, సుగంధ ద్రవ్యాలు అనే ఐదు కేటగిరీలుగా ధ్రువీకరణ చేస్తారు. వీటిని రైతులు వ్యక్తిగతంగా లేదా బృందాలుగా చేయించుకోవచ్చు. ఏపీలో ఏపీఎస్‌వోపీసీఏ ధ్రువీకరణ సేవలను అందిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇండ్ గ్యాప్ అమలు కోసం సుస్థిర వ్యవసాయ ఆహార వ్యవస్థలు అనే పేరుతో ఎఫ్ఏవో–టీసీపీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. కార్యక్రమంలో క్యూసీఐ డైరెక్టర్ డాక్టర్ మనీశ్ పాండే, భారత్‌లో ఎఫ్ఏవో రిప్రజెంటేషన్, ఆఫీసర్ ఇన్‌చార్జి డాక్టర్ కొండారెడ్డి చవ్వా, ఐసీఏఆర్–ఏటీఏఆర్ఐ హైదరాబాద్ డైరెక్టర్ షేక్ ఎన్. మీరా తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో

రూ.19.28 లక్షలు జప్తు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఏడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, రెండు తహసీల్దార్ కార్యాలయాల్లో ఏసీబీ నిర్వహించిన సోదాల్లో రూ.19.28 లక్షల అనధికారిక నగదును స్వాధీనం చేసుకుంది. వరుసగా రెండో రోజు గురువారం కూడా ఏసీబీ అధికారులు ఆయా కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారు. పలు అక్రమాలకు సంబంధించిన పత్రాలు, ఇతర ఆధారాలను గుర్తించారు. నగదుపై అధికారులు ఇచ్చిన వివరణను విశ్లేషించాక సబ్ రిజిస్ట్రార్లు, ఇతరులపై పీసీ చట్టం కింద క్రిమినల్ కేసుల నమోదుతో పాటు, తహసీల్దార్లపై శాఖా పరమైన చర్యలకు సిఫార్సు చేస్తామని డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు.

జప్తు చేసిన నగదు

- గుంటూరు జిల్లా మేడికొండూరు తహసీల్దార్ కార్యాలయం నుంచి రూ.1.04 లక్షలు
- జలుమూరు తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, రెవెన్యూ అధికారి నుంచి రూ.27,500.
- బద్వేల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం విధులు నిర్వహిస్తున్న ఓ ప్రైవేటు ఉద్యోగి వద్ద రూ.2.70 లక్షలు, డాక్యుమెంట్ రైటర్ నుంచి రూ.2.10 లక్షలు
- అనంతపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ ప్రైవేట్ డ్రైవర్ ఎస్‌కే ఇస్మాయిల్ డాక్యుమెంట్ రైటర్ల నుంచి వసూలు చేసిన రూ.2 లక్షలకు పైగా నగదు
- కందుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ చాంబర్ నుంచి రూ.41 వేలు, డాక్యుమెంట్ రైటర్ల నుంచి రూ.94 వేలు జప్తు వన్నం సతీశ్ అనే డాక్యుమెంట్ రైటర్ ఆరు నెలల్లో సబ్ రిజిస్ట్రార్‌కు రూ.94 వేలు, సబ్ రిజిస్ట్రార్ అటెండర్‌కు రూ.1.20 లక్షలు ఫోన్ పే ద్వారా పంపినట్టు గుర్తించారు.
- తిరుపతి రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్ వద్ద రూ.90 వేలు, ఇద్దరు ప్రైవేటు ఉద్యోగుల వద్ద రూ.56 వేలు, జూనియర్ అసిస్టెంట్ వద్ద రూ.9 వేలు
- నర్సాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సబ్ రిజిస్ట్రార్ చాంబర్ నుంచి రూ.30 వేలు, డాక్యుమెంట్ రైటర్ల వద్ద రూ.20 వేలు, సీనియర్ అసిస్టెంట్ వద్ద రూ.9,500, ప్రైవేటు ఉద్యోగి వద్ద రూ.6 వేలు.
- జగదాంబ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం(విశాఖపట్నం)లో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ఓ ప్రైవేటు ఉద్యోగి మూడు విడతల్లో ఓ సబ్ రిజిస్ట్రార్‌కు రూ.90 వేలు పంపినట్టు గుర్తించారు. డాక్యుమెంట్ రైటర్ల నుంచి రూ.39 వేలు స్వాధీనం చేసుకున్నారు.
- తుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్ల నుంచి రూ.20 వేలు, లెక్కల్లోకి రాని మరో రూ.20 వేలు.

ఒక్కరోజులోనే 'సీఎం' సాయం

ఆర్థిక సహాయం అందజేసిన కలెక్టర్
ఓ దివ్యాంగుడికి ఉద్యోగమిస్తూ నియామక పత్రం అందజేత
నార్పలలో తనను కలిసిన బాధితులపై సర్కారు ఔదార్యం

అనంతపురం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తారనేదానికి.. కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలుస్తూ ఆదుకుంటారనడానికి బుధవారం జరిగిన సంఘటనే ఉదాహరణ. తాజాగా.. ఈనెల 26న అనంతపురం జిల్లా పర్యటనలో భాగంగా నార్పలకు విచ్చేసిన సీఎంను వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న పలువురు నేరుగా ఆయన్ను కలిసి తమ సమస్యలను చెప్పుకున్నారు. వారి కష్టాలను విన్న ఆయన చలించిపోయారు. ఆదుకునే విషయంపై అప్పటికప్పుడు కలెక్టర్ గౌతమికి ఆదేశాలు జారీచేశారు. సీఎం ఆదేశాల మేరకు బాధితులతో కలెక్టర్ మాట్లాడి అవసరమైన ఆర్థిక సహాయం అందించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆమె బాధితులకు చెక్‌లు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్ఓ గాయత్రిదేవి, పరిపాలనాధికారి విజయలక్ష్మి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర ఉన్నారు.




ఇటీవల జరిగిన కెమికల్ బ్లాస్ట్‌లో భర్తను కోల్పోయానని అనంతపురం ఎ.నారాయణపురానికి చెందిన చాకలి నవ్య సీఎంకు తెలిపారు. ఇద్దరు చిన్నపిల్లలతో కుటుంబపోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం ఆమె కుటుంబానికి కలెక్టర్ రూ.7 లక్షలు ఆర్థిక సహాయం అందజేశారు.




అనంతపురం ఎ.నారాయణపురానికి చెందిన రాజు, అరుణ కుమారుడు ధనుష్ జన్యుపరమైన సమస్యతో బాధపడుతున్నాడు. వీరు తమ బిడ్డ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లగా ఆ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. అదే విధంగా ధనుష్‌కు అవసరమైన వైద్య చికిత్సలు ఉచితంగా అందించాలని నిర్ణయించారు.




నార్పలకు చెందిన యోగీశ్వరి భర్త రంగారెడ్డి ప్రమాదంలో మరణించాడు. ఇద్దరు కుమారులతో తనకు కుటుంబపోషణ భారంగా మారిందని సీఎం దృష్టికి తీసుకెళ్లింది. ఆమె కుటుంబానికి రూ.2 లక్షలు సాయం అందించారు.

- శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన వి. అమర్‌నాథ్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయాడు. తీవ్ర ఇబ్బందిపడుతున్నట్లు సీఎం దృష్టికి తీసుకొచ్చాడు. ఆ కుటుంబానికి రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందించారు.
- తన మేనల్లుడు చేతన్‌రెడ్డి కండరాల వ్యాధితో బాధపడుతున్నట్లు తాడిపత్రి మండలం ఎర్రగుంటపల్లికి చెందిన కొండారెడ్డి సీఎంకు తెలిపారు. ఆయన కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు.




నార్పల మండలం సిద్ధరాచెర్లకు చెందిన రామచంద్ర సోదరి భవాని కుమారుడు బాలచంద్ర (11) అంగ వైకల్యంతో బాధపడుతున్నాడు. ఆమె కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సహాయం, వీల్ చైర్ అందజేశారు.




నార్పలకు చెందిన రామాంజి విద్యుత్ శాఖలో బిల్ రీడర్‌గా పనిచేసేవాడు. ఈ క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై కుడిచేయి కోల్పోయాడు. ఆయనకు రూ.2 లక్షలతో పాటు, ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం ఇచ్చారు.




అనంతపురానికి చెందిన నారాయణమ్మ కుమారుడు జశ్వంత్‌రెడ్డి (6) తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆమె కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు.




తన భార్య అనారోగ్యంతో బాధపడుతున్నట్లు నార్పలకు చెందిన గంగయ్య సీఎంకు విన్నవించాడు. ఆ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సహాయం, వీల్ చైర్ అందజేశారు.




దివ్యాంగుడైన తనకు మూడు చక్రాల సైకిల్ ఇవ్వాలని నార్పలకు చెందిన నబిరసూల్ సీఎంకు విన్నవించాడు. ఆయనకు ట్రై సైకిల్‌ను అందజేశారు.

టైమ్‌లైన్ ప్రకారం ఉద్యోగుల సమస్యల పరిష్కారం



సాక్షి, అమరావతి: ఉద్యోగుల ప్రతి సమస్యను టైమ్‌లైన్ ప్రకారం పరిష్కరిస్తామని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. మే 1 నుంచి ఉద్యోగులకు సంబంధించిన జీవోలను వరుసగా ఒక్కొటి విడుదల చేస్తామన్నారు. ఉద్యోగుల సమస్యలపై ఏర్పాటైన మంత్రుల కమిటీ గురువారం సచివాలయంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపింది. మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి, ఆర్థిక శాఖ కార్యదర్శి చిరంజీవి చౌదరి, సర్వీసెస్ కార్యదర్శి పోలా భాస్కర్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చించారు. ఈ చర్చల్లో ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.వెంకట్రామిరెడ్డి, ఏపీ ఎన్జీవో ప్రతినిధి శివారెడ్డి, అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. చర్చల అనంతరం మంత్రి బొత్స మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటికే ఉద్యోగుల బకాయిల్లో మార్చి 31 నాటికి 70 శాతం చెల్లించామని గుర్తు చేశారు. మిగతా 30 శాతంలో లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, సరెండర్ లీవ్ వంటి అంశాలను వేగంగా క్లియర్ చేసేందుకు ప్రత్యేకంగా టైమ్‌లైన్ నిర్దేశించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో చర్చించి కొత్త పీఆర్సీ కమిటీ నియామక తేదీని ప్రకటిస్తామని వెల్లడించారు. 2004లో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) కటాఫ్ డేట్‌పై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై చర్చించామన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు ప్రత్యేక విధివిధానాలను రూపొందిస్తున్నట్టు తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఉద్యోగ సంఘాలు చట్టబద్ధంగా వ్యవహరించాల్సిన బాధ్యత వాటిపై ఎంతైనా ఉందని చెప్పారు. ప్రభుత్వంలో ప్రజలతో పాటు ఉద్యోగులు కూడా భాగమనే విషయాన్ని దృఢంగా విశ్వసిస్తున్నామన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. సీపీఎస్‌పై మరోసారి చర్చిస్తామని తెలిపారు.

ప్రభుత్వం సానుకూలంగా ఉంది: వెంకట్రామిరెడ్డి

ఉద్యోగుల సమస్యలను టైమ్‌లైన్ ప్రకారం పరిష్కరిస్తామని మంత్రుల కమిటీ పేర్కొందని ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.వెంకట్రామిరెడ్డి తెలిపారు. ప్రభుత్వంతో చర్చల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉద్యోగుల పెండింగ్ బకాయిల్లో ఇప్పటికే రూ.5,820 కోట్లను ప్రభుత్వం చెల్లించిందన్నారు. పెండింగ్‌లోని డీఏల్లో ఒక డీఏను చెల్లిస్తామన్నారని, వారంలో ఒక డీఏ ఇస్తామన్నారని చెప్పారు. 2004కు ముందు నోటిఫికేషన్‌లో భర్తీ అయిన ఉద్యోగులను ఓపీఎస్ పరిధిలోకి తెస్తామన్నారని వెల్లడించారు. కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టైమ్‌లైన్ కావాలని కోరగా సెప్టెంబర్‌లోగా క్రమబద్ధీకరణ ఉత్తర్వులు ఇస్తామన్నారని పేర్కొన్నారు. కొత్త పీఆర్సీని నియమించాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. అలాగే ఉద్యోగుల హెల్త్ కార్డుల కంట్రిబ్యూషన్‌ను ట్రస్టుకు మళ్లించాలని కోరినట్లు తెలిపారు.

సాధికారత సుస్థిరం



పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

▶ మొదటి పేజీ తరువాయి

స్వయం ఉపాధి కోసం తోడ్పాటు అందిస్తున్నట్టు చెప్పారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై సీఎం జగన్ గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ అమలు, గ్రామీణ రహదారులపై కూడా సమీక్షించి పలు సూచనలు చేశారు. ఆ వివరాలివీ..

చేయూతతో 9 లక్షల మందికి స్వయం ఉపాధి

45 – 60 సంవత్సరాల వయసున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళల సాధికారతే లక్ష్యంగా అమలు చేస్తున్న వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఇప్పటివరకూ 9 లక్షల మంది స్వయం ఉపాధి పొందుతున్నట్లు అధికారులు వెల్లడించారు. హిందుస్తాన్ యూనీ లీవర్, ఐటీసీ లిమిటెడ్, రిలయెన్స్, అజియో, జీవీకే, మహీంద్ర, కాలాగుడి, ఇర్మా, నైనా, పీ అండ్ జీ లాంటి అంతర్జాతీయ సంస్థలతో ఇప్పటికే ఒప్పందాలు జరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా చేయూత మహిళా మార్టులు, వస్త్ర, చింతపండు ప్రాసెసింగ్ యూనిట్, లేస్ పార్కు, ఇ-కామర్స్, ఇ-మిర్చ, బ్యాక్ యార్డు పౌల్ట్రీ, ఆనియన్ సోలార్ డ్రయ్యర్ల లాంటివి చేపడుతున్నట్లు అధికారులు వివరించారు.

ఈ ఏడాది 'ఉపాధి' వ్యయం రూ.8,800 కోట్లు

ఉపాధి హామీపై సమీక్ష సందర్భంగా ఈ ఏడాది 1,500 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకూ 215.17 లక్షల పనిదినాలు కల్పించారు. ఉపాధి హామీ పనిదినాల రూపంలో రూ.5,280 కోట్లు ఖర్చు చేయనున్నారు. మెటీరియల్ రూపంలో రూ.3,520 కోట్లు ఖర్చు చేయనున్నారు. మొత్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.8,800 కోట్లు ఖర్చు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి ఉపాధి హామీ నిధులు సుమారు రూ.880 కోట్లు రావాల్సి ఉందని అధికారులు వెల్లడించగా దీనిపై వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్స్ భవన నిర్మాణాలు గడువులోగా పూర్తి కావాలన్నారు.

మన్నికగా నాణ్యమైన రోడ్లు..

రహదారుల నాణ్యతపై మరింత దృష్టి పెట్టాలని అధికారులను ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారు. కనీసం ఐదేళ్లపాటు నిలిచేలా నాణ్యతా ప్రమాణాలను పాటించాలని స్పష్టం చేశారు. రహదారుల పనులు చేసిన మరుసటి ఏడాదే మళ్లీ మరమ్మతులు చేపట్టాల్సిన పరిస్థితి తలెత్తకూడదన్నారు. ఆ మేరకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంజనీర్లు రోడ్ల నాణ్యతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో ఉపముఖ్యమంత్రి (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ) బూడి ముత్యాల నాయుడు, సీఎస్ డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ పి.బసంత్ కుమార్, సెర్ప్ సీఈవో ఎండీ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర ఆర్థిక ప్రగతి దిశగా..

లబ్ధిదారులు పథకాన్ని అందుకున్న మొదటి ఏడాది నుంచే స్వయం ఉపాధి మార్గాలవైపు మళ్లించే కార్యక్రమాలను పెంచడం వల్ల గ్రామ స్థాయిలో సుస్థిర ఆర్థిక ప్రగతి దిశగా వేగంగా అడుగులు పడతాయని ముఖ్యమంత్రి జగన్ పేర్కొన్నారు. అర్హులైన మహిళలకు అవగాహన పెంపొందించి బ్యాంకు రుణాలు కూడా ఇప్పించి ఉపాధి మార్గాలను సమర్థంగా కొనసాగించాలన్నారు. మహిళలు తయారు చేసే వస్తువులు, ఉత్పాదనలకు సంబంధించి మంచి మార్కెట్ వ్యవస్థఉండాలని, దీనికోసం బహుళజాతి కంపెనీలతో అనుసంధానం కావాలని సూచించారు.

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు



ప్రధాన కేంద్రాల్లో గురువారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	41.4	27.2
రాజమహేంద్రవరం	41.0	26.5
అనంతపురం	40.4	23.9
కడప	38.8	25.8
కర్నూలు	38.2	26.3
విజయవాడ	38.0	27.0
తిరుపతి	38.0	26.0
శ్రీకాకుళం	38.0	24.0
విశాఖపట్నం	37.0	26.2
నెల్లూరు	35.7	28.0
విజయనగరం	34.0	27.0
తెలంగాణలో..		
నల్లగొండ	37.0	21.0
ఆదిలాబాద్	36.8	19.7
హైదరాబాద్	32.7	24.0
మెదక్	32.6	21.3

కిడ్నీ రాకెట్‌పై సర్కారు సీరియస్

తిరుమల ఆస్పత్రి సీజ్

మహారాణిపేట/సింహాచలం: విశాఖపట్నంలో కిడ్నీ రాకెట్ వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖను ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా అధికారులు ఈ ఉదంతంపై విచారణ వేగవంతం చేశారు. దీనిపై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతోపాటు పోలీసులు కూడా సమగ్ర దర్యాప్తు చేపట్టారు. పెందుర్తిలో కిడ్నీ మార్పిడి చేసిన తిరుమల ఆస్పత్రిపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, జీవన్‌దాన్ అధికారులు, పోలీసులు దాడులు నిర్వహించారు. డబ్బు ఆశ చూపించి గత ఏడాది డిసెంబర్ 16వ తేదీన మధురవాడ వాంబే కాలనీకి చెందిన జి.వినయ్‌కుమార్‌కు పెందుర్తి తిరుమల ఆస్పత్రిలో కిడ్నీ తీసుకున్న విషయం తెలిసిందే. ఒప్పందం ప్రకారం రూ.8.50 లక్షలు ఇవ్వకుండా కేవలం రూ.2.50 లక్షలు ఇవ్వడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

ఆస్పత్రికే అనుమతి లేదు

కలెక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశాల మేరకు పెందుర్తిలో కిడ్నీ మార్పిడి చేసిన తిరుమల ఆస్పత్రిపై డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు, జీవన్‌దాన్ కో–ఆర్డినేటర్ రాంబాబు, ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఆస్పత్రి అనుమతులు, ఇటీవల జరిగిన సర్జరీలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో ఆర్థో ఓపీలు, సర్జరీలు చేస్తున్న విషయాన్ని గుర్తించారు. ఇందులో రెండు ఆపరేషన్ థియేటర్లు కూడా ఉండటాన్ని గమనించారు. ఐదేళ్లుగా పెందుర్తిలో తిరుమల ఆస్పత్రి కార్యకలాపాలు సాగిస్తోంది. దీనికి ఎటువంటి అనుమతి లేదని అధికారుల విచారణలో నిర్ధారణ అయింది. కనీసం తాత్కాలిక అనుమతి కూడా లేదన్న విషయం తెలుసుకుని అధికారులు కంగుతిన్నారు. అనుమతులు లేని ఆస్పత్రిలో నిబంధనలకు విరుద్ధంగా, నేరపూరితంగా సర్జరీలు నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. ఆ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ వైద్యుడు మాత్రమే ఉండగా.. కిడ్నీ మార్పిడి ఎలా చేశారు, ఎవరు చేశారన్న విషయంపైనా ఆరా తీశారు. తమ ఆస్పత్రిలో ఎముకలకు సంబంధించిన వైద్యమే తప్ప ఎలాంటి కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జరగలేదని ఆస్పత్రి ఎండీ పరమేశ్వరరావు అధికారులకు చెప్పారు.



తిరుమల ఆస్పత్రి



ఆస్పత్రిని సీజ్ చేస్తున్న అధికారులు

ఆస్పత్రి సీజ్ : వైద్య సేవలు, సౌకర్యాలపై అధికారులు కలెక్టర్ మల్లికార్జునకు ప్రాథమిక నివేదికను అందజేయగా.. ఆస్పత్రిని సీజ్ చేయాలని ఆదేశించారు. దీంతో డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, పెందుర్తి తహసీల్దార్ సమక్షంలో ఆస్పత్రిని సీజ్ చేశారు. మోసం, మానవ అవయవాల మార్పిడి చట్టం 1995, ఐపీసీ 18, 19తో పాటు 420 ఆర్/డబ్ల్యూ 120(బీ) కింద కేసు నమోదు చేశారు.

'భౌ'బోయ్.. కరుస్తున్నాయ్!

▶ మొదటి పేజీ తరువాయి

విశ్వాసం వ్యక్తం చేశారు. ముఖ్యంగా 71 శాతం మంది ప్రజలు స్వచ్ఛ భారత్ కార్యక్రమం కింద విచ్చలవిడి జంతు నిర్వహణకు నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం విశేషం.

36% రేబిస్ మరణాలు భారత్‌లోనే!

దేశంలో జంతువులపై క్రూరత్వ నిరోధక చట్టం–1960 ప్రకారం జంతువులను హింసించడం, చంపడం చట్టవిరుద్ధం. యానిమల్ బర్త్ కంట్రోల్ రూల్–2001 ప్రకారం.. వాటి జనాభాను తగ్గించడానికి వీధి కుక్కలకు స్టెరిలైజేషన్, టీకాలు వేయాల్సి ఉంటుంది. అయితే, చాలా రాష్ట్రాల్లో నిధుల కొరతతో వీధి కుక్కలకు టీకాలు వేయడంలో విఫలమవుతున్నట్టు సర్వే చెబుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా రేబిస్ మరణాలలో 36 శాతం భారతదేశం నుంచే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. అంటే 18వేల నుంచి 20వేల మరణాలు సంభవిస్తున్నాయి. 30నుంచి 60 శాతం మృతుల్లో 15 ఏళ్లలోపు చిన్నారులే ఎక్కువగా ఉంటున్నారు.

శునకాల వేటాడే స్వభావం

వీధి శునకాలకు విచ్చలవిడిగా వేటాడే స్వభావం ఉంటుందని జంతుశాస్త్ర నిపుణులు చెబుతున్నారు. అవి సంచరిస్తున్న ప్రదేశంలో ఆహారం లభించకుంటే చిన్నచిన్న జంతువులను చంపి తింటాయని.. ఆ ప్రక్రియ వాటి మానసిక ప్రవృత్తిని ప్రభావితం చేస్తోందని వాదిస్తున్నారు. ఏటా ఆడ శునకం 20 పిల్లలకు జన్మనిస్తుంది. ఒక్కసారి కారు, బైక్ ప్రమాదంలో శునకం పిల్ల చనిపోతే ఆ వాహనాన్ని శత్రువుగా భావిస్తుంది. అలాంటి వాహనాలు వస్తే దూకుడుగా వెంబడించడం.. దాడి చేయటం వాటికి అలవాటుగా మారుతుందంటున్నారు. గతేడాది మహారాష్ట్రలో అత్యధికంగా 3,46,318 శునకాల దాడుల కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత 3,30,264 కేసులతో తమిళనాడు రెండో స్థానంలో నిలిచింది. ఏపీలో 1,69,378, ఉత్తరాఖండ్‌లో 1,62,422, కర్ణాటకలో 1,46,094, గుజరాత్‌లో 1,44,855, బీహార్‌లో 1,18,354 కేసులొచ్చాయి.

లాభం పండే..!

ఆనందంలో పొగాకు రైతులు

పొగాకు రైతుకు కాలం కలిసొచ్చింది. రెండేళ్లుగా లాభాలే లాభాలు. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా మార్కెట్ ఆశాజనకంగా ఉంది. కర్ణాటకలో రైతులకు మంచి ధర లభించడం.. అక్కడ వేలం ముగియడంతో ఇక్కడ కూడా ఇంచుమించు అవే ధరలు రావడంతో రైతుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. వేలం ప్రారంభంలో కేజీ ధర రూ.200 పలికింది. 43 రోజులు గడుస్తున్నా ధర రూ.195 నుంచి రూ.201 మధ్య పలుకుతోంది. ఒక్కో బ్యారన్‌కు సుమారు రూ.4 లక్షల వరకూ లాభం రావచ్చని రైతులు అంచనా వేస్తున్నారు.


ఒంగోలు-1 వేలం కేంద్రంలో కొనుగోలుకు సిద్ధంగా ఉన్న పొగాకు బేళ్లు

- రూ.195 నుంచి రూ.200 మధ్య నిలకడగా కేజీ పొగాకు ధర
- ఒక్కో బ్యారన్‌కు రూ.3.50 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఆదాయం
- జిల్లాలో 107 మిలియన్ కేజీల కొనుగోళ్లు లక్ష్యం
- ఇప్పటికే 11 వేలం కేంద్రాల్లో 37 మిలియన్ కేజీల కొనుగోళ్లు
- అత్యధికంగా కొండపి ప్లాట్‌ఫాంలో 4.39 మిలియన్ కేజీలు
- అత్యల్పంగా కనిగిరి ప్లాట్‌ఫాంలో 2.0 మిలియన్ కేజీల కొనుగోళ్లు

చీమకుర్తి: పొగాకు రైతుల పంట పండింది. ఈ ఏడాది కూడా ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. కొనుగోళ్లు ప్రారంభించింది మొదలు ఇప్పటి వరకు ప్రారంభంలో పలికిన ధరే నిలకడగా కొనసాగుతోంది. ఫిబ్రవరి 24న పొగాకు కొనుగోళ్లు మొదలవగా, దాదాపు 43 రోజుల పాటు ఇప్పటికీ ప్రారంభపు ధరే రెండుమూడు రూపాయలు అటూఇటుగా కొనసాగుతోంది. కేజీ ధర రూ.200 పలుకుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పొగాకు బోర్డు ఒంగోలు రీజియన్ పరిధిలోని 11 వేలం కేంద్రాల్లో ఇప్పటి వరకూ 37 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు చేశారు.

ఒక్కో బ్యారన్‌కు రూ.3.50 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు లాభాలు...

ఒక్కో బ్యారన్‌కు భూమి నాణ్యతను బట్టి 7 నుంచి 8 ఎకరాల పొగాకు సాగు చేస్తారు. ఎకరా సాగుకు క్యూరింగ్ అయ్యే వరకు రూ.లక్ష ఖర్చవుతుంది. 7 ఎకరాల సాగుకు రూ.7 లక్షల వరకు ఖర్చవుతుండగా, రైతులకు ఒక్కో బ్యారన్‌కు ఖర్చులన్నీపోను రూ.3.50 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు లాభాలు రావచ్చని అంచనా వేస్తున్నారు. రెండేళ్ల కిందట కేజీ పొగాకు ధర రూ.160 నుంచి రూ.170 మధ్యే పలకగా, ఈ ఏడాది రూ.195 నుంచి రూ.200 మధ్య వస్తుండటంతో పొగాకు రైతుల పంట పండిందని మార్కెట్ వర్గాలు అంటున్నాయి.

కొండెక్కిన కౌలు ధరలు...

బ్యారన్ కౌలు ధర నిన్నమొన్నటి వరకు రూ.లక్ష ఉండగా, ఇప్పుడు ఏకంగా రూ.1.60 లక్షలకు పెరిగింది. ఎకరా పొలం కౌలు ఇటీవల వరకు రూ.8 వేల నుంచి రూ.15 వేల మధ్య ఉండగా, పొగాకు ధరలు పెరుగుతుండటంతో నేడు ఒకేసారి రూ.20 వేలకు పెంచారు. దాంతో పొగాకు సాగు చేయాలనుకునే రైతులకు కౌలుకు బ్యారన్‌లు, పొలాలు దొరక్క ఎక్కువ కౌలు ఇచ్చయినా సరే సాగు చేయాలనే ఆలోచనలో ఉన్నారు.

సూర, పండుగుల్లకు సైతం మంచి రోజులు...

రైతులు పండించే పొగాకులో అతి తక్కువ రకమైన సూర పొగాకుకు కూడా మంచి రోజులు వచ్చాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో క్వింటా రూ.1000 నుంచి రూ.2 వేలకు మించి కొనుగోలు చేసే వారు కాదు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో పొగాకుకు పెరిగిన గిరాకీని దృష్టిలో ఉంచుకుని పొగాకు బయ్యర్లు సూరను కూడా గతంలో ఎప్పుడూ లేని విధంగా క్వింటాను రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. అదేవిధంగా కూలీలు సేకరించిన పండుగుల్లను గతంలో ప్రైవేటు డీలర్లు కొనుగోలు చేసేవారు. ఇప్పుడు దాన్ని కూడా పొగాకు బోర్డు ద్వారా నేరుగా కొనుగోలు చేసి దళారులకు వచ్చే లాభాలు నేరుగా కూలీలకు దక్కే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

పొగాకు వేలం కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన పొగాకు పరిమాణం, సరాసరి ధర వివరాలు ఇలా ఉన్నాయి...

ప్లాట్‌ఫాం	పొగాకు పరిమాణం (మిలియన్ కేజీలు)	సరాసరి ధర
వెల్లంపలి-2	3.94	రూ.189.78
ఒంగోలు-1	4.26	రూ.193.28
ఒంగోలు-2	3.05	రూ.192.99
టంగుటూరు-1	3.45	రూ.194.47
కొండపి	4.39	రూ.196.14
పొదిలి	3.09	రూ.194.34
కనిగిరి	2.08	రూ.192.63
కందుకూరు-1	3.39	రూ.195.89
కందుకూరు-2	3.42	రూ.195.04
కలిగిరి	2.44	రూ.192.91
డీసీ పల్లి	3.31	రూ.196.17

కొనుగోళ్ల లక్ష్యం 107 మిలియన్ కేజీలు...

జిల్లాలోని 11 పొగాకు వేలం కేంద్రాల ద్వారా 107 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు 37 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు చేసినట్లు బోర్డు అధికారుల వద్ద ఉన్న గణాంకాలు చెబుతున్నాయి. అత్యధికంగా కొండపి ప్లాట్‌ఫాం ద్వారా 4.39 మిలియన్ కేజీల కొనుగోళ్లతో జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉండగా, కనిగిరి వేలం కేంద్రం 2.0 మిలియన్ కేజీలతో చివరి స్థానంలో ఉంది.

పొగాకు రైతులు సంతోషంగా ఉన్నారు



“ఈ ఏడాది ఒక్కో బ్యారన్‌కు రూ.3.50 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు లాభాలు వచ్చే అవకాశం ఉంది. దీంతో రైతులు చాలా సంతోషంగా ఉన్నారు. పండు గుల్లను ఏరుకునే కూలీలకు కూడా మంచి గిట్టుబాటు ధరలు దక్కే పరిస్థితులు ఉన్నాయి.

– సూరం గురవారెడ్డి, ఒంగోలు–1 ప్లాట్‌ఫాం అసోసియేషన్ ప్రెసిడెంట్, పేర్నమిట్ట

37 మిలియన్ కేజీల కొనుగోలు పూర్తి

ప్రకాశం జిల్లాలో ఈ ఏడాది 107 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు చేయాలని బోర్డు లక్ష్యంగా నిర్ణయించింది. ఫిబ్రవరి 24న జిల్లాలో పొగాకు కొనుగోళ్లు ప్రారంభించాం. 43 రోజుల పాటు జరిగిన వేలంలో ఇప్పటి వరకు సుమారు 37 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు చేశాం. ఈ ఏడాది ఇప్పటి వరకు కేజీ పొగాకు ధర సరాసరిన రూ.194 నుంచి రూ.200 మధ్య నిలకడగా నడుస్తోంది.

– తులసి, ఆర్ఎం, పొగాకు బోర్డు, ప్రకాశం జిల్లా

ఇంటర్‌లో గురుకులాల విద్యార్థుల సత్తా

మెరుగైన ఫలితాలు సాధించడంపై సీఎం జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల పరిధిలోని గురుకులాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో మెరుగైన ప్రతిభ కనబరిచారు. అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించి తమ సత్తా చాటారు. మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులాల విద్యార్థులు ఇంటర్ ఫస్టియర్‌లో 86 శాతం, సెకండియర్‌లో 90 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 1,393 మంది ఫస్టియర్ పరీక్షలకు హాజరవ్వగా.. 1,198 మంది పాస్ అయ్యారు. సెకండియర్‌కు సంబంధించి 1,419 మంది హాజరవ్వగా.. 1,291 మంది ఉత్తీర్ణులయ్యారు. నంద్యాల జిల్లా అరెకల్ బాలికల బీసీ జూనియర్ కాలేజీలోని విద్యార్థినులు ఫస్టియర్‌లో 98.04 శాతం, సెకండియర్‌లో 97.78 శాతం ఉత్తీర్ణత సాధించి రికార్డు సృష్టించారు.

ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో..

డాక్టర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యార్థులు ఇంటర్ ఫస్టియర్‌లో 63.19 శాతం, సెకండియర్‌లో 74.33 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్‌కు సంబంధించి 10,435 మంది పరీక్షలకు హాజరవ్వగా.. 6,594 మంది పాస్ అయ్యారు. సెకండియర్‌లో 11,097 మందికి గాను 8,248 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే గిరిజన సంక్షేమ గురుకుల కాలేజీల్లో ఫస్టియర్‌లో 54.03 శాతం, సెకండియర్‌లో 62.69 శాతం మంది విద్యార్థులు పాస్ అయ్యారు. ఫస్టియర్‌లో మొత్తం 4,248 మంది పరీక్షలకు హాజరవ్వగా 2,295 మంది ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో 4,999 మందికి గాను 3,134 మంది ఉత్తీర్ణులయ్యారు.

విద్యార్థులు, అధ్యాపకులకు సీఎం అభినందనలు..

ఇంటర్ పరీక్షల్లో గురుకుల విద్యాసంస్థలు మెరుగైన ఫలితాలు సాధించడంపై సీఎం వైఎస్ జగన్ అభినందించారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ చెప్పారు. గురువారం సీఎంను కలిసి ఫలితాల గురించి వివరించినట్టు మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులాల విద్యార్థులు అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించడం గొప్ప విషయమని.. ఇందుకు కృషి చేసిన విద్యార్థులు, అధ్యాపకులకు సీఎం జగన్ అభినందనలు తెలిపారని మంత్రి పేర్కొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ విడుదల

- 24 నుంచి జూన్ 1 వరకు పరీక్షలు
- ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు ఒకే రోజు
- ఉదయం, మధ్యాహ్నం నిర్వహణ
- జూన్ 5 నుంచి 9 వరకు ప్రాక్టికల్స్

సాక్షి, అమరావతి: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను మే 24 నుంచి జూన్ 1 వరకు నిర్వహించనున్నట్టు బోర్డు కార్యదర్శి ఎంవీ శేషగిరి బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఇంటర్ ఫస్టియర్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండియర్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పరీక్ష ఫీజు చెల్లించేందుకు మే 3 చివరి తేదీ అని వెల్లడించారు. జూన్ 2న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్, జూన్ 3న ఎన్విరాన్‌మెంట్ పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ప్రాక్టికల్ ఎగ్జామ్స్: అన్ని విభాగాల విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలను జూన్ 5 నుంచి 9 వరకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు.

సూడాన్ నుంచి బయటపడతామనుకోలేదు

- అక్కడి పరిస్థితులు భయానకంగా ఉన్నాయి
- ఆపరేషన్ కావేరిలో ఢిల్లీ చేరుకున్న ఏపీ యువకుడు విష్ణువర్ధన్

సాక్షి, న్యూఢిల్లీ: సూడాన్‌లో పరిస్థితులు భయానకంగా ఉన్నాయని..అక్కడి నుంచి సురక్షితంగా బయటపడతామని అసలు ఊహించలేదని బాపట్ల జిల్లా చీరాలకు చెందిన విష్ణువర్ధన్ అన్నారు. ఆపరేషన్ కావేరిలో భాగంగా సూడాన్‌లో చిక్కుకున్న భారతీయులను కేంద్రం వెనక్కి తీసుకు వస్తోన్న నేపథ్యంలో 360 మందితో సూడాన్ నుంచి తొలి ప్రత్యేక విమానం గురువారం ఢిల్లీకి చేరుకుంది. అందులో సూడాన్ నుంచి వచ్చిన విష్ణువర్ధన్ తన పరిస్థితిని ఢిల్లీలోని ఏపీభవన్‌లో మీడియాతో పంచుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సూడాన్‌లో ఉండలేమన్నారు. యుద్ధం 72 గంటలు నిలిపేసినప్పటికీ అక్కడక్కడ కొనసాగుతోందని చెప్పారు. తినడానికి తిండి లేదని, నీళ్ళు తాగి బ్రతకాల్సిందేనని తెలిపారు. ప్రైవేట్ వెహికల్‌లో పోర్ట్ సూడాన్‌కు చేరుకున్నామని, అక్కడి నుంచి కొందరిని ఎయిర్ లిఫ్ట్ చేస్తే, ఇంకొందరినీ షిప్‌ల్లో జెడ్డాకు తరలిస్తున్నారని..జెడ్డా నుంచి స్పెషల్ ఫ్లైట్‌లో భారత్‌కు వచ్చానని చెప్పారు. షిప్‌లో మరో బృందం ఉందని, వాళ్ళు కూడా క్షేమంగా భారత్‌కు వస్తారని భావిస్తున్నానని చెప్పారు.

జూనియర్ మిస్ ఇండియాగా నైనిషా


ట్రోఫీతో నైనిషా


పలాస: శ్రీకాకుళం జిల్లా పలాసకి చెందిన 9వ తరగతి విద్యార్థిని ఎం.నైనిషా ఇటీవల ముంబైలో జరిగిన జూనియర్ మిస్ ఇండియా పోటీల్లో పాల్గొని సత్తా చాటింది. బెస్ట్ పర్సనాలిటీ విభాగంలో ఆంధ్ర, తెలంగాణలో ప్రథమ స్థానంలో నిలిచింది. ముంబైలో ఈ నెల 22, 23 తేదీల్లో మై సిటీ ఇండియా ఈవెంట్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. నైనిషాకు అవార్డు రావడం పట్ల కాశీబుగ్గ లలిత కళారంజని, పలాస సత్యసాయి సేవా సంస్థ ప్రతినిధులు చిన్నాచారి, గంగాధర్, మల్లా రామేశ్వరరావు తదితరులు అభినందించారు.

‘గంగమ్మ జాతర స్వర కుంభాభిషేకం’ ఆవిష్కరణ

గాయకుడిగా మారిన భూమన


గంగమ్మ స్వర కుంభాభిషేకం సీడీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ డి.హరిత తదితరులు

సాక్షి,తిరుపతి: మే లో నిర్వహించనున్న తాతాయ్యగుంట గంగమ్మ తల్లి జాతర కోసం రూపొందించిన అల్బమ్‌ను గురువారం తిరుపతిలో ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష తదితరులు ఆవిష్కరించారు. రాయలసీమలో ప్రసిద్ధి గాంచిన తాతాయ్యగుంట గంగమ్మ జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో జాతరను వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దేవదాయశాఖ, టీటీడీ సంయుక్తంగా రూ.16 కోట్లతో పునర్నిర్మిస్తోన్న గంగమ్మ ఆలయ నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. మే 5న మహాకుంభాభిషేకం, 9న గంగమ్మ జాతరకు చాటింపు జరుగుతుంది. వారం రోజుల పాటు నిర్వహించనున్న ఈ జాతర కోసం గాయని మంగ్లి, కిషన్, సంపత్, జస్వంత్‌తో పాటు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి 7 పాటలు పాడారు. వీటిలో ‘జాతరో జాతర గంగమ్మ జాతర.. ఏడాదికి ఒకసారి జరిగే మా జాతర..’ అంటూ సాగే పాటను భూమన పాడారు.



దొడ్డ శ్రీనివాసరెడ్డి

కృత్రిమ మేధ కళలకు వధ?

ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు క్లాడి మోనెట్ ‘వాటర్ లిల్లీస్’ పేరిట రూపొందించిన 250 చిత్రాలు పూర్తి చేయడానికి దాదాపు 30 ఏళ్లు పట్టింది. తన ఇంటి దగ్గర ఉన్న సరస్సులో లిల్లీపూల స్ఫూర్తిగా ఆయన వీటిని చిత్రించారు. వాటర్ లిల్లీస్‌లోని ఒక చిత్రం 2007లో సోత్‌బే వేలంలో 1.85 కోట్ల డాలర్లకు అమ్ముడుపోయింది. తరువాతి సంవత్సరం లండన్ క్రిస్టీ వేలంలో మరో చిత్రం 4.1 కోట్ల డాలర్లకు అమ్ముడుపోయింది. మోనెట్ చిత్రించిన వాటర్ లిల్లీస్‌ను ఓ మంచి ఫొటోగ్రాఫర్ అంతే అందంగా కొన్ని క్షణాల్లో కెమెరాలో బంధించగలడు కానీ వాటికి ఉండే విలువెంత?

19వ శతాబ్దంలో లాండ్ స్కేప్ ఆర్టిస్టులకు, ఫొటోగ్రాఫర్లకు మధ్య వివాదం చెలరేగింది. ఫొటోలను సృజనాత్మక కళగా గుర్తించగలమా అన్నది నాటి కళాకారుల ప్రశ్న. కానీ తదుపరి కాలంలో ఫొటోగ్రఫీ కూడా కళగా అవతరించింది. ఫొటోలు కూడా వందల కోట్ల డాలర్లు ఆర్జించిన సందర్భాలున్నాయి. ఇప్పుడు కళాకారుల మనుగడనే ప్రశ్నించే మరో ముప్పు కృత్రిమ మేధ (ఏఐ) రూపంలో వచ్చి పడింది. ఏళ్లకు ఏళ్లు చేసిన సాధన ద్వారా కళాకారులు సాధించిన నైపుణ్యాన్ని కృత్రిమమేధ క్షణాల్లో అనుకరిస్తోంది. నమూనాలను సృష్టిస్తోంది. కృత్రిమమేధ ఇకముందు కళలకు సమాధి కడుతుందా? మనిషి సృజనాత్మకతతో పోటీపడుతుందా? కారుచౌకగా ఏఐ కళారూపాలను సృష్టిస్తుంటే అసలు కళలకు ఆదరణ ఉంటుందా? ఏఐ రూపొందించే కళలకు విలువ ఉంటుందా? అన్నవి ఇప్పుడు కళా ప్రపంచంలో తలెత్తుతున్న ప్రశ్నలు. ఇప్పటికే అనేక రంగాలను ఆక్రమించుకుంటున్న కృత్రిమమేధ ఇక సృజనాత్మక కళారంగాలనూ కబ్జా చేస్తుందని కళాకారులు ఆందోళన చెందుతున్నారు.

డాలీ.. డాలీ

కృత్రిమమేధ ఆధారంగా చాట్‌బాట్ ‘చాట్ జీపీటీ’ సృష్టించిన సంస్థ ఓపెన్ ఏఐ రూపొందించిన మరో ప్లాట్‌ఫామ్ డాల్–ఇ. ప్రఖ్యాత ఫ్రెంచ్ సర్రియలిస్ట్ పెయింటర్ సాల్వడార్ డాలీ పేరును పోలినట్లుగా ఉండే ఈ డాల్–ఇ ప్లాట్‌ఫామ్ కృత్రిమమేధను ఉపయోగించి అద్భుతమైన డిజిటల్ పెయింటింగ్స్‌ను సృష్టిస్తోంది. డాల్–ఇ మాదిరిగానే మిడ్ జర్నీ, స్టేబుల్ డిఫ్యూజన్ లాంటి మరికొన్ని ఏఐ ప్లాట్‌ఫామ్‌లు కూడా చిత్రకళారంగంలో చొరబడి సంచలనం సృష్టిస్తున్నాయి. హేగ్ మ్యూజియంలో ఉన్న జొనెస్ వెర్మీర్ అద్భుత కళాఖండం ‘గర్ల్ విత్ ఎ పెరల్ ఇయరింగ్’ స్ఫూర్తిగా జులియన్ వాన్ డైకెన్ అనే ఆర్టిస్టు మిడ్ జర్నీ ప్లాట్‌ఫామ్‌పై కృత్రిమమేధను వినియోగించి రూపొందించిన ‘ఎ గర్ల్ విత్ గ్లోయింగ్ ఇయరింగ్స్’ చిత్రాన్ని ఆమ్‌స్టర్‌డామ్‌లోని ఓ ప్రముఖ మ్యూజియంలో ప్రదర్శనకు పెట్టినప్పుడు చిత్ర కళారంగంలో అలజడి రేగింది. కంప్యూటర్ సృష్టించిన చిత్రాన్ని కళాఖండంగా ఎలా పరిగణిస్తారని ఆర్టిస్టులు ముక్తకంఠంతో ప్రశ్నించారు. ప్రింటింగ్, పబ్లిషింగ్ పరిశ్రమ కూడా ఇప్పుడు కృత్రిమమేధను ఆశ్రయించి కవర్ డిజైన్స్ రూపొందిస్తోంది. ప్రముఖ పత్రిక ‘ది ఎకనామిస్ట్’ ఇప్పుడు తన కవర్ డిజైన్ల సృష్టికి కృత్రిమమేధపై ఆధారపడుతోంది. అనేకమంది రచయితలు తమ నవలలు, పుస్తకాల కవర్ డిజైన్ల కోసం కృత్రిమమేధను ఉపయోగిస్తున్నారు. ఆర్కిటెక్ట్‌లు కూడా అద్భుతమైన కట్టడాలు, డామ్‌లు, స్టేడియాలు, గార్డెన్ల డిజైన్ల రూపకల్పనకు కృత్రిమమేధను ఆశ్రయిస్తున్నారు. ఫ్యాషన్ ప్రపంచంలోకీ కృత్రిమమేధ అడుగుపెట్టింది. ది ఫ్యాబ్రికెంట్ లాంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు అనూహ్యమైన వస్త్రాలు, ఆభరణాల డిజైన్‌లను ఏఐతో సృష్టిస్తున్నాయి. ఇవి ధరించడానికి పనికి రావు కానీ డిజిటల్ రూపంలో వర్చువల్‌గా వీటిని ధరించి ఆనందించవచ్చు. అయితే వీటిని పొందడానికి మాత్రం ‘నిజమైన’ ధర చెల్లించాల్సిందే. కొన్ని వస్త్రాల డిజైన్‌లు పదివేల డాలర్ల వరకు ఉన్నాయి. ఇటీవల బీచ్‌లో సర్ఫింగ్ చేస్తున్న వారి ఫొటో ఒకటి ఆస్ట్రేలియాలో ప్రతిష్టాత్మకమైన ఫొటోగ్రఫీ పోటీల్లో విజయం సాధించింది. అయితే ఈ ఫొటో కృత్రిమమేధ ఆధారంగా తయారుచేసిందని తెలిసి ప్యానెల్ జడ్జిలు ఈ చిత్రాన్ని తొలగించి వేరే ఫొటోను ఎంపిక చేయాల్సి వచ్చింది. ఈ విషయంలో చెలరేగిన వివాదం ఫలితంగా పోటీలను రెండు విభాగాలుగా విభజించారు. ఒకటి కంప్యూటర్ సృష్టించే ఫొటోలకు, మరొకటి కెమెరా ద్వారా తీసిన ఫొటోలకి.


‘గర్ల్ విత్ ఎ పెరల్ ఇయరింగ్’ ‘ఎ గర్ల్ విత్ గ్లోయింగ్ ఇయరింగ్స్’


ఏఐ సృష్టించిన బీచ్‌లో సర్ఫింగ్ ఫొటో

కదం తొక్కుతున్న కళాకారులు

వివిధ రంగాలకు చెందిన కళాకారులు, నిపుణులు ఏళ్ల తరబడి కృషితో సాధించిన నైపుణ్యాన్ని అచ్చుగుద్దినట్లు అనుకరిస్తున్న కృత్రిమమేధపై కదం తొక్కుతున్నారు. కళా నైపుణ్యాన్ని కూడా ఆటోమేషన్ చేస్తే తమ భవిష్యత్తు ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఆర్టిస్టులు, డిజైనర్లు, ఫొటోగ్రాఫర్లు, రచయితలు, మ్యూజీషియన్లు తమ మనుగడను అంధకారంలోకి నెడుతోందని కృత్రిమమేధపై విరుచుకుపడుతున్నారు. కృత్రిమమేధ చొరబాటును అడ్డుకునేందుకు రకరకాల ఆయుధాలు సన్నద్ధం చేస్తున్నారు. శాన్‌ఫ్రాన్సిస్కోకి చెందిన కార్టూనిస్టు సరా అండర్సన్, ఇల్లస్ట్రేటర్ కార్లో వోర్టిజ్ కాపీరైట్ చట్టం కింద న్యాయ పోరాటం చేస్తున్నారు. తమ బొమ్మలను అనుకరిస్తూ నకలు సృష్టిస్తున్న ఏఐ వేదికలు డ్రీమ్ అప్, మిడ్ జర్నీ, స్టేబుల్ ఫ్యూజన్‌పై వీరు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమ అనుమతి లేకుండా, పరిహారం చెల్లించకుండా తమ బొమ్మలను వాడుకుంటున్నందుకు కాపీరైట్ చట్టం కింద శిక్షించాలని కోరారు.

గుర్తింపు కావాలి

ఏఐ ఆధారిత కంప్యూటర్ ప్రోగ్రాంలు సొంతంగా ఏమీ సృష్టించలేవు. అవి సృష్టించే నకలుకి ఏదో ఒక అసలైన చిత్రమో, కళాకారులు లేదా రచయితల శైలి ఆధారం కావాలి. ఎలాంటి చిత్రం, ఫొటో, రచన కావాలన్నా ఎవరిశైలిలో కావాలన్నా కమాండ్ ఇస్తే వాటిని అనుసరించి కృత్రిమమేధ నకలును సృష్టించగలుగుతుంది. అలాంటప్పుడు వాటికి ఆధారమైన కళాకారులు, రచయితలు, ఫొటోగ్రాఫర్లకు తగిన రీతిలో పరిహారం చెల్లించడం, గుర్తింపు ఇవ్వాలనేది వారి వాదన. క్రిస్ కస్టనోవా అనే రచయిత్రి ‘జోర్యా ఆఫ్ ద డాన్’ పేరిట ప్రచురించిన కామిక్ నవలకు అమెరికా కాపీరైట్ ఆఫీసు తొలుత ఆమోదం తెలిపింది. అయితే ఈ కామిక్‌లో ఉపయోగించిన బొమ్మలు మిడ్‌జర్నీ ప్లాట్‌ఫామ్ ద్వారా సృష్టించినట్లు తరువాత వెల్లడైంది. దీనిపై వివాదం చెలరేగడంతో నవలలో కథకు మాత్రమే కాపీరైట్ ఇస్తున్నామని, కంప్యూటర్ సృష్టించిన బొమ్మలకు ఇవ్వలేదని కాపీరైట్ ఆఫీసు తన నిర్ణయాన్ని సవరించుకుంది. బొమ్మలు, కార్టూన్లు, చిత్రాలను కృత్రిమమేధ కాపీ కొట్టకుండా షికాగో యూనివర్సిటీకి చెందిన ఓ బృందం ‘గ్లేజ్’ అనే సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసింది. దీన్ని ఉపయోగిస్తే, అది చిత్రాలపై కంటికి కనిపించని ఒక తెరను కప్పేస్తుంది. దాంతో కృత్రిమమేధ ఈ చిత్రాన్ని కాపీ కొట్టడం కుదరదు. ‘కృత్రిమమేధ అత్యంత వేగంగా విస్తరిస్తోంది. ఈ తరుణంలో కొన్ని మార్గదర్శకాలు, ఆంక్షలు అవసరం’ అని గ్లేజ్ సృష్టికర్త స్వాన్‌షాన్ అభిప్రాయపడ్డారు.

సహజీవనం తప్పదు

కృత్రిమమేధ విస్తృతిని ఆపడం ఎవరివల్లా కాదు. అన్ని రంగాల్లోకి అది చొచ్చుకుపోతోంది. ఇక కృత్రిమమేధను మన జీవితాల్లోకి ఆహ్వానించక తప్పదు. దాంతో సహజీవనానికీ మార్గం సుగమం చేసుకోవాల్సిందే అని విజ్ఞులు చెబుతున్నారు. సాల్వడార్ డాలీ సర్రియలిస్టు పెయింటింగ్స్‌ను, పికాసో అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్స్‌ను, బ్రాక్ క్యూబిజమ్‌ను మొదట్లో కళగా గుర్తించలేదు. కానీ ఇప్పుడవి అద్భుత కళాఖండాలుగా ఆవిష్కృతమయ్యాయి. కొత్తదనాన్ని స్వీకరించడానికి మనిషికి కొంత సమయం పడుతుంది. ఇప్పుడు కృత్రిమమేధ సృష్టించే కళారూపాల్ని ముందు ముందు మనం ఆమోదించి ఆహ్వానిస్తామేమో?.

ఈ మధ్య పోప్ ఫ్రాన్సిస్ తెల్లజాకెట్ వేసుకున్న చిత్రం ఒకటి సంచలనం సృష్టించింది. అద్భుతమైన ఈ ఫొటో తీసిందెవరని ఇంటర్నెట్‌లో లక్షలాదిమంది వెతికారు. ఈ ఫొటో పూర్తిగా కృత్రిమమేధ ఆధారంగా రూపొందిందే కావడం కొసమెరుపు.

నామమాత్రపు ధరకు విశాఖ ఉక్కును అమ్మకుండా ఆపండి

- హైకోర్టులో ప్రజా శాంతి పార్టీ వ్యవస్థాపకుడు కేఏ పాల్ పిల్
- వేసవి సెలవుల తరువాత విచారణ చేపడతామని స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని నామమాత్రపు ధరకు విక్రయించకుండా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఉక్కు కర్మాగారం ఆదాయ, వ్యయాలపై విచారణ జరిపేందుకు తెలుగు తెలిసిన హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తిని నియమించాలని కోర్టును కోరారు. అంతేకాక విశాఖ స్టీల్ ప్లాంట్ నడిచేందుకు రూ. 8 వేల కోట్లెనా, రూ.42 వేల కోట్లెనా తన గ్లోబల్ పీస్ సంస్థ ద్వారా విరాళాల రూపంలో సేకరిస్తానని, ఇందుకోసం అనుమతినిచ్చేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కూడా కోరారు. గురువారం ఉదయం ఆయన స్వయంగా హైకోర్టుకు వచ్చి ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం ముందు తన పిల్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. తన వ్యాజ్యంపై లంచ్‌మోషన్ రూపంలో అత్యవసరంగా విచారణ జరపాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా తనకు ఎంతో పేరు ఉందని, విరాళాల రూపంలో ఐదు బిలియన్ డాలర్లెనా సేకరించే సత్తా ఉందని అన్నారు. తనను నోబెల్ శాంతి బహుమతి కోసం కేంద్ర ప్రభుత్వంతో సహా పలు ప్రపంచ దేశాలు సిఫారసు చేశాయంటూ తన గురించి, తన స్వచ్ఛంద సంస్థ గ్లోబల్ పీస్ ఇనిషియేటివ్ గురించి చెప్పారు. అయితే, లంచ్‌మోషన్ సాధ్యం కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. రేపు (శుక్రవారం) విచారించాలన్న పాల్ వినతిని కూడా ధర్మాసనం తిరస్కరించింది. వేసవి సెలవుల తరువాత విచారణ చేపడతామని స్పష్టం చేసింది. పిల్‌తో పాటు తన బ్యాంకు ఖాతా వివరాలను కూడా పాల్ జత చేశారు. రూ.వేల కోట్లు సేకరిస్తానని చెప్పిన ఆయన బ్యాంకు ఖాతాలో ఈ నెల 17వ తేదీకి ఉన్న బ్యాలెన్స్ రూ.2,336. నోబెల్ శాంతి బహుమతికి పాల్ పేరును సిఫారసు చేస్తూ కేంద్ర మంత్రి పురుషోత్తం రుపాలా రాసిన లేఖను కూడా జత చేశారు.

“ ఓ విశ్వాసులారా! మీలో ఎవరూ ఇతరులెవరినీ ఎగతాళి చేయరాదు. బహుశా వారే మీకంటే శ్రేష్ఠులు కావచ్చు!

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 28 ఏప్రిల్ 2023

పరిహాసమైన ప్రజాస్వామ్యం

కంచే చేను మేస్తే? ధర్మం, న్యాయం కాపాడాల్సిన పాలకులే... అధర్మానికి కాపు కాస్తే? మాఫియా డాన్‌ల అడుగులకు మడుగులొత్తితే? పోలీసు, న్యాయవ్యవస్థలు దోషులుగా నిర్ధారించిన వారిని సైతం శిక్షాకాలం పూర్తి కాక ముందే రకరకాల సాకులతో బాహ్యప్రపంచంలోకి వదిలేస్తుంటే ఏమనాలి? ఎవరికి చెప్పాలి? పార్టీలు, పాలకుల మీద ఏవగింపు గలిగే ఇలాంటి చర్యల వరుసలో తాజా ఉదాహరణ – హంతకుడు ఆనంద్ మోహన్ సింగ్‌ను పాలకులు నిస్సిగ్గుగా జైలు నుంచి బయటకొదిలేసిన సంఘటన. ఐఏఎస్ అధికారి జి. కృష్ణయ్యను దారుణంగా చంపి, జైలు ఊచలు లెక్కబెడుతున్న ఈ బడా నేరస్థుడు గురువారం బిహార్‌లోని సహరసా జైలు నుంచి విడుదలైన తీరు నివ్వెరపరుస్తోంది అందుకే. నిరుడు బీజేపీతో బంధం తెంచుకున్నాక ఓట్ల పునాదిని విస్తరించుకొనేందుకు తంటాలు పడుతున్న బిహార్ సీఎం నితీశ్ బలమైన తోమర్ రాజ్‌పుత్ వర్గానికి చెందిన ఆనంద్‌లో అద్భుతమైన అవకాశాన్ని చూశారని ఆరోపణ వినిపిస్తోంది. స్వార్థ ప్రయోజనాలే పరమావధిగా దోషుల్ని వదిలేసే దిగజారుడు పనిలో పార్టీలన్నీ పోటీ పడుతుండడం ఆగ్రహం రేపుతోంది.

ఐఏఎస్ అధికారి, గోపాల్‌గంజ్ జిల్లా మేజిస్ట్రేట్ అయిన కృష్ణయ్యను 1994లో దారుణంగా హత్య చేశాడీ ఆనంద్ మోహన్. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కృష్ణయ్య 1985 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. దళితుడు. విధినిర్వహణలోని ఆయనను ముజఫర్‌పూర్‌లో ప్రభుత్వ వాహనం నుంచి లాగి, హేయంగా కొట్టి చంపడానికి 1994 డిసెంబర్ 5న అల్లరిమూకను రెచ్చగొట్టింది ఆనంద్ మోహన్. 2007లో ట్రయల్ కోర్ట్ దోషికి మరణశిక్ష విధించింది. ఏడాది తర్వాత పాట్నా హైకోర్ట్ దాన్ని జీవితకాల శిక్షగా తగ్గించింది. ఈ తీర్పును ఆనంద్ సుప్రీమ్‌లో సవాలు చేసినా, ఇప్పటి దాకా కోర్ట్ ఉపశమనమేమీ ఇవ్వలేదు. అలా 2007 నుంచి జైలులో ఉన్న వ్యక్తిపై బిహార్ సర్కార్ ఎక్కడ లేని అక్కర చూపింది. ఈ నెలలోనే 'బిహార్ ప్రిజన్ మ్యాన్యువల్ 2012'లో 481వ రూల్‌ను మార్చింది. 'విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వాధికారి హత్యలో దోషి అయిన ఖైదీని విడుదల చేయరాద'న్న నిబంధనను నిర్లజ్జగా తొలగించింది. ఫలితంగా – జైలులో 14 ఏళ్ళు, 20 ఏళ్ళు గడిపిన మరో 27 మంది ఖైదీలతో పాటు ఈ నేరస్థుడికీ అన్యాయంగా స్వేచ్ఛ లభించింది.

పౌర సమాజం నుంచి ప్రతిపక్షాల దాకా అందరూ తీవ్రంగా వ్యతిరేకించినా, నితీశ్ సర్కార్ వెనక్కి తగ్గలేదు. బిహార్‌లో రాజకీయాలకూ, నేరస్థులకూ మధ్య అనాదిగా పొడిచిన పొత్తుకు ఇది ప్రతీక. రాజకీయ నేతగా ఎదిగిన గ్యాంగ్‌స్టర్ ఆనంద్ మోహన్ పలుకుబడి సామాన్యమేమీ కాదు. శివ్‌హర్ లోక్‌సభా స్థానంలో గతంలో ఎంపీగా గెలిచాడు. కృష్ణయ్య హత్యతో జైలులో ఉంటేనేం, అతని భార్య లవ్లీ ఆనంద్ ఒకసారి ఎంపీ అయ్యారు. 2010 అసెంబ్లీ, 2014 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల పక్షాన పోటీ చేశారు. వారి కుమారుడు చేతన్ ఆనంద్ ప్రస్తుతం ఎమ్మెల్యే. తల్లీకొడుకులిద్దరూ బిహార్ అధికార సంకీర్ణ కూటమిలో భాగమైన రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) సభ్యులే. కుమారుడి వివాహ నిశ్చితార్థం కోసం ఆనంద్ ఇటీవల 15 రోజులు పెరోల్ మీద బయటే ఉన్నాడు. సదరు నిశ్చితార్థానికి సాక్షాత్తూ బిహార్ సీఎం సహా అధికార కూటమి నేతలందరూ హాజరయ్యారంటే అర్థం చేసుకోవచ్చు. పెరోల్ ముగిసిన ఆనంద్ ఏప్రిల్ 26న జైలుకు చేరాడో లేదో, సర్కార్ సవరించిన నిబంధనల పుణ్యమా అని మర్నాడే బయటకొచ్చేశాడు.

వివిధ రాష్ట్రాల్లోని పాలకుల అవసరానికి తగ్గట్టు నియమ నిబంధనలు మారిపోతున్నాయి. వ్యవస్థలు ప్రభావితమవుతున్నాయి. వెరసి, జైళ్ళలోని దోషుల శిక్షాకాలాన్ని తగ్గించి బయటకు వదిలేస్తున్న లజ్జాకరమైన ఘటనలు ఇటీవల పెరుగుతున్నాయి. గత ఆగస్ట్‌లో బయటపడ్డ బిల్కిస్ బానో కేసులోని 11 మంది దోషుల నుంచి తాజా ఆనంద్ మోహన్ దాకా అన్ని వ్యవహారాలూ అలాంటివే. బీజేపీ నుంచి జేడీ-యూ దాకా అన్ని పార్టీలూ ఈ తిలా పాపంలో తలా పిడికెడు పంచుకున్నవే. ఓటు రాజకీయాలు, సమర్థకుల సంరక్షణ – ఇలా ఈ విడుదల వెనుక పైకి కనిపించని కారణాలు అనేకం. గద్దె మీది పెద్దల పరోక్ష సాయంతో బయటపడ్డ వీరికి సమర్థకుల నుంచి లభిస్తున్న స్వాగత సత్కారాలు, నీరాజనాలు మరింత ఆందోళన రేపుతున్నాయి. ఆనంద్ విడుదలతో జరిగిన బైక్ ర్యాలీలు, మిఠాయి పంపిణీలూ అచ్చంగా అలాంటివే. రేపిస్టులనూ, హంతకులనూ గౌరవించి, ఆరాధించే సంస్కృతికి అన్ని పార్టీలూ, అనుయాయులూ దిగజారుతున్న తీరు జుగుప్సాకరం. ప్రజాస్వామ్యాన్ని పరిహసించే ఈ ఘటనల్లో వ్యవస్థలు భాగమైపోతూ ఉండడం శోచనీయం.

చేసిన నేరం తాలూకు తీవ్రత, దోషుల వ్యక్తిగత చరిత్రలను బట్టి ఏ కేసుకా కేసు ప్రత్యేకమైనదే. కానీ, అన్నిటినీ ఒకే గాటన కడుతూ, కావాల్సినవారిని కాపాడుకొనే రీతిలో నిర్ణీత కాలవ్యవధి దాటి జైలులో ఉన్నవారందరినీ వదిలేయవచ్చని తీర్మానించడం సబబేనా? అలాంటప్పుడు బాధితులకు సరైన న్యాయం ఏ రకంగా జరిగినట్టు? పశ్చాత్తాపం, పరిణత సత్ప్రవర్తన లాంటివి శిక్షాకాలపు తగ్గింపునకు గీటురాళ్ళు కావాలి. కేవలం జైలులో గడిపిన రోజులే లెక్కలోకి తీసుకుంటే, బాజాప్తాగా బయటకొచ్చిన దోషి రేపు మరో నేరానికి పాల్పడడని నమ్మకం ఏమిటి? బాధిత కుటుంబాల కళ్ళెదుటే నేరస్థులు నిష్పూచీగా తిరుగుతుంటే, చట్టం, న్యాయం పట్ల సామాన్యుడు విశ్వాసం కోల్పోతే ఆ పాపం ఎవరిది? తాత్కాలిక ప్రయోజనాల కోసం హడావిడి పడుతున్న పార్టీలు, ప్రభుత్వాలు ఇవన్నీ లోతైన ప్రభావం చూపే పరిణామాలని ఇకనైనా తెలివిడి తెచ్చుకోవాలి. ఈ దేశంలో చట్టాలన్నీ అధికార బలగానికి చుట్టాలేనన్న భావన బలపడితే ప్రజాస్వామ్యానికే చేటు.

విశ్వ సమానత్వాన్ని తిరస్కరిస్తారా?

విశ్లేషణ

ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

జాతి, మతం, లింగం, లైంగిక ధోరణితోపాటు కుల ప్రాతిపదికన వివక్షను నిషేధించే చట్టాలు అమెరికా, కెనడాల్లోని కొన్ని రాష్ట్రాలు ఆమోదించాయి. వీటిని ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ మేధావులు వ్యతిరేకించారు. అమెరికాలో హిందూ ప్రతిభ పురోగతిని అడ్డుకునేందుకు కుట్ర పన్నుతున్నారనీ, ప్రపంచంలో హిందూ మతానికి హాని కలిగించడానికే ఈ వివక్షా కార్డును ఉపయోగిస్తున్నారనీ వారు ఆరోపించారు. భారతీయ వలసల్లో కుల వివక్ష ఎలా పనిచేస్తోందని అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, యూరప్ దేశాల్లో ఇప్పటికే కొన్ని అధ్యయనాలు జరిగాయి. సాధారణంగా మానవ సమానత్వం వైపు, ప్రపంచంలో ఎక్కడ నివసిస్తున్నప్పటికీ భారతీయులు సమానత్వం వైపు నిలబడుతున్నట్లయితే, ఎవరైనా అలాంటి శాసనాలను ఎందుకు వ్యతిరేకించాలి?

అమెరికాలో పలువురు వలస భారతీయుల కేంద్రంగా ఉన్న సుసంపన్న రాష్ట్రం కాలిఫోర్నియా సెనేట్‌లో 2023 మార్చి 22న కుల వివక్ష వ్యతిరేక బిల్లును ప్రవేశపెట్టారు. ఇది ఆమోదం పొందినట్లయితే, ప్రపంచంలోనే కులాన్ని మరింత మౌలికంగా చర్చించే మొదటి చట్టం అవుతుంది. భారత రాజ్యాంగం అస్పృశ్యతను రద్దు చేసింది కానీ కులాన్ని కాదు. హిందుత్వ ప్రవాసులు ఇలాంటి కీలక పరిణామం చోటు చేసుకోబోదని భావించారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, బీజేపీ శక్తులు కూడా అలాంటి ఘటన జరగకూడదని భావించాయి. కానీ ప్రపంచం వీరి పరిధిని దాటిపోయింది.

జాతి, మతం, లింగం, లైంగిక ధోరణితోపాటు కుల ప్రాతిపదికన పౌరులు, పెద్దలు లేదా పిల్లలపై వివక్షను నిషేధించే చట్టాన్ని సియాటిల్ సిటీ కౌన్సిల్(అమెరికా), టొరొంటో డిస్ట్రిక్ట్ స్కూల్ బోర్డ్(కెనడా) ఆమోదించినప్పుడు పలువురు ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ మేధావులు వ్యతిరేకించారు. ఇలాంటి శాసనాలను 'హిందూఫోబియా'గా వారు ఖండించారు. అటువంటి శాసనాలను వ్యతిరేకిస్తూ పలు పత్రికలు, సోషల్ మీడియా వేదికల్లో రాశారు, మాట్లాడారు. సాధారణంగా మానవ సమానత్వం వైపు, ప్రపంచంలో ఎక్కడ నివసిస్తున్నప్పటికీ భారతీయుల సమానత్వం వైపు నిలబడుతున్నట్లయితే, అలాంటి శాసనాలను ఎందుకు వ్యతిరేకించాలి?

వివక్షకు సమర్థనా?

సియాటిల్ సిటీ కౌన్సిల్ ఇటీవలే ఆమోదించిన తీర్మానంలో వివక్ష వ్యతిరేక చట్టాలకు కులాన్ని కూడా జోడించడాన్ని ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ పత్రిక పాంచజన్య 'సంస్థాగత మార్గం ద్వారా అమెరికాలో హిందూఫోబియాను ప్రోత్సహిస్తున్నారు, అమెరికాలో హిందూ ప్రతిభ పురోగతిని అడ్డుకునేందుకు కుట్ర పన్నుతున్నారు' అని పేర్కొన్నట్టుగా 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' రాసింది. ఆర్‌ఎస్‌ఎస్ సీనియర్ నాయకుడు రామ్ మాధవ్ ఈ వాదననే మరింత ముందుకు తీసుకుపోయారు. కుల వివక్షకు సంబంధించిన ఈ తప్పుడు జెండాను ఎత్తుతున్న బృందాలు సాధారణంగా హిందూభయంతో ఉంటున్నాయని ఆయన ఒక జాతీయ దినపత్రికలో రాశారు. ప్రపంచంలో హిందూ మతానికి హాని కలిగించడానికే ఈ వివక్షా కార్డును ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. అమెరికా కేంద్రంగా వ్యవహరించే పరిశోధనా సంస్థ 'ఈక్వాలిటీ ల్యాబ్'నూ, అలాగే అమెరికా, కెనడా, యూరప్ తదితర ప్రాంతాల్లో అలాంటి కుల వ్యతిరేక చట్టాలు, శాసనాలపై పనిచేసే పౌర సమాజ బృందాలనూ పశ్చిమ దేశాల్లోని హిందూఫోబిక్ గ్రూపులుగా రామ్ మాధవ్ తప్పుపట్టారు.

పాంచజన్య ఆరెస్సెస్ అధికార పత్రిక. వివక్షా వ్యతిరేక చట్టం హిందూఫోబియాకు సంకేతమనీ, భారతీయ ప్రతిభ పురోగతిని అడ్డుకునే కుట్ర అనీ అది పేర్కొంటోంది. భారత్ లేదా ప్రపంచంలో గణనీయ సంఖ్యలో భారతీయులు నివసిస్తున్న చోట సంస్థాగత శాసనాలను రూపొందించకుండా కులవివక్ష సమస్యను పరిష్కరించడం ఎలా? వివక్షను ప్రదర్శిస్తున్న వారు అలాంటి వివక్షా వైఖరి తప్పు అని ఎన్నడూ భావించరు. ఒక వ్యక్తి లేదా వర్గ మానసిక లక్షణాల్లో వివక్షా పూరితమైన ప్రవర్తన భాగమవుతుంది. హిందూ మతానికి సంబంధించి, అలాంటి వివక్షను ఆధ్యాత్మిక పాఠ్య గ్రంథాల ద్వారా సమర్థిస్తున్నారు. దానికి పవిత్రతను కల్పిస్తున్నారు.



వివక్షాపూరిత అనుభవాలెన్నో!

భారతీయ వలసల్లో కుల వివక్ష ఎలా పనిచేస్తోందని అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, యూరప్ దేశాల్లో ఇప్పటికే కొన్ని అధ్యయనాలు జరిగాయి. స్కూల్, కాలేజీ, పిల్లలు, యువత రోజువారీగా అనుభవిస్తున్న వేదనకు సంబంధించిన ఇవి గాథలను వర్ణించాయి. వ్యక్తుల కుల నేపథ్యాన్ని తెలుసుకోవడానికి, అమలవుతున్న వివక్షా పద్ధతులను కనుగొనడానికి సంబంధించిన యంత్రాంగాలను పలు నివేదికలు వెలికి తెచ్చాయి. ఉదాహరణకు, తేన్‌మొళి సౌందరరాజన్ తాజా పుస్తకం 'ద ట్రామా ఆఫ్ కాస్ట్ – ఎ దళిత్ ఫెమినిస్ట్ మెడిటేషన్ ఆన్ సర్వైవర్‌షిప్, హీలింగ్, అబాలిషన్' అమెరికాలోని భారతీయ వలస ప్రజలలో వివక్షకు సంబంధించిన అసంఖ్యాక ఘటనలను గుదిగుచ్చింది. ఈమె రెండో తరం భారతీయ అమెరికన్ దళిత మహిళ.

టొరొంటో శాసనాలను రూపొందించిన తర్వాత, కెనడాలోని ఒక కాలేజీ విద్యార్థి త్రినా కుమార్ తన జీవితంలో ఎదుర్కొన్న ఒక అనుభవాన్ని సమగ్రంగా వర్ణించారు. తమ వేదనా గాథలను చెబుతున్న, భవిష్యత్తును ప్రేమిస్తున్న యువ మహిళగా ఆమె కనిపిస్తారు. ''గ్రేటర్ టొరొంటో పాఠశాలల్లో కులపరమైన వేధింపును చాలానే ఎదుర్కొన్నాను. ఈ వేధింపు నాకు అయోమయం కలిగించింది. ప్రత్యేకించి మేమంతా కెనడియన్లమే అయినప్పటికీ నా తోటి క్లాస్‌మేట్లకు కులం అంటే ఇంత ప్రాధాన్యం ఎందుకు అని నేను ఆశ్చర్యపడ్డాను'' అని ఆమె చెబుతున్నారు. ''వారి అగ్రకుల సంప్రదాయాలను నేను అనుసరించలేదు, దళిత క్రిస్టియన్‌గా ఉంటున్నందుకు వారు నన్ను ఆటపట్టించేవారు'' అని ఆమె చెప్పారు. క్రిస్టియన్లు మెజారిటీగా ఉంటున్న దేశంలో వారు ఇలా చేస్తున్నారు. ఇది క్రిస్టోఫోబియా కాదా?

పాశ్చాత్య కులతత్వ వలస ప్రజల్లో ఈక్వాలిటీ ల్యాబ్స్ ఒక సంక్షోభాన్ని సృష్టించింది. అయితే, అమెరికాలో కుల వివక్షపై ఈక్వాలిటీ ల్యాబ్స్ అధ్యయనాన్ని రామ్ మాధవ్ తోసిపుచ్చారు. ఇలాగైతే, మొత్తంగా గోధుమవర్ణపు భారతీయులు తమ మీద శ్వేత అమెరికన్లు వివక్ష ప్రదర్శిస్తారని ఎలా ఆరోపించగలరు?

సమానత్వం కోసం పనిచేస్తున్న గ్రూపులెన్నో!

అమెరికా, కెనడాల్లో కుల వివక్షా వ్యతిరేక చట్టాలపై ఈక్వాలిటీ ల్యాబ్స్ ఒక్కటే పనిచేయలేదు. ఉత్తర అమెరికా అంబేడ్కర్ అసోసియేషన్, బోస్టన్ స్టడీ గ్రూప్, పెరియార్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్, అంబేడ్కర్ బుద్ధిస్ట్ అసోసియేషన్, అంబేడ్కర్ కింగ్ స్టడీ సర్కిల్, అంబేడ్కర్ ఇంటర్నేషనల్ మిషన్ వివక్షను ఎండగట్టడానికీ, పీడిత కుల వలస ప్రజలను చైతన్యవంతం చేయడానికీ కృషి చేశాయి. భారత్‌లో కులం, మానవ అస్పృశ్యత ఎలా పనిచేస్తున్నాయో, దాన్ని అమెరికా, యూరప్, కెనడా, ఆస్ట్రేలియాల్లో ఎలా విస్తరింపజేస్తున్నారో పాశ్చాత్య సమాజాలకు తెలియపర్చేందుకు ఈ సంస్థలు బహుముఖ కార్యక్రమాలను చేపడుతూ వచ్చాయి. ఎక్కడ ఉన్నా సరే... కుల అణచివేత, దాని కార్యకలాపాలు ఎంత అమానుషంగా ఉంటున్నాయో ఈ దేశాల్లోని నల్లవారికీ, శ్వేత జాతీయులకూ తెలియజెప్పేందుకు ఈ సంస్థలు తమ వనరులనూ, మానవ శ్రమనూ చాలా వెచ్చించాయి. కులవ్యవస్థ గురించి, దాని అమానుషమైన ఆచరణ గురించి ప్రపంచానికి అవగాహన కల్పించడంలో తప్పేముంది? మానవ సమానత్వం కోసం నిలబడకుండా ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ప్రజాస్వామ్యం కోసం ఎలా నిలబడతాయి?

జాతి వివక్ష, ఇతర దేశాల పట్ల దురభిప్రాయం, దానికి సంబంధించిన అసహనాలకు వ్యతిరేకంగా డర్బన్ లో ఐక్యరాజ్యసమితి సదస్సు జరిగిన 2001 నుంచి ప్రపంచం చాలా దూరం పయనించింది. ఆనాటి సదస్సులో జాతి సమస్యతోపాటు కుల సమస్యను కూడా చర్చించడానికి అనుమతించలేదు. ఆనాడు ఐ.రా.స. అంగాలకు కుల వ్యవస్థ గురించి ఏమీ తెలియదనే చెప్పాలి. కుల సమస్యను అంతర్గత అంశం అని ప్రకటించి, దానిపై ఎలాంటి చర్చను కూడా అనుమతించడానికి బీజేపీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం సుముఖత చూపడం లేదు. హిందూఫోబియా పేరిట వివక్షను, అసమానత్వాన్ని, జాతి హత్యాకాండను విశ్వగురువు ఎందుకు ప్రేమిస్తున్నారు? హిందూయిజం మానవ సమానత్వాన్ని కోరుకోవడం లేదని దీని అర్థం కాదా?

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సురక్షిత భారత్



సూడాన్ నుంచి ఇండియా చేరుకున్న మొదటివాళ్లలో నా భర్త ఉన్నారు. భారతీయురాలిగా ఇదివరకెన్నడూ అనుభూతి చెందనంత సురక్షితంగా ఇప్పుడు ఉన్న భావన కలిగింది. మిగతా దేశాలు తమ దౌత్యవేత్తలను తరలించడానికి ప్రాధాన్యం ఇస్తే, మనం పౌరులకు ఇచ్చాం.

– మీనాక్షీ అగర్వాల్, ఫెంగ్‌షుయి కన్సల్టెంట్

నవ్వాల్సిన విషయమా?



డిప్రెషన్, ఆత్మహత్యలు అనేవి నవ్వదగిన అంశాలు కావు. ప్రత్యేకించి యువతలో. 'ఎన్‌సీఆర్‌బీ' డేటా ప్రకారం, 2021లో 1,64,033 మంది ఆత్మహత్య చేసుకున్నారు. ఇందులో అత్యధికులు ముప్పై ఏళ్ల లోపు వారు. ఇది విషాదం. జోక్ చేయాల్సిన అంశం కాదు. (ఆత్మహత్యల మీద ప్రధాని జోక్ చేశారన్న భావంలో)

– ప్రియాంకా గాంధీ వాద్రా, కాంగ్రెస్ లీడర్

వ్యక్తిగత దాడి వద్దు



గౌరవనీయ ప్రధాని మీద ఎంత దాడిచేస్తే అది అంత వెనక్కి తన్నుతుంది. మనది ప్రజాస్వామ్యం. అంశాలవారీగా ఆయన మీద దాడి చేయండి. వ్యక్తిగతంగా చేయొద్దు. (మోదీ మీద ఖర్గే వ్యాఖ్యల నేపథ్యంలో)

– తెహసీన్ పూనావాలా, వెంచర్ క్యాపిటలిస్ట్

కంటెంట్ మిస్సయ్యాం



ఈ మధ్యకాలంలో అన్ని బ్రేకప్పుల కంటే ఈ హాట్‌స్టార్, హెచ్‌బీఓల బ్రేకప్ నన్ను బాగా ప్రభావితం చేసింది.

– గౌరవ్ కపూర్, నిర్మాత

అంత కొత్తదొద్దు!



కొత్తది ఏది చేయడానికైనా నాకు సమ్మతమే. కానీ ఈ ప్రయోగాలను బీట్‌రూట్ ఇడ్లీ దగ్గర ఇక ఆపితే మంచిదేమో!

– కమలా త్యాగరాజన్, జర్నలిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

సారాంశం

సరికొండ చలపతి

క్వాంటిటీ పెరిగింది.. క్వాలిటీ పెంచుదాం

సంతాన మూలికలం
సంసార బానిసలం
సంతాన లక్ష్మి మనదిరా.. తమ్ముడూ
సంపాదన ఒకటే బరువురా
చదివెయ్య సీటులేదు
చదివొస్తే పనేలేదు
అన్నమో రామచంద్రా
అంటే పెట్టేదిక్కేలేదు
దేవుడిదే భారమనీ పెంపు చేయరా బ్రదర్
1981 నాటి ఆకలిరాజ్యం సినిమా పాట....
-పాటొచ్చి ఏళ్లయినా..
పరిస్థితులు మారాయా?

......

80 దశకంలో రేషన్
కార్డుమీద స్లోగన్
పంటలెక్కువయినా
పరిమితులెందుకు?
సంతాన పరిమితి లేనందుకు..
– సీన్ మారిందా..?

....

చిన్నప్పుడు పరీక్షల్లో ఓ ప్రశ్నకు జవాబు
'భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశం '
– 50 ఏళ్ల కిందటి పశ్న, జవాబు
అప్పట్లో 'అభివృద్ధి చెందుతున్న దేశం'
అనే మాట కొత్తగా చేర్చారని
టీచర్లు చెప్పేవారు.
– ఇప్పటికీ ఆ హోదా మారిందా?

....

మారిందల్లా..
అభివృద్ధి చెందిందల్లా..
హోదా మారిందల్లా..
జనాభాలోనే – నంబర్ వన్ ప్లేస్

....

పాపులేషన్ ప్రాబ్లమ్స్..

జనాభాలో నంబర్‌వన్ అనగానే సోషల్ మీడియాలో రెస్పాన్స్ ఇదీ.

....

ఇదేమీ సంతోషించవలసిన విషయం కాదు. యువతకి చేతినిండా పనిలేదు, ప్రజలకి కనీస సౌకర్యాలు లేవు. పెరుగుతున్న జనాభా చౌకయిన లేబర్‌గా మారుతున్నారు. చాలీ చాలని జీతాలతో బతుకుతున్నారు. అమెరికా వెళ్లే సాఫ్ట్‌వేర్ వాళ్లనే కాదు. సౌదీ, దుబాయ్.. లాంటి దేశాలకు వెళ్లేవారినీ, వాళ్ల జీవితాలనూ చూడండి

....

ప్రపంచానికి మానవ వనరులు పంచి.. మనం దారిద్ర్యాన్ని కూడబెట్టుకుంటామా? దేశ జనాభా ఇంతలా పెరుగుతుంటే లాభం పది శాతం, నష్టం తొంభై శాతం..

....

ఎపుడయినా ఆర్మీ రిక్రూట్‌మెంట్ క్యాంప్ చూశారా.. కొద్దిపాటి ఉద్యోగాలకు ప్రాణం పెట్టి పోరాడుతున్న వేలాది యువకులను చూశారా.. పిడికెడు గవర్నమెంట్ జాబుల కోసం లక్షలాది మంది పోటీ పడడం గమనించారా... ఇప్పుడు చెప్పండి జనాభా పెరుగుదలను ఆస్వాదిద్దామా..?

....

భారతావనికి ప్రాణం పోసే వ్యవసాయానికి మనం ఊపిరి పోస్తున్నామా. జనాభా పెరిగే కొద్దీ వనరులు, ఆహారపు అవసరాల మీద విపరీతమైన ఒత్తిడి పెరిగి... డిమాండ్‌ను తీర్చడం సవాలుగా మారుతుంది.

....

ప్రతి ఏడాది ఊళ్లనుంచి సిటీలకు ఎంతో మంది వలస వస్తున్నారు. పట్టణాలు కిక్కిరిసి పోవడం ఖాయం. ఇదంతా బతుకుదెరువు కోసమే కదా.. ఇప్పటికే బతుకుకు ఆసరా లేదు. జనాభా పెరుగు తుంటే ఎలా..

....

ఇండియా మరింత పెద్ద కన్స్యూమర్ మార్కెటయ్యింది ..అంతే!

....

..పైవన్నీ కొట్టివేయదగ్గ కామెంట్సేమీ కాదు. మంది ఎక్కువయినా మజ్జిగ పలుచన కాకుండా చూసుకోగలిగితే.. మానవ వనరులే మహాబలం అంటున్న సామాజిక, ఆర్థిక నిపుణుల మాటలు నిజమవుతాయి.

లేకుంటే, తమ జనాభాను అధిగమించిందన్న వార్త వినగానే అక్కసుతో చైనా అన్న మాట 'క్వాంటిటీ కన్నా క్వాలిటీ ముఖ్యం'.. అనేదే నిజమవుతుంది.

– అందుకే జీవన ప్రమాణాల్లో, నైపుణ్యంలో.. క్వాలిటీ పెంచుకుందాం.



పాపులేషన్ పాప్‌కార్న్..

– జన సంఖ్య ప్రాతిపదికన చూస్తే.. ఇండియా, చైనాల తర్వాత ఏకంగా 139 కోట్ల మంది వినియోగదారులతో 'ఫేస్‌బుక్' మూడో అతిపెద్ద దేశంగా నిలుస్తుంది.

– చిత్రం ఏమిటంటే ప్రపంచ జనాభాలో చాలా వరకు 'అనుకోకుండా' పుట్టినవారేనని అంచనా. దంపతులు గర్భనిరోధక పద్ధతులను సరిగా పాటించకపోవడం, యువతుల్లో అవాంఛిత గర్భధారణ వంటివే దీనికి కారణమని నిపుణులు చెప్తున్నారు.

– ప్రపంచవ్యాప్తంగా 70 కోట్ల మందికిపైగా అమ్మాయిలకు 18ఏళ్లలోపు వయసులోనే వివాహాలు జరుగుతున్నాయి. ఆడపిల్లలు మధ్యలోనే చదువు మానేసేందుకు, జనాభా పెరుగుదలకు ఇది కారణం కావడం విషాదం

– భూమ్మీద ఇప్పటివరకు మొత్తంగా 10,800 కోట్ల మంది నివసించినట్టు అంచనా. అందులో ఏడు శాతం ప్రస్తుతం జీవిస్తున్నారు.

– మొత్తం జనాభాలో సగం మంది అంటే 380 కోట్ల మంది వయసు 30 ఏళ్లలోపే కావడం గమనార్హం. ఇందులో 10–24 ఏళ్ల మధ్యవయసువారు 180 కోట్ల మంది ఉన్నారు.

– 19వ శతాబ్దంలో జనాభా వంద కోట్ల నుంచి 200 కోట్లకు పెరగడానికి వందేళ్లకుపైగా పడితే.. 1960 నుంచి 2000 సంవత్సరం మధ్య కేవలం 40 ఏళ్లలో జనాభా 300 కోట్ల నుంచి 600 కోట్లకు పెరిగిపోయింది.

– అధిక జనాభాకు కారణం కేవలం జననాలు మాత్రమే కాదని, సగటు జీవిత కాలం పెరగడమూ కారణమేనని నిపుణులు చెప్తున్నారు. ఉదాహరణకు ప్రపంచవ్యాప్తంగా పురుషుల ఆయుర్దాయం 1950లో 66 ఏళ్లుకాగా.. ప్రస్తుతం 74 ఏళ్లకుపైనే. అంటే జననాలు అదే స్థాయిలో ఉన్నా.. మరణాలు తగ్గి, జనాభా ఎక్కువగా ఉంటోందన్న మాట.

– ప్రపంచ జనాభా బాగా పెరిగిపోయినా.. వృద్ధిరేటు మాత్రం క్రమంగా తగ్గుతూ వస్తోంది. గత పదేళ్లలో జనాభా సంఖ్య 1.18 శాతం పెరగగా.. అంతకుముందు దశాబ్దంలో ఇది 1.24 శాతం కావడం గమనార్హం.

– సొంత దేశాలను వీడి విదేశాలకు వలస వెళ్లినవారి సంఖ్య 23 కోట్లకుపైగా ఉన్నట్టు అంచనా. గతంలో పేద దేశాల నుంచి అభివృద్ధి చెందిన దేశాలకు వలసలు జరిగితే.. ఇప్పుడు ఒక పేద దేశం నుంచి మరో పేద దేశానికి వలసలు జరుగుతున్నాయి.

– ప్రస్తుతం జనాభాలో 50 శాతం మంది పట్టణ ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం వలసలే దీనికి కారణం. 19వ శతాబ్దం మొదట్లో పట్టణ జనాభా 3 శాతమేకాగా.. 2050 నాటికి ఇది 70 శాతానికి పెరుగుతుందని అంచనా.

– ప్రపంచ జనాభాలో 300 కోట్ల మందికిపైగా సగటున రోజుకు రెండు డాలర్ల (సుమారు రూ.163) కన్నా తక్కువ ఖర్చుతోనే జీవిస్తున్నారు. పేద దేశాల్లో అయితే ఈ ఖర్చు ఇంకా బాగా తక్కువ.

– నిజానికి అధిక జనాభా కంటే మితిమీరిన వినియోగమే పెద్ద సమస్య. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం.. జనాభాలో టాప్ 20 శాతం ధనవంతులు ఆహారం, ఇతర వనరుల్లో 85 శాతాన్ని వినియోగిస్తుంటే.. అట్టడుగు 20 శాతం పేదల వినియోగం 1.3 శాతమే.


– సుమారు 75 కోట్ల మందికి రక్షిత మంచినీరు అందుబాటులో లేదు.

....

సమతా సద్గురుమూర్తి

భారతదేశంలో ఎందరో మహానుభావులు జన్మించారు. తమ దివ్యోపదేశాల ద్వారా మానవ జాతికి దిశానిర్దేశం చేశారు. అటువంటివారిలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఒకరు. చిన్న వయస్సులోనే వేద వేదాంగాలనూ, ఉపనిషత్తులనూ, పురాణేతిహాసాలనూ ఆపోశన పట్టి... వాటి సారాన్ని అచ్చ తెలుగులో తత్వాలుగా, పద్యాలుగా, వచన గేయాల రూపాల్లో పామరులకు సైతం అర్థమయ్యే రీతిలో ఆలపించి... జాతికి వెలుగులను ప్రసాదించారాయన.

ఆయన క్రీ.శ. 1608లో జన్మించారు. చిన్నతనంలో తల్లిదండ్రులను కోల్పోయారు. 12వ ఏట తన పెంపుడు తల్లి అనుమతితో ఆయన దేశాటనకు బయలుదేరారు. పదహారవ ఏడు వచ్చేటప్పటికి బనగానపల్లె చేరి రెడ్డి రాణి అచ్చమాంబ ఇంట ఆవుల కాపరిగా కుదిరారు. తదుపరి ఆమెకే సద్గురువై జ్ఞానోపదేశం చేశారు. తన దేశాటనలో గమనించిన మూఢాచారాలనూ, మత ఛాందసత్వాన్నీ, నిరక్షరాస్యతనూ, మహిళా వివక్షనూ ఆయన తీవ్రంగా ఖండించారు.



నాటి సమాజంలో రజస్వల అయిన కన్యను వివాహమాడకూడదనే మూఢనమ్మకం ఉండేది. దానికి విరుద్ధంగా బ్రహ్మంగారు గోవిందమాంబను రజస్వల అయిన తర్వాతనే వివాహమాడారు. స్త్రీలకు సహజ సౌభాగ్యం జన్మతః వచ్చిందనీ, భర్త పోయినా దానిని విడనాడరాదనీ, బాల్య వివాహాలు సమాజానికి చేటు కలిగిస్తాయనీ ప్రకటించారు.

మతాలకతీతంగా మహమ్మదీయుడైన సిద్దయ్యను ప్రియ శిష్యునిగా స్వీకరించి ఆదరించారు. మనిషిని ప్రేమించలేని వాడు దేవుడిని ప్రేమించలేడనీ, మానవ సేవే మాధవ సేవయనీ హరిజనుడైన కక్కయ్యను శిష్యునిగా స్వీకరించి షట్చక్ర సందర్శనం చేయించారు. బ్రాహ్మణుడైన అన్నాజయ్యకు మంత్రోపదేశం చేశారు. శ్రమైక జీవన సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ... కార్మిక, కర్షక వర్గాలకు కావలసిన వ్యవసాయ పనిముట్లను కులవృత్తిని అనుసరించి అందించారు. అదే సమయంలో ఆధ్యాత్మిక ప్రబోధాలూ చేశారు. తన జ్ఞాన నేత్రంతో ప్రకృతిలోని రహస్యాలను గ్రహించి 'సాంద్ర సింధు వేద' మనే కాలజ్ఞానాన్ని రచించి భవిష్యత్తులో జరగబోయే వింతలను, విశేషాలను ముందుగానే దర్శించి వినిపించారు. ఆయన రచించిన కాళీ మకుట కందాలు, కాళికాంబ సప్తశతి, కాలజ్ఞాన తత్త్వాలు, గోవింద వాక్యాలు వంటివి భక్తులకు నేటికీ ఒకపక్క ఆధ్యాత్మికానందాన్ని ఇస్తూనే... మరోపక్క సామాజిక సంస్కరణకూ పురిగొల్పుతున్నాయి.

– పెద్దోజు నాగేశ్వర సిద్ధాంతి, హైదరాబాదు

(ఏప్రిల్ 30న పోతులూరి వీరబ్రహ్మం ఆరాధన మహోత్సవాలు)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: శు.అష్టమి ప.2.57 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: పుష్యమి ఉ.9.11 వరకు, తదుపరి ఆశ్లేష, వర్జ్యం: రా.11.22 నుండి 1.08 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.11 నుండి 9.02 వరకు, తదుపరి రా.12.23 నుండి 1.13 వరకు, అమృతఘడియలు: లేవు ; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 5.41, సూర్యాస్తమయం: 6.13.

కొచ్చి వాటర్ మెట్రో ప్రాజెక్ట్‌కు శ్రీసిటీ ఎఫ్ఆర్‌పీ ఉత్పత్తులు

- ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు బీఎఫ్‌జీ సహకారం గర్వకారణం
- శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి


కొచ్చి వాటర్ మెట్రో చిత్రం

వరదయ్యపాళెం (తిరుపతి జిల్లా): కొచ్చి వాటర్ మెట్రోకు బీఎఫ్‌జీ సహకారం అందించడం అభినందనీయమని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ప్రశంసించారు. బీఎఫ్‌జీ మేడ్ ఎట్ శ్రీసిటీ ఎఫ్ఆర్‌పీ ఉత్పత్తులను కొచ్చి వాటర్ ప్రాజెక్ట్‌తో పాటు ప్రతిష్టాత్మక వందే భారత్ ఎక్స్‌ప్రెస్, ఇతర అనేక మెట్రో ప్రాజెక్టుల్లో ఉపయోగించడం గర్వకారణమన్నారు. కాగా, ఈనెల 25న దేశానికి అంకితం చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన కొచ్చి వాటర్ మెట్రో సూపర్ స్ట్రక్చర్, దాని ఇంటీరియర్లను శ్రీసిటీలోని బీఎఫ్‌జీ ఇండియా పరిశ్రమ సరఫరా చేసింది. ఇది భారతదేశపు మొట్టమొదటి నీటి మెట్రో మాత్రమే కాదు.. ఆసియాలోనే ఈ పరిమాణం, స్థాయి కలిగిన మొట్టమొదటి సమగ్ర జల రవాణా వ్యవస్థ కూడా. 100 మంది ప్రయాణికుల సామర్థ్యం కలిగిన ఈ వాహన సూపర్ స్ట్రక్చర్, ఇంటీరియర్స్ అన్నింటినీ శ్రీసిటీలోని బీఎఫ్‌జీ కంపెనీలో తయారు చేస్తారు. ఆపై కొచ్చి షిప్‌యార్డ్‌కు తరలించి అక్కడ ఈ విడిభాగాలను అనుసంధానం చేసి ఏకీకృతం చేస్తారు. అలాగే ఆల్‌స్టోమ్ ఇండియాతో ఉన్న ఒప్పందంలో భాగంగా ఇంటీరియర్స్, ఫ్రంట్ ఎండ్‌లు, డ్రైవర్ క్యాబ్‌లు, సైడ్ వాల్స్, సెంట్రల్ సీలింగులు, గ్యాంగ్‌వే విభజనలు, క్యాబ్ విభజనలు వంటి వివిధ విడిభాగాలను కొచ్చి, లక్నో, సిడ్నీ, ముంబై–3, మ్యాంట్రియల్ మెట్రో ప్రాజెక్టులు, వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రాజెక్టుకు అవసరమైన వివిధ విడిభాగాలను బీఎఫ్‌జీ సంస్థ సరఫరా చేస్తోంది.

త్వరలో 147 వ్యవసాయ ప్రయోగశాలలు

- 2 వేల వీఏఏ పోస్టులు భర్తీ చేస్తాం
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్): రాష్ట్రంలోని రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని గ్రామీణ నియోజకవర్గాల్లో 147 వ్యవసాయ ప్రయోగశాలలు ఏర్పాటు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. రెండు వేల గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏ) పోస్టులను కూడా త్వరలో భర్తీ చేస్తామని ఆయన తెలిపారు. నెల్లూరులోని ఆర్డీవో కార్యాలయం సమీపంలో రూ.2.40 కోట్లతో నూతనంగా నిర్మించిన జీవన, సేంద్రియ, ఎరువుల నాణ్యత నిర్ధారణ ప్రయోగశాలను ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అన్ని జిల్లా కేంద్రాల్లో ఇటువంటి ప్రయోగశాలల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారని తెలిపారు. భూసార పరీక్షల విధానంలో త్వరలోనే ప్లాంట్ డాక్టర్ విధానాన్ని తీసుకువస్తామన్నారు. ప్రధానంగా పురుగుమందులు, విత్తనాలు, ఎరువులలో నకిలీని పూర్తిగా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, జేడీఏ సుధాకర్‌రాజు పాల్గొన్నారు.

బాబూ.. నీకు రాజకీయ సన్యాసమే..

- 942వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రాష్ట్ర ప్రయోజనాలు గాలికొదిలి కేవలం అధికారం కోసం అర్రులు చాస్తూ సభలు, సమావేశాలతో ప్రజలను రెచ్చగొడుతున్న చంద్రబాబుకు రాజకీయ సన్యాసం తప్పదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 942వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతిపక్ష నేతల పర్యటనల్లో ప్రభుత్వ వ్యతిరేకతపై మాట్లాడడం, లేదా ప్రభుత్వం కంటే అధికంగా తాను ప్రజలకు సంక్షేమం అందిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వాలి కానీ.. బాబు మాత్రం కుల,మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని చెప్పారు. ప్రజల భావోద్వేగాలతో ఆడుకుంటూ కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలే లక్ష్యంగా కులం ముసుగులో వెళుతున్న బాబు ప్రజలకు ఏం చేస్తాడో స్పష్టంగా చెప్పి ఎన్నికలకు రావాలని డిమాండ్ చేశారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు పేదలకు ఇంగ్లిష్ మీడియం విద్య ఎందుకు అందించలేదో, గూడులేని పేదలకు ఇళ్ల స్థలాలు ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పాలన్నారు. బహుజన హక్కుల కోసం మూడు సంవత్సరాలుగా తాము పోరాటం చేస్తుంటే కనీసం తొంగిచూడని ప్రతిపక్ష పార్టీలకు తామెందుకు ఓట్లేయాలో చెప్పాలని ప్రశ్నించారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, బేతపూడి సాంబయ్య, కారుమూరి పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు చేరిన విద్యార్థి సాయియూష్ మృతదేహం


- అమెరికాలో దుండగుడి కాల్పుల్లో మృతి
- నేడు పాలకొల్లులో అంత్యక్రియలు



ఏలూరు టౌన్: అమెరికాలోని ఒహాయో రాష్ట్రంలో దుండగుడి కాల్పుల్లో మృతి చెందిన విద్యార్థి వీర సాయియూష్ మృతదేహం అమెరికా నుంచి గురువారం సాయంత్రం ఏలూరు చేరుకుంది. ఉదయం హైదరాబాద్ చేరుకోగా లాంఛనాలన్నీ పూర్తిచేసి హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ఎంబసీ అధికారులు బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు. అంబులెన్స్‌లో సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో ఏలూరు తెచ్చారు. ఏలూరు అశోక్‌నగర్‌లోని ఇంటి వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల సందర్శనార్థం ఉంచారు. అనంతరం పాలకొల్లులో అంత్యక్రియలు చేసేందుకు అంబులెన్స్‌లో తీసుకెళ్లారు. శుక్రవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహిస్తారని బంధువులు చెప్పారు. భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో అమెరికా వెళ్లిన వీర సాయియూష్ వారం కిందట దుండగుడి దాడిలో తీవ్రంగా గాయపడి మృతిచెందిన విషయం తెలిసిందే. కుమారుడి మృతదేహాన్ని చూసిన తల్లి జయశ్రీతో పాటు అన్న వీర వెంకటేష్, స్నేహితులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

బీటెక్ విద్యార్థుల ప్రాజెక్టులు వినూత్నంగా ఉండాలి

- ఇండియన్ ఏరో స్పేస్ సైంటిస్ట్ నంబి నారాయణన్


విద్యార్థులకు డిగ్రీ పట్టా అందిస్తున్న నంబి నారాయణన్, రంగ జనార్ధన్ తదితరులు

నారాయణవనం(తిరుపతి జిల్లా): బీటెక్ విద్యార్థులు రూపొందించే ప్రాజెక్టులు ఇన్నొవేటివ్‌గా ఉండాలని ఇండియన్ ఏరో స్పేస్ సైంటిస్ట్ నంబి నారాయణన్ సూచించారు. స్థానిక సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ డే గురువారం ఘనంగా నిర్వహించారు. నంబి నారాయణన్, అనంతపురం జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ రంగ జనార్ధన్, సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ సేథురామన్ ముఖ్య అతిథులుగా పాల్గొని బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. నంబి నారాయణన్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రాజెక్టులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి దర్పణం పట్టే విధంగా ఉండాలన్నారు. భవిష్యత్తులో ఎదగడానికి ఇవి ఎంతగానో ఉపకరిస్తాయని చెప్పారు. కళాశాల చైర్మన్ డాక్టర్ అశోకరాజు, వైస్ చైర్‌పర్సన్ ఇందిరావేణి పాల్గొన్నారు.

టీటీడీ ఆస్పత్రుల్లో ప్రపంచస్థాయి వైద్య ప్రమాణాలు

స్విమ్స్, బర్డ్, శ్రీపద్మావతి హృదయాలయ ఇందుకు నిదర్శనం

- వైద్యపరికరాల తయారీకోసం బర్డ్‌లో ల్యాబ్ ఏర్పాటు చేస్తాం
- ఇందుకోసం 5 ప్రముఖ ఐఐటీలతో ఒప్పందం
- ఎన్‌బీఈఎంఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మిను బాజ్‌పాయ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మిను బాజ్ పాయ్

తిరుపతి తుడా: తిరుపతిలో టీటీడీ ఆధ్వర్యంలోని స్విమ్స్, బర్డ్, శ్రీపద్మావతి హృదయాలయ ఆస్పత్రుల్లో ప్రపంచస్థాయి వైద్య ప్రమాణాలు పాటిస్తున్నారని ప్రముఖ పీడియాట్రిక్ సర్జన్, నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మిను బాజ్‌పాయ్ ప్రశంసించారు. ఆయన గురువారం టీటీడీ ఈవో ఎ.వి.ధర్మారెడ్డితో కలిసి శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయం, బర్డ్ ఆస్పత్రులను సందర్శించారు. ముందు శ్రీ పద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డితో కలిసి గుండెమార్పిడి అనంతరం చికిత్స పొందుతున్న చిన్నారితో పాటు పలు వార్డుల్లో గుండె జబ్బులకు చికిత్స పొందుతున్న చిన్నారులను, క్యాథ్‌ల్యాబ్, ఐసీయూ తదితర కేంద్రాలను చూసి పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం బర్డ్‌లో నిరుపేదలకు ఉచితంగా మోకీళ్ల మార్పిడి, ఆర్థో సంబంధిత వ్యాధులకు అందిస్తున్న చికిత్సలను బర్డ్ ఆస్పత్రి ప్రత్యేకాధికారి డాక్టర్ రెడ్డెప్పరెడ్డి.. డాక్టర్ బాజ్‌పాయ్‌కి వివరించారు. అనంతరం డాక్టర్ బాజ్‌పాయ్ మీడియాతో మాట్లాడుతూ టీటీడీ ఆస్పత్రుల్లో నిరుపేదలకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు, మోకీలు, తుంటిమార్పిడి, అత్యంత సంక్లిష్టమైన వెన్నుపూస ఆపరేషన్లు, గ్రహణమొర్రి శస్త్రచికిత్సలు చేయడం పట్ల అభినందనలు తెలిపారు. శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయం, బర్డ్ ఆస్పత్రుల్లో అత్యాధునిక సౌకర్యాలు, స్పెషలిస్ట్ డాక్టర్లు ఉన్నట్లు చెప్పారు. పద్మావతి ఆస్పత్రిలో ఇప్పటివరకు 1,300కు పైగా గుండె సంబంధిత ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. దేశం నలుమూలలతో పాటు పక్క దేశం నుంచి కూడా చిన్నపిల్లల తల్లిదండ్రులు ఇక్కడికి చికిత్సకోసం వస్తుండడం గొప్ప విషయమన్నారు. తిరుమల శ్రీవారి అండదండలతోనే ఇంతటి ఘనత సాధ్యమైందని కొనియాడారు.

పేద, మధ్య తరగతి ప్రజలకు వరం

రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం పేద, మధ్యతరగతి ప్రజలకు వరమని చెప్పారు. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆధ్వర్యంలో దేశం మొత్తం మీద వైద్యరంగంలో కార్యక్రమాల అమలును పర్యవేక్షిస్తామని తెలిపారు. తమ బోర్డు ఆధ్వర్యంలో స్పెషలిస్టులను తయారు చేయడమే ప్రధాన ఉద్దేశమన్నారు. కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్ అంశాల్లో వైద్యులకు శిక్షణ ఇస్తామని చెప్పారు. క్యాన్సర్ రోగుల కోసం వినియోగించే లీనియర్ యాక్సిలరేటర్ రూ.50 కోట్లు అవుతుందని, మన దేశంలో ఇలాంటివి వందల సంఖ్యలో కావాల్సి ఉందని తెలిపారు. ఇలాంటి ఖరీదైన వైద్య పరికరాలను ఉత్పత్తి చేసేందుకు మన డాక్టర్లకు శిక్షణ ఇప్పించేందుకు చర్యలు మొదలుపెట్టినట్లు చెప్పారు. బర్డ్ ఆస్పత్రిలో స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ సౌకర్యాలు ఉన్నాయన్నారు. వైద్యరంగంలో నూతన పరికరాల తయారీ కోసం బర్డ్‌లో ప్రత్యేకంగా ల్యాబ్ ఏర్పాటు చేస్తామని, ఇందుకోసం దేశంలోని ఐదు ప్రముఖ ఐఐటీలతో ఒప్పందం కుదుర్చుకున్నామని ఆయన చెప్పారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి, జేఈవో సదా భార్గవిలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈఈ కృష్ణారెడ్డి, ఎస్వీసీహెచ్‌సీకి చెందిన డాక్టర్ గణపతి, బర్డ్ వైద్యులు డాక్టర్ రామమూర్తి, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగులోకి 'అల్లూరి' కాలం నాటి గుహలు

- గూడెంకొత్తవీధి మండలంలో గుర్తించిన గిరిజనులు
- సీతారామరాజు రహస్య స్థావరంగా వినియోగించుకున్నారని ప్రచారం


దట్టమైన అడవిలో ఉన్న కొండ గుహలు

గూడెంకొత్తవీధి (అల్లూరి సీతారామరాజు): మన్యం పేరు చెప్పగానే విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు గుర్తుకువస్తారు. అల్లూరి నడయాడిన నేలగా మన్యం ప్రాంతానికి ప్రత్యేక చరిత్ర ఉంది. ఆ మహనీయుడు నడిచిన ప్రాంతాలు, వినియోగించిన వనరులు ఇప్పటికీ పదిలంగా నాటి చరిత్రకు సాక్ష్యంగా ఉన్నాయి. తాజాగా అల్లూరి సీతారామరాజు రహస్య స్థావరంగా వినియోగించుకున్న రెండు గుహలు వెలుగులోకి వచ్చాయి. గూడెంకొత్తవీధి మండలం సప్పర్లకు ఐదు కిలోమీటర్ల దూరంలో గాలికొండ పంచాయతీకి ఆనుకుని ఉన్న కొండపై ఈ గుహలను ఇటీవల గిరిజనులు గుర్తించారు. ఇవి అల్లూరి కాలం నాటి గుహలని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతం నాడు దట్టమైన దండకారణ్యంగా ఉండటం, క్రూరమృగాలు అధికంగా సంచరించడంతో ఎవరూ వెళ్లేవారు కాదు. ఇప్పుడు అడవులు తగ్గడం, రహదారులు ఏర్పడటం, క్రూరమృగాల సంఖ్య తగ్గడంతో ప్రజల రాకపోకలు పెరిగాయి. ఈ క్రమంలో అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం వెళ్లిన కొంతమంది యువకులు ఈ గుహలను గుర్తించారు. బ్రిటిష్ సైనికుల నుంచి తప్పించుకునేందుకు అల్లూరి సీతారామరాజు ఈ గుహలను రహస్య స్థావరాలుగా వినియోగించుకునేవారని గిరిజన పెద్దలు చెబుతున్నారు. ఆయన ఇక్కడ నుంచి కృష్ణదేవీపేట, మంప, కొయ్యూరు వంటి ప్రాంతాలకు రహస్యంగా రాకపోకలు సాగించేవారని పేర్కొంటున్నారు. అల్లూరి సీతారామరాజు రహస్య స్థావరంగా వినియోగించుకున్న ఈ గుహలను చారిత్రక సంపదగా గుర్తించి పరిరక్షించాలని, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు. మరోవైపు గుహల ఫొటోలను స్థానిక యువకులు సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్ అయ్యాయి.

ఏపీ జెన్‌కో సర్క్యూట్ బ్రేకర్‌లో మంటలు

- ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు


మంటలు వచ్చిన సర్క్యూట్ బ్రేకర్

ముత్తుకూరు: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం నేలటూరులోని శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్టు రెండో దశ యూనిట్ ఏహెచ్‌పీ కంట్రోల్ రూమ్‌లో గురువారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు కాంట్రాక్టు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రాజెక్టు ఉద్యోగుల కథనం ప్రకారం.. ఎస్ఈసీ కంపెనీకి చెందిన కె.కార్తీక్, టాటా సంస్థకు చెందిన సురేష్ ఎల్‌టీ మాడ్యూల్ సర్క్యూట్ బ్రేకర్ వద్ద మెయింటెనెన్స్ పనులు చేపట్టారు. ఒక్కసారిగా బ్రేకర్‌లో నుంచి మంటలు ఎగసిపడడంతో ఎదురుగా ఉన్న వీరిద్దరి శరీరాలు కాలిపోయాయి. వెంటనే అంబులెన్స్ ద్వారా వీరిని జెన్‌కో ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వీరి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు ప్రాజెక్టు ఉద్యోగులు తెలిపారు. జెన్‌కో ప్రాజెక్టులో జరిగిన ప్రమాదంపై రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి ఇంజనీర్లతో మాట్లాడారు. సంఘటన వివరాలను ఆరా తీశారు. వీరికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

మద్యం కల్తీని ఇట్టే పట్టేస్తారు!

- ఏయూతో ఎక్సైజ్ శాఖ అవగాహన ఒప్పందం
- అత్యాధునిక ఆల్కహాల్ టెస్టింగ్ ప్రయోగశాల ఏర్పాటు


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

ఏయూక్యాంపస్: మద్యం కల్తీ చేయడం ఇకపై సాధ్యపడదు. నార్కోటిక్ డ్రగ్స్‌ను గుర్తించే వ్యవస్థను అభివృద్ధి చేస్తూ.. రీజినల్ లేబొరేటరీని ఉత్తరాంధ్ర జిల్లాలకు ఉపయుక్తంగా విశాఖలో ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఆంధ్రవిశ్వవిద్యాలయంలో దీనికి అనువైన స్థలం, ప్రత్యేక ప్రయోగశాలను కేటాయించారు. ఏయూలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆల్కహాల్ టెస్టింగ్‌కి రూ.3 కోట్ల వ్యయంతో ప్రాంతీయ ప్రయోగశాలను ఏర్పాటు చేస్తోంది. ఏయూ ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలపై గురువారం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసులు సంతకాలు చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ అన్నిరకాల మద్యం, మత్తుపదార్థాలను ఇక్కడ ప్రయోగశాలలో శాస్త్రీయంగా పరిశీలించడం, అధ్యయనం చేస్తారని చెప్పారు. అదే విధంగా బ్రాండెడ్ మద్యంలో జరిగే కల్తీని సైతం గుర్తించడం వీలవుతుందన్నారు. డిస్టిలరీలలో మద్యం తయారీకి ఉపయోగించే ఆల్కహాల్‌లో ఇంప్యూరిటీస్‌ని గుర్తించి, గణించే సామర్థ్యం ఈ ప్రయోగశాలకు ఉందని తెలిపారు. నార్కోటిక్ డ్రగ్స్ వివిధ రూపాల్లో చలామణి అవుతుందని, నేరం జరిగిన సందర్భంలో శాస్త్రీయంగా వాటిని గుర్తించడానికి ఈ ప్రయోగశాల ఉపయుక్తంగా నిలుస్తుందని వివరించారు. రీసెర్చ్ డెవలప్‌మెంట్ డీన్ ఆచార్య కె.బసవయ్య, రెక్టార్ ఆచార్య కె.సమత పాల్గొన్నారు.

ప్రయాణ 'వైభోగ'పురం


భోగాపురం ఎయిర్‌పోర్టు చెక్ ఇన్ హాల్ నమూనా

▶ మొదటి పేజీ తరువాయి

అన్ని కీలక అనుమతులు సాధించడంతో రెండేళ్లలోనే అందుబాటులోకి రానుంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనులకు మే 3న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భూమి పూజ చేసి నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభిస్తారు. కేంద్ర మంత్రులు ముఖ్య అతిథులుగా హాజరవుతుండటంతోఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

మొత్తం మూడు దశల్లో..

ఏటా 1.80 కోట్ల మంది ప్రయాణించేలా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మూడు దశల్లో అభివృద్ధి చేయనున్నారు. ఇందులో భాగంగా తొలి దశలో 60 లక్షల మంది ప్రయాణించేలా రూ.5,000 కోట్లతో పనులు చేపడతారు. ఇక రెండో దశలో 1.20 కోట్ల మంది, మూడో దశలో 1.80 కోట్ల మంది ప్రయాణించేలా అభివృద్ధి చేస్తారు. మూడు దశల్లో ఒకేసారి 22 విమానాలు ఆగేలా 22 ఎయిర్‌బ్రిడ్జిలను నిర్మిస్తారు. ఇందులో భాగంగా తొలిదశలో ఏడు ఎయిర్‌బ్రిడ్జిలను అభివృద్ధి చేస్తారు. తొలి దశలో ప్యాసింజర్ టెర్మినల్, కార్గో కాంప్లెక్స్, విమానాల నిర్వహణ, మరమ్మతులకు ఎంఆర్‌వో యూనిట్, ఏవియేషన్ అకాడమీ, ప్లాంట్ క్వారంటైన్, యానిమల్ క్వారంటైన్ వంటి పలు సదుపాయాలను కల్పించనున్నారు. అలాగే విశాఖ నగరం వైపు అభివృద్ధి చేయనున్నారు.

భారీ విమానాలకు అనువుగా..

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీ విమానాలు సురక్షితంగా దిగేలా 3.8 కి.మీ పొడవైన భారీ రన్‌వేను నిర్మించనున్నారు. తూర్పు తీరంలో విశాఖ చాలా వ్యూహాత్మక స్థానం కావడంతో రక్షణ అవసరాల కోసం ఎయిర్‌పోర్టులో 10 ఎకరాలను ప్రత్యేకంగా ప్రభుత్వం కేటాయించింది. ఇవి కాకుండా అంతర్జాతీయ విమాన సర్వీసులకు అవసరమైన కస్టమ్స్, ఇమిగ్రేషన్‌లతోపాటు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) టవర్లను ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఎయిర్‌పోర్టుకు ఆనుకొని ఉన్న 500 ఎకరాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏరో సిటీని అభివృద్ధి చేయనుంది.

అడ్డంకులన్నీ అధిగమించి.. కీలక అనుమతులు సాధించి..

గత ప్రభుత్వం భూసేకరణ కూడా పూర్తి చేయకుండానే ఎన్నికల ముందు హడావుడిగా శంకుస్థాపన చేసింది. దానికి భిన్నంగా ప్రస్తుత ప్రభుత్వం అన్ని అనుమతులు వచ్చాకే నిర్మాణ పనులను ప్రారంభిస్తోంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంపై సుప్రీంకోర్టు, హైకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)ల్లో నమోదైన కేసుల్లో రాష్ట్ర ప్రభుత్వం విజయం సాధించింది. అలాగే భూసేకరణకు సంబంధించిన అన్ని అడ్డంకులను అధిగమించింది. విమానాశ్రయం ప్రారంభించాక ప్రస్తుతం విశాఖలోని నేవీ విమానాశ్రయం నుంచి 30 ఏళ్లపాటు వాణిజ్య సేవలను నిలిపివేయడానికి కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) పొందింది. అలాగే ఎయిర్‌పోర్టు భద్రతకు బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ ఆమోదం, పలు సర్వీసు సేవలకు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ), విదేశీ సర్వీసుల నిర్వహణకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖలతో పలు ఒప్పందాలను రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకుంది.

2025 నాటికి తొలి విమానం..

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను ముఖ్య అతిథిగా ఆహ్వానించాం. 2025 నాటికి ఇక్కడి నుంచి తొలి విమానం ఎగరాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. మూలపేట పోర్టు, భోగాపురం ఎయిర్‌పోర్టులతో పారిశ్రామికంగా ఉత్తరాంధ్ర ముఖచిత్రం మారిపోతుంది.

– గుడివాడ అమర్‌నాథ్, పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి

అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం

నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని అంతర్జాతీయ ప్రమాణాలతో ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేస్తున్నాం. సీఎం వైఎస్ జగన్ ఆశయాలకు అనుగుణంగా అన్ని అనుమతులు సాధించాకే నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నాం. దీంతో రెండేళ్లలోనే వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం రానుంది. అలాగే స్థానిక కుటుంబాలకు సాధ్యమైనంత ఎక్కువ సాయం అందించడానికి సీఎం ఆదేశాలకు అనుగుణంగా అత్యాధునిక వసతులతో పునరావాస గ్రామాలను అభివృద్ధి చేశాం.

– బీఎస్ భరత్ రెడ్డి, ఎండీ, ఏపీఏడీసీఎల్

నిర్వాసితులకు అండగా..

విమానాశ్రయ నిర్మాణం నేపథ్యంలో నాలుగు గ్రామాలకు చెందిన ప్రజలను పునరావాస గ్రామాలకు తరలించారు. ఇందుకోసం పోలిపల్లి, గూడెపువలస వద్ద 50.3 ఎకరాల్లో సుమారు రూ.77 కోట్లతో రెండు గేటెడ్ కమ్యూనిటీ తరహాలో పునరావాస గ్రామాలను ప్రభుత్వం అభివృద్ధి చేసింది. ప్రైవేటు రియల్ ఎస్టేట్ వెంచర్లకు దీటుగా కాలనీల్లో 30 అడుగుల సీసీ రోడ్లు, డ్రైనేజ్, ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి, కమ్యూనిటీ హాళ్లు, చిల్డ్రన్ పార్క్, పాఠశాల, పోస్టాఫీసు, షాపింగ్ కాంప్లెక్స్, దేవాలయాలు వంటి అనేక సదుపాయాలను కల్పించడంతో ప్రజలు సంతోషంగా గ్రామాలను వదిలి పునరావాస కేంద్రాలకు చేరుకున్నారు.

దళితవాడల్లో 2,000 ఆలయాల నిర్మాణానికి కృషి

- టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వెల్లడి
- సత్యవేడులో టీటీడీ కల్యాణ మండపానికి శంకుస్థాపన


టీటీడీ కల్యాణ మండపానికి శంకుస్థాపన చేస్తున్న వైవీ సుబ్బారెడ్డి

సత్యవేడు (తిరుపతి జిల్లా): రాష్ట్రంలోని దళితవాడలు, ఎస్టీ, బీసీ కాలనీల్లో 2,000 ఆలయాలు నిర్మించే దిశగా టీటీడీ చర్యలు చేపట్టిందని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం సత్యవేడులో జరిగిన టీటీడీ కల్యాణమండపం నిర్మాణానికి శంకుస్థాపనలో ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే ఆదిమూలంతో కలసి వైవీ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సత్యవేడులో పేదలు, కార్మిక కుటుంబాల కోసమే కల్యాణమండపం మంజూరు చేసినట్లు చెప్పారు. కళ్యాణ మండపాల మంజూరులో 20 శాతం మ్యాచింగ్ గ్రాంట్ ఉంటుందని, కానీ సత్యవేడు రిజర్వ్‌డ్ నియోజకవర్గంలో పేదలు అధికంగా ఉండడంతో మ్యాచింగ్ గ్రాంట్ లేకుండా పూర్తిగా రూ. 2 కోట్లు నిధులు మంజూరు చేశామన్నారు. నియోజకవర్గంలో 45 పాఠశాలల అభివృద్ధికి రూ.40 కోట్లు, పిచ్చాటూరులోని ఆరణియార్ అభివృద్ధికి రూ.33 కోట్లు, దాసుకుప్పం బైపాస్ రోడ్డు ఏర్పాటుకు రూ.26 కోట్లు, రూ.10 కోట్లతో మూడు పీఏసీఎస్‌లు అభివృద్ధి జరుగుతుందన్నారు. సత్యవేడు నియోజకవర్గంలోని పాండూరు సమీపంలో 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి మంజూరైనట్లు ఎంపీ డాక్టర్ గురుమూర్తి తెలిపారు.

కేఎల్‌యూలో ప్రారంభమైన అడ్మిషన్స్ కౌన్సెలింగ్


శీలం జాహ్నవికి ధ్రువీకరణపత్రాన్ని అందజేస్తున్న వీసీ తదితరులు

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయం పరిధిలోని విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లలో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశం కోసం గురువారం కౌన్సెలింగ్ ప్రారంభించినట్లు ఉప కులపతి డాక్టర్ పార్థసారధి వర్మ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో మూడు విడతలుగా జాతీయస్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించామని, ఇంజినీరింగ్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు మే నెల 5వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని వివరించారు. కేఎల్ మాట్ 2023లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు కూడా పాల్గొని అడ్మిషన్లు తీసుకున్నారని తెలిపారు. అనంతరం కేఎల్ ఇంజినీరింగ్‌లో మొదటి ర్యాంకు సాధించిన ఎం.జయచంద్రకు బీటెక్ సీఈసీ విభాగంలోనూ,కేఎల్ మాట్ పరీక్షలో మొదటి ర్యాంకు సాధించిన శీలం జాహ్నవికి ఎంబీఏ సీటు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. పలువురు యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పలు మెము రైళ్లు రద్దు


రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): విజయవాడ డివిజన్‌లోని రాయనపాడు యార్డ్ సెక్షన్‌లో జరుగుతోన్న ట్రాఫిక్ బ్లాక్ పనుల కారణంగా పలు మెము రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. విజయవాడ–భద్రాచలం రోడ్డు (079790), భద్రాచలం రోడ్డు–విజయవాడ (07278), డోర్నకల్లు జంక్షన్–విజయవాడ(07755), విజయవాడ–డోర్నకల్లు జంక్షన్ (07756) మెమో రైళ్లను ఈ నెల 28 నుంచి 30 వరకు రద్దు చేశారు.

ఇంద్రకీలాద్రిపై కేశఖండన టికెట్ ధర పెంపు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై గల శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన కేశఖండన శాల టికెట్ ధరను రూ.25 నుంచి రూ.40 కు పెంచుతూ దేవస్థాన ఈవో భ్రమరాంబ గురువారం ఆదేశాలిచ్చారు. దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాల మేరకు మే 1 నుంచి ఈ పెంపు అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

12 దాకా సిసోడియా జ్యుడీషియల్ కస్టడీ



న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఉప ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు మనీశ్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీ న్యాయస్థానం మే 12వ తేదీ దాకా పొడిగించింది. ఈ మేరకు ప్రత్యేక జడ్జి ఎం.ఎం.నాగపాల్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసులో ఈ నెల 25న దాఖలు చేసిన అనుబంధ చార్జిషీట్ ఈ–కాపీని సిసోడియాకు అందజేయాలని సీబీఐని ఆదేశించారు. విచారణ పూర్తి కాకుండానే సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసిందని, సిసోడియాకు డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరఫు న్యాయవాది రిషికేశ్ కోరారు. బెయిల్ కోసం దరఖాస్తు చేసే హక్కు తమకు ఉందని పేర్కొన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. అనుబంధ చార్జిషీట్ ఈ–కాపీని సిసోడియాకు ఇవ్వాలని సీబీఐకి స్పష్టం చేశారు.

దేవెగౌడ సుడిగాలి పర్యటనలు

11 రోజుల్లో 42 చోట్ల ప్రచారం చేయనున్న జేడీఎస్ చీఫ్



శివాజీనగర: త్రిముఖ పోరుగా మారిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో జేడీఎస్ పార్టీ మరిన్ని సీట్లు ఒడిసి పట్టేందుకు ఆ పార్టీ చీఫ్ హెచ్‌డీ దేవెగౌడ స్వయంగా రంగంలోకి దిగారు. వచ్చే 11 రోజుల్లో 42 చోట్ల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 89 ఏళ్ల వయసులోనూ పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తూ పార్టీ శ్రేణులను, కార్యకర్తలు, మద్దతుదారుల్లో ఎన్నికల సమరోత్సాహం పెంచనున్నారు. 'శుక్రవారం నుంచి మే ఎనిమిదో తేదీ దాకా 42 చోట్ల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటా. వయోభారం రీత్యా వారానికి ఒక్కరోజు మాత్రం కాస్తంత విరామం తీసుకుంటా. మా పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేసేందుకు వస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మాట ఇచ్చారు. కర్ణాటకలో వారు ప్రచారంలో పాల్గొంటారు. ప్రచారం కోసం ఇంకొందరు జాతీయస్థాయి నేతలతో ఈ విషయమై హెచ్‌డీ కుమారస్వామి మంతనాలు జరుపుతున్నారు' అని దేవెగౌడ గురువారం బెంగళూరులో మీడియాతో చెప్పారు. 'జాతీయరాజకీయాల్లో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. స్థానిక రాజకీయాల్లోనూ ఆ మార్పులు తప్పనిసరి' అని అన్నారు. '207 మంది పార్టీ అభ్యర్థులు బరిలో నిలిచారు. మూడు చోట్ల సీపీఎం అభ్యర్థులకు, మరో మూడు చోట్ల రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థులకు మద్దతిస్తున్నాం' అని ఆయన చెప్పారు.

'కల్యాణం' ఎవరికో?


కల్యాణ కర్ణాటకలో హోరాహోరీ

కాంగ్రెస్‌కు ముందునుంచీ కంచుకోట

ఈసారి పాగా వేయాలని బీజేపీ యత్నం

వెనకబాటుతనమే ఇక్కడి ప్రధాన సమస్య

కల్యాణ (హైదరాబాద్) కర్ణాటక. కన్నడ సీమలో అత్యంత వెనకబడ్డ మెట్ట ప్రాంతం. దశాబ్దాలుగా కాంగ్రెస్‌కు కంచుకోటగా నిలుస్తూ వస్తోంది. రాష్ట్రంలో బీజేపీ రెండుసార్లు 100కు పైగా స్థానాలు ఒడిసిపట్టినా మెజారిటీ మార్కును దాటలేకపోవడానికి ఈ ప్రాంతంలో పట్టు లేకపోవడమే ప్రధాన కారణం. దాంతో ఈసారి రెండు పార్టీలకూ కల్యాణ కర్ణాటక కీలకంగా మారింది. పట్టు కొనసాగించాలని కాంగ్రెస్, కోటను ఎలాగైనా బద్దలు కొట్టాలని బీజేపీ పట్టుదలగా ఉన్నాయి. ఇక్కడ ఎప్పుడూ ఐదు స్థానాలకు మించి గెలవని జేడీ(ఎస్) ఈసారి బీజేపీ, కాంగ్రెస్ రెబెల్స్‌ను బరిలో దించి అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది...



ప్రభావం చూపే అంశాలు
- పడకేసిన ఐటీ కారిడార్
- తీవ్ర కరువు, నిరుద్యోగం
- తాగు, సాగునీటి కొరత
- రోడ్ల లేమి, వలసలు
- కలబురగికి రైల్వే డివిజన్ హామీ పెండింగ్

'హైదరాబాద్ రాష్ట్రం'లో భాగమే

కల్యాణ కర్ణాటక ఒకప్పటి హైదరాబాద్ రాజ్యంలో భాగంగా నిజాంల ఏలుబడిలో కొనసాగింది. ఇటీవలి దాకా కూడా ఈ ప్రాంతాన్ని హైదరాబాద్ కర్ణాటకగానే పిలిచేవారు.

ఈ ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీ, లింగాయత్, ముస్లింలు అధిక సంఖ్యాకులు. 50 శాతానికి పైగా ఉండే ఈ వెనుకబడిన వర్గాలే ఇక్కడ నిర్ణాయక శక్తి.

వీరేంద్ర పాటిల్, ధరంసింగ్ రూపంలో ఇద్దరు సీఎంలను అందించినా ఈ ప్రాంతం అత్యంత వెనకబాటుతనానికి మారుపేరు.

దేశంలోనే రెండో అతి పెద్ద మెట్ట ప్రాంతంగా పేరొందింది. దాంతో వెనకబాటుతనం ఇక్కడ ప్రతిసారీ ఎన్నికల అంశంగా మారుతుంటుంది.

ఈసారి కూడా పార్టీలన్నీ అభివృద్ధి నినాదాన్నే జపిస్తున్నాయి.

అతివృష్టితో ఇక్కడ 90 శాతం పంటనష్టం జరిగింది. బీజేపీ ప్రభుత్వం హెక్టార్‌కు రూ.10 వేల పరిహారం ప్రకటించినా అదింకా అందలేదు. ఇది ఎన్నికల్లో ప్రభావం చూపవచ్చంటున్నారు.

ఆర్టికల్ 371(జే) ప్రకారం విద్య, ఉద్యోగాల్లో ఈ ప్రాంతానికి ప్రత్యేక హోదా ఉన్నా ఒరిగిందేమీ లేదని స్థానికుల్లో తీవ్ర అసంతృప్తి ఉంది.

దాంతో కొన్నేళ్లుగా ప్రత్యేక కల్యాణ రాష్ట్ర డిమాండ్ ఊపందుకుంటోంది!

బీదర్, కలబురిగి, యాద్గిర్, రాయచూరు, కొప్పళ, బళ్లారి, విజయనగర జిల్లాలతో కూడిన కల్యాణ కర్ణాటకలో 40 స్థానాలున్నాయి.

గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇక్కడ సగానికి పైగా స్థానాలను కాంగ్రెస్ చేజిక్కించుకుని సత్తా చాటింది. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 21 సీట్లు రాగా బీజేపీ 15, జేడీ(ఎస్) 4 గెలిచాయి. అయితే 2013తో పోలిస్తే కాంగ్రెస్‌కు 2 సీట్లు తగ్గగా బీజేపీకి 9 పెరిగాయి!

ఖర్గేకు సుదీర్ఘ రాజకీయ జీవితంలో 2019 లోక్‌సభ ఎన్నికల్లో తొలి ఓటమిని రుచి చూపిన స్ఫూర్తితో కల్యాణ కర్ణాటకలో పూర్తిగా పాగా వేసేందుకు ప్రయత్నిస్తోంది.

లింగాయత్‌లు ఎక్కువగా ఉన్నందున వారికి 2 శాతం అదనపు రిజర్వేషన్ల నిర్ణయం కలిసొస్తుందని ఆశ పడుతోంది. కానీ 40 శాతం కమీషన్లు, నియామక అక్రమాలు, రెబెల్స్ వంటివి బీజేపీకి ప్రతికూలంగా మారాయి.

ఖర్గే ఖిల్లా

మల్లికార్జున ఖర్గే కల్యాణ కర్ణాటక ప్రాంతానికి చెందిన నాయకుడే. కాంగ్రెస్ సారథిగా ఈసారి ఇక్కడ పార్టీకి అత్యధిక స్థానాలు సాధించి పెట్టాలని పట్టుదలగా ఉన్నారు. ఖర్గే కుమారుడు, చిత్తాపుర ఎమ్మెల్యే ప్రియాంక్ ఖర్గే ఇక్కడ బీజేపీకి కొరకరాని కొయ్యగా మారారు.

ఈ కాంగ్రెస్ కంచుకోటను బద్దలు కొట్టేందుకు అధికార బీజేపీ విశ్వప్రయత్నాలు చేస్తోంది. డబుల్ ఇంజిన్ సర్కార్, అభివృద్ధి కార్యక్రమాలనే బీజేపీ ప్రచారాస్త్రాలుగా చేసుకుంది. మోదీపై ఆశలు పెట్టుకుంది.


కల్యాణ కర్ణాటక ఉత్సవం, బీదర్ ఉత్సవం వంటివాటితో స్థానికుల మనసు దోచుకునే ప్రయత్నాలు చేసింది.

కల్యాణ కర్ణాటక ప్రాంతీయాభివృద్ధి మండలికి వార్షిక కేటాయింపులను రూ. 1,500 కోట్ల నుంచి రూ.5,000 కోట్లకు పెంచింది.

జేడీఎస్ గత మూడు ఎన్నికల్లో ఇక్కడ ఎప్పుడూ ఐదు సీట్లకు మించి నెగ్గలేదు. ఈసారి తమ పంచరత్న యాత్ర విజయవంతం కావడం, కాంగ్రెస్, బీజేపీ సీనియర్ నేతలు జేడీ(ఎస్)లో చేరడంతో మంచి ఫలితాలపై ఆశలు పెట్టుకుంది.

ఈసారి కల్యాణ కర్ణాటక నుంచి బరిలో దిగిన గాలి జనార్ధన్ రెడ్డి కల్యాణ రాజ్య ప్రగతి పార్టీ (కేఆర్‌పీపీ) మూడు ప్రధాన పార్టీల అవకాశాలను తారుమారు చేసే అవకాశముంది. **- సాక్షి, బెంగళూరు**

విమర్శల నడుమే ఆనంద్ విడుదల



ఆనంద్.. తెలంగాణ ప్రాంత కలెక్టర్ కృష్ణయ్య హత్య కేసులో దోషి

సహర్సా/పట్నా: రెమిషన్ అమలుకు సంబంధించి జైలు మాన్యువల్‌ను నితీశ్ కుమార్ ప్రభుత్వం 'మార్చడం'తో రాజకీయనేతగా ఎదిగిన గ్యాంగ్‌స్టర్, మాజీ ఎంపీ ఆనంద్ మోహన్ సింగ్ గురువారం బిహార్ కారాగారం నుంచి విడుదలయ్యారు. 1994లో ముజఫర్‌పూర్ గ్యాంగ్‌స్టర్ ఛోటా శుక్లా అంత్యక్రియల సందర్భంగా ఆందోళనలురేపి ఆ గొడవల్లో నాటి బిహార్‌లోని గోపాల్‌గంజ్ జిల్లా కలెక్టర్, తెలంగాణ వ్యక్తి జి.కృష్ణయ్యను అత్యంత పాశవికంగా హత్య చేసిన ఉదంతంలో ఆనంద్ దోషిగా తేలడం తెల్సిందే. 2007లో స్థానిక కోర్టు ఆనంద్‌ను దోషిగా తేల్చి మరణశిక్ష ఖరారుచేసింది. కానీ ఆ తర్వాతి ఏడాది విజ్ఞప్తి మేరకు శిక్షను తగ్గించి జీవిత ఖైదుగా మారుస్తూ పట్నా హైకోర్టు తీర్పు వెలువర్చడం తెల్సిందే. ఆనాటి నుంచి 15 ఏళ్లపాటు బిహార్ జైలులో ఆనంద్ శిక్ష అనుభవించారు. పలుమార్లు పెరోల్‌పై బయటికొచ్చారు. ఇటీవల సీఎం నితీశ్ సమక్షంలో తన కుమారుడు, ఆర్జేడీ ఎమ్మెల్యే చేతన్ నిశ్చితార్థం ఘనంగా జరిపించారు. మాజీ ఎంపీ, పాత మిత్రుడు కావడంతో రాజకీయ లబ్ధి కోసం నితీశ్‌కుమార్.. జైలు నిబంధనలను మార్చి ఆనంద్‌కు జైలు నుంచి విముక్తి కల్పించడం పెను విమర్శలకు దారితీసింది. వాస్తవానికి విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిని చంపిన వారికి రెమిషన్ వర్తించదు. అందుకే ఆ నిబంధనను తొలగిస్తూ జైలు మాన్యువల్‌ను పదో తేదీన సవరిస్తూ బిహార్ రాష్ట్ర విభాగం నోటిఫై చేసింది. దీంతో ఆనంద్‌సహా మరో 27 మంది విడుదలకు మార్గం సుగమమైంది. నిజాయతీ గల ఐఏఎస్‌ను చంపిన గ్యాంగ్‌స్టర్‌కు ఇలా ప్రభుత్వం రాజమర్యాదలు చేయడమేంటని ఐఏఎస్ అధికారుల సంఘంసహా పౌర సమాజం, విపక్షాలు ఎంతగా విమర్శలు చేసినా సహర్సా జైలు నుంచి ఆనంద్ విడుదల ఆగలేదు. 'ఆనంద్ కుమారుడు చేతన్ ప్రస్తుతం ఆర్జేడీ ఎమ్మెల్యే. రాష్ట్రంలో మహాఘట్‌బంధన్ కూటమి పార్టీ ఆర్జేడీతో బంధం, పదవి కాపాడుకునేందుకు చట్టాన్నే నితీశ్ పణంగా పెట్టారు' అని బిహార్ మాజీ మంత్రి, బీజేపీ నేత సుశీల్ మోదీ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఐఏఎస్ అధికారుల సంఘం, కృష్ణయ్య సతీమణికి నా నమస్కారాలు' అని ఇప్పటికే పెరోల్‌పై ఉన్న ఆనంద్ సోమవారం వ్యాఖ్యానించడం గమనార్హం.

స్వలింగ జంటలకు సామాజిక ప్రయోజనాలు?

న్యూఢిల్లీ: దేశంలో స్వలింగ వివాహాలకు చట్టబద్ధత లేదని, అయినప్పటికీ అలాంటి వివాహాలు చేసుకున్న వారికి సామాజిక సంక్షేమ ప్రయోజనాలు, హక్కులు కల్పించేందుకు గల మార్గాలను అన్వేషించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ దాఖలైన వివిధ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం విచారణ కొనసాగించింది. స్వలింగ జంటలకు సామాజికపరమైన హక్కుల్ని కల్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వం ఏదో ఒక మార్గాన్ని కనుగొనాలని పేర్కొంది. ఇలాంటి జంటలకు ఉమ్మడి బ్యాంక్ ఖాతాలు ఇవ్వడం, బీమా పాలసీల్లో భాగస్వామిని నామినేట్ చేయడం వంటి అంశాలపై స్పష్టత ఇవ్వాలని ధర్మాసనం సూచించింది. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించే విషయంలో పార్లమెంట్ తీర్మానమే కీలకమన్న అంశాన్ని తాము అంగీకరిస్తున్నట్లు వెల్లడించింది. స్వలింగ వివాహాన్ని ప్రభుత్వం గుర్తించినా, గుర్తించకున్నా దానికొక లేబుల్ అవసరమని అభిప్రాయపడింది. సేమ్ సెక్స్ పెళ్లిళ్లకు చట్టబద్ధత కల్పించకుండా వారి సమస్యలను ఎలా పరిష్కరిస్తారో చెప్పాలని ప్రభుత్వాన్ని ధర్మాసనం ప్రశ్నించింది. దీనిపై వివరణ కావాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశించింది. ప్రేమించడం, సహజీవనం చేయడం, జీవిత భాగస్వామిని ఎన్నుకోవడం వంటివి ప్రాథమిక హక్కులే అయినప్పటికీ స్వలింగ వివాహాన్ని చట్టబద్ధంగా గుర్తించాలని కోరడం ప్రాథమిక హక్కు కాదని తుషార్ మెహతా తేల్చిచెప్పారు. తదుపరి విచారణను ధర్మాసనం మే 3వ తేదీకి వాయిదా వేసింది.

మత్స్యకారులకు రూ.10 లక్షల బీమా: రాహుల్



ఉడుపి/మంగళూరు: కాంగ్రెస్ నేత రాహుల్ కర్ణాటక మత్స్యకారులపై వరాల జల్లు కురిపించారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే మత్స్యకారులకు రూ.10 లక్షల బీమా కల్పిస్తామని, లీటర్ డీజిల్‌పై రూ.25 చొప్పున రాయితీ ఇస్తామని, రోజుకు 500 లీటర్ల డీజిల్‌కు ఈ రాయితీ వర్తిస్తుందని, మత్స్యకార మహిళలకు రూ.లక్ష వడ్డీ లేని రుణం అందజేస్తామని హామీ ఇచ్చారు. రాహుల్ గురువారం ఉడుపి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మత్స్యకారులతో సమావేశమయ్యారు. కేవలం హామీలు ఇవ్వడం కాదు, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి రోజు నుంచే వాటిని అమలు చేస్తామని వెల్లడించారు. ప్రస్తుతం కర్ణాటకలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వం కాదని అన్నారు. కర్ణాటకలో అధికారంలోకి రాగానే మహిళలకు ప్రజా రవాణా సంస్థ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని రాహుల్ హామీ ఇచ్చారు.

గ్రీన్‌కార్డులపై 'కంట్రీ లిమిట్' తొలగించండి

వాషింగ్టన్: గ్రీన్‌కార్డులపై 7 శాతంగా ఉన్న కంట్రీ లిమిట్‌ను తొలగించాలని సిలికాన్ వ్యాలీకి చెందిన ప్రముఖ భారత–అమెరికన్ వ్యాపారవేత్త అజయ్ జైన్ భుతోరియా అమెరికా పాలకులకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి పరిమితి వల్ల గ్రీన్‌కార్డుల కోసం అర్హులైన వారు సుదీర్ఘకాలం నిరీక్షించాల్సి వస్తోందని చెప్పారు. అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో భారతఅమెరికన్ పార్లమెంట్ సభ్యుడు రో ఖన్నా ఆధ్వర్యంలో తాజాగా జరిగిన యూఎస్–ఇండియా సదస్సులో అజయ్ జైన్ మాట్లాడారు. హెచ్–1 వీసాలపై లేని కంట్రీ లిమిట్ గ్రీన్‌కార్డులపై ఎందుకని ప్రశ్నించారు. అమెరికాలో ఇప్పుడు 8,80,000 మంది గ్రీన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్నారని తెలియజేశారు. వీరిలో భారత్, చైనా నుంచి వచ్చినవారి సంఖ్య అధికంగా ఉందన్నారు. పదేళ్లకు పైగా నిరీక్షిస్తున్నవారు చాలామంది ఉన్నారని గుర్తుచేశారు. చట్టాన్ని మార్చకపోతే మరో 50 సంవత్సరాలు ఎదురు చూడక తప్పదని తేల్చిచెప్పారు.



చార్‌ధామ్ యాత్రలో భాగంగా ఉత్తరాఖండ్‌లో భక్తుల సందర్శనార్థం గురువారం తొలిసారిగా తెరచుకున్న బద్రీనాథ్ ఆలయం. హెలికాప్టర్ ద్వారా భక్తులపై పూలవర్షం కురిపించారు. మొదటి పూజను ప్రధాని మోదీ పేరిట అర్చకులు నిర్వహించారు.

ప్రతి భారతీయుడిని తీసుకొస్తాం

- సూడాన్ నుంచి స్వదేశానికి తరలింపు ముమ్మరం
- విదేశాంగ కార్యదర్శి క్వాత్రా

న్యూఢిల్లీ: సాయుధ బలగాల ఆధిపత్య పోరుతో సంక్షోభంలో చిక్కిన సూడాన్ నుంచి భారతీయులందరినీ సురక్షితంగా స్వదేశానికి తీసుకొస్తామని భారత్ పునరుద్ఘాటించింది. స్వదేశానికి తరలింపునకు ఉద్దేశించిన 'ఆపరేషన్ కావేరి' పురోగతిని గురువారం ఢిల్లీలో భారత విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ క్వాత్రా మీడియాకు వెల్లడించారు. 'సూడాన్‌లో చిక్కుకుపోయిన మన వారిని అందరినీ తీసుకొస్తాం. సూడాన్‌తో భారత్ పటిష్ట అభివృద్ధి భాగస్వామిగా ఉన్న దృష్ట్యా ఆర్మీ, తక్షణ స్పందన దళం(ఆర్‌ఎస్‌ఎఫ్) రెండూ భారతీయుల తరలింపునకు సానుకూలంగా స్పందించాయి. సూడాన్‌లోని భారతీయ ఎంబసీలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రకారం అక్కడ 3,100 మంది భారతీయులు ఉన్నారు. మరో 300 మంది ఆపరేషన్ కావేరీతో టచ్‌లో ఉన్నారు. దాదాపు మరో వేయి మంది భారతీయ సంతతి వారున్నారు. ప్రతి ఒక్క భారతీయుడిని స్వదేశానికి తీసుకొస్తాం. ఇప్పటికే భారత్‌లో ల్యాండ్ అయిన/ఇంకా ప్రయాణంలో ఉన్న వారితో కలుపుకుని దాదాపు 606 మందిని రక్షించాం. ప్రస్తుతం జెద్దాకి 495 మంది, సూడాన్ పోర్ట్‌కి 320 మంది చేరుకున్నారు. గురువారం 246 మందితో సీ17 గ్లోబ్ మాస్టర్ విమానం ముంబైలో దిగింది. మరో 42 మందిని పొరుగున ఉన్న దక్షిణ సూడాన్ దేశానికి పంపించాం. తరలింపులో సహకరిస్తున్న సౌదీకి కృతజ్ఞతలు' అని అన్నారు.



ముంబైకి చేరుకున్న భారతీయులు

ప్రాణాలతో బయటపడతాననుకోలేదు: ఏపీ వాసి విష్ణువర్ధన్

'సూడాన్‌లో పరిస్థితి భయానకం. ప్రాణాలతో బయటపడతానని అస్సలు ఊహించలేదు' అని ఏపీలోని బాపట్ల జిల్లా చీరాలకు చెందిన విష్ణువర్ధన్ చెప్పారు. ఢిల్లీలోని ఏపీభవన్‌లో మీడియాతో చెప్పారు. 'అక్కడ పరిస్థితి దారుణం. 72 గంటలపాటు కాల్పుల విరమణ అన్నారేగానీ పోరు ఆగనేలేదు. మొత్తం కాల్పులమోతే. తినడానికి తిండి లేదు. నీరే దిక్కు' అని అన్నారు. ఆర్మీ, ఆర్‌ఎస్‌ఎఫ్‌ల మధ్య పోరులో ఇప్పటిదాకా 400 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు.

ప్రధాని విషసర్పం.. తాకితే అంతే

మోదీపై ఖర్గే వివాదాస్పద వ్యాఖ్య

యశవంతపుర: ప్రధాని మోదీ విష సర్పమని, తాకినవారు మరణిస్తారని చేసిన విమర్శలపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే వెనక్కి తగ్గారు. బీజేపీ పార్టీ సిద్ధాంతాలనుద్దేశిస్తూ తాను ఈ వ్యాఖ్యలు చేశానని వివరణ ఇచ్చారు.

అసలేం జరిగింది?

సొంత రాష్ట్రం కర్ణాటకలో ప్రచారంలో భాగంగా గురువారం గదగ జిల్లాలోని రాన్ నియోజకవర్గ పరిధిలోని గజేంద్రగడలో పార్టీ ప్రచార సభలో ఖర్గే పాల్గొని ప్రసంగించారు. 'పొరపాటు చేయకండి. జాగ్రత్త. ప్రధాని మోదీ విషసర్పం లాంటి వ్యక్తి. మరీ అంత విషతుల్యం కాదంటారా.. అయితే ఒకసారి తాకి చూడండి. మరణం తథ్యం. శాశ్వత నిద్రలోకి జారుకుంటారు' అని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'అవినీతి పాలన అందించిన బీజేపీ నాయకులను మోదీ పక్కనే కూర్చోబెట్టుకున్నారు. మోదీ ముఖం చూసి ఓటు వేసే కాలం పోయింది' అని అన్నారు. ప్రధానిని విషసర్పంతో పోలుస్తూ చేసిన వ్యాఖ్యలపై విమర్శలు రావడంతో వెంటనే హావేరి సభలో ప్రసంగిస్తూ ఖర్గే వివరణ ఇచ్చారు. 'బీజేపీ పార్టీ ఒక విషసర్పం అనేదే నా ఉద్దేశం. ఆ పార్టీ సిద్ధాంతం విషతుల్యం. ఆ సిద్ధాంతాలను ఆచరిస్తే అంతమైనట్లే ఇక అనే ఉద్దేశంలో మాట్లాడాను' అని వివరించారు.

రైలులో మంటలు..ఏడుగురు సజీవదహనం

కరాచీ: పాకిస్తాన్‌లో ఎక్స్‌ప్రెస్ రైలులో చెలరేగిన మంటల్లో నలుగురు చిన్నారులు, ఒక మహిళ సహా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. కరాచీ నుంచి లాహోర్ వెళ్తున్న రైలు ఏసీ బోగీలో బుధవారం అర్ధరాత్రి తర్వాత మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ వెంటనే టాండో మస్తి ఖాన్ స్టేషన్‌లో రైలును ఆపేసి, మంటలు అంటుకున్న బోగీని వేరు చేశారు. అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ దుర్ఘటనలో నలుగురు చిన్నారులు, ఒక మహిళ సహా ఏడుగురు సజీవ దహనమయ్యారు. ఆరు మృతదేహాలు గుర్తు పట్టడానికి కూడా వీలు లేనంతగా కాలిపోయాయి. ఘటనపై దర్యాప్తు జరుగుతోందని అధికారులు చెప్పారు.

ఉక్రెయిన్‌కు నాటో భారీ ఆయుధ సాయం



ఉక్రెయిన్, రష్యా హోరాహోరీ కాల్పుల్లో ధ్వంసమైన బఖ్ముత్ పట్టణం

కీవ్: రష్యాపై ఎదురు దాడి ప్రయత్నాల్లో ఉన్న ఉక్రెయిన్ బలగాలకు నాటో భారీ సాయం లభించింది. నాటోలోని మొత్తం 31 సభ్య దేశాలు కలిపి ఉక్రెయిన్‌కు 1,550 పోరాట వాహనాలు, 230 ట్యాంకులు, ఇతర పరికరాలతో పాటు పెద్దమొత్తంలో మందుగుండు సామగ్రిని అందించాయి. దీంతో ఉక్రెయిన్‌కు ఇచ్చిన హామీల్లో 98% వరకు నెరవేర్చినట్లయిందని నాటో సెక్రటరీ–జనరల్ జెన్స్ స్టోల్టెన్‌బర్గ్ చెప్పారు. అంతేకాకుండా, కొత్తగా ఏర్పాటైన9 ఉక్రెయిన్ బ్రిగేడ్‌లకు చెందిన 30 వేల బలగాలకు ఆయుధ, శిక్షణ సాయం కూడా ఇచ్చామని చెప్పారు. ఇవన్నీ కలిపితే ఆక్రమిత ప్రాంతాల నుంచి రష్యాను వెళ్లగొట్టేందుకు జరిగే పోరులో ఉక్రెయిన్ పైచేయిగా నిలుస్తుందన్నారు. శాంతి చర్చల్లోనూ ఆ దేశం పటిష్ట స్థానంలో ఉంటుదన్నారు. ఇలా ఉండగా, బుధ, గురువారాల్లో రష్యా కాలిబర్ క్రూయిజ్ మిస్సైళ్ల దాడిలో ఉక్రెయిన్‌లోని మైకోలైవ్ ప్రాంతం తీవ్రంగా దెబ్బతిందని అధికారులు చెప్పారు.. కనీసం ఏడుగురు చనిపోగా, మరో 33 మంది గాయపడ్డారు. దాడుల్లో 22 బహుళ అంతస్తుల భవనాలు, 12 ప్రైవేట్ ఇళ్లు, ఇతర నివాస భవనాలు దెబ్బతిన్నాయి.

ఛత్తీస్‌గఢ్ అమరులకు ఘన నివాళులు

దంతెవాడ: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడలో బుధవారం మావోయిస్టుల మందుపాతర పేల్చిన ఘటనలో అమరులైన 10 మంది పోలీసు సిబ్బంది, ఒక డ్రైవర్‌కు ఘనంగా నివాళులర్పించారు. కర్లి ప్రాంతంలోని పోలీస్‌లైన్స్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో మృతుల కుటుంబీకులు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతం రోదనలు, భారత్ మాతా కీ జై నినాదాలతో ప్రతిధ్వనించింది. ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ తదితరులు హాజరై మృతులకు పూలతో నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను బఘేల్ ఓదార్చారు. అనంతరం జవాన్ల భౌతికకాయాలను వాహనాల్లో సొంతూళ్లకు తరలించారు. సీఎం బఘేల్ కూడా భుజం కలిపి ఒక జవాను మృతదేహాన్ని వాహనం వద్దకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అమరుల త్యాగాలు వృథా కావని, మావోయిస్టులపై పోరు మరింత తీవ్రతరం చేస్తామని చెప్పారు. దంతెవాడ జిల్లా అరన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసుల వాహనాన్ని నక్సల్స్ మందుపాతరతో పేల్చిన ఘటనలో డిస్ట్రిక్ట్ రిజర్వు గార్డు(డీఆర్‌జీ) విభాగానికి చెందిన 10 మంది జవాన్లు, డ్రైవర్ ప్రాణాలు కోల్పోయారు.



శవపేటికను మోస్తున్న సీఎం బఘేల్

పార్లమెంట్ విశ్వాసం పొందిన పాక్ పీఎం

ఇస్లామాబాద్: పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ గురువారం పార్లమెంట్‌లోని దిగువసభ నేషనల్ అసెంబ్లీ విశ్వాసం పొందారు. మొత్తం 342 మంది సభ్యులకుగాను 180 మంది షరీఫ్ నాయకత్వంపై విశ్వాసం ప్రకటించారు. షరీఫ్ ప్రభుత్వం, న్యాయ వ్యవస్థకు మధ్య ఇటీవలి కాలంలో ఘర్షణాత్మక వాతావరణం నెలకొన్న సమయంలో ఈ పరిణామం సంభవించింది. గత ఏడాది అధికారంలోకి వచ్చిన సమయంలో షరీఫ్‌కు 174 మంది సభ్యులు మాత్రమే మద్దతు తెలపడం గమనార్హం. పంజాబ్, ఖైబర్ పఖ్తున్వా ప్రావిన్స్ అసెంబ్లీలకు ఎన్నికలు జరపాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇందుకు పాకిస్తాన్ ఎన్నికల సంఘం (ఈసీపీ)కి అవసరమైన నిధుల కేటాయింపునకు సంబంధించిన బిల్లును నేషనల్ అసెంబ్లీ ఇటీవల తిరస్కరించిన నేపథ్యంలో షరీఫ్ ప్రభుత్వం బలనిరూపణకు సిద్ధమయింది. వెంటనే పార్లమెంట్ ఎన్నికలు జరపాలంటూ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సారథ్యంలోని పీటీఐ పార్టీ గట్టిగా పట్టుబడుతోంది.

సరిహద్దుల్లో శాంతితోనే సత్సంబంధాలు

చైనా రక్షణ మంత్రికి తేల్చిచెప్పిన రాజ్‌నాథ్

న్యూఢిల్లీ: భారత్–చైనా మధ్య సత్సంబంధాలు కొనసాగాలంటే సరిహద్దు సమస్యలన్నీ ద్వైపాక్షిక ఒప్పందాలకు లోబడి పరిష్కారం కావాల్సి ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కుండబద్దలు కొట్టారు. గురువారం ఆయన చైనా రక్షణ మంత్రి లి షంగ్‌ఫుతో చర్చలు జరిపారు. తూర్పు లద్దాఖ్‌లోని వాస్తవాధీన రేఖ వెంబడి(ఎల్‌ఏసీ) మూడేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలతో రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో జరిగిన ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. శుక్రవారం జరిగే షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) దేశాల రక్షణ మంత్రుల సమావేశం కోసం లి గురువారం ఢిల్లీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్, లి సుమారు 45 నిమిషాలసేపు చర్చలు జరిపారు. ఇరువురు మంత్రులు సరిహద్దు వివాదాలతోపాటు ద్వైపాక్షిక సంబంధాలపై ఎటువంటి దాపరికాలు లేకుండా చర్చలు జరిపినట్లు రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఎల్‌ఏసీ వెంట నెలకొన్న వివాదాలు రెండు దేశాల మధ్య కుదిరిన ఒప్పందాలు, హామీలు, ఒడంబడికలకు లోబడి పరిష్కారం కావాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ తెలిపారు. 'సరిహద్దుల్లో శాంతి యుత వాతావరణాన్ని బట్టే రెండు దేశాల మధ్య సంబంధాల కొనసాగింపు ఆధారపడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. సరిహద్దు ఒప్పందాల ఉల్లంఘనలతో ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతింటాయని, ఉద్రిక్తతలు సడలిన తర్వాత మాత్రమే బలగాల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు' అని రక్షణ శాఖ ఆ ప్రకటనలో వివరించింది.



రాజ్‌నాథ్, చైనా మంత్రి షంగ్‌ఫు చర్చలు

కొన్ని పార్టీలకు రాజకీయాలంటే అవినీతి

- ప్రధాని మోదీ ఆగ్రహం
- కర్ణాటక బీజేపీ కార్యకర్తలతో మోదీ మాటామంతి

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయమే లక్ష్యంగా బీజేపీ కార్యకర్తలంతా కష్టపడి పనిచేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ గురువారం బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించారు. వారికి దిశానిర్దేశం చేశారు. కర్ణాటకలో ఓటర్లకు ప్రతిపక్ష కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ఆయన వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కాంగ్రెస్ వారంటీ ఎప్పుడో ముగిసిపోయిందని, ఆ పార్టీ ఇచ్చే గ్యారంటీలకు అర్థంపర్థం లేదని ఎద్దేవా చేశారు. ఉచిత పథకాలపై మోదీ మరోసారి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి పథకాల వల్ల రాష్ట్రాలు దివాలా తీయడం ఖాయమని చెప్పారు. భవిష్యత్తు తరాలకు దక్కాల్సిన ప్రయోజనాలను ఈ ఉచిత పథకాలు మింగేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉచితాల సంస్కృతికి తెరపడాలని మోదీ స్పష్టం చేశారు.



ప్రజల ఆశీస్సులు కోరుతా..

'మన దేశంలో రాజకీయాలు అంటే అర్థం అధికారం, అవినీతిగా కొన్ని పార్టీలు మార్చేశాయి. అధికారం కోసం ఆయా పార్టీలు సామ దాన భేద దండోపాయాలన్నీ ప్రయోగిస్తున్నాయి. దేశ భవిష్యత్తు గురించి, కర్ణాటకలోని యువత, మహిళల భవిష్యత్తు గురించి ఏమాత్రం ఆలోచించడం లేదు' అని మండిపడ్డారు. కర్ణాటక ప్రజలు బీజేపీపై ఎంతో నమ్మకం పెట్టుకున్నారని, ఈ నమ్మకాన్ని వమ్ము కానివ్వబోమని చెప్పారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వాల వల్ల దక్కే లాభాలను బూత్ స్థాయిలో ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యకర్తలతో కలిసి పని చేస్తానని చెప్పారు. ఒక కార్యకర్తగా కర్ణాటక ప్రజల వద్దకు వెళ్లి, వారి ఆశీస్సులు కోరుతానని వివరించారు.

'ఫస్ట్ డెవలప్ ఇండియా'

షార్ట్‌కట్‌లను తాము నమ్ముకోవడం లేదని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అత్యాధునిక భౌతిక, డిజిటల్, సామాజిక మౌలిక సదుపాయాల కల్పనకు భారీగా నిధులు వెచ్చిస్తున్నామని గుర్తుచేశారు. ఎఫ్‌డీఐ అంటే తమకు 'ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్' కాదని, 'ఫస్ట్ డెవలప్ ఇండియా' అని వివరించారు. ఐదేళ్ల పాలనా కాలం గురించి యోచించడం లేదని, దేశం గురించి ఆలోచిస్తున్నామని పేర్కొన్నారు. పార్టీ కాదు, దేశమే తమకు ముఖ్యమని చెప్పారు.

సాక్షి 24|7
కర్ణాటక
KARNATAKA
శుక్రవారం । 28 । ఏప్రిల్ । 2023

ఏ వాహనంలో ఏముందో



ఎన్నికలు కావడంతో వాహన తనిఖీలు ముమ్మరమయ్యాయి. గురువారం బెంగళూరు ఆర్‌ఎం రాయ్ రోడ్డులో కారులో సోదాలు

న్యూస్‌రీల్

మళ్లీ బీజేపీదే అధికారం: బండి



ప్రచారంలో బండి సంజయ్

గౌరిబిదనూరు: కర్ణాటకలో మరలా బీజేపీ అధిక మెజారిటీతో అధికారంలోకి వస్తుందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. గురువారం తాలూకాలోని దారినాయకపాళ్య తదితర గ్రామాలలో పార్టీ అభ్యర్థి శశిధర్ తరపున ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రణాళిక లేదు, భవిష్యత్తు ఉంటే కదా మంచి ప్రణాళిక ఉండడానికి అన్నారు. కాంగ్రెస్, జేడీఎస్‌లకు ఓటేస్తే డ్రైనేజీలోకి వేసినట్లే. కాంగ్రెస్ గెలిస్తే ఎస్టీ, ఎస్సీ రిజర్వేషన్లు తగ్గించి, ముస్లింల రిజర్వేషన్లను పెంచుతుందని అన్నారు. ఆ రెండు పార్టీలు ఎంత డబ్బు వెదజల్లినా బీజేపీ గెలుపును ఆపలేరన్నారు. రెండు పార్టీలు గుంటనక్కల్లా కలిసి పోటీ చేస్తుంటే బీజేపీ ఒక్కటే సింగిల్‌గా సింహంలా పోటీ చేస్తోందని చెప్పారు. జేడీఎస్ కు రాష్ట్ర అభివృద్ధి గురించి అవగాహన లేదు, బీజేపీకి ఓటేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ ప్రచారంలో పార్టీ అభ్యర్థి, నాయకులు పాల్గొన్నారు.

తమిళ గీతానికి నో

శివమొగ్గ: శివమొగ్గ నగరంలో ఉన్న తమిళ ప్రజల కోసం నిర్వహించిన బీజేపీ సమావేశంలో తమిళ రాష్ట్ర గీతం వేయగా, వేదికపై ఉన్న సీనియర్ నేత ఈశ్వరప్ప వెంటనే ఆపివేయించి కన్నడ జాతీయ గీతాన్ని వేయించారు. వివరాలు.. గురువారం నగరంలో తమిళ ఓటర్ల కోసం బీజేపీ సమావేశాన్ని నిర్వహించింది. తమిళనాడు బీజేపీ నేత అన్నామలై, ఈశ్వరప్ప తదితరులు హాజరయ్యారు. ప్రారంభ సమయంలో తమిళ రాష్ట్ర గీతం రికార్డు వేయగా, కేఎస్.ఈశ్వరప్ప వెంటనే ఆ పాటను నిలిపివేయాలని సూచించారు. తరువాత కన్నడ గీతాన్ని ఆలపించి కొనసాగించారు.

సోమావతి నదిలో చేపల మృత్యువాత

- తాగునీటి సరఫరా బంద్



నదిలో చనిపోయిన చేపలు

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా బెళ్తంగడి పట్టణానికి తాగునీరు అందించే సోమావతి నదిలో వేలసంఖ్యలో చేపలు కళ్లతేలేశాయి. ఎవరో దుండగులు విష పదార్థాలను నదిలో కలపడం దీనికి కారణమని అనుమానిస్తున్నారు. మూడేళ్ల క్రితం ఇలాంటి ఘటనే జరిగింది. ఈసారి వేసవిలో దక్షిణ కన్నడ జిల్లా పరిధిలో అనేక నదులు ఎండిపోయాయి. ప్రజలకు తాగునీరు అందించే నదిలో విషం కలపడంపై బెళ్తంగడి ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణానికి రోజూ 10 లక్షల లీటర్ల నీరు అవసరం. చేపల మృతితో అనుమానాలు రావడంతో పట్టణానికి తాగునీటి సరఫరాను నిలిపేశారు. నగర పరిధిలోని ట్యాంకులను శుభ్రం చేసి బోర్ల నీటిని తాగునీటిగా అందిస్తున్నట్లు నగర పంచాయతీ అధికారులు తెలిపారు.

ఉద్యోగుల సంఘం నేతపై ఫిర్యాదు

శివాజీనగర: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడైన సీ.ఎస్.షడక్షరి కోడ్‌ను ఉల్లంఘించారని, ఆయనపై చర్య తీసుకోవాలని ఎన్నికల సంఘానికి మాజీ ఎమ్మెల్సీ రమేశ్ బాబు ఫిర్యాదు చేశారు. త్వరలో ఉద్యోగులకు డీఏ, ఇతర ఆర్థిక ప్రయోజనాలను విడుదల చేస్తారని ఆయన మీడియా ముందు ప్రకటన చేశారు, ఇది ఎన్నికల కోడ్‌కు విరుద్ధం, ఉద్యోగులను ప్రభావితం చేసేలా మాట్లాడారని ఆరోపించారు. అధికార పార్టీకి మద్దతుగా పనిచేసే ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

లిఫ్ట్‌లో చిక్కి వలస కార్మికుడు మృతి

బనశంకరి: లిఫ్ట్‌లో చిక్కుకుని ఉత్తరప్రదేశ్‌కు చెందిన యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన నగరంలో కలాసిపాళ్య పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వికాస్‌కుమార్ (25) ఉత్తర ప్రదేశ్ నుంచి 6 నెలల క్రితం బెంగళూరుకు చేరుకుని కలాసిపాళ్యలో ఒక ఆటోమొబైల్ షాప్‌లో పనిచేస్తున్నాడు. అతడు బుధవారం రాత్రి 8 గంటల సమయంలో జేసీ రోడ్డు మొదటి క్రాస్‌లో భరత్‌సర్కిల్ వద్దనున్న కమర్షియల్ బిల్డింగ్‌లోకి పని మీద వెళ్లాడు. లిఫ్టులో ఎక్కి పై అంతస్తుకు వెళ్తుండగా మధ్యలో నిలిచిపోయింది. ఎంత ప్రయత్నించినా కదలలేదు. లిఫ్టులో అతడు ఊపిరాడక మృతి చెందాడు. పోలీసులు చేరుకుని లిఫ్టులో నుంచి మృతదేహాన్ని బయటికి తీసి విక్టోరియా ఆసుపత్రికి తరలించారు.

అవినీతికి హస్తం గ్యారంటీ

- ప్రధాని నరేంద్రమోదీ ధ్వజం
- నేతలతో, కార్యకర్తలతో వర్చువల్ సమావేశం



బెంగళూరులో ఒక ఫంక్షన్ హాల్లో ప్రధాని మోదీ వర్చువల్ సమావేశం

బనశంకరి: కాంగ్రెస్ అంటే కుటుంబపాలన, అవినీతి అని ప్రధాని నరేంద్రమోదీ ధ్వజమెత్తారు. ఇప్పటికే కాలం చెల్లిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చే గ్యారంటీకి అర్థం లేదని హేళన చేశారు. రాష్ట్ర విధానసభ ఎన్నికలకు ఇంకా 13 రోజులు సమయం ఉండగా గురువారం రాష్ట్రంలోని బీజేపీ నేతలు, కార్యకర్తలతో మోదీ వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రసంగిస్తూ కాంగ్రెస్ గ్యారంటీ కార్డు అవినీతికి గ్యారంటీ అని, ఆ పార్టీకే వారంటీ లేదని చమత్కరించారు.

డబుల్ ఇంజిన్ తప్పనిసరి

రాష్ట్రంలో ఈసారి బీజేపీ ప్రభుత్వాన్ని పూర్తి మెజారిటీతో అధికారంలోకి తీసుకురావాలని కార్యకర్తలకు మోదీ పిలుపునిచ్చారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజల ఇంటింటికీ చేరవేయాలి. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ప్రభుత్వం లేకపోతే రాష్ట్రం నష్టపోతుంది. కోవిడ్ సమయంలో నిరుపేదలకు ఉచితంగా రేషన్ అందించాము. కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే పార్టీ ప్రభుత్వంలో ఉంటే అభివృద్ధికి దోహదం అవుతుంది. కన్నడనాడు సంస్కృతికి పేరుగాంచింది. కన్నడ భాష సుసంపన్నమైనది మోదీ వర్ణించారు. పోలింగ్‌కు కొద్దిరోజులు మాత్రమే సమయం ఉండగా, కార్యకర్తలకు ప్రధాని కర్తవ్యబోధ చేశారు. ప్రతి 10 మంది పురుషులు, 10 మంది మహిళా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వారికి బీజేపీ నుంచి ఏమి కోరుకుంటున్నారు, వారి సమస్యలు ఏమిటి ఆలకించాలన్నారు. ఈ భేటీలో రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ కార్యాలయాల్లో కార్యకర్తలు పాల్గొన్నారు. బెంగళూరులో ఒక స్టార్‌హోటల్లో సీఎం బసవరాజ బొమ్మై, యడియూరప్ప, మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

కాంగ్రెస్‌పై స్మృతి నిప్పులు



బెళగావి సభలో మాట్లాడుతున్న స్మృతి ఇరానీ

మరోవైపు బెళగావిలో కేంద్రమంత్రి స్మృతి ఇరానీ బీజేపీ ఎన్నికల సభలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్‌తో పాటు ఇటీవల పార్టీని వీడిన జగదీశ్ షెట్టర్, లక్ష్మణ సవది తదితరులపై ఆరోపణలు ఎక్కుపెట్టారు. సిద్ధాంతాలు లేని ఇటువంటి నాయకులు ఇళ్లల్లో కూర్చోవడం మంచిదని మండిపడ్డారు. ఒక పెద్ద మనిషి బీజేపీని వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌లోకి చేరిపోయాడని షెట్టర్‌పై ధ్వజమెత్తారు. మరాఠాలు అధికంగా ఉన్న బెళగావి ప్రాంతాన్ని గతంలో కాంగ్రెస్ సర్కారు అభివృద్ధి చేయకుండా విస్మరించిందని దుయ్యబట్టారు. మహారాష్ట్ర నుంచి ఓటర్లను తరలించి సరిహద్దు నియోజకవర్గాల్లో గెలవడానికి యత్నిస్తోందని ఆమె ఆరోపించారు. కాంగ్రెస్‌వి ఓటు బ్యాంకు రాజకీయాలన్నారు.

నీళ్ల కోసం పారిన రక్తం

- పంటపొలానికి నీటిపై గొడవ..
- వదిన, ఆమె తనయుని హత్య
- మండ్య జిల్లాలో కిరాతకం



పంపుసెట్ వద్ద శాంతమ్మ మృతదేహం





యశ్వంత మృతదేహం

మండ్య: పంటపొలానికి నీరు పెట్టే గొడవలో రెండు నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. సొంత అన్న భార్యను, ఆమె కుమారున్ని వేట కొడవలితో నరికి చంపాడో కిరాతకుడు. పొలంలో నీళ్లకు బదులుగా రక్తం ప్రవహించింది. ఈ దారుణం మండ్య జిల్లాలోని పాండవపుర తాలూకా హెగ్గడెహళ్లి గ్రామంలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. శంకరేగౌడ భార్య శాంతమ్మ (40), ఆమె కుమారుడు యశ్వంత(17) హత్యకు గురైన వారు. నిందితుడు శంకరేగౌడ తమ్ముడు సతీష్ (43).

4 ఎకరాలు..ఒక పంపుసెట్టు

వివరాలు.. అన్నదమ్ములకు 4 ఎకరాల పొలం ఉండగా, ఒకటే పంప్‌సెట్ ఉంది. ఎండాకాలం కావడంతో పంటకు నీటి అవసరం చాలా ఉంది. దాంతో కొన్నిరోజులుగా పంప్‌సెట్ వాడుకోవడం గురించి గొడవలు జరుగుతున్నాయి. ఎక్కువగా నిందితుడు సతీష్ పంప్‌సెట్‌ను ఉపయోగిస్తూ, అన్నకు అవకాశం ఇవ్వడం లేదు. దీనిపై శాంతమ్మ భర్తతో రోజూ గొడవ పడేది. దాంతో అతడు వెళ్లి తమ్మునితో తగాదా పడేవాడు. ఈ నేపథ్యంలో పంటకు నీటిని పెట్టడం కోసమని శాంతమ్మ, కొడుకు యశ్వంత పొలానికి వచ్చారు. వేట కొడవలితో వచ్చిన సతీష్ ఇద్దరినీ వెంటాడి నరికి చంపాడు. మృతదేహాలు రక్తంతో తడిసి ముద్దయ్యాయి. ఆపై పాండవపురకు వెళ్లి పోలీసులకు లొంగిపోయాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నీళ్ల కోసం ఇంత ఘోరానికి పాల్పడాలా? అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

నడత మారిన నాలుగో సింహం!

- వేధింపులు, వసూళ్ల ఆరోపణలు
- నగర పోలీసులపై తరచూ ఆరోపణలు



పోలీస్ స్టేషన్‌కు వచ్చిన మహిళలతో కొందరు పోలీసుల అసభ్య ప్రవర్తన

బనశంకరి: బాధలు, కష్టాలను చెప్పుకోవడానికి పోలీస్‌స్టేషన్ కు వచ్చే మహిళలకు లైంగిక వేధింపులు, లంచం తీసుకోవడం, బెదిరించడం, అక్రమ అరెస్ట్ తదితర ఆరోపణల్లో పోలీసులు చిక్కుకోవడం చర్చనీయాంశమైంది. నిరుపేదల నుంచి శ్రీమంతుల వరకు కష్టకాలంలో నాలుగో సింహం సహాయం కోసం పోలీస్‌స్టేషన్లను ఆశ్రయిస్తారు. శాంతిభద్రతలు కాపాడటంలో ఖాకీలు కీలకపాత్ర వహిస్తారు. కానీ ఇటీవల ఇబ్బందుల్లో ఉన్న ప్రజలు సహాయం కోసం వస్తే పోలీసులే వేధించినట్లు పలు సంఘటనలు ప్రస్ఫుటం చేశాయి. మహిళలనైతే లైంగిక సతాయించడం, ఏకాంతంగా గడపాలనే డిమాండ్లు పెట్టడం పెరిగిందనే ఆరోపణలున్నాయి. రాత్రి సమయంలో సంచరించే జంటలను తనిఖీల పేరుతో అడ్డుకుని బెదిరించి ఫోన్ పే ద్వారా లంచం తీసుకుని ఆపై దొరికితున్నారు.

బయటకు వచ్చేవి కొన్ని మాత్రమేనా?

ఇటీవల మారతహళ్లి పోలీసులు రైస్‌పుల్లింగ్ కేసులో ఆరోపిని పోలీస్ స్టేషన్‌లో బంధించి రూ.10 లక్షలు ఇవ్వాలని ఒత్తిడి చేశారు. ఈ ఘటన వెలుగులోకి రాగానే ఉన్నతాధికారులు కొరడా ఝులిపించారు. ఎస్‌ఐతో పాటు నలుగురు పోలీసులు సస్పెండ్ అయ్యారు. మిగిలిన ఇద్దరు పరారీలో ఉన్నారు. అయితే బయటకు వచ్చిన ఒకటీ అరా కేసుల్లో మాత్రమే ఇలా జరుగుతోంది. తెలియకుండా అనేక సంఘటనలు సాగిపోతున్నాయని, ఉన్నతాధికారులకు తెలిసినా చర్యలు తీసుకునేది చాలా స్వల్పమని సామాజిక కార్యకర్తలు పేర్కొన్నారు.



బాధితులకు అండగా ఉండాల్సిన పోలీసులే దారి తప్పితే ప్రజలకు రక్షణ ఎవరు?

ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు ఇలా

- ఆడుగోడి కానిస్టేబుల్ దంపతుల నుంచి ఫోన్ పే ద్వారా డబ్బు వసూలు చేశాడు
- పులకేశినగర పోలీస్‌స్టేషన్ రైస్‌పుల్లింగ్ నిందితున్ని అక్రమంగా అరెస్ట్ చేసి డబ్బు గుంజడం
- ఫిర్యాదు చేయడానికి వచ్చిన యువతితో కొడిగేహళ్లి సీఐ అసభ్య ప్రవర్తన
- బనశంకరి పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ దొంగల గ్యాంగ్‌లో ఉండడం
- సుబ్రమణ్యనగర సీఐపై అబద్ధపు లేఖ రాసిన ఇద్దరు కానిస్టేబుల్స్, ఆపై వారి సస్పెండ్
- సాక్ష్యం చెప్పడానికి వచ్చిన మహిళకు సుద్దగుంటెపాళ్య ఎస్‌ఐ.. గదికి రావాలని లైంగిక వేధింపులు
- స్వాధీనం చేసుకున్న బైకును విడిపించడానికి రూ.15 వేలు లంచం డిమాండ్ చేసిన దేవనహళ్లి ఏఎస్‌ఐ
- బెంగళూరులో ఇలా వివిధ ఆరోపణలతో గత ఐదేళ్లలో డీవైఎస్పీలు 21 మంది, సీఐలు 157, ఎస్‌ఐ 229 మంది సస్పెన్షన్‌కు గురయ్యారు.



ముగ్గేసి ఓటు ముచ్చట

కచ్చితంగా ఓటేయాలని ఓటరు మహాశయుల జాగృతి కోసం ఎన్నికల సంఘం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. గురువారం చిక్కమగళూరులో జాగృతి వేడుకలో ముగ్గులు వేస్తున్న ఉద్యోగులు



రాహుల్ ముమ్మర ప్రచారం



ఉడుపి వద్ద సభలో రాహుల్‌గాంధీ ప్రసంగం

యశవంతపుర: ఉడుపి జిల్లాలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో శివమొగ్గ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో ఉడుపికి చేరుకున్నారు. గట్టి పోలీసు బందోబస్తు మధ్య కాపు నియోజకవర్గంలో ఎన్నికల సభలో పాల్గొని బీజేపీపై విమర్శల వర్షం కురిపించారు. కాపు పట్టణంలో మత్స్యకారులతో సమావేశమయ్యారు. కాగా, ఉడుపిలో రాహుల్ హెలికాప్టర్ దిగగానే ఎన్నికల అధికారులు హెలికాప్టర్‌ను తనిఖీ చేశారు. అంతకు ముందు శివమొగ్గ నగరంలో కాంగ్రెస్ అభ్యర్థులతో ఆయన ఎన్నికల గురించి చర్చించారు.

సర్వేలన్నీ మాకే అనుకూలం: డీకే

శివాజీనగర: బెంగళూరు దక్షిణలో జేడీఎస్ టికెట్ చివరిక్షణంలో మిస్సయిన ప్రభాకర్‌రెడ్డి, కనకపుర నేత నారాయణగౌడ గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కేపీసీసీ కార్యాలయంలో కేపీసీసీ అధ్యక్షుడు డీ.కే.శివకుమార్ ఇద్దరినీ పార్టీలోకి ఆహ్వానించారు. పెద్దసంఖ్యలో ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని డీకే తెలిపారు. కాంగ్రెస్‌కు రాష్ట్రంలో 78 లక్షల మంది సభ్యులయ్యారన్నారు. పలు సర్వేల్లో, మీడియాల నివేదికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పాయని తెలిపారు.

కాంగ్రెస్‌లోకి శివరాజ్‌కుమార్ భార్య!

ఈ సందర్భంగా పౌర కార్మికులు డీకేని కలిశారు, వారి ఉద్యోగాలను పర్మినెంట్‌చేస్తామని హామీ ఇచ్చారు. మాజీ సీఎం దివంగత ఎస్.బంగారప్ప కుమార్తె, ప్రముఖ సినీ నటుడు శివరాజ్‌కుమార్ సతీమణి గీతా శివరాజ్‌కుమార్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. ఈ మేరకు కేపీసీసీ ఆఫీసు ఒక ప్రకటనలో తెలిపింది.

నగదు మార్పిడి పేరుతో స్కాం



బనశంకరి: నగదు మార్పిడి లావాదేవీలను నిర్వహిస్తామని ప్రజలను నమ్మించి కోట్లాది రూపాయలు వంచనకు పాల్పడిన ఇద్దరిని గురువారం సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. నాగదేవనహళ్లి జ్ఞానభారతి లేఔట్ నివాసి అశోక్‌మోగవీర, యలహంక మారుతినగర నివాసి జోజిపాల్ నిందితులు. వీరు రాజాజీనగర రాజ్‌కుమార్ రోడ్డు అంబికాప్లాజాలో స్యాన్‌జోస్ వెల్త్ మేనేజ్‌మెంట్ పేరుతో ఆఫీసు తెరిచారు. నగదు మార్పిడిలో అధిక లాభాలు వస్తాయని అనిత అనే మహిళను నమ్మించారు. ఆమె నుంచి రూ.27.50 లక్షలు పెట్టుబడిగా పెట్టించుకుని కొన్నిరోజులకు ముఖం చాటేశారు. లాభాలు కాదు కదా అసలు ఇవ్వమని అడిగినా మాయమాటలు చెప్పి వాయిదా వేయసాగారు. మోసపోయినట్లు తెలుసుకున్న అనిత రాజాజీనగర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీసీబీ పోలీసులు కేసు దర్యాప్తు చేసి పై ఇద్దరిని అరెస్టు చేశారు. మంచి లాభాలను ఇస్తామని చెప్పి సుమారు 870 మంది నుంచి రూ.31 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టించుకుని స్వాహా చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసింది.

విద్వేష ప్రసంగాలు చేశారు

- అమిత్‌షాపై కాంగ్రెస్ ఫిర్యాదు

శివాజీనగర: కన్నడనాట జోరుగా అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సాగుతున్న సమయంలో ఫిర్యాదుల పర్వం ఆరంభమైంది. కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా.. విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రసంగించారని కాంగ్రెస్ ఇన్‌చార్జి రణదీప్‌సింగ్ సుర్జెవాలా, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌లు గురువారం బెంగళూరులోని హైగ్రౌండ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గొడవలు, అల్లర్లు అధికమవుతాయని అమిత్ షా పలు బహిరంగ సభల్లో ఆరోపించారు, ఇది ద్వేషపూరిత ప్రసంగమని, రెచ్చగొట్టేలా ఉందని, ఆయనపై కేసు నమోదుచేసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.



ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్రమంతటా కేంద్ర బలగాలు మోహరించాయి. మంగళూరులో జవాన్ల కవాతు

రూ.25 వేలకు ఓటర్ల డేటా

బనశంకరి: ఓటర్ల సమాచారాన్ని అక్రమంగా సేకరిస్తున్న చిలుమె సంస్థ అక్రమాలను మరువకముందే మరో కంపెనీ ఇదే తరహాలో సమాచారం సేకరించి విక్రయానికి ఉంచింది. రూ.25 వేలు ఇస్తే చాలు మీ నియోజకవర్గంలో ఓటర్ల సమాచారం మేము మీకు అందిస్తాం, అతి తక్కువ మొత్తానికే లక్షలాది ఓటర్ల సమాచారం అందుకోండి అని గుర్తుతెలియని వెబ్‌సైట్ ఆఫర్ చేస్తోంది. దీనిపై ఆగ్నేయ విభాగం సైబర్‌క్రైం పీఎస్‌లో కేసు నమోదైంది. ఒక స్వతంత్ర అభ్యర్థి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

మీ వెన్నంటే మేముంటాం


ఓటును అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి: ఐదేళ్ల పాటు తమ వెంట ఉండి ప్రతి సమస్యపై స్పందిస్తున్న మీ వెన్నంటే తాముంటామని సణాపుర గ్రామ మహిళలు ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి జేఎన్ గణేష్‌కు భరోసా ఇచ్చారు. గురువారం సణాపుర, బెళగోడులలో చేపట్టిన ప్రచారం సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీకు అందుబాటులో ఉంటూ మీ ప్రతి సమస్యను పరిష్కరించింది తానేనని, మీ అందరూ ఆదరించి తిరిగి తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ జేడీపీ సభ్యులు కే.శ్రీనివాసరావు, ప్రముఖులు హూగార్ అయ్యప్ప, కే.షణ్ముఖప్ప, హబీబ్ రహిమాన్, శరణగౌడ, హనుమంతప్ప, రాఘవేంద్ర, బీ.జాఫర్, కే.మనోహర్, అక్కి జిలాన్, వాసు, దొడ్డబసప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

బన్నేరుఘట్టకు కొత్త అతిథి

బొమ్మనహళ్లి: బెంగళూరు బన్నేరుఘట్ట జూ పార్క్‌లో చెన్నై జూ నుంచి అరుదైన తెల్లపులిని తీసుకొచ్చారు. ఇది ఆరోగ్యంగా ఉందని, ఇక్కడి వాతావరణానికి అనుకూలం కావడానికి కొంతకాలం పడుతుందని జూ సిబ్బంది తెలిపారు. అంతవరకూ దీనిని ప్రత్యేక గదిలో ఉంచుతారు. ఆ తరువాత సందర్శకులు చూడడానికి అనుమతిస్తారు. దీనికి త్వరలోనే పేరు పెడతామని చెప్పారు.

నగరాభివృద్ధికి సహకరించండి


ప్రచారం చేస్తున్న గాలి లక్ష్మీ అరుణ

సాక్షి,బళ్లారి: మే 10న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఫుట్‌బాల్ గుర్తుకు ఓటు వేసి నగరాభివృద్ధికి సహకరించాలని కేఆర్‌పీపీ అభ్యర్థి గాలి లక్ష్మీ అరుణ పేర్కొన్నారు. ఆమె గురువారం నగరంలోని 18, 21వ వార్డుల్లో ఫుట్‌బాల్ చేతపట్టుకుని మండుటెండల్లో తిరుగుతూ ఇంటింటా ప్రచారం చేశారు. ఒంటరి మహిళను బరిలో ఉన్నానని, జనమే తనకు అండగా నిలవాలని కోరారు. ఆమె వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేఆర్‌పీపీలోకి భారీగా చేరికలు

సాక్షి,బళ్లారి: ఎన్నికల తేదీ దగ్గరపడుతున్న కొద్దీ కేఆర్‌పీపీలోకి వలసలు భారీగా పెరుగుతుండడంతో క్రమంగా ఆ పార్టీ బలం పుంజుకుంటోంది. గురువారం 33, 34వ వార్డులకు చెందిన పలువురు ప్రముఖులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్‌కు చెందిన రామాంజిని, సత్యవెంకటేశ్, సర్దార్ బాషా, రామకృష్ణ, రాము, ప్రభావతి, ఉమేష్, శంకర్, గాదిలింగ, ప్రవీణ్, రఘు, చంద్రశేఖర్, ఎలిజబెత్, రజియాబేగం తదితరులు నగరాభివృద్ధి కోసం పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఆ పార్టీ నగర అభ్యర్థిని గాలి లక్ష్మీ అరుణ వారిని పార్టీలోకి స్వాగతించి కండువా వేశారు. ఈసందర్భంగా మాజీ మేయర్ వెంకటరమణ, పార్టీ ప్రముఖులు మల్లికార్జున ఆచార్, హంపీ రమణ, విజయ్ కుమార్, ప్రవీణ్‌రెడ్డి, వసంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటుతోనే అభివృద్ధి


ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి నారా భరత్‌రెడ్డి

సాక్షి,బళ్లారి: కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తేనే నగర అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ అభ్యర్థి నారా భరత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం 22వ వార్డులో ఇంటింటా ప్రచారం చేశారు. యువకుడైన తనను ఈసారి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపుతానన్నారు. నిస్వార్థంగా ప్రజాసేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలున్నారు.

గాంధీనగరలో ప్రచారం


దినేశ్ గుండూరావు ప్రచారం

బనశంకరి: దేశ సమగ్రతకు, అన్నివర్గాల సంక్షేమానికి పాటుపడేది కాంగ్రెస్ పార్టీ ఒక్కటే అని గాంధీనగర నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి దినేశ్ గుండూరావ్ అన్నారు. ఆయన గురువారం శేషాద్రిపురంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యమన్నారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వం కర్ణాటకకు చేసిందేమి లేదని కేవలం ప్రచారంతోనే కాలం వెళ్లదీస్తుందని దుయ్యబట్టారు.


గంగావతి..గెలుపెవరిదో మరి

- సర్వశక్తులు ఒడ్డుతున్న గాలి జనార్దనరెడ్డి
- ఇతర పార్టీలకు కంటిలో నలుసుగా కల్యాణ రాజ్య ప్రగతి పక్ష

సాక్షి,బళ్లారి: గంగావతి అసెంబ్లీ నియోజకవర్గం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనాలకు కేంద్ర బిందువుగా మారింది. ఈసారి ఎన్నికల్లో ఇక్కడి నుంచి కేఆర్‌పీపీ సంస్థాపకుడు, మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డి పోటీ చేస్తుండటంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ నియోజకవర్గంలో కన్నడిగుల ఓట్లతో పాటు తెలుగు వారి ఓట్లు కూడా కీలకం. వారు ఆంధ్రప్రదేశ్ నుంచి పెద్ద ఎత్తున వలస వచ్చి ఇక్కడే స్థిరపడి జీవనం సాగిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో 2,02,206 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 1,00,295 మంది, మహిళలు 1,01,899 మంది కాగా ఇతరులు 12 మంది ఉన్నారు. ఈ నియోజకర్గంలో కూడా మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. కులాల ప్రాతిపదికన తీసుకుంటే లింగాయత్, ముస్లిం ఓట్లు పెద్ద సంఖ్యలో ఉండగా, కురుబ, ఎస్సీ, ఎస్టీలతో ఇతర సామాజిక వర్గానికి చెందిన వారు ఈ ఎన్నికల్లో కీలకంగా మారనున్నారు. అనూహ్య పరిణామాలతో గంగావతి ఎన్నికల బరిలోకి దిగిన కేఆర్‌పీపీ అభ్యర్థి గాలి జనార్దనరెడ్డి ఈసారి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు.

నలుగురూ హేమాహేమీలే

బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి, కాంగ్రెస్ తరఫున మాజీ మంత్రి ఇక్బాల్ అన్సారీ, జేడీఎస్ తరఫున హెచ్‌ఆర్ చెన్నకేశవ బరిలో ఉన్నారు. వీరు నలుగురూ హేమాహేమీలే. చతుర్ముఖ పోటీ నెలకొన్నప్పటికీ కేఆర్‌పీపీ, బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్యనే గట్టి పోటీ నెలకొనే అవకాశాలు ఉన్నాయని అంచనా.


తాలూకాలో వెలసిన ఆంజనేయ స్వామి జన్మస్థలమైన అంజనాద్రి పుణ్యక్షేత్రం

భత్తదనాడు, అన్నపూర్ణ నియోజకవర్గంగా, సాక్షాత్తు ఆంజనేయ స్వామి జన్మించిన పవిత్ర పుణ్యభూమిగా ఖ్యాతి పొందిన గంగావతి నియోజకవర్గ ఫలితాన్ని కల్యాణ కర్ణాటకలోనే కాకుండా రాష్ట్రంలోని 224 నియోజకవర్గాల ప్రజలు, రాజకీయ ప్రముఖులు, అంజనాద్రికి వచ్చివెళుతున్న యావత్ దేశంలోని శ్రీరామభక్తులందరూ ఆసక్తిగా గమనిస్తున్నారు.

వరుసగా గెలిచిన దాఖలాలు లేవు

గంగావతిలో 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్బాల్ అన్సారీ జేడీఎస్ తరఫున గెలుపొందారు. మళ్లీ 2008లో జరిగిన ఎన్నికల్లో పరణ్ణ మునవళ్లి బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం 2013లో జరిగిన ఎన్నికల్లో మళ్లీ జేడీఎస్ తరఫున ఎమ్మెల్యేగా ఇక్బాల్ అన్సారీ గెలుపొందారు. 2018లో మళ్లీ బీజేపీ తరఫున పరణ్ణ మునవళ్లి గెలుపొందారు. గత 20 ఏళ్లుగా ఇక్బాల్ అన్సారీ, పరణ్ణ మునవళ్లిలు గంగావతి రాజకీయాలను శాసిస్తున్నారు. ఒకరు ఒకసారి గెలిస్తే, మరోసారి ఓడిపోతున్నారు. ఈ ఇద్దరు నేతలు వరుసగా రెండుసార్లు గెలిచిన దాఖలాలు లేవు. ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేసిన పరణ్ణ మునవళ్లి ప్రధానంగా దాదాపు 60 వేలకు పైగా ఓటర్లు ఉన్న తన లింగాయత్ సామాజిక వర్గం ఓటు బ్యాంకుపై ఆశలు పెట్టుకున్నారు. అయితే ఇప్పటికే రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా ఆయన తన సామాజిక వర్గానికి ఎలాంటి మేలు చేయలేదనే అపవాదు ఉంది.

వలసలతో బీజేపీ గుండెల్లో రైళ్లు

లింగాయత్ సామాజిక వర్గం గంపగుత్తగా పరణ్ణకు ఓట్లు వేసే పరిస్థితి లేక ఆ వర్గానికి చెందిన ప్రముఖులు కేఆర్‌పీపీలో చేరుతుండటంతో బీజేపీ గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. పరణ్ణ గెలుపునకు అండగా నిలవాల్సిన ప్రముఖ సామాజిక వర్గం వలస పోతుండటంతో బీజేపీ డైలమాలో పడింది. ఇక కాంగ్రెస్ అభ్యర్థి ఇక్బాల్ అన్సారీ కూడా గతంలో గంగావతి నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగిరీ చేసినా ఆయన నియోజకవర్గంలో అందరినీ కలుపుకుని పోలేదని, అభివృద్ధిలో కూడా ఆయన వెనుకబడ్డారని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జాతీయ పార్టీల తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులను ఈసారి ఎన్నికల్లో దూరం పెట్టి కొత్తగా రాజకీయ అరంగేట్రం చేసిన కేఆర్‌పీపీ అభ్యర్థిని గెలిపిస్తే తమ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందనే ఆశతో గంగావతి వాసులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో గెలుపెవరిదో తేలాలంటే మే 13వ తేదీ వరకు వేచి చూడాల్సిందే.


గాలి జనార్దనరెడ్డి (కేఆర్‌పీపీ)


ఇక్బాల్ అన్సారీ (కాంగ్రెస్)


పరణ్ణ మునవళ్లి (బీజేపీ)


హెచ్‌ఆర్ చెన్నకేశవ (జేడీఎస్)

శెట్టర్ గెలవాలని రక్తంతో అభిమాని లేఖ

- సోషల్ మీడియాలో జోరుగా వైరల్

హుబ్లీ: అందరి దృష్టిని ప్రత్యేకంగా ఆకర్షిస్తున్న హుబ్లీ–ధార్వాడ సెంట్రల్ నియోజకవర్గం కాంగ్రెస్ కార్యకర్త ఒక్కరు ఈసారి జగదీశ్ శెట్టర్ గెలుస్తారని,కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనితో లేఖ రాశారు. ఓటమి ఎరుగని మాజీ సీఎం జగదీశ్ శెట్టర్‌కు బీజేపీ హైకమాండ్ టికెట్ నిరాకరించిన నేపథ్యంలో ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుని సెంట్రల్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఈ క్రమంలో మంజునాథ అనే కాంగ్రెస్ కార్యకర్త తన రక్తంతో ఈసారి జగదీశ్ శెట్టర్ నూటికి నూరు పాళ్లు విజయం సాధిస్తారని, కాంగ్రెస్ సర్కారు అధికారం చేపడుతుందని రక్తంతో రాసిస్తానని రాసిన సదరు లేఖ సోషల్ మీడియాలో జోరుగా వైరల్ అయింది.

నటుడు సుదీప్ రోడ్‌షో


కూడ్లిగిలో బీజేపీ అభ్యర్థి తరఫున రోడ్‌షోలో పాల్గొన్న హీరో కిచ్చా సుదీప్

హొసపేటె: విజయనగర జిల్లా కూడ్లిగి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి లోకేశ్ వి.నాయక తరఫున కన్నడ నటుడు కిచ్చా సుదీప్ గురువారం రోడ్‌షో చేపట్టారు. నటుడు సుదీప్ ప్రచారానికి వస్తున్న విషయాన్ని తెలుసుకున్న ఆయన అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి తమ నటుడికి చేయి ఊపి అభివాదం చేశారు. అభ్యర్థి లోకేశ్ నాయకతో కలిసి వాహనంలో ప్రముఖ వీధుల్లో రోడ్‌షో చేపట్టడంతో ఆ రోడ్లలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి కూడ్లిగి ప్రజలు ఓటు వేసి తప్పక గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జిల్లాలో మొత్తం ఓటర్లు 12,23,720 మంది

- వీరిలో యువ ఓటర్లు 39,359 మంది
- 80 ఏళ్ల వయస్సు పైబడిన వృద్ధులు 16,845 మంది

బళ్లారి రూరల్: జిల్లా వ్యాప్తంగా 5 నియోజకవర్గాల్లో మొత్తం 12,23,720 మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు జిల్లా యంత్రాంగం ఓ ప్రకటనలో తెలిపింది. బళ్లారి సిటీ నియోజకవర్గంలో 1,26,067 మంది పురుషులు, 1,33,087 మంది మహిళలు, 30 మంది మంగళముఖులు(హిజ్రాలు), 8,432 యువ ఓటర్లు, 1,383 మంది దివ్యాంగులు, 4,691 మంది 80 ఏళ్లు పైబడిన వృద్ధులు ఉన్నారు. బళ్లారి రూరల్ నియోజకవర్గంలో 1,16,096 మంది పురుషులు, 1,22,181 మంది మహిళలు, 49 మంది హిజ్రాలు, 7,940 మంది యువ ఓటర్లు, 3,001 మంది దివ్యాంగులు, 3,436 మంది వృద్ధులు ఉన్నారు. కంప్లి నియోజకవర్గంలో 1,06,528 మంది పురుషులు, 1,07,882 మంది మహిళలు, 29 మంది హిజ్రాలు, 8,084 మంది యువ ఓటర్లు, 4,331 మంది దివ్యాంగులు, 2,509 మంది వృద్ధులు ఉన్నారు. సిరుగుప్ప నియోజకవర్గంలో 1,06,789 మంది పురుషులు, 1,10,354 మంది మహిళలు, 38 హిజ్రాలు, 7,024 మంది యువ ఓటర్లు, 3,696 మంది దివ్యాంగులు, 3,128 మంది వృద్ధులు ఉన్నారు. సండూరు నియోజకవర్గంలో 1,11,839 మంది పురుషులు, 1,11,416 మంది మహిళలు, 26 మంది హిజ్రాలు, 7,879 మంది యువ ఓటర్లు, 2,694 మంది దివ్యాంగులు, 3,081 మంది వృద్ధులున్నట్లు తెలిపారు.

పెనుతుపానుగా కాంగ్రెస్ గాలి

- మాజీ సీఎం సిద్దరామయ్య


మాట్లాడుతున్న మాజీ సీఎం సిద్దరామయ్య

సిరుగుప్ప: రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తోందని, పెనుతుపానుగా మారి 130 స్థానాలకు పైగా కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్య ధీమా వ్యక్తం చేశారు. ఆయన గురువారం నగర క్రీడాంగణంలో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. 2013–18 మధ్య అవధిలో కాంగ్రెస్ చెప్పిన వాగ్దానాలన్నింటినీ నెరవేర్చామన్నారు. ఇప్పుడు నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. రూ.450లుగా ఉన్న వంట గ్యాస్ ధర రూ.1200లకు పెరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను రద్దు చేశారన్నారు. బీజేపీ మతతత్వ పార్టీ అని, ఎన్నికల్లో ఓట్ల కోసం డ్రామాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతోందన్నారు. బీజేపీ, నరేంద్రమోదీ మోసపూరిత పాలనపై నిప్పులు చెరిగారు. మంచి పరిపాలన అందించాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు, ఎమ్మెల్సీ ప్రకాష్ రాథోడ్, అల్లం వీరభద్రప్ప, జేడీ శీలం, ముండ్రిగి నాగరాజ్, పార్టీ అభ్యర్థి బీఎం.నాగరాజ, చంద్రయ్యస్వామి, చొక్కా బసవనగౌడ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేత్రపర్వం..సోమేశ్వరుని రథోత్సవం

కంప్లి: పట్టణ ప్రజల ఆరాధ్య దైవం సోమేశ్వరుని రథోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. విజయనగర కాలం నాటి ఉగ్రరూపంలో కొలువై ఉన్న సోమేశ్వరుడు అనేక మందికి కులదైవంగా, మరికొందరికి ఆరాధ్య దైవంగా పేరొందాడు. ఈ ఆలయంలో ప్రతి అమావాస్యకు అనేక కార్యక్రమాలు, వివాహాది శుభకార్యాలు జరుగుతాయి. రథోత్సవాన్ని తిలకించేందుకు పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు, ఇతర తాలూకాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రథంపైకి అగరవత్తులు, అరటి పండ్లను విసిరి తమ భక్తిని చాటుతూ మొక్కులను తీర్చుకున్నారు.

రథాన్ని లాగుతున్న భక్తులు →



భూమాపన అధికారికి జైలు

హుబ్లీ: లంచం స్వీకరిస్తుండగా ధార్వాడ లోకాయుక్త అధికారుల వలలో చిక్కిన హుబ్లీ భూమాపన అధికారికి ధార్వాడ మూడో అదనపు జిల్లా సెషన్స్ ప్రత్యేక కోర్టు బుధవారం మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. 2018లో హుబ్లీ మినీ విధానసౌధలోని ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో భూమాపన అధికారిగా పని చేస్తున్న రమేష్ జావళగి ఓ పొలం దాఖలాలు సరి చేసేందుకు రూ.4 వేలు లంచం స్వీకరిస్తుండగా లోకాయుక్త అధికారులు దాడి చేశారు. లోకాయుక్త, ఏసీబీ పోలీసులు నిందితుడిపై కోర్టులో చార్జిషీట్ వేశారు. కేసు విచారించిన సదరు కోర్టు జడ్జి ఎస్.సుబ్రమణ్య నిందితుడిపై ఆరోపణలు రుజువు కావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

మొబైల్ ఫోన్ల అప్పగింత


మొబైల్ ఫోన్‌ను సొంతదారుకు అందిస్తున్న ఎస్పీ శ్రీహరిబాబు

హొసపేటె: నగరంలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న, చోరీకి గురి కాగా స్వాధీనపరచుకున్న మొబైల్స్‌ను గురువారం జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు వాటి సొంతదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ తమ మొబైల్ ఫోన్లు చోరీకి గురైతే ప్రజలు కేఎస్‌పీఈ ద్వారా లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఇప్పటి వరకు 582 మొబైల్‌ఫోన్లను బ్లాక్ చేశామన్నారు. లభ్యమైన 87 మొబైల్స్‌ను యజమానులకు అప్పగించామన్నారు. ఈసందర్భంగా డీఎస్పీలు విశ్వనాథరావు కులకర్ణి, మహంతేష్ కూనబేవు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో ప్రచార హోరు

బళ్లారి రూరల్: రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ప్రచారం ఇప్పుడు జోరందుకుంది. పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ అనుచరులతో వార్డులు, గ్రామాల్లో ప్రచారంలో బిజీ అయ్యారు. మరో పక్క అన్ని పార్టీలు యువకులను ప్రచారం కోసం ఏర్పాటు చేసుకొని ఫేస్‌బుక్, వాట్సప్ గ్రూపులు, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్‌ల్లోను అభ్యర్థుల ప్రచార వీడియోలను అప్‌లోడ్ చేస్తున్నారు. నగరంలో ఓ పార్టీకి చెందిన యువకులు మొబైల్‌ఫోన్‌కు కాల్ చేసి తమ నాయకుడికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. కంప్యూటర్ టెక్నాలజీ తెలిసిన నిరుద్యోగ యువతను ప్రధాన పార్టీలన్నీ ప్రచారానికి నియమించుకొన్నట్లు సమాచారం. ముఖ్యంగా యూట్యూబ్ చానళ్లు, వాట్సప్ గ్రూప్‌ల్లో ఎన్నికల ప్రచారంతో ఊదరగొడుతున్నారు. ఇంకో పక్క బీజేపీ, కాంగ్రెస్, ఆప్, జేడీఎస్, కేఆర్‌పీ పార్టీలు తమ స్నేహితులు, అనుచరుల పేరిట వాట్సప్ గ్రూప్‌లు క్రియేట్ చేసి ప్రచార పర్వాన్ని హోరెత్తిస్తున్నారు.

నేడు బళ్లారికి రాహుల్ రాక

బళ్లారిఅర్బన్: కర్ణాటకలో జరుగుతున్న ఎన్నికల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ శుక్రవారం సాయంత్రం 5 గంటలకు నగరానికి వస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు సయ్యద్ నాసిర్ హుస్సేన్ తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన రాయల్ ఫోర్ట్ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారానికి రాహుల్ గాంధీతో పాటు ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే, మాజీ సీఎం సిద్దరామయ్య, కేపీసీసీ అధ్యక్షుడు డీకే.శివకుమార్ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఉడుపి, శివమొగ్గ, కుష్టిగిల్లో ప్రచారం ముగించుకొని హెలికాప్టర్ ద్వారా బళ్లారికి చేరుకుంటారన్నారు. టీబీ శానిటోరియం వద్ద నుంచి బెళగల్‌క్రాస్, బాబాచౌక్, కౌల్‌బజార్ మీదుగా రోడ్‌షో ద్వారా మొదటి గేట్‌కి చేరుకుంటారన్నారు. మోతీ సర్కిల్‌లో సమావేశంలో మాట్లాడతారన్నారు. ఈసందర్భంగా మాజీ ఎంపీ ఉగ్రప్ప, పార్టీ నేతలు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శివసాయిబాబా జన్మదిన వేడుక

బళ్లారిఅర్బన్: కర్నూలు జిల్లా ఓర్వకల్లు కాల్వబుగ్గలో వెలసిన శివసాయి సేవాశ్రమం పీఠాధిపతి శ్రీశ్రీ శివసాయి గురూజీ 61వ జన్మదిన వేడుకలను హంపీ ఆనెగుంది మాతాశ్రమంలో గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులకు పలు సందేశాలను వివరించారు. అనంతరం కేక్ కట్ చేసి అన్నదానం జరిపారు. బళ్లారి బాలానంద స్వామి, ఓబుళాపురం లక్ష్మీ ఆశ్రమం రఘుస్వామీజీ, మాతాశ్రమం మాతా అన్నపూర్ణసింగ్ సండూరు, ఎస్టీడీ మంజునాథ్, బళ్లారి వెంకట నారాయణ నాయుడు, హొలహర్వి శ్రీనివాస్‌రెడ్డి తదితరులతో పాటు హొసపేటె, గంగావతి, కంప్లి, ఆనెగుంది, కిష్కింధా నుంచి వందలాది మంది స్వామీజీ భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం ఆదరించండి


ఓటర్లతో మాట్లాడుతున్న అభ్యర్థి సోమశేఖరరెడ్డి

సాక్షి,బళ్లారి: నగర సమగ్రాభివృద్ధి కోసం కమలం గుర్తుకు ఓటు వేయాలని బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం బండిమోట్ తదితర ప్రాంతాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. తనను గెలిపిస్తే నగరాన్ని రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతానన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భగీరథ జయంతి

సాక్షి,బళ్లారి: నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా గురువారం భగీరథ జయంతిని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి గాలి సోమశేఖరరెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు మురహరగౌడ తదితరులు భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజ చేశారు. అభ్యర్థి సోమశేఖరరెడ్డి మాట్లాడుతూ దివి నుంచి భువికి గంగను తేవడంలో భగీరథ మహర్షి చేసిన కృషి శ్లాఘనీయం అన్నారు. భగీరథుడు ఒక వ్యక్తి కాదని, ఆయన ఒక శక్తి అన్నారు. ప్రతి ఒక్కరూ ఏదైనా పనిని భగీరథ ప్రయత్నంలా ఆరంభిస్తే ఖచ్చితంగా సాధించవచ్చన్నారు. మహానుభావుల జయంతులను ఆచరించడంతో పాటు వారి అడుగు జాడల్లో మనందరం నడుస్తూ సమసమాజ స్థాపన కోసం కృషి చేయాలని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

చెట్టుకు కారు ఢీ..ఒకరి దుర్మరణం

- మరో ముగ్గురికి గాయాలు


లక్ష్మీపతి(ఫైల్)


ఘటనాస్థలంలో ప్రమాద దృశ్యం

కోలారు: రోడ్డు ప్రమాదంలో పాత్రికేయుడు దుర్మరణం పాలైన ఘటన గురువారం మధ్యాహ్నం తాలూకాలోని షాపూరు వద్ద చోటు చేసుకుంది. నగరానికి చెందిన కోలారు మించు దినపత్రిక సంపాదకుడు లక్ష్మీపతి(45) విధి నిర్వహణలో భాగంగా తన సొంత టాటా న్యానో కారులో బేతమంగలకు వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి కారు చెట్టును ఢీకొంది. ప్రమాద సమయంలో సాగర్ అనే వ్యక్తి కారు నడుపుతున్నారు. ఘటనలో కారులో ప్రయాణిస్తున్న మరో ముగ్గురు తీవ్రంగా గాయపడడంతో వారిని వెంటనే కోలారు ఆర్‌ఎల్ జాలప్ప ఆస్పత్రికి తరలించారు. యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్న శివు, ఉర్దూ పత్రిక విలేకరి నయ్యూ ప్రమాదంలో గాయపడ్డారు. ఘటన తీవ్రతకు కారు ధ్వంసమైంది. కారులో ఇరుక్కుపోయిన క్షతగాత్రులను వెలికి తీయడానికి పోలీసులు చాలా శ్రమించారు. విషయం తెలిసిన వెంటనే కోలారు రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టి కేసు నమోదు చేసుకున్నారు.

ఘనంగా కరగ మహోత్సవం


కరగను తలపై మోస్తున్న పూజారి

మాలూరు: తాలూకాలోని కుడియనూరులో పురాతన ద్రౌపతాంబ, ధర్మరాయస్వామి ఆలయంలో కరగ మహోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కరగ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను జరిపారు. ప్రధాన అర్చకులు పుట్టస్వామి నేతృత్వంలో ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ధర్మరాయ స్వామి, ద్రౌపతాంబ విగ్రహాలకు విశేష పూల అలంకరణ జరిగింది. అనంతరం కరగ పూజారి కరగను తలపై మోస్తూ చేసిన నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

కాంగ్రెస్‌కు సీపీఐ మద్దతు

కోలారు: సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తున్న మతతత్వ శక్తులను అడ్డుకోవడానికి తమ పార్టీ కాంగ్రెస్‌కు మద్దతునిస్తోందని సీపీఐ పార్టీ నాయకుడు సాతి సుందరేష్ తెలిపారు. గురువారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అవినీతిలో కూరుకుపోయిన ఈ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

అక్రమార్కులకు ఓటేయవద్దు

మాలూరు: పలు కేసుల్లో ఉన్న మాలూరు ఎమ్మెల్యే కెవై నంజేగౌడ బెయిల్‌పై బయట తిరుగుతున్నారని, అలాంటి వ్యక్తికి ఓటు వేయవద్దని ఎంపీ ఎస్.మునిస్వామి తెలిపారు. గురువారం తాలూకాలోని చిక్కతిరుపతి, లక్కూరు గ్రామాల్లో బీజేపీ అభ్యర్థి మంజునాథ్‌గౌడ తరఫున ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గతంలో ఎవరూ చేయని విధంగా ఎమ్మెల్యే కుంభకోణాలు చేశారన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిని వచ్చే ఎన్నికల్లో ఓడించి గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. బీజేపీ అభ్యర్థి మంజునాథ్‌గౌడను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కలను పెంచండి

కోలారు: ఔషధ మూలికలతో కూడిన మొక్కలను విరివిగా నాటి పెంచాలని జిల్లా సెషన్స్ జడ్జి సునీల్ ఎస్. హొసమని తెలిపారు. గురువారం తాలూకాలోని ధనమట్నహళ్లిలో వినియోగదారుల హక్కులు, రక్షణపై అవగాహన కార్యక్రమాన్ని మొక్కను నాటి ప్రారంభించి మాట్లాడారు. అనేక రోగాలను అరికట్టడంలో ఆయుర్వేద వైద్యం ఎంతో ఉపయుక్తమన్నారు. పారంపరిక ఆయుర్వేద వైద్యుడు ధనమట్నహళ్లి డాక్టర్ వెంకటేషమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆయుర్వేద వైద్యంపై విశ్వాసం ఉంచి ప్రాచీన వైద్య శాస్త్రాన్ని ప్రోత్సహించాలన్నారు. ముఖ్య అతిథులుగా సవితారాణి, గ్రామస్తులు నారాయణస్వామి, త్రివేణికుమార్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన

కేజీఎఫ్: రూ.8 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న కేజీఎఫ్ రవాణా శాఖ ప్రాంతీయ సహాయక అధికారి కార్యాలయ భవన నిర్మాణ పనులను గురువారం ఆ శాఖ ఏఆర్‌టీఓ నయాజ్‌పాషా పరిశీలించారు. నగరంలో రవాణా శాఖ కార్యాలయాన్ని గత 50 ఏళ్లుగా బాడుగ భవనంలో నిర్వహిస్తున్నారు. రవాణా శాఖ కార్యాలయానికి డ్రైవింగ్ ట్రాక్ నిర్మించడానికి జిల్లా కలెక్టర్ ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని రవాణా శాఖకు అప్పగించారు. అత్యాధునిక కట్టడ నిర్మాణ బాధ్యతలను కేఎస్ఆర్టీసీ సాంకేతిక విభాగానికి కట్టబెట్టారు. గత వారం రోజులుగా పనులు ప్రారంభమై వేగంగా సాగుతున్నాయి. రూ.3 కోట్లతో డ్రైవింగ్ ట్రాక్ నిర్మాణానికి నిధులు విడుదలయ్యాయని, ఏడాదిలోగా భవనంతో పాటు ట్రాక్ పనులను పూర్తి చేస్తారని అధికారి తెలిపారు.

వైభవంగా బ్రహ్మరథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

శ్రీనివాసపురం: తాలూకాలోని కోడిచెరువులో గురువారం వేణుగోపాలస్వామి బ్రహ్మరథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలను నెరవేర్చి ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఉంచి ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు రథోత్సవంలో పాల్గొనగా, గ్రామస్తులు భక్తులకు పానకం, పెసర బేడులను వంచి పెట్టి అన్న సంతర్పణ చేశారు.

కాగడాలతో ఓటరు జాగృతి

శ్రీనివాసపురం: పట్టణంలో స్వీప్ సమితి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కాగడాలతో ఓటరు జాగృతిని నిర్వహించారు. తహసీల్దార్ శిరీన్‌తాజ్ మాట్లాడుతూ ప్రతి ఓటరు తమ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలన్నారు. హక్కుగా భావించి ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు వేయాలని కోరారు. ప్రజాప్రభుత్వ రక్షణ కేవలం ఓటు వల్లనే సాధ్యమన్నారు. టీపీ ఈఓ కృష్ణప్ప మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆత్మప్రభోదాను సారం ఓటు వేయాలన్నారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ నారాయణస్వామి, బీఈఓ ఉమాదేవి, పురసభ ముఖ్యాధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

హస్తం మీ నేస్తం



ఓటు అడుగుతున్న ఎమ్మెల్యే రామలింగారెడ్డి

బొమ్మనహళ్లి : బీటీఎం లేఔట్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి రామలింగారెడ్డి గురువారం కోరమంగళ, ఈజీపురలో స్కూటర్‌పై వీధి వీధి తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేశారు. మహిళలను పలకరిస్తూ హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అవినీతి బీజేపీ సర్కార్‌ను సాగనంపాలన్నారు. మాజీ మేయర్ మంజునాథ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ టి.రామంద్ర పాల్గొన్నారు.

పరీక్ష ఫెయిలై విద్యార్థిని ఆత్మహత్య

యశవంతపుర:ద్వితీయ సంవత్సరం పీయూసీ ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. చిక్కమగళూరు జిల్లా కళస తాలూకా కేంద్రంలోని ప్రభుత్వ కాలేజీలో మేగల్ గ్రామానికి చెందినన స్పర్శ అనే విద్యార్థిని ద్వితీయ సంవత్సరం పీయూసీ చదువుతోంది. ఇటీవల ఫలితాలు విడుదల కాగా ఆమె ఉత్తీర్ణత సాధించలేదు. దీంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న జాంబ్లె గ్రామానికి చెందిన స్నేహితురాలు దీక్షిత పురుగుల మందు తాగింది. ఆమెను మంగళూరు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎం.సతీష్‌రెడ్డి

బొమ్మనహళ్లి:ఎన్నికల ప్రచారంలో భాగంగా బొమ్మనహళ్లి ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి ఎం.సతీష్ రెడ్డి బుధవారం రాత్రి మంగమ్మనపాళ్య వార్డులో సుడిగాలి పర్యటన చేశారు. ఇంటింటికీ వెళ్లి తాను చేపట్టిన అభివృద్ధిని వివరించారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి తనను మరోమారు గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. అనంతరం మంగమ్మనపాళ్య సర్కిల్‌లో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. తర్వాత మదీనా నగర్‌లో పర్యటించారు. ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సలాం, శ్రీనివాస్‌గౌడ, నాగేంద్రగౌడ, భరత్‌గౌడ పాల్గొన్నారు.

24 మంది అరెస్ట్



నిందితులను విచారిస్తున్న పోలీసు అధికారి

శివమొగ్గ: ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న 24 మందిని పోలీసులు కటకటాల వెనక్కు నెట్టారు. శివమొగ్గనగరంలోని తుంగా నగర ఎస్ఐ దూద్యా నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న 12 మందిని అరెస్ట్ చేశారు. అదేవిధంగా భద్రావతిలోని హొసమనె పోలీసు స్టేషన్ పరిధిలో సీఐ నింగరాజు తనిఖీలు నిర్వహించారు. 12 మంది గుంపులుగా తిరుగుతుండగా అరెస్ట్ చేశారు.

పోలింగ్ కేంద్రంలో వసతులు కల్పించండి

మైసూరు: విధానసభ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు సదుపాయాలు కల్పించాలని జిల్లా అధికారి డాక్టర్ కే.రాజేంద్ర సూచించారు. పిరియాపట్టణ తాలూకా కార్యాలయంలో గురువారం ఆయన ఎన్నికల అధికారులతో సమావేశమై చర్చించారు. పోలింగ్ కేంద్రాల్లో మంచినీరు, నీడ సదుపాయం కల్పించాలని, ఓటర్లందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చైతన్యం కల్పించాలని సూచించారు.

పూర్తి మెజార్టీతో అధికారం చేపడుతాం



మాట్లాడుతున్న బీజేపీ నేత అరుణ్ సింగ్

మైసూరు: శాసనసభ ఎన్నికల్లో బీజేపీ పూర్తి మెజార్టీతో విజయం సాధించి మళ్లీ అధికారం చేపడుతుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జ్ అరుణ్ సింగ్ అన్నారు. గురువారం మైసూరులో బీజేపీ ఎన్నికల మీడియా కేంద్రంలో మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు బీజేపీ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అలాంటి వాటిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ప్రజలు బీజేపీ వైపు ఉన్నారని, ఎన్నికల్లో విజయదుందుభి మోగిస్తామన్నారు.

హోరెత్తిన ఎన్నికల ప్రచారం



జయనగరలో కాంగ్రెస్ అభ్యర్థి సౌమ్యారెడ్డి ఎన్నికల ప్రచారం

బనశంకరి: ఎన్నికల ప్రచారం హోరెత్తుతోంది. అభ్యర్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు వీధి వీధిన పర్యటిస్తూ ప్రజలను కలిసి ఓట్లను అభ్యర్థిస్తున్నారు. జయనగర కాంగ్రెస్ అభ్యర్థి సౌమ్యారెడ్డి గురువారం గుర్రప్పనపాళ్య వార్డులో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వం అవినీతికూపంలో కూరుకుపోయిందని దుయ్యబట్టారు. నిత్యావసర ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్‌కు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

శివాజీనగర: శివాజీనగర నియోజకవర్గ పరిధిలోని రామస్వామి పాళ్య వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి రిజ్వాన్ హర్షద్ గురువారం ముమ్మర ప్రచారం చేపట్టారు. చిన్నప్పగార్డెన్ మెయిన్ రోడ్డు, మారెప్పగార్డెన్, ఏ.కే.కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. తనను మరో మారు గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

శాంతినగరలో..

శాంతినగరలో అభివృద్ధికి నోచుకోని అనేక ప్రాంతాల సమగ్రాభివృద్ధి కోసం తనను గెలిపించి అసెంబ్లీకి పంపాలని శాంతినగర కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్యే ఎన్.ఏ. హ్యారిస్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గురువారం దొమ్మలూరు, దొమ్మలూరు లేఔట్, గౌతమ్ కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్‌షోద్వారా ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గ్యారెంటీ కార్డులు అమల్లోకి వస్తాయని తెలిపారు.



దొమ్మలూరులో ఎమ్మెల్యే ఎన్.ఏ.హ్యారిస్ రోడ్‌షో

హెబ్బాళలో..

హెబ్బాళ బీజేపీ అభ్యర్థి కట్టా జగదీశ్ జే.సీ.నగర, గంగానగర వార్డులో ఎన్నికల ప్రచారం చేపట్టారు. రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలు అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. బీజేపీకి ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. మాజీ కార్పొరేటర్లు వెంకటేశ్, నాగరాజ్ పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

శివాజీనగర: శివాజీనగర బీజేపీ అభ్యర్థి ఎన్.చంద్రుకు మద్దతుగా మహిళా సంఘల కార్యకర్తలు గురువారం రామస్వామిపాళ్య వార్డు ఎంఆర్‌ఎస్ పాళ్య, చిన్నప్పగార్డెన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తమిళనాడు తిరుచ్చి మహిళా మోర్చా అధ్యక్షురాలు రేఖ కార్తికేయన్ నేతృత్వంలో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. సుమన్ జయప్రకాశ్, శివాజీ నగర మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు పుష్పా గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



కట్టా జగదీశ్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

పులకేశీనగరలో..

పులకేశీనగర నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఏ.సీ. శ్రీనివాస్‌కి మద్దతుగా ఎస్.కే.గార్డెన్ వార్డులో మాజీ కార్పొరేటర్ జమీర్‌షా ప్రచారం నిర్వహించారు.

బీజేపీ అభ్యర్థి తరపున దర్శన్ రోడ్‌షో

మండ్య: శ్రీరంగ పట్టణ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఇండువాళ సచ్చిదానందకు మద్దతుగా కన్నడ నటుడు డి.బాస్ దర్శన్ గురువారం కేఆర్ ఎస్‌లో రోడ్‌షో నిర్వహించారు. దర్శన్ మాట్లాడుతూ సచ్చిదానంద రాజకీయాల్లోకి రాక ముందునుంచే తనకు మంచి స్నేహితుడన్నారు. అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ ఎన్నికల్లో ఆయనకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని ప్రజలను కోరారు.

భగీరథ మహర్షి జీవితం మార్గదర్శకం

చిక్కబళ్లాపురం: భగీరథ మహర్షి జీవితం అందరికీ మార్గదర్శకమని వక్తలు అన్నారు. భగీరథ మహర్షి జయంతిని గురువారం సరళంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో భగీరథ మహర్షి చిత్రపటానికి అదనపు జిల్లా కలెక్టర్ ఎస్. తిప్పేస్వామి పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ కఠోర తపస్సు చేసి గంగమ్మను దివినుంచి భువికి తెచ్చిన భగీరథ మహర్షిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలన్నారు. రాష్ట్ర ఉప్పార మహాసభ ఉపాధ్యక్షుడు వెంకటేశ్, భగీరథ క్షేమాభివృద్ధి సంఘం తాలూకా అధ్యక్షుడు వీ కృష్ణప్ప, నారాయణస్వామి, రంజిత్ కుమార్, దేవరాజు పాల్గొన్నారు.



చిక్కబళ్లాపురంలో భగీరథ మహర్షి చిత్రపటానికి పూజలు చేస్తున్న ఏడీసీ తిప్పేస్వామి

తుమకూరు : నగరంలో జిల్లా యంత్రాంగం, కన్నడ సాహిత్య పరిషత్, ఉప్పార సమాజం ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతిని నిర్వహించారు. కన్నడ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఎస్. సిద్దలింగప్ప తెలిపారు. భగీరథ మహర్షి చిత్రపటానికి పూజలు చేశారు.



తుమకూరులో పూజలు చేస్తున్న కసాప జిల్లా అధ్యక్షుడు సిద్దలింగప్ప

మద్యానికి డబ్బు ఇవ్వలేదని కడతేర్చాడు

- కుమారుడి చేతిలో తండ్రి హతం
- 15 రోజులుగా ఇంట్లోనే మృతదేహం



బసవరాజు మృతదేహం



నిందితుడు నీలాధర్

కృష్ణరాజపురం: చెట్టంత ఎదిగిన కుమారుడు తండ్రికి అండగా ఉండకుండా మద్యానికి బానిసయ్యాడు. మద్యానికి డబ్బు ఇవ్వలేదని తండ్రిని ఇటుకతో బాది హత్య చేశాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గోవిందరాజనగర పోలీస్ స్టేషన్ పరిధిలోని మారేనహళ్లిలో పీఎస్ లేఔట్‌లో బసవరాజు(60) అనే వ్యక్తి తన కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. బసవరాజు వాచ్‌మెన్‌గా పనిచేస్తుండగా కుమారుడు నీలాధర్ ఆటో నడిపేవాడు. మద్యానికి బానిసైన నీలాధర్ 15 రోజుల క్రితం తండ్రిని డబ్బు అడిగాడు. తన వద్ద లేదని చెప్పడంతో తలపై ఇటుకతో బాదాడు. తీవ్ర గాయాలతో బసవరాజు మృతి చెందాడు. విషయం బయటకు పొక్కితే జైలు తప్పదని భావించి మృతదేహాన్ని ఇంట్లోనే ఉంచాడు. దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు వచ్చి చూడగా బసవరాజు హత్యోదంతం వెలుగు చూసింది. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి నీలాధర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

నంజుండేశ్వరుని హుండీ ఆదాయం రూ.2కోట్లు

మైసూరు:దక్షిణ కాశీగా పేరు పొందిన మైసూరు జిల్లా నంజనగూడులోని నంజుండేశ్వరస్వామికి భక్తులు భారీగా కానుకలు సమర్పించారు. ఆలయంలోని రెండు హుండీలను లెక్కించగా రూ. 2,23,47,797 నగదు, 121గ్రాముల బంగారం, 10 కిలోల 100 గ్రాముల వెండి, విదేశీ కరెన్సీ లభించింది.

లోకాయుక్త వలలో బీబీఎంపీ ఆరోగ్యాధికారి

బనశంకరి: లంచం తీసుకుంటూ సీవీ.రామన్ నగర ఆరోగ్యాధికారి వీ.శివేగౌడ గురువారం లోకాయుక్త వలకు చిక్కాడు. దోమల నియంత్రణకు శ్రీనివాస్ అనే వ్యక్తి కాంట్రాక్టు తీసుకున్నారు. దీనికోసం బీబీఎంపీ ఆరోగ్యాధికారి రూ.80 వేల లంచం డిమాండ్ చేశారు. ఇప్పటికే రూ.30 వేలు తీసుకున్నాడు. మిగిలిన రూ.50 వేలు గురువారం తీసుకుంటుండగా లోకాయుక్త అధికారులు దాడిచేసి శివేగౌడను అరెస్ట్ చేశారు.

వివాహేతర సంబంధంతో మహిళ మృతి

బనశంకరి: వివాహేతర సంబంధానికి గృహిణి బలైన ఘటన బసవేశ్వరనగర పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. జేసీ.నగరలో నివాసం ఉంటున్న సరగుణం(35)కు 17 సంవత్సరాల క్రితం ఓ వ్యక్తితో వివాహమైంది. ఆమెకు 16 ఏళ్ల వయసున్న కుమారుడున్నాడు. అయితే ఆమె గణేశ్ అనే ఆటో డ్రైవర్‌తో వివాహేతర సంబంధం కలిగి ఉంది. రూ.50 వేలు డబ్బు ఇచ్చి అద్దె ఇంటిని సమకూర్చింది. ఇతను మరో మహిళతో సన్నిహితంగా ఉంటున్నట్లు అనుమానించిన ఆమె బుధవారం అతని ఇంటికి వెళ్లింది. అన్నీ సమకూర్చిన తనతో కాకుండా మరొకరితో సన్నిహితంగా ఉంటావా? అని ప్రశ్నించగా ఆత్మహత్య చేసుకుంటానంటూ ఉరివేసుకునేందుకు గణేష్ యత్నించగా అడ్డుకుంది. అనంతరం సురగుణం కుర్చీ ఎక్కి పైకప్పునకు తాడు బిగించి గొంతుకు తగిలించుకుంది. గణేష్ కుర్చీని పక్కకు తోయడంతో తాడు బిగుసుకొని మృతి చెందింది. బసవేశ్వరనగర పోలీసులు గణేశ్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

బీజేపీలో చేరిక



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే జ్యోతిగణేష్

తుమకూరు: వివిధ పార్టీల మహిళా కార్యకర్తలు భారీ సంఖ్యల గురువారం బీజేపీలో చేరారు. వీరికి తుమకూరు నగర ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి జ్యోతీగణేష్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మామ విజయం కోసం కోడలి ప్రచారం

మైసూరు: వరుణ నియోజకవర్గం నుంచి బరిలో ఉన్న మాజీ సీఎం, కాంగ్రెస్ అభ్యర్థి సిద్దరామయ్య విజయానికి ఆయన కోడలు స్మిత రాకేశ్ రంగంలోకి దిగారు. గురువారం తాయూరు గ్రామ పంచాయతీ పరిధిలో మామా సిద్దరామయ్యకు మద్దతుగా ప్రచారం చేశారు. కాంగ్రెస్ హయాంలో సిద్దరామయ్య అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. హస్తం గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు.

బీజేపీ అభ్యర్థి విజయానికి శ్రమించండి



మాట్లాడుతున్న రవి

చింతామణి: విధానసభ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకొని మళ్లీ అధికారంలోకి వస్తామని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీటీ రవి జోస్యం చెప్పారు. గురువారం పట్టణ శివార్లలోని బూరగమాకలహళ్లి సీతారామకల్యాణ మండపంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించి అభ్యర్థి వేణుగోపాల్ విజయానికి శ్రమించాలన్నారు. బీజేపీ అభ్యర్థి వేణుగోపాల్, మహేశ్, శివారెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

హోసూరు వార్తలు..

క్షతగాత్రునికి సహాయం



క్షతగాత్రున్ని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

హోసూరు: డెంకణీకోట- హోసూరు మార్గంలో రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తిని ఎంపి సెల్లకుమార్ హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గురువారం ఉద్దనపల్లి, డెంకణీకోట, హోసూరు ప్రాంతాల్లో జరిగిన ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎంపి సెల్లకుమార్ పాల్గొన్నారు. హోసూరులో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతుండగా మత్తిగిరి క్యాటిల్ ఫాం వద్ద ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై పడి ఉన్నాడు. స్థానికులు, ఎంపీ కలిసి బాధితుడు కళుగొండపల్లి శశికుమార్ (40)ను అంబులెన్స్ ద్వారా హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రెండు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

హోసూరు: హోసూరు– క్రిష్ణగిరి జాతీయ రహదారిపై జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో డ్రైవర్‌తో పాటు ఇద్దరు మృతి చెందారు. బాగల్‌కోట జిల్లాకు చెందిన గంగప్ప(38) హోసూరు మత్తిగిరి సమీపంలోని అందివాడిలో నివాసముంటూ డ్రైవర్‌గా పని చేస్తూ వచ్చాడు. రోడ్డుపై నడిచి వెళ్తుండగా బైక్ ఢీకొని మరణించాడు.

గుర్తు తెలియని వ్యక్తి..

హోసూరు– క్రిష్ణగిరి హైవే శ్యానమావు వద్ద గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందినట్లు స్థానికులు హడ్కో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతునికి సుమారు 40 ఏళ్ల వయస్సు ఉంటుందని, ఆచూకీ కోసం విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కడుపునొప్పితో మహిళ ఆత్మహత్య

కెలమంగలం: కడుపునొప్పిని తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ ఆస్పత్రిలో మరణించింది. వివరాల మేరకు డెంకణీకోట సమీపంలోని బాలతోటనపల్లిలో మల్లేష్, ఉమ (30) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి 12 ఏళ్ల క్రితం పెళ్లి జరిగి ఇద్దరు పిల్లలున్నారు. ఈమె గత కొన్నిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన బంధువులు సేలం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఫలితం లేక బుధవారం రాత్రి మృతి చెందింది. డెంకణీకోట పోలీసులు కేసు నమోదు చేశారు.

30న ఆధ్యాత్మిక శిబిరం

బనశంకరి: బెంగళూరులోని భారతీయ విజ్ఞాన సంస్థ(ఐఐఎస్‌సీ) ఆవరణలో ప్రముఖ సిద్ధయోగి డాక్టర్ స్వామి అంతర్ముఖానంద నేతత్వంలో అంతర్ముఖ యోగంపై ఈనెల 30న ఉచిత ఆధ్యాత్మిక శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అంతర్ముఖ ప్రాణాయామం, బ్రహ్మవిద్య, సిద్ధవిద్య, భగవద్గీత పారాయణం, ఉపనిషత్, బైబిల్, ఖురాన్‌లోని అంశాలపై అవగాహన కల్పిస్తారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ బ్రహ్మర్షి ప్రేమ నాథ్ ఆధ్యాత్మిక బోధన, ప్రత్యక్ష, సంగీత ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. వివరాలకు 9008532066 నెంబరులో సంప్రదించాలని శిబిరం నిర్వాహక సంస్థ మహావతార్ ఫౌండేషన్ ట్రస్టీ రంగస్వామి తెలిపారు.

సంస్కరణలతోనే నిష్పక్షపాతంగా ఎన్నికలు

గౌరిబిదనూరు: పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ కోసం మరిన్ని సంస్కరణలు తేవాల్సి ఉందని ఓటర్లు, ప్రజా సంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు. అక్రమాలను అరికట్టడం, ఓటర్లందరూ నిర్భయంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకునేలా పరిస్థితులు ఉండాలని సూచిస్తున్నారు. గతంలో కేంద్ర ఎన్నికల సంఘం అధికారి టీఎన్ శేషన్ ఎన్నికల నిర్వహణలో ఎన్నో మార్పులు తెచ్చారని గుర్తు చేస్తున్నారు. రాజకీయ పార్టీలు ఎన్నోకల్లో గెలవడానికి వ్యూహాలు మార్చుతున్నాయని, ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రలోభాలకు తెరలేపుతున్నాయని, ఇలాంటివాటిని సమర్థంగా అడ్డుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణలో మార్పులు తేవాలని మేధావులు సూచిస్తున్నారు. నామినేషన్ల ప్రారంభం నుంచి నిత్యం కోట్లలో నగదు, వస్తు సామగ్రి పట్టుబడుతోందని, ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇక ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రజల్లో చైతన్యం తేవాలని, ఇందు కోసం కార్యక్రమాలు నిర్వహించాలని అభిప్రాయపడుతున్నారు. మనలను పాలించే నేతలు ఎలాంటి మచ్చలేకుండా ఉండాలని, అందు కోసం ఓటర్లు చైతన్యవంతులై ఉత్తమ వ్యక్తులను ఎన్నుకునేలా అధికార యంత్రాంగం జాగ్రతి చేయాలని సూచిస్తున్నారు.

నదీ జలాలు తెప్పించాలి



జిల్లాలో దశాబ్దాలుగా శాశ్వత నీటిసదుపాయాల కోసం పోరాటాలు జరుగుతున్నా ప్రభుత్వాలనుంచి స్పందన లభించడం లేదు. బెంగళూరు మురుగు నీటిని శుద్ధిచేసి చెరువులను నింపడానికన్నా ఈ ప్రాంతానికి నదీ జలాలు తెప్పించి అన్నదాతల ను ఆదుకునే నేతలను ఎన్నికల్లో ఎన్నుకోవాలి.

-ఆంజనేయరెడ్డి, జిల్లా శాశ్వత నీటి పోరాట సమితి అధ్యక్షుడు

ఉత్తమ వ్యక్తులను ఎన్నుకోవాలి



పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం వల్ల ప్రజల ఆరోగ్యాలను దెబ్బతింటున్నాయి. అడవులను పెంచడానికి పాటుపడే వ్యక్తులను ఎన్నుకోవాలి. తద్వారా ముందు తరాలవారికి మేలు చేసిన వారమవుతాం.

-చౌడప్ప దొడ్డకురుగోడు, పరిసరవాది

రైతు సంక్షేమం కోరేవారికే ప్రాధాన్యత



రైతుల సంక్షేమం కోరే వారికే ఎన్నికల్లో ప్రాధాన్యత ఇవ్వాలి. రైతులకు నాణ్యమైన విత్తనాలు, రసాయన ఎరువులు, కల్తీ లేని పురుగుల మందులు లభించేలా చర్యలు తీసుకోవాలి. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి. సేవాభావం ఉన్న వ్యక్తులను ఎన్నుకోవాలి.

- రాంబాబు, ప్రవాసాంధ్రుడు

అధికారంలోకి రాబోతున్నాం

తుమకూరు: పూర్తి మెజార్టీతో జేడీఎస్ అధికారంలోకి రాబోతోందని మాజీ సీఎం కుమారస్వామి అన్నారు. తుమకూరులో గురువారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత షఫీ అహ్మద్ జేడీఎస్‌లో చేరారు. ఆయనకు కుమారస్వామి జెండా అప్పగించి పార్టీలోకి స్వాగతం పలికారు. కుమారస్వామి మాట్లాడుతూ షఫీ అహ్మద్ చేరికతో జిల్లాలో పార్టీ బలోపేతం అవుతుందని, 11 అసెంబ్లీ స్థానాల్లో జేడీఎస్ విజయం సాధిస్తుందన్నారు.



షఫీ అహ్మద్‌ను జేడీఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ సీఎం కుమారస్వామి

బురదకయ్యల్లో ఆటపాటలు

మైసూరు : పాఠశాలలకు వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థులు ఆటపాటల్లో నిమగ్నమవుతున్నారు. మైసూరులోని ఒక పాఠశాల నిర్వాహకులు బురదకయ్యల్లో పరుగు పందెం, తాడాట లాంటి పోటీలు నిర్వహింగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



వేర్వేరుగా ముగ్గురు యువతుల అదృశ్యం

హోసూరు: హోసూరు ప్రాంతంలో వేర్వేరు చోట్లలో ముగ్గురు మహిళలు అదృశ్యమయ్యారు. వివరాల మేరకు హోసూరు కార్పొరేషన్ పరిధిలోని దిన్నూరు ప్రాంతానికి చెందిన 22 ఏళ్ల యువతి గత 24వ తేదీ ఇంటి నుంచి బయటకెళ్లి మళ్లీ ఇంటికి రాలేదు. అవాక్కైన తల్లిదండ్రులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో గాలించినా జాడ తెలియకపోవడంతో సేలం అమ్మాపేటకు చెందిన సుజిత్(27)పై అనుమానం ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డెంకణీకోటలో

డెంకణీకోట తాలూకా కళుగొండపల్లి గ్రామానికి చెందిన 24 ఏళ్ల వివాహిత భర్తతో విభేదాలతో రెండేళ్ల నుంచి ఒంటరిగా ఉంటోంది. గత 23వ తేదీ ఇంటి నుండి బయటకెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు మత్తిగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రైవేటు ఉద్యోగిని..

ధర్మపురి జిల్లా పాలకోడు ప్రాంతానికి చెందిన 21 ఏళ్ల యువతి హోసూరు సమీపంలోని కర్నూరు వద్ద మహిళా హాస్టల్లో ఉంటూ అదే ప్రాంతంలోని ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తూ వచ్చింది. గత 22వ తేదీ హాస్టల్ నుంచి బయటకెళ్లి తిరిగి రాకపోవడంతో ఆమె తల్లిదండ్రులు మత్తిగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒకేసారి ముగ్గురు యువతులు మిస్సింగ్ కావడం కలకలం రేపింది. ఈ మూడు కేసుల్లోనూ పోలీసులు విచారణ ప్రారంభించారు.

కొబ్బరి తెగుళ్లపై జాగ్రుతి

హోసూరు: మెళకువలను పాటించి కొబ్బరి రైతులు అధిక దిగుబడులను సాధించాలని వ్యవసాయ విజ్ఞాని శ్రీదేవి రైతులకు సూచించారు. గురువారం హోసూరు సమీపంలోని తొరపల్లి అగ్రహారం గ్రామంలో రైతులకు కొబ్బరి సాగుపై అవగాహన కల్పించారు. హోసూరు తాలూకాలో తొరపల్లి, చెన్నత్తూరు, ముత్తాళి, తట్టిగానపల్లి తదితర ప్రాంతాల్లో 210కి పైగా హెక్టార్లలో రైతులు కొబ్బరితోటలను సాగు చేశారని, తెగుళ్ల వల్ల దిగుబడులు తగ్గాయని తెలిపారన్నారు. తొరపల్లి అగ్రహారంలో రైతులు సాగు చేస్తున్న కొబ్బరి పంటను పరిశీలించామన్నారు. క్రిష్ణగిరి జిల్లాలో ప్రధానంగా కొబ్బరి చెట్లకు రూకోస్ సురుల్ (కొబ్బరి ఈకలు ఎండిపోవడం), తెల్ల ఈగల కాటుతో కాయలు పెరగకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. వ్యవసాయ అధికార్ల సలహాలను పాటించి కొబ్బరి చెట్లకు సోకే చీడపీడలను నివారించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హోసూరు వ్యవసాయ శాఖ ఉపడైరెక్టర్ భువనేశ్వరి, రైతులు పాల్గొన్నారు.



కొబ్బరి సాగుపై రైతులకు చైతన్యం కల్పిస్తున్న దృశ్యం

ఘనంగా కుంభాభిషేకం

హోసూరు: హోసూరు తేరుపేటలో వెలసిన స్వర్ణాంబిక సమేత కళ్యాణ చంద్ర చూడేశ్వరస్వామి ఆలయ మహా కుంభాభిషేకోత్సవం గురువారం ఘనంగా జరిగింది. తేరుపేట సమీపంలో కొండపై శ్రీ మరకతాంబ సమేత శ్రీ చంద్రచూడేశ్వరస్వామి ఆలయం ఉంది. కొండ అడుగు భాగంలో స్వర్ణాంబిక సమేత శ్రీ కళ్యాణ చంద్రచూడేశ్వరస్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ఆలయ కమిటీచే పునరుద్ధరణ గావించారు.

కామాంధునికి ఐదేళ్ల జైలు

కెలమంగలం: అంచెట్టి సమీపంలో ఐదేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ క్రిష్ణగిరి మహిళా కోర్టు తీర్పునిచ్చింది. తాలూకా కేంద్రం అంచెట్టి సమీపంలోని అర్ధకల్ గ్రామానికి చెందిన శివనాగి (30) అదే ప్రాంతానికి చెందిన ఆరేళ్ల బాలికపై 2018 జూన్‌లో అత్యాచారం చేశాడు. చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు డెంకణీకోట మహిళా పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి శివనాగిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఈ కేసు క్రిష్ణగిరి మహిళా కోర్టులో జరుగుతూ వచ్చింది. నేరం రుజువు కావడంతో దోషికి ఐదేళ్ల జైలు శిక్ష రూ. 5000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సుధ బుధవారం తీర్పు చెప్పారు.

పలు అభివృద్ధి పనులకు నాంది



డెంకణీకోటలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

క్రిష్ణగిరి, కెలమంగలం, హోసూరు: క్రిష్ణగిరి జిల్లా సూళగిరి, డెంకణీకోట, హోసూరు తాలూకాల్లో 22.79 కోట్ల ఖర్చుతో పలు అభివృద్ధి పనులకు గురువారం జౌళి శాఖ మంత్రి ఆర్. గాంధీ భూమిపూజ చేశారు. సూళగిరి తాలూకా ఉద్దనపల్లి సమీపంలోని పాతకోట వద్ద డెంకణీకోట- ఉద్దనపల్లి వరకు రూ. 5.50 కోట్ల ఖర్చుతో జాతీయ రహదారి నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం రూ. 2.22 కోట్ల ఖర్చుతో పాత కోట నుంచి టి. కురుబరపల్లి వరకు పంచాయతీ రోడ్డు విస్తరణ పనులను ఆయన ప్రారంభించారు.

కార్యక్రమంలో హోసూరు కార్పొరేషన్ పరిధిలోని కాంధి నగర్, క్రిష్ణానగర్, టైటాన్ టౌన్‌షిప్, ఓ. కారుపల్లి, కొత్తగొండపల్లిల ప్రాంతాల్లో 5 రేషన్ దుకాణాలను మంత్రి ప్రారంభించి ప్రజలకు సంక్షేమ ఫలాలను అందజేశారు. ఎంపీ సెల్లకుమార్, ఎమ్మెల్యేలు వై.ప్రకాష్, టి.రామచంద్రన్, హోసూరు మేయర్ ఎస్.ఏ. సత్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

చంద్రబాబు రోడ్‌షోలో గాయపడిన యువకుడి మృతి

ఇటీవల అమరావతిలో చంద్రబాబు రోడ్ షోలో యువకుడికి తీవ్ర గాయాలు



అమరావతి : టీడీపీ అధినేత చంద్రబాబు అమరావతిలో గత మంగళవారం నిర్వహించిన రోడ్ షో సందర్భంగా బైక్ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన అడుసుమిల్లి వెంకటేశ్వర్లు(39) గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం గ్రంధసిరి గ్రామానికి చెందిన అడుసుమిల్లి బాలవెంకటేశ్వర్లు చంద్రబాబు రోడ్‌షోలో పాల్గొన్నాడు. ఈ క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్ పెట్రోలు ట్యాంక్ పగిలి చెలరేగిన మంటల్లో కాలిపోయి గుంటూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించి అమరావతి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివేకా పీఏ కుటుంబ సభ్యులను విచారించిన సీబీఐ

పులివెందుల: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ అధికారులు గురువారం వివేకా పీఏ కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను విచారించారు. సీబీఐ అధికారులు రెండు వాహనాలలో పులివెందులలోని డిగ్రీ కళాశాల రోడ్డులో గల కృష్ణారెడ్డి ఇంటికి చేరుకున్నారు. ఆ సమయంలో కృష్ణారెడ్డి ఇంట్లో లేకపోవడంతో ఆయన భార్య సుజాత, కుమారుడు రాజేష్‌ను రెండు గంటల పాటు పలు విషయాలపై ప్రశ్నించారు. అనంతరం సీబీఐ అధికారులు పులివెందుల నుంచి కడపకు వెళ్లారు.

ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు

- వైఎస్ వివేకా హత్య కేసులో హైకోర్టు ఉత్తర్వులు
- సీబీఐ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం
- రూ.లక్షన్నర పూచీకత్తుతో ట్రయల్ కోర్టు నుంచి బెయిల్ పొందవచ్చని సూచన

సాక్షి, హైదరాబాద్ : మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ–1 నిందితుడు ఎర్ర గంగిరెడ్డి బెయిల్‌ను రద్దుచేస్తూ తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు వెలువరించింది. వచ్చే నెల 5లోగా సీబీఐ ఎదుట లొంగిపోవాలని గంగిరెడ్డిని ఆదేశించింది. ఒకవేళ అతను లొంగిపోకుంటే అరెస్టుచేయవచ్చని స్పష్టం చేసింది. జ్యూడీషియల్ రిమాండ్‌ను జూన్ 30 వరకు విధించింది. ఆ తర్వాత రూ.లక్షన్నర పూచీకత్తుతో ట్రయల్ కోర్టు నుంచి బెయిల్ పొందవచ్చని గంగిరెడ్డికి సూచించింది. ఈ మేరకు గురువారం ఆదేశాలు జారీచేసింది.

వివేకా హత్య కేసులో ప్రధాన నిందితుడు గంగిరెడ్డి బెయిల్ రద్దుచేయాలని కోరుతూ హైకోర్టులో సీబీఐ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ చిల్లకూర్ సుమలత బుధవారం వరకు వాదనలు విన్నారు. గతంలో రెండుసార్లు గంగిరెడ్డి బెయిల్ రద్దు కోరుతూ సీబీఐ పిటిషన్ దాఖలు చేయగా, కడప కోర్టు, ఏపీ హైకోర్టు ఆ పిటిషన్లను కొట్టివేశాయని.. మళ్లీ ఇప్పుడు అదే పిటిషన్‌ను ఈ కోర్టులో దాఖలు చేయడం చట్టవిరుద్ధమని అతని తరఫున సీనియర్ న్యాయవాది శేషాద్రి నాయుడు, న్యాయవాది సి.శరత్‌రెడ్డి వాదనలు వినిపించారు. హత్య కేసులో ప్రధాన నిందితుడు బయట ఉండి సాక్షులను ప్రభావితం చేస్తున్నాడని, భయపెడుతున్నాడని సీబీఐ పీపీ వాదించారు. ఇంప్లీడ్‌పిటిషన్ వేసిన సునీత తరఫున టి.స్వేచ్ఛ వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. బెయిల్ రద్దుచేస్తూ ఉత్తర్వులు వెలువరించారు.

ఏకపక్షంగా విచారణ

వివేకా హత్యపై సోషల్ మీడియాలో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి వీడియో వైరల్

- ఏ 4ను పావుగా వాడుకొని సునీతమ్మ, సీబీఐ మమ్మల్ని టార్గెట్ చేస్తున్నారు
- కిరాయి హంతకుడు అదే డబ్బు కోసం వ్యక్తిత్వ హననానికి పాల్పడడా?
- సునీతక్క తన భర్తను కాపాడుకునే క్రమంలో మా వ్యక్తిత్వాలను నాశనం చేస్తోంది
- సీబీఐపై నమ్మకంతో, పెదనాన్న గురించి కొన్ని విషయాలు చెప్పలేక మూడేళ్లు మౌనంగానే ఉన్నా
- రెండు చార్జిషీట్లు, అఫిడవిట్లు, సాక్షుల స్టేట్‌మెంట్లు పరిశీలిస్తే డొల్లతనం బహిర్గతం
- పెదనాన్న హత్యకు ఎంపీ టికెట్ మోటివ్‌గా చెప్పడం అత్యంత హాస్యాస్పదం
- అబద్ధాల కట్టడం న్యాయస్థానంలో నిలబడదు.. కుప్పకూలుతుంది
- కుట్రలను పటాపంచలు చేస్తాం.. అంతిమంగా న్యాయమే గెలుస్తుంది



సాక్షి ప్రతినిధి, కడప: 'సీబీఐ పెద్ద సంస్థ... నేను ఆ సంస్థ మొత్తాన్ని నిందించే పెద్దవాడిని కాదు గానీ వివేకం పెదనాన్న హత్య కేసులో విచారణ చేస్తున్న రామ్‌సింగ్ ఏకపక్షంగా వ్యవహరించారు. ఫ్యాక్ట్ టార్గెట్ కాకుండా పర్సన్‌ను టార్గెట్ చేస్తూ విచారణ చేస్తున్నారు. కట్టుకథల ఆధారంగా అబద్ధాల కట్టడాలను కడుతోంది. మా అక్క సునీతమ్మ తన భర్తను కాపాడుకునే క్రమంలో నన్ను, మానాన్న వ్యక్తిత్వాలను నాశనం చేస్తోంది. సునీతమ్మను పావుగా వాడుకుని ఎల్లో మీడియా, చంద్రబాబునాయుడు, బీజేపీలో చేరిన టీడీపీ నేతల ద్వారా వైఎస్సార్ సీపీపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారు' అని కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణకు సంబంధించి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ (ఐవో) ఏకపక్ష వైఖరి, ఎల్లో మీడియా కట్టుకథలపై ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి వీడియో గురువారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. అందులో వివరాలు ఇవీ..

మూడేళ్లుగా మాట్లాడాలనుకున్నా..

సీబీఐ విచారణ గురించి ప్రజలందరికీ తెలియాలనే ఉద్దేశంతోనే ఈ వీడియో చేస్తున్నా. మూడేళ్లుగా చాలా సందర్భాల్లో మాట్లాడాలనుకున్నా.. సీబీఐపై నమ్మకంతో, వివేకం పెద్దనాన్న గురించి కొన్ని విషయాలు మాట్లాడలేక, చనిపోయిన వ్యక్తి కుమార్తె, అల్లుడు గురించి మాట్లాడలేక ఎన్ని ఆరోపణలొచ్చినా మౌనంగానే ఉన్నా. విచారణ తప్పుదారిలో వెళ్తున్నా భరించా. సీబీఐ వేసిన రెండు చార్జిషీట్లు, 248 మంది సాక్షుల స్టేట్‌మెంట్లు, కోర్టుల్లో దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్లు, వ్యక్తిగతంగా నా విచారణను బేస్ చేసుకొని నేను మాట్లాడుతున్నా.

పథకం ప్రకారం వ్యక్తిత్వ హననం..

వాచ్‌మెన్ రంగన్న ప్రత్యక్ష సాక్షిగా స్టేట్‌మెంట్ ఇచ్చాడు. నలుగుర్ని గుర్తు పట్టి వారి పేర్లు కూడా చెబుతాడు. మరి నలుగురిలో ఒకర్ని అప్రూవర్‌గా మార్చాల్సిన అవసరం ఉందా? కిరాయికి హత్య చేసిన వ్యక్తి, డబ్బు కోసం మంచి మనిషిని చంపిన వ్యక్తి, అదే డబ్బు కోసం వ్యక్తిత్వ హననానికి పాల్పడడా? హత్యలో స్వయంగా పాల్గొన్నానని చెప్పిన దస్తగిరి ముందస్తు బెయిల్‌కు సీబీఐ నో అబ్జెక్షన్ అని చెబుతోంది. రెండేళ్లుగా కోర్టులో ఎవరు బెయిల్ పిటిషన్ వేసినా ఇంప్లీడ్ అవుతున్న సునీతమ్మ మరి దస్తగిరి ముందస్తు బెయిల్ పట్ల ఎందుకు మౌనంగా ఉన్నారు? ఇది అతడిని పావుగా వాడుకొని మమ్మల్ని టార్గెట్ చేయడం కాదా? అప్రూవర్ అనే అబద్ధాల కట్టడంలో అత్యున్నత స్థాయి విచారణ సంస్థ ఇన్వెస్టిగేషన్ అధికారి రామ్‌సింగ్ దిగజారి ప్రవర్తించారు. కీలక అంశాలను మరుగున పరుస్తూ సిల్లీ అంశాల ఆధారంగా విచారణ కొనసాగించారు.

నిజాలను మరుగునపరచి..

ఘటనా స్థలంలో ఉన్న వాస్తవాన్ని ఎందుకు దాచిపెట్టాల్సి వచ్చింది? వైఎస్ వివేకానందరెడ్డిది హత్య అని తెలిసీ, డెత్ నోట్ చదివి వినిపించిన పీఏ కృష్ణారెడ్డిని ఎవరికీ చూపించకుండా లేఖ దాచి పెట్టాలని అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి ఆదేశించారు. వాస్తవాలు చెప్పకుండా ఘటన స్థలంలోకి నన్ను వెళ్లమని నర్రెడ్డి శివప్రకాష్‌రెడ్డి ఫోన్‌లో చెప్పారు. జమ్మలమడుగు వెళ్తున్న నేను అక్కడికి వెళ్లి చూసిన ఘటనను ముందుగా పోలీసులకు సమాచారం ఇచ్చా. అప్పటి సీఐకి ఫోన్ చేసి వివేకం పెద్దనాన్న చనిపోయారు, చాలా రక్తం ఉంది, బెడ్ రూమంతా రక్తం ఉంది, త్వరగా రండి సార్.. అని చెప్పా. అది హత్య అని తెలియడానికి లెటర్ క్లియర్ ఎవిడెన్స్. లెటర్ కంటెంట్ విన్న వెంటనే నర్రెడ్డి రాజశేఖరరెడ్డి పోలీసులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదు? కనీసం నాకైనా చెప్పాలి కదా? హత్య విషయాన్ని ఎందుకు దాచిపెట్టారు. ఇలాంటి వాస్తవాలను రామ్‌సింగ్ మరుగునపరచి ఏకపక్షంగా వ్యవహరిస్తారు. సునీతమ్మ తన భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, నర్రెడ్డి శివప్రకాష్‌రెడ్డిలను కేసు నుంచి కాపాడుకునేందుకు ఆరాటం చూపుతోంది.

అన్ని వేళ్లు వాళ్ల వైపే...

ఘటనాస్థలంలో దొరికిన లెటర్‌తో పాటు వేళ్లన్నీ వాళ్ల వైపే చూపుతున్నాయి. వివేకం సార్ 2010లో ఇస్లాం మతం స్వీకరించి మహమ్మద్ అక్బర్‌గా పేరు మార్చుకొని షమీమ్ అనే మహిళను వివాహం చేసుకున్నారు. వారికి షహెన్‌షా అనే అబ్బాయి కూడా ఉన్నాడు. సునీతమ్మ, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, షమీమ్ స్టేట్‌మెంట్లు పరిశీలిస్తే ఆ విషయం స్పష్టంగా తెలుస్తుంది. షమీమ్‌కు ఒక విల్లా కొనుగోలు చేసి ఇచ్చి, అబ్బాయిని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదివించాలని, ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి వారి జీవనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వివేకం పెదనాన్న అనుకున్నారు. బెంగళూరు డీల్ రూ.8 కోట్లు వస్తే ఆ మొత్తం వారికి ఇవ్వాలనుకున్నారు. అయితే బెంగళూరులో డబ్బు వచ్చే అవకాశమే లేదని 8 మంది సాక్షుల ద్వారా వెల్లడైంది. తన వాటా ఆస్తిగా వచ్చిన 25 శాతం భాగాన్ని షమీమ్ కుటుంబానికి చెందేలా వివేకం సార్ విల్లు రాయించారు. నర్రెడ్డి రాజశేఖరరెడ్డి ఇది తెలిసి ఎర్ర గంగిరెడ్డి ద్వారా పథక రచన చేశారు. రెండో పెళ్లి వ్యవహారంతో 2013 నుంచి సునీతమ్మకు, పెదనాన్నకు మధ్య మాటలు కూడా లేవు. నర్రెడ్డి రాజశేఖరరెడ్డి కూడా ఆ విషయాన్ని విచారణలో వెల్లడించారు. వివేకం సార్‌కు ఉన్న చెక్ పవర్‌ను కూడా రద్దు చేశారు. హత్య అనంతరం ఎర్ర గంగిరెడ్డి డాక్యుమెంట్లు, స్టాంపు పేపర్లు తీసుకెళ్లినట్లు ఏ–4 చెబుతున్నాడు. ఇవన్నీ కూడా వేళ్లు వారివైపే చూపుతున్నాయి. ఏ–2, ఏ–3 కుటుంబ సభ్యుల కారణంగా వివేకం సార్‌తో తీవ్రమైన విభేదాలున్నాయి. ఎర్రగంగిరెడ్డి ద్వారా నర్రెడ్డి రాజశేఖరరెడ్డి వీరందర్నీ వాడుకున్నారు. ఇది పూర్తిగా మర్డర్ ఫర్ గెయిన్. రాజశేఖరరెడ్డిని తప్పించి దస్తగిరిని పావుగా చేసుకొని మమ్మల్ని టార్గెట్ చేస్తున్నారు.

సునీతమ్మది పోరాటం కాదు...ఆరాటం

వివేకం సార్ హత్య కేసులో సునీతమ్మది పోరాటం కాదు, ఆరాటం మాత్రమే. భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి ఈ హత్య కేసులోంచి బయటికి రావాలి. ఆమె భర్త స్థానంలో నన్ను, మా నాన్నను ఇరికించాలి. అది అసూయతోనే. ఇంకో కారణం లేదు. మాకైతే సునీతమ్మపై గౌరవం ఉంది. ఆమెను బాధ పెట్టాలని కాదు.. వాస్తవాలు తెలియాలి కాబట్టి చెబుతున్నాం. సుప్రీంకోర్టులో నాపై తీవ్రమైన ఆరోపణలు చేస్తూ పిటిషన్ వేశారు. రామ్‌సింగ్‌ను సపోర్టు చేస్తూ కౌంటర్ పిటిషన్ వేస్తారు. పర్సన్‌ను టార్గెట్ చేస్తూ తీవ్రమైన ఆరోపణలు చేస్తారు. మాజిల్లా వాసులందరికీ తెలుసు. ఎంపీ టికెట్ మోటివ్ అన్నది హాస్యాస్పదం. వైఎస్ వివేకా ముందు రోజు కూడా మైదుకూరు నియోజకవర్గంలో డోర్ టు డోర్ ప్రచారం చేశారు. ఎమ్మెల్యేగా రఘురామిరెడ్డి, ఎంపీగా వైఎస్ అవినాశ్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం చేశారు. సంబంధం లేని వారి జీవితాలను ఇందులోకి లాగి ఎందుకు నాశనం చేయాలనుకున్నారు? ఈ విషయాన్ని సీబీఐని అడుగుతున్నా. సునీతక్కను కూడా అడుగుతున్నా. నేను చేసే ప్రతి కార్యక్రమాన్ని వివేకం పెదనాన్న బలపర్చేవారు. నా కార్యక్రమాలకు వచ్చేవారు. నా కోసం ఫైట్ చేసే వ్యక్తిని నేను చంపానని అనడం ఎంతవరకూ లాజికల్ అనేది ఆలోచించండి. 2014లో వేంపల్లెలో వీధి వీధిలో తిరుగుతూ మా ఇద్దరు కుమారులు జగన్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డిలను గెలిపించాలని ప్రచారం చేశారు.

అప్రూవర్ కట్టుకథ....

సీబీఐకి సాక్షుల స్టేట్‌మెంట్లు పరిశీలిస్తే (ఎల్ డబ్ల్యూ 10, 34, 37, 38, 50, 86, 94, 98) బెంగళూరు సెటిల్‌మెంట్ ఫెయిల్ అయింది. రాధాకృష్ణమూర్తివి ఫేక్ డాక్యుమెంట్లు, డబ్బులు రావని స్పష్టంగా చెప్పారు. ఏమాత్రం డబ్బులు రాని విషయం గురించి వాదోపవాదనలు చేసుకుని చంపినట్లు చెప్పడం కట్టుకథ కాదా? అది స్పష్టంగా తెలియడం లేదా? వివేకం పెదనాన్న హత్యలో సిట్ నాలుగైదు కోణాల్లో విచారణ కొనసాగించింది. వివేకం సార్ రెండో వివాహం, బతికున్న సమయంలో బలపనూరులో షమీమ్‌కు కట్టించిన ఇంటిని కూడా రాయించుకోవడం, మర్డర్ ఫర్ గెయిన్ అన్న విషయం వెలుగు చూస్తున్న సమయంలో.. నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, నర్రెడ్డి శివప్రకాష్‌రెడ్డిలను కాపాడుకునేందుకు సునీతమ్మ సిట్ వద్దు సీబీఐ విచారణ కావాలని కోరుతోంది. అంతకంటే వేరే మతలబు లేదు.

ఎల్లోబ్యాచ్ పావుగా సునీతమ్మ

సీబీఐ ఎంతో పెద్ద ఏజెన్సీ. కానీ పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా ఉంది. ఏ–4 దస్తగిరిని పావుగా చేసుకొని సునీతమ్మ మమ్మల్ని టార్గెట్ చేస్తోంది. సునీతమ్మను పావుగా చేసుకొని లబ్ధి పొందేందుకు ఎల్లో బ్యాచ్ ప్రయతిస్తోంది. వాళ్లకు నేను, మానాన్న టార్గెట్ కాదు. వైఎస్సార్‌సీపీనే టార్గెట్. ఎందుకంటే మాద్వారా వైఎస్సార్‌సీపీ డీఫేమ్ కావాలి. ఎల్లో మీడియా, చంద్రబాబునాయుడు, మారెడ్డి రవీంద్రనాథరెడ్డి, బీజేపీలో ఉన్న టీడీపీ నేతలు నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. వారికి ప్రజల్లోకి వెళ్లే దమ్ము, ధైర్యం లేదు. డీఫేమ్ చేయడంలో ఎల్లోబ్యాచ్ ఎక్స్‌పర్ట్. ఎన్టీ రామారావు లాంటి మహానుభావుడినే డీఫేమ్ చేసి రోడ్డున పడేశారు. మీ కుట్రలను పటాపంచలు చేస్తాం. న్యాయ పోరాటం చేస్తాం. న్యాయ వ్యవస్థపైన మాకు నమ్మకం ఉంది. అబద్ధాల కట్టడాలు న్యాయస్థానంలో నిలబడవు. నిజం పునాదిపై ఉన్నాం. చివరకు న్యాయమే గెలుస్తుందన్న విశ్వాసం ఉంది.

అవినాశ్ అరెస్టుకు సీబీఐ అత్యుత్సాహం

▶ మొదటి పేజీ తరువాయి

విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'సీబీఐ ప్రధానంగా నాలుగు అంశాలను ప్రస్తావిస్తూ అవినాశ్‌ను అరెస్టుచేయాలని చూస్తోంది. కానీ, అందులో ఏ ఒక్క దానికీ ఆధారాల్లేవు. అన్నీ ఊహాజనితాలు, కల్పితాలే. ఏ–4 నిందితుడు దస్తగిరి వాంగ్మూలం, గూగుల్ టేక్అవుట్, ఎమ్మెల్సీ ఎన్నికల కారణం, సాక్ష్యాలను చెరిపివేసే ప్రయత్నం చేశారన్న ఆరోపణలు చేస్తోంది. ఇందులో ఏ ఒక్కటీ చట్టప్రకారం సరికాదు. మన వెనుక వైఎస్ అవినాశ్, భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి ఉన్నారని గంగిరెడ్డి చెప్పినట్లు దస్తగిరి వాంగ్మూలాన్ని ఇచ్చాడు. ఈ వ్యాఖ్యలను గంగిరెడ్డి తన వాంగ్మూలంలో ఖండించాడు. తను ఎవరి పేరు చెప్పలేదని వెల్లడించాడు. దస్తగిరి రెండుసార్లు వాంగ్మూలం ఇచ్చాడు. మొదటిసారి చెప్పిన దాంట్లో ఎవరి పేరూలేదు. రెండోసారి చెప్పిన దాంట్లో ఈ పేర్లు చెప్పాడు. ఇలా ఎందుకు చెప్పాడని సీబీఐ అతన్ని ప్రశ్నించడంలేదు. 'హియర్ సే ఎవిడెన్స్' అంటే.. ఎవరో చెప్పింది విని చెప్పడం. ఇది చట్టప్రకారం ఆమోదయోగ్యం కాదు. అంతేకాదు.. కేసును ఏపీ హైకోర్టు సీబీఐకి బదిలీ చేసిన తర్వాత దస్తగిరి దాదాపు రెండునెలలు ఢిల్లీలో ఉండి వచ్చాడు. తాను సీబీఐ వారిని కలిసివచ్చానని కూడా బయట చెప్పాడు. అక్కడ జరిగిన ఒప్పందంలో భాగంగానే ఈ పేర్లు ప్రస్తావించాడు. తానే హత్య చేశానని చెప్పిన కిరాయి హంతకుడికి బెయిల్ ఇచ్చేందుకు సీబీఐ సహకరించడం ఎప్పుడూ జరగలేదు. గూగుల్ టేక్అవుట్ ప్రామాణికం కాదు. ఒక వ్యక్తి తన స్నేహితుడి ఫోన్‌లోని గూగుల్‌ను అతని జీ మెయిల్‌తో తెరిస్తే.. స్నేహితుడు ఎక్కడికి వెళ్లినా ఇతను అక్కడ ఉన్నట్లే చూపిస్తుంది. అందుకే గూగుల్ టేక్అవుట్‌ను గూగుల్ కూడా సర్టిఫై చేస్తూ లేఖ ఇవ్వదు. కేంద్ర ప్రభుత్వం కూడా దాన్ని సర్టిఫై చేయదు. దస్తగిరి చెప్పిన వాంగ్మూలానికి, గూగుల్ టేక్అవుట్ సమాచారానికి వివరాల్లో తేడా ఉంది. ఇందులో ఏది సరైందో సీబీఐ ఎలా నిర్ణయించుకుంది?'.. అని నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. ఇక వివేకా.. అవినాశ్‌కు బాబాయి. అవినాశ్ ఎంపీగా పోటీచేసినప్పుడు అతని ప్రచారంలో, గెలుపులో వివేకా కీలకపాత్ర పోషించారు. తర్వాత జరగబోయే ఎన్నికల్లో కూడా అవినాశ్ గెలుపు కోసం ప్రచారంలో పాల్గొనడానికి ఆయన సిద్ధమై ఉన్నారు. ఇదే విషయాన్ని వివేకా మృతిచెందిన దాదాపు 10 రోజుల తర్వాత ఆయన కుమార్తె సునీత కూడా మీడియాకు వెల్లడించింది. తర్వాత ఏం జరిగిందో.. మాట మార్చారు. ఇక సాక్ష్యాలను మార్చడం విషయానికొస్తే.. మార్చి 15, 2019 ఉదయం అవినాశ్‌రెడ్డి జమ్మలమడుగు బయల్దేరారు. మధ్యలో ఉండగా, వివేకా అల్లుడు ఫోన్‌చేసి, గుండెపోటుతో మృతిచెందినట్లు చెప్పారు. దీంతో ఆయన ఉ.6 తర్వాత అక్కడికి చేరుకున్నారు. కొంత సమయం ఉండి వెళ్లిపోయారు తప్ప.. సాక్ష్యాలను చెరిపివేసే ప్రయత్నం చేయలేదు. అవినాశ్, భాస్కర్‌రెడ్డి లక్ష్యంగా సీబీఐ దర్యాప్తు సాగిస్తోంది. వివేకా రాసిన లేఖను సాయంత్రం వరకు ఎందుకు దాచాల్సి వచ్చిందో చెప్పమని అతని అల్లుడిని సీబీఐ కనీసం ప్రశ్నించలేదు. సీబీఐ దర్యాప్తు చేపట్టిన నాటి నుంచి పిలిచిన ప్రతీసారి అవినాశ్ విచారణకు హాజరవుతున్నారు. ఎప్పుడూ తప్పించుకునే ప్రయత్నం చేయలేదు. ఆర్టికల్–21ను ఉల్లంఘిస్తూ.. అవినాశ్ ప్రాథమిక హక్కును కాలరాస్తున్నారు. సీబీఐ కోరిన రోజున.. ఉదయం నుంచి సాయంత్రం వరకు (కస్టడీ) విచారణకు హాజరుకావడానికి అవినాశ్ సిద్ధంగా ఉన్నారు. ఈ క్రమంలో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలి' అని నిరంజన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సునీత తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. అవినాశ్‌పై పలు కేసులు ఉన్నాయని, ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారని చెప్పారు. దీనిపై నిరంజన్‌రెడ్డి జోక్యం చేసుకుని.. అవినాశ్‌పై ఎలాంటి కేసుల్లేవని, తాజాగా స.హ.చట్టం ప్రకారం తీసుకున్న డాక్యుమెంట్లను కోర్టుకు చూపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

'ఇదేం ఖర్మ'.. జనం ఏరీ!

▶ మొదటి పేజీ తరువాయి

చంద్రబాబు సభకు చేరుకున్నారు. పల్నాడులో తమకు ఆదరణ పెరిగిందని చూపించుకునేలా సభకు పెద్ద ఎత్తున జనసమీకరణ కోసం టీడీపీ నేతలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మహిళలకు ఒక చీర, రూ.300, పురుషులకు రూ.500, మద్యం, పలావ్ ప్యాకెట్లు ఇచ్చి జనాన్ని తరలించినప్పటికీ నిర్దేశించుకున్న చిన్న ప్రాంతం కూడా నిండకపోవడం గమనార్హం. చంద్రబాబు రోడ్ షో సైతం వెలవెలబోయింది. దీంతో పెదకూరపాడు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మాలపాటి శ్రీధర్, సత్తెనపల్లి నేతలకు చంద్రబాబు క్లాస్ తీసుకున్నట్టు టీడీపీ శ్రేణులు చెబుతున్నాయి. సభలు, రోడ్డు షోలకు జన సమీకరణలో విఫలమైతే ఎలా? అంటూ బాబు అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. తాము డబ్బు, తాయిలాలు ఇచ్చినా పెద్దగా జనం రాలేదని నేతలు వివరణ ఇచ్చుకున్నా చంద్రబాబు సంతృప్తి చెందలేదని సమాచారం. ప్రజల్లో సానుకూలత ఉంటే తమ ప్రయత్నాలు ఫలిస్తాయి తప్ప.. జనంలో కొంచెం సానుకూలత కూడా లేకపోతే ఎంత గట్టిగా ప్రయత్నించినా జనం రారని టీడీపీ నేతలు సంజాయిషీ ఇచ్చుకున్నట్టు తెలుస్తోంది. కాగా, కందుకూరు ఘటనతోనూ పాఠాలు నేర్వని చంద్రబాబు ఆ తర్వాత కూడా అదే తరహాలో ఇరుకుసందుల్లో సభలు నిర్వహిస్తున్నా జనం లేక సభలు, రోడ్ షోలు వెలవెలబోతున్నాయి. ఇటీవల మచిలీపట్నం, గుడివాడ సభలు సైతం అట్టర్‌ఫ్లాప్ అయ్యాయి. జనం కోసం చంద్రబాబు గంటల తరబడి నిరీక్షించి చివరకు సభలో ఉపన్యాసం మొదలుపెట్టినా ఆ ప్రాంగణం ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చింది.

అమరావతి గ్రాఫిక్స్ అన్నవారు

ఆ భవనాలపై ఎక్కి దూకండి

- నాకు వయసు ఒక నంబరే
- నాకున్న స్పిరిట్ జగన్‌కు లేదు
- మేడికొండూరు మండలం గుండ్లపాలెం సభలో చంద్రబాబు



సాక్షి ప్రతినిధి, గుంటూరు : అమరావతిలో పెద్ద పెద్ద భవనాలు కట్టామని, అమరావతి గ్రాఫిక్స్ అన్న మంత్రులు ఆ భవనాలు ఎక్కి దూకండని, శని విరగడ అవుతుందని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అసహనాన్ని ప్రదర్శించారు. గురువారం మేడికొండూరు మండలం గుండ్లపాలెం సభలో ఆయన మాట్లాడుతూ.. అమరావతి పెద్ద కుంభకోణం అన్నారని, కొండను తవ్వి ఎలుకను కాదుకదా కనీసం దాని బొచ్చును కూడా పట్టుకోలేదని అన్నారు. ఎన్నికలకు ముందు ఇదే రాజధాని అని జగన్ అన్నాడని, ఇక్కడే ఇల్లు కట్టుకున్నా అన్నాడని, ఎందుకు నీ ఇల్లు తగలబెట్టడానికా అంటూ అక్కసు వెళ్లగక్కారు. ఆనాడే మూడు రాజధానులు అంటే జగన్ తాట తీసేవారని అన్నారు. మనం కట్టిన అసెంబ్లీలో, మనం కట్టిన సచివాలయంలో కూర్చుని వాటిపై ఆరోపణలు చేస్తున్న ఫేక్ ఫెలో ఈ ముఖ్యమంత్రి అని అన్నారు. సత్తెనపల్లిలో అక్కడి ఎమ్మెల్యే అంబోతు ఓ బాధిత కుటుంబానికి ఐదు లక్షల పరిహారం వస్తే దానిలో కూడా వాటా అడిగాడని, వీళ్లు మనుషులా, శవాలపై చిల్లర ఏరుకునే వ్యక్తులా అని అన్నారు. ఇక్కడ ఉన్న వైసీపీ ఎంపీ ఇసుక అక్రమాలు చేస్తున్నాడని, ఇసుక డబ్బు అంతా తాడేపల్లికి పోతోందని ఆరోపించారు. వివేకా హత్యపై షర్మిల వ్యాఖ్యలకు జగన్ సిగ్గు తెచ్చుకోవాలన్నారు. జగన్ తన వయసు గురించి మాట్లాడుతున్నాడని, తనకు వయసు ఒక నంబరేనని చెప్పారు. తనకున్న స్పిరిట్ ఆయనకు లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో కుప్పంలోనూ టీడీపీ జెండా ఎగురుతుందన్నారు. ఇంట్లో జగన్ స్టిక్కర్ వేస్తే దాని పక్కన 6093 అని రాయాలని, అది జగన్ ఖైదీ నంబరని అన్నారు. జగన్ బొమ్మ ఉండాల్సింది మన గోడలపై కాదని, పోలీస్ స్టేషన్‌లో అని వ్యాఖ్యానించారు.

బాబు జీవితంలో నిజం చెప్పడు

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



సత్తెనపల్లి: ప్రతిపక్ష నేత చంద్రబాబు సత్తెనపల్లిలో ఒక్క నిజమైనా చెబుతాడేమోనని ఎదురు చూశానని, అన్నీ పచ్చి అబద్ధాలు చెప్పుకొంటూ వచ్చాడని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నిజం చెబితే ఆయన శిరస్సు వెయ్యి వక్కలైపోతుందని ఒక మునిశాపం ఉందని, అందువల్ల చంద్రబాబు జీవితంలో నిజం చెప్పడని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎప్పుడూ చెప్పేవారని గుర్తుచేశారు. చంద్రబాబు సత్తెనపల్లిలో కూడా అదే కార్యక్రమం కొనసాగించాడని ఎద్దేవా చేశారు. చంద్రబాబు సత్తెనపల్లి పర్యటన అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. 'మోదీని తిడతావు. దేశంలో బీజేపీని సర్వనాశనం చేస్తానని, ఆ పార్టీకి వ్యతిరేక శక్తుల్ని ఐక్యం చేస్తానని దేశమంతా తిరిగావు. మళ్లీ ఇప్పుడు మోదీ కాళ్లు పట్టుకుంటాననంటున్నావు. అధికారం కోసం ఎవరినైనా తిడతావు.. ఎవరితోనైనా జతకడతావు. అందితే జుట్టు.. అందక పోతే కాళ్లు పట్టుకునే నువ్వు సైకో..' అని చంద్రబాబును విమర్శించారు. చంద్రబాబు రాజకీయజీవితం అంతా ఆంబోతులకు ఆవులను సప్లై చేయడమేనని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, డాక్టర్స్ సెల్ పల్నాడు జిల్లా కన్వీనర్ డాక్టర్ గజ్జల నాగభూషణ్‌రెడ్డి మాట్లాడారు.

ఐటీ టూల్స్ దేశానికే ఆదర్శం

- ట్రేడ్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో మంత్రి బుగ్గన



సాక్షి, రాజమహేంద్రవరం/ఏలూరు (మెట్రో): పన్నుల విధింపులో అధికారుల తప్పిదాలు, ప్రభావం లేకుండా రాష్ట్రం అభివృద్ధి చేసిన టూల్స్ దేశానికే ఆదర్శమని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వెల్లడించారు. స్థానిక ఉత్పత్తులపై జీఎస్టీ కౌన్సిల్ ద్వారా వ్యాపారులకు అనువైన సంస్కరణలు, వెసులుబాట్లు తెచ్చిన ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ఆయన గుర్తు చేశారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ట్రేడ్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో మంత్రి బుగ్గన మాట్లాడారు. పన్నులకు సంబంధించి ఎదురయ్యే సాంకేతిక ఇబ్బందుల పరిష్కారంలో ఏపీ ముందంజలో ఉందన్నారు. డిపార్ట్‌మెంట్‌కు, డీలర్‌కు మధ్య మంచి సంబంధాలుండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మంత్రులు తానేటి వనిత, చెల్లుబోయిన వేణు, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ గిరిజా శంకర్, ఎంపీ వంగా గీత, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

అత్యుత్తమ ప్రమాణాలతో నిర్మాణం

రాష్ట్రంలో వివిధ శాఖల భవనాలను నిర్మించేందుకు అత్యుత్తమ ఆర్కిటెక్ట్ ప్రమాణాలను పాటిస్తున్నామని బుగ్గన రాజేంద్రనాథ్ తెలిపారు. ఏలూరులో రూ.10 కోట్లతో నిర్మించిన జిల్లా సమీకృత ఆర్థిక భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలో నూతన భవనాల నిర్మాణం కోసం ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్కిటెక్చరల్ బోర్డును ఏర్పాటు చేశామన్నారు.

తెలంగాణ

ఇక నాలుగు నెలలే సమయం

సాక్షి, హైదరాబాద్: 'ఈ ఏడాది నవంబర్‌లో రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. సెప్టెంబర్ చివరిలో లేదా అక్టోబర్‌లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే చాన్స్ ఉంది. అంటే ఎన్నికలకు కేవలం నాలుగు నెలల సమయమే ఉంది. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యేలు తమ కార్యాచరణ రూపొందించుకోవాలి. జాగ్రత్తగా లేకపోతే మీకే నష్టం' అని ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు హెచ్చరించారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర బడ్జెట్ రూ.6 లక్షల కోట్లకు చేరుతుందని, ఎన్ని కష్టాలొచ్చినా దళితబంధును కొనసాగిస్తామని ప్రకటించారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ సర్వసభ్య సమావేశంలో ప్రసంగించారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014లో 63, 2018లో 88 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించామని, ఈ ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో వందకుపైగా సీట్లు గెలుస్తామన్నారు.

జూన్ నుంచి ఎన్నికలపైనే దృష్టి

'త్వరలో ఒక్కో ఎమ్మెల్యేతో వ్యక్తిగతంగా మాట్లాడుతా. విరాళాల ద్వారా బీఆర్‌ఎస్ పార్టీ ఫండ్ రూ.1,250 కోట్లకు చేరింది. ఇందులో రూ.767 కోట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాం. దానిపై వస్తున్న వడ్డీలో నుంచి రూ.7 కోట్లను పార్టీ కార్యకలాపాల నిర్వహణ, కార్యాలయాల నిర్మాణం, ప్రచారం, మౌలిక వసతుల కల్పన కోసం ఉపయోగిస్తున్నాం. బీఆర్‌ఎస్‌ను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ నిధులతో టీవీ ప్రచార ప్రకటనలు, ఫిలిం ప్రొడక్షన్‌తోపాటు అవసరమైతే జాతీయ టీవీ చానల్‌ను కూడా నడపాలి. రాబోయే నెల రోజుల పాటు వరుసగా అధికారిక కార్యక్రమాలు ఉంటాయి. ఈ నెల 30న రాష్ట్ర సచివాలయం, మే 4న ఢిల్లీలో నిర్మిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తాం. జూన్ 1న హుస్సేన్‌సాగర్ తీరాన అమరుల స్మారకాన్ని ఆవిష్కరిస్తాం. జూన్ 2న రాష్ట్ర అవతరణ వేడుకలు జరుగుతాయి. ఆ తర్వాత ఎన్నికల దిశగా పార్టీ కార్యకలాపాలపైనే పూర్తిగా దృష్టి కేంద్రీకరించాలి' అని కేసీఆర్ చెప్పారు.

చంద్రబాబు ఊసరవెల్లిని మించి రంగులు మార్చగలడు

డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



కడప కార్పొరేషన్: ప్రతిపక్షనేత చంద్రబాబు ఊసరవెల్లిని మించి రంగులు మార్చగల సమర్థుడని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా చెప్పారు. ఆయన గురువారం కడపలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పల్నాడు జిల్లా పెదకూరపాడులోని ధరణికోటలో ముస్లింల ఆత్మీయ సమావేశం నిర్వహించిన చంద్రబాబు ముస్లిం మైనార్టీలపై ప్రేమ ఒలకబోయడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. రాబోయే ఎన్నికల్లో గద్దెనెక్కాలంటే ముస్లిం ఓట్లు అవసరమని భావించి ఎక్కడ లేని ప్రేమ కనబరుస్తున్నారని, ముస్లిం సమాజం దీన్ని గుర్తించాలని కోరారు. 1999లో, 2014లో బీజేపీతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు ముస్లింల మనోభావాలను తుంగలో తొక్కారని, వారిని పూర్తిగా అణగదొక్కారని చెప్పారు. ముస్లింలు తనకు ఓట్లు వేయలేదని, దశాబ్దాలుగా టీడీపీలో ఉన్న నేతలకు కూడా అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని గుర్తుచేశారు. తన బావమరిది బాలకృష్ణకు సీటు ఇవ్వడానికి సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనిని పక్కన పెట్టారని, ఎమ్మెల్సీ ఇస్తామని ఇవ్వకుండా అవమానించారని చెప్పారు. అదే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత మేనమామను పక్కనబెట్టి కడప టికెట్ జీవితకాలం ముస్లింలదేనని ప్రకటించిన గొప్పనేత అని కొనియాడారు. టీడీపీతో దశాబ్దాలుగా ఉన్న లాల్‌జాన్‌బాషా, ఫరూఖ్‌లను వాడుకుని వదిలేశారని, పీలేరులో కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించడానికి డాక్టర్ ఇక్బాల్‌ను బలిపశువును చేశారని గుర్తుచేశారు. 2004లో ఓడిపోయాక బీజేపీతో పొత్తు పెట్టుకొని చరిత్రాత్మక తప్పు చేశానన్న చంద్రబాబు 2014లో మళ్లీ జతకట్టారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని మేలు మన రాష్ట్రంలో వైఎస్ జగన్ హయాంలో ముస్లింలకు జరుగుతోందని చెప్పారు. రంజాన్ తోఫా, సంక్రాంతి కానుకల పేరుతో హెరిటేజ్ వస్తువులను అమ్ముకున్నారని గుర్తుచేశారు. వైఎస్ జగన్ ముస్లింలకు ఐదు ఎమ్మెల్యే సీట్లు ఇచ్చారని, వారిలో ఓడిపోయిన ఇక్బాల్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి గౌరవించారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ముస్లింలకు అన్ని సీట్లు ఇవ్వలేదన్నారు. రాష్ట్ర విభజనతో ఉర్దూ రెండో అధికార భాష హోదా కోల్పోయిందని, వైఎస్ జగన్ సీఎం అయ్యాక మాత్రమే ఆ హోదా కల్పించారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, నాయకులు నాగయ్య, సీహెచ్ వినోద్, సుబ్బారెడ్డి, కృష్ణ, షఫీ పాల్గొన్నారు.

దళితుల రాబందు చంద్రబాబు

- టీడీపీని దళితులు చీత్కరించుకున్నారు
- చంద్రబాబు, లోకేశ్ ఇప్పటికైనా వాస్తవం తెలుసుకోవాలి
- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే అనిల్‌కుమార్, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్



మాట్లాడుతున్న అనిల్‌కుమార్. పక్కన అరుణ్‌కుమార్

సాక్షి, అమరావతి: దళితుల్లో పుట్టాలని ఎవరు కోరుకుంటారని ప్రశ్నించిన చంద్రబాబు దళితుల పట్ల రాబందు అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ దుయ్యబట్టారు. అసలు దళిత బంధువు ఎవరు.. దళితుల రాబందు ఎవరనేది అసెంబ్లీలో చర్చిద్దాం.. వస్తావా బాబూ? అని సవాల్ విసిరారు. వారు గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దళితులను ఉద్ధరించానని, వారంతా తన పార్టీ వైపే ఉన్నారంటూ చంద్రబాబు హాస్యాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అసలు బాబుకు దళితుల మేలు గురించి మాట్లాడే అర్హత ఉందా? అని ప్రశ్నించారు. గతంలో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఇద్దరు దళితులకు మంత్రి పదవులిస్తే తమ ప్రభుత్వం ఐదు మంత్రి పదవులిచ్చిందని చెప్పారు. రెండుసార్లు హోంశాఖ, రెండుసార్లు డిప్యూటీ సీఎం పదవులు ఇచ్చినట్లు తెలిపారు. బాబు హయాంలో కార్పొరేషన్ చైర్మన్ పదవులు నాలుగు మాత్రమే ఇస్తే.. ఇప్పుడు 15 మందికి చైర్మన్ పదవుల్ని కట్టబెట్టినట్లు చెప్పారు. 43 మంది ఎమ్మెల్సీలుంటే అందులో 22 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలని పేర్కొన్నారు. దీన్ని అంబేడ్కర్ విజన్.. ఆలోచనగా ఎవరైనా చెబుతారన్నారు. అందుకే పేదోళ్ల పెద్దబిడ్డ తమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చరిత్రలో నిలిచిపోతారని చెప్పారు. 2047 కల్లా పేదరికం లేని సమాజాన్ని తెస్తానని చంద్రబాబు చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. పేదరికం లేని సమాజం కోసం సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక ఇప్పటికి సుమారు రూ.2.8 లక్షల కోట్లను పేదల మేలుకోసం పంపిణీ చేశారని వివరించారు. చంద్రబాబు ఎన్ని అబద్ధాలు ఆడినా దళితులెవరూ ఆయన్ని నమ్మరన్నారు.

డీఎన్ఏలోనే లోపం ఉంది

బాబు, లోకేశ్ డీఎన్ఏలోనే లోపముందని పేర్కొన్నారు. తండ్రేమో 'ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా?' అని, కొడుకేమో 'దళితులు పీకిందేమీ లేదు' అని అంటారని గుర్తుచేశారు. ఇప్పటికైనా బాబు దళితుల గురించి మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గరపెట్టుకోవాలని సూచించారు. తమ ప్రభుత్వం వచ్చాక 28 దళిత పథకాల్ని తొలగించామని చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారన్నారు. రాష్ట్రంలో ఎస్సీ రిజర్వుడు సీట్లు 29 ఉంటే, వాటిల్లో 28 చోట్ల టీడీపీని ప్రజలు ఎందుకు ఓడించారో బాబు, లోకేశ్ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. టీడీపీని దళితులు చీత్కరించుకుంటున్నారనే వాస్తవాన్ని తెలుసుకోవాలన్నారు. సబ్‌ప్లాన్ కింద చంద్రబాబు ఐదేళ్లలో రూ.33 వేలకోట్లు ఖర్చు పెడితే.. తమ ప్రభుత్వం ఈ నాలుగేళ్లలోనే రూ.53 వేలకోట్లు ఖర్చుపెట్టిందని చెప్పారు. దళితులు 2024 ఎన్నికల్లో కూడా టీడీపీని ఓడించి బుద్ధిచెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని వారు పేర్కొన్నారు.

ఫ్రీగా.. వెరైటీగా...





పలాజో ప్యాంట్, ఖఫ్తాన్ టాప్ క్యాజువల్ లుక్‌తో కట్టడి చేస్తుంది.

ప్రింట్ అండ్ ఎంబ్రాయిడరీ కాంబినేషన్‌తో ఉండే ఖఫ్తాన్స్ ఈవెనింగ్ పార్టీలో స్పెషల్‌గా అట్రాక్ట్ చేస్తుంది.



హై–లో ఖఫ్తాన్ సెట్ గెట్ టు గెదర్ పార్టీలో గ్రాండ్‌గా వెలిగిపోతుంది.



ప్రింటెడ్, ప్లెయిన్ లాంగ్ ఖఫ్తాన్ డిజైన్ సెట్ చేసుకుంటే దానికి తగిన ఇతర అలంకరణలో పార్టీలో ప్రత్యేకంగా వెలిగిపోవచ్చు.



వెల్వెట్ క్లాత్‌కి లేస్ అందం ఎంబ్రాయిడరీ జిలుగులు జత చేస్తే సంప్రదాయ వైభవం కళ్లకు కడుతుంది.



ముందు వైపు తక్కువ పొడవు, వెనకవైపు పాదాలను అంటేలా ఉండే ఖఫ్తాన్ రాయల్టీ లుక్‌తో అట్రాక్ట్ చేస్తుంది.

వేడి కాలం.. ఉక్కపోత కాలం..
వదులైన దుస్తులను ఎంచుకునే కాలం.
కానీ, స్టైలిష్‌గా లేకపోతే
స్పెషల్ లుక్‌తో కనిపించకపోతే
డల్‌గా మనలేం అనుకునేవారు
ఈజీగా సెలక్ట్ చేసుకునే
డ్రెస్ ఖఫ్తాన్.
సింగిల్‌పీస్ డ్రెస్‌గా పేరున్న
ఖఫ్తాన్ స్టైల్‌కి
బోలెడన్ని హంగులు ఉన్నాయి.

పలాజో, ధోతీ, జీన్స్, ట్రౌజర్, లెగ్గింగ్, జెగ్గింగ్.. ఇలా బాటమ్ ఏదైనా ఖఫ్తాన్ టాప్ సరైన ఎంపిక అవుతుంది. లేదంటే లాంగ్ ఖఫ్తాన్‌తో కంఫర్ట్‌లుక్‌లోకి ఈజీగా మారిపోవచ్చు. ఇతర అలంకరణలేవీ లేకుండా హాయిగా వేసవిని మరింత స్టైలిష్‌లుక్‌తో మెరిపించవచ్చు.

కొత్త దారి

ఉద్యోగ పర్వం

రీస్టార్ట్

ఉద్యోగం ఊరికే ఎవరూ మానెయ్యరు.
సవాలక్ష కారణాలు ఉండవచ్చు.
ఉద్యోగం మానేయడం ఎంత తేలికో, తిరిగి ఉద్యోగంలో చేరడం అంత కష్టం.
ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని మహిళలు తమ కెరీర్‌ను రీస్టార్ట్ చేయడానికి బెంగళూరు కేంద్రంగా 'జాబ్స్ ఫర్ హర్' ప్లాట్‌ఫామ్‌కు శ్రీకారం చుట్టింది నేహా బగరియా.
ఆ ప్లాట్‌ఫామ్‌ను 'హర్ కీ' పేరుతో రీబ్రాండ్ చేసి రెండడుగులు ముందుకు వేసింది నేహా...

రకరకాల కారణాల వల్ల ఉద్యోగాలు మానేస్తున్న మహిళలు ఎంతోమంది ఉన్నారు. కరోన కరకు కాలంలో ఉద్యోగం మానేసిన వారిలో మహిళలే ఎక్కువగా ఉన్నారు. అలా ఉద్యోగాలు మానేసిన వారు కెరీర్ రీస్టార్ట్ చేయడానికి తనవంతు ప్రయత్నం చేస్తోంది నేహా బగరియా.



నేహా బగరియా

అమెరికాలోని వార్టన్ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ చేసిన నేహా హెచ్ ఆర్‌లో ఫైనాన్స్, మార్కెటింగ్ రంగాలలో పనిచేసింది.

2010లో తన కెరీర్‌కు బ్రేక్ వచ్చింది.

తిరిగి మూడు సంవత్సరాల తరువాత ఉద్యోగంలో చేరింది. 'కెరీర్ రీస్టార్ట్ చేయకపోతే ఎంతో నష్టపోయేదాన్ని' అని తనలో తాను అనుకుంది. అదే సమయంలో ఉద్యోగాలు మానేసి ఇంటికే పరిమితమైన ఎంతోమంది మహిళా ఉద్యోగులు గుర్తుకు వచ్చారు.

వారు అనాసక్తతతోనో, వ్యతిరేకతతోనో ఉద్యోగాలు మానేసి ఉండరు.

ఒకానొక నిర్దిష్టమైన సమయంలో తప్పనిసరి పరిస్థితులలో ఉద్యోగం మానేసి ఉంటారు. వారు తిరిగి ఉద్యోగంలో చేరాలకుంటున్నా దారి కనిపించి ఉండదు.

'పురుషులతో పోల్చితే మహిళలకు ఉద్యోగ అవకాశాలు అనే కిటికీ చాలా చిన్నది' అంటుంది నేహా.

కొన్ని కంపెనీలు అప్పుడే కాలేజీ విద్యను పూర్తి చేసుకున్న అమ్మాయిలకే ఉద్యోగ అవకాశాలు ఇవ్వడానికి ప్రాధాన్యత ఇస్తున్నాయి. కుటుంబ బాధ్యతల వల్ల ఉద్యోగ విధులు సరిగ్గా నిర్వహించలేరేమో అనే భయం వల్ల పెళ్లయిన మహిళలకు ఉద్యోగం ఇవ్వడానికి వెనకాడుతున్నారు. అయితే అది అపోహ అని చరిత్ర చెబుతూనే ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని 'జాబ్స్ ఫర్ హర్' అనే ఆన్‌లైన్ పోర్టల్ స్టార్ట్ చేసింది నేహా.

ఉద్యోగం మానేసిన ఎంతోమంది మహిళలు తిరిగి ఉద్యోగంలో చేరడానికి ఈ ప్లాట్‌ఫామ్ ఎంతో ఉపయోగపడింది. కంపెనీలకు, ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న మహిళలకు మధ్య వారధిగా మారింది.

'తమను తాము తిరిగి నిరూపించుకోవాలనే పట్టుదల చాలామంది మహిళలలో కనిపించింది' అంటుంది నేహా.

'జాబ్స్ ఫర్ హర్' ద్వారా ఉద్యోగంలో చేరిన మహిళలలో ముంబైకి చెందిన శ్రీప్రియ ఒకరు.

'వ్యక్తిగత కారణాల వల్ల ఉద్యోగం మానేసిన నేను కాస్త ఆలస్యంగా అయినా తిరిగి ఉద్యోగం చేయాలనే నిర్ణయం తీసుకున్నాను. అయితే అది అంత సులువైన విషయం కాదని తెలిసిపోయింది. ఈ పరిస్థితులలో జాబ్స్ ఫర్ హర్ చుక్కానిలా కనిపించింది' అంటుంది శ్రీప్రియ.

కొంత కాలం తరువాత...

'జాబ్స్ ఫర్ హర్' వెంచర్‌ను 'హర్ కీ' పేరుతో రీబ్రాండ్ చేసింది నేహా.


'హర్ కీ'కి కలారీ క్యాపిటల్, 360 వన్ ఎసెట్... మొదలైన సంస్థలు ఫండింగ్ చేశాయి.

'ఉద్యోగం మానేసిన మహిళలలో ఎనభై శాతం మంది తిరిగి ఉద్యోగం చేయాలనుకుంటున్నారు. అలాంటి వారికి హర్ కీ కొత్త దారి చూపుతుంది' అంటోంది '360 వన్ ఎసెట్' సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నిధి గుమాన్.

వంటిల్లు

మ్యాంగో మెనూ

వేసవి అతిథి అందరిళ్లకూ వచ్చేసింది.
వంటగదిలో తన స్థానాన్ని పదిలపరుచుకుంది.
'మీరేదైనా వండండి... అందులో నేనుంటా...'
అని మారాం చేస్తోంది మామిడికాయ.
కచ్చాపచ్చాగా కారంకారంగా రోటి పచ్చడవుతుంది.
అన్నంలో కలిసి పుల్లపుల్లగా పులిహోరవుతుంది.
ఎండ నుంచి సేదదీర్చే ఆమ్ పన్నా అవుతుంది.
రొయ్యలతో జతకట్టి ఘుమఘుమలాడుతుంది.
పండే లోపు ఇలా వండుకోండని చెబుతోంది.



మ్యాంగో పులిహోర

కావలసినవి:
బియ్యం– రెండు కప్పులు ;
మామిడికాయ తురుము – కప్పు ; పసుపు– టీ స్పూన్
ఉప్పు– టీ స్పూన్ లేదా రుచిని బట్టి.

పోపు కోసం: నూనె– 2 టేబుల్ స్పూన్‌లు ; వేరుశనగ పప్పు – టేబుల్ స్పూన్ ; ఆవాలు – టీ స్పూన్ ; శనగపప్పు – అర టేబుల్ స్పూన్ ; మినప్పప్పు – టీ స్పూన్ ; ఇంగువ – అర టీ స్పూన్ ; ఎండు మిర్చి– 2 ; పచ్చిమిర్చి– 2 ; కరివేపాకు రెమ్మలు– 4.

తయారీ: ● బియ్యం కడిగి అన్నం పలుకుగా వండి వెడల్పు పాత్రలోకి మార్చాలి. వేడి తగ్గిన తరవాత అర టీ స్పూన్ పసుపు వేసి గరిటెతో కలియ తిప్పి అన్నాన్ని పూర్తిగా చల్లారనివ్వాలి. తర్వాత అన్నంలో ఉప్పు, మామిడి తురుము వేసి కలపాలి. ● బాణలిలో నూనె వేడి చేసి అందులో వేరుశనగ పప్పు దోరగా వేయించి తీసి పక్కన పెట్టుకోవాలి. అదే బాణలిలో ఆవాలు, ఎండుమిర్చి, పచ్చి శనగపప్పు, మినప్పప్పు వేసి దోరగా వేయించాలి. ఇప్పుడు పచ్చిమిర్చి, ఇంగువ, పసుపు, కరివేపాకు వేసి స్టవ్ ఆపేయాలి. ఈ పోపు అంతటినీ అన్నం–మామిడి తురుములో వేసి సమంగా కలిసే వరకు గరిటెతో జాగ్రత్తగా (అన్నం ముద్ద కాకుండా) కలపాలి. ఇప్పుడు వేయించి పక్కన పెట్టుకున్న వేరుశనగపప్పు వేసి కలిపి వడ్డించాలి.



రోస్టెడ్ ఆమ్ పన్నా

కావలసినవి: మామిడి కాయలు – 3 ; పుదీన ఆకులు– పావు కప్పు ; జీలకర్ర పొడి– టీ స్పూన్ (జీలకర్రను వేయించి పొడి చేయాలి) ; బ్లాక్ సాల్ట్ – అర టీ స్పూన్ ; చక్కెర – కప్పు.

తయారీ: ● మామిడి కాయలను శుభ్రంగా కడిగి తేమ లేకుండా తుడవాలి. ● స్టవ్ మీద గ్రిల్ పెట్టి మామిడి కాయలను సన్న మంట మీద (బొగ్గుల్లో కాల్చినట్లు) కాల్చాలి. అన్ని వైపులా కాలిన తర్వాత పక్కన పెట్టి చల్లారనివ్వాలి. చల్లారిన తర్వాత తొక్కు ఒలిచి కాయను (గుజ్జును) చాకుతో ముక్కలు చేయాలి. ఇలా మూడు కాయల గుజ్జును ఒక పాత్రలో వేసుకోవాలి. అందులో పుదీన, జీలకర్ర పొడి, నల్ల ఉప్పు, చక్కెర వేసి స్పూన్‌తో కానీ హ్యాండ్ బ్లెండర్‌తో కానీ కలపాలి. మామిడి గుజ్జు, చక్కెర మొత్తం కరిగి మృదువుగా వచ్చేవరకు బ్లెండ్ చేయాలి. చేత్తో కలపడం కుదరకపోతే మిక్సీలో బ్లెండ్ చేయవచ్చు. ఆమ్ పన్నా రెడీ. తయారీలో నీరు వేయరాదు. ● తేమ లేని సీసాలో నిల్వ చేసుకోవాలి. గ్లాసునీటికి మూడు టేబుల్ స్పూన్‌ల ఆమ్ పన్నా కలుపుకోవాలి. ఇష్టమైతే తాజా పుదీనతో గార్నిష్ చేసుకోవచ్చు.

గమనిక: ● మామిడి గుజ్జుకు రెండింతలు చక్కెర ఉండాలి. గుజ్జు కొలతను బట్టి చక్కెర మోతాదు మార్చుకోవాలి. ● మామిడి రకాలను బట్టి పీచు ఎక్కువ – తక్కువ ఉంటుంది. బ్లెండ్ చేసిన తర్వాత కూడా పీచు ఎక్కువగా అనిపిస్తే వడపోసుకోవాలి. ● ఆమ్ పన్నాని ఫ్రిజ్‌లో పెట్టకపోయినా సరే తేమ తగలకుండా వాడితే వారం రోజులు తాజాగా ఉంటుంది. మామిడి పండే లోపు తాగ గలిగిన మ్యాంగో జ్యూస్ ఆమ్ పన్నా. ఇది మహారాష్ట్ర స్పెషల్. ● మామిడికాయలను కాల్చడం సాధ్యం కాకపోతే ఉడికించి కూడా చేసుకోవచ్చు.



ప్రాన్స్–మ్యాంగో కర్రీ (కేరళ స్టైల్)

కావలసినవి: రొయ్యలను మారినేట్ చేయడానికి: రొయ్యలు – 500 (పొట్టు వలిచినవి) ; పసుపు – అర టేబుల్ స్పూన్ ; మిరప్పొడి – టేబుల్ స్పూన్ ; నిమ్మరసం – టేబుల్ స్పూన్ ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; జీడిపప్పు – పది.

కొబ్బరి మసాలా కోసం: కొబ్బరి తురుము – అర కప్పు ; చింతపండు – చిన్న నిమ్మకాయంత ; ఎండు మిర్చి– 3 ; ధనియాలు – అర టీ స్పూన్ ; ఉల్లిపాయ ముక్కలు – పావు కప్పు.

గ్రేవీ కోసం: పసుపు – అర టీ స్పూన్ ; మిరప్పొడి – అర టీ స్పూన్ ; కరివేపాకు రెమ్మలు – 2 ; పచ్చి మామిడి కాయ – 1 ; కొబ్బరి పాలు – కప్పు ; నూనె– టీ స్పూన్.

తయారీ: ● రొయ్యలను పొట్టు వలిచిన తరవాత శుభ్రంగా కడగాలి. పసుపు, ఉప్పు వేసి రుద్ది నీటితో శుభ్రం చేస్తే జిగట, వాసన వదులుతుంది. ఆ తరవాత రొయ్యలను ఒక పాత్రలో వేసి అందులో పసుపు, మిరప్పొడి, నిమ్మరసం, ఉప్పు వేసి కలిపి అరగంట సేపు పక్కన ఉంచాలి. ● పచ్చి మామిడి కాయను చెక్కు, టెంక లేకుండా ముక్కలు చేయాలి. ● కొబ్బరి తురుము, చింతపండు, ఎండు మిర్చి, ధనియాలు, ఉల్లిపాయ ముక్కలను మిక్సీ జార్‌లో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ● బాణలిలో నూనె వేడి చేసి జీడిపప్పు వేయించి పక్కన పెట్టుకోవాలి. అదే బాణలిలో పసుపు, మిరప్పొడి, కరివేపాకు, కొబ్బరి మసాలా పేస్ట్ వేసి ఐదు నిమిషాల సేపు సన్న మంట మీద వేగనివ్వాలి. ఇప్పుడు మారినేట్ చేసిన రొయ్యల మిశ్రమం, మామిడి ముక్కలు వేసి కలపాలి. మిశ్రమం ఉడకడం మొదలైన తర్వాత కొబ్బరి పాలు పోసి కలిపి సన్న మంట మీద ఉడకనివ్వాలి. ఐదారు నిమిషాలకు మసాలాలన్నీ కలిసి గ్రేవీ చిక్కబడుతుంది. రుచి చూసుకుని అవసరమైతే కొద్దిగా నీటిని పోసి వేడయ్యే వరకు మరిగించి జీడిపప్పు కలిపి దించేయాలి. ఇది అన్నం, చపాతీలోకి రుచిగా ఉంటుంది.



మామిడి కాయ రోటి పచ్చడి

కావలసినవి: మామిడి కాయలు – 3 (మీడియం సైజువి) ; ఎండు మిర్చి– 15 ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; ఆవాలు – అర టీ స్పూన్ ; ధనియాలు – అర టీ స్పూన్ ; ఇంగువ – చిటికెడు ; నూనె– టేబుల్ స్పూన్.

పోపు కోసం: ఆవాలు – అర టీ స్పూన్ ; మెంతులు – అర టీ స్పూన్ ; ఎండు మిర్చి– 2 ; పచ్చి శనగ పప్పు – టీ స్పూన్ ; ఇంగువ – చిటికెడు ; కరివేపాకు – 2 రెమ్మలు ; వెల్లుల్లి రేకలు– 4.

తయారీ: ● మామిడి కాయలను శుభ్రం చేసి ముక్కలు చేయాలి. ● బాణలిలో నూనె వేడి చేసి ఎండుమిర్చి, ఆవాలు, ధనియాలు వేసి వేయించి చివరగా ఇంగువ వేసి దించేయాలి. ● ఎండు మిర్చి వేడి తగ్గిన తరవాత రోలు లేదా మిక్సీలో వేసి పొడి చేయాలి. అందులో మామిడి ముక్కలు వేసి గ్రైండ్ చేయాలి. చివరగా ఉప్పు కలిపి ఒకసారి తిప్పి గిన్నెలోకి తీసుకోవాలి. ● ఎండుమిర్చి వేయించిన బాణలిలో మిగిలిన నూనెలో పోపు కోసం తీసుకున్న ఆవాలు, మెంతులు, పచ్చి శనగపప్పు వేసి వేయించాలి. అవి వేగిన తర్వాత ఇంగువ, కరివేపాకు, వెల్లుల్లి రేకలు వేసి దించేయాలి. ఈ పోపును మిక్సీలో వేసి సిద్ధంగా ఉంచిన మామిడికాయ పచ్చడిలో వేసి కలపాలి.

ఇంటిప్స్

గ్యాస్ స్టవ్ క్లీనింగ్



గోరువెచ్చని నీటిలో కొంచెం సర్ఫ్ బాగా కలిపి స్పాంజి ముంచి గ్యాస్ స్టవ్ టాప్ ని శుభ్రం చేయాలి. ఆ తర్వాత శుభ్రమైన పొడి వస్త్రంతో తుడవాలి. ఆ తర్వాత గ్లాస్ స్టవ్ మీద బేకింగ్ సోడా చల్లి నిమ్మకాయ తొక్కతో శుభ్రం చేయాలి. బేకింగ్ సోడా, నిమ్మకాయ కఠినమైన మరకలను తొలగించటమే కాకుండా మురికిని, జిడ్డును తొలగిస్తాయి.

ఒక గిన్నెలో నీటిని పోసి డిష్ సోప్, బేకింగ్ సోడా సమాన భాగాలుగా వేసి బాగా కలిపి దానిలో బర్నర్ స్టాండ్స్ ఉంచాలి. 15 నిమిషాలు అయ్యాక శుభ్రమైన నీటితో కడిగితే జిడ్డు అంతా తొలగిపోయి శుభ్రంగా మారుతాయి.

బేకింగ్ సోడా, ఉప్పు సమాన భాగాలుగా తీసుకుని నీటితో పేస్ట్‌లా తయారు చేయాలి. ఈ పేస్ట్‌ని గ్యాస్ స్టవ్ టాప్ మీద, బర్నర్స్ స్టాండ్ కి రాసి పది నిమిషాలు అలా వదిలేయాలి. ఆ తర్వాత నీటితో శుభ్రం చేస్తే జిడ్డు, మరకలు, మురికి అన్ని తొలగిపోతాయి. పైన చెప్పుకున్న పద్ధతులలో మీకు సులువుగా అనిపించిన దానిని అనుసరించవచ్చు.



ఐపీఎల్ టోర్నీకి సుందర్ దూరం

తొడ కండరాల గాయంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఆల్‌రౌండర్, భారత క్రికెటర్ వాషింగ్టన్ సుందర్ ఐపీఎల్ టోర్నీలో మిగిలిన మ్యాచ్‌లకు దూరమయ్యాడు. తమిళనాడుకు చెందిన 23 ఏళ్ల సుందర్ ఈ ఐపీఎల్ సీజన్‌లో ఏడు మ్యాచ్‌లు ఆడి 60 పరుగులు చేసి, మూడు వికెట్లు పడగొట్టాడు. గత రెండు ఐపీఎల్ సీజన్లలోనూ సుందర్ గాయాలబారిన పడ్డాడు. చేతి వేలి గాయంతో 2021 ఐపీఎల్ యూఏఈ దశ మ్యాచ్‌లకు... 2022లో నాలుగు ఐపీఎల్ మ్యాచ్‌లకు సుందర్ దూరమయ్యాడు.



బోపన్న జోడీ శుభారంభం

మాడ్రిడ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. మాడ్రిడ్‌లో గురువారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో ఏడో సీడ్ బోపన్న–ఎబ్డెన్ ద్వయం 6–3, 7–6 (7/4)తో రొబెర్టో బాటిస్టా అగుట్ (స్పెయిన్)–డేనియల్ ఇవాన్స్ (బ్రిటన్) జోడీపై విజయం సాధించింది. 78 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న, ఎబ్డెన్ పది ఏస్‌లు సంధించడంతోపాటు, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశారు.

గ్రేడ్ 'సి'లో మేఘన, అంజలి

బీసీసీఐ మహిళా క్రికెటర్ల కాంట్రాక్టులు


సబ్బినేని మేఘన


అంజలి శర్వాణి

ముంబై: భారత మహిళల జట్టు తరఫున నిలకడగా రాణిస్తున్న ఇద్దరు ఆంధ్ర ప్రదేశ్ క్రికెటర్లు సబ్బినేని మేఘన, అంజలి శర్వాణిలకు తొలిసారి బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ లభించింది. కొత్తగా ప్రకటించిన జాబితాలో వీరిద్దరికి గ్రేడ్ 'సి'లో చోటు దక్కింది. బ్యాటర్ మేఘన ఇప్పటి వరకు భారత్ తరఫున 3 వన్డేలు, 17 టి20లు ఆడగా... లెఫ్టార్మ్ పేసర్ అంజలి 6 టి20ల్లో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. మూడు గ్రేడ్‌లలో కలిపి మొత్తం 17 మందితో బోర్డు వార్షిక కాంట్రాక్ట్ జాబితాను ప్రకటించింది. గ్రేడ్ 'ఎ'లో ఇప్పటి వరకు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన మాత్రమే ఉండగా కొత్తగా ఆల్‌రౌండర్ దీప్తి శర్మకు అవకాశం లభించింది. మే 2021 తర్వాత మహిళా క్రికెటర్లకు కాంట్రాక్టులు ప్రకటించడం ఇదే తొలిసారి. గత జాబితాలో ఉండి ప్రస్తుతం రిటైర్ అయిన మిథాలీ రాజ్, జులన్ గోస్వామిలతో పాటు పూనమ్ యాదవ్‌ను కూడా తప్పించగా... 'బి' గ్రేడ్ జాబితాను 10నుంచి ఐదుకు కుదించారు. ప్రస్తుతం జట్టులో కీలకంగా మారిన రేణుకా ఠాకూర్, రిచా ఘోష్‌లకు ప్రమోషన్ దక్కగా, పూజ వస్త్రకర్ 'బి' నుంచి 'సి'కి పడిపోయింది.

కాంట్రాక్టుల జాబితా

గ్రేడ్ 'ఎ' (రూ. 50 లక్షలు): హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన, దీప్తి శర్మ.
గ్రేడ్ 'బి' (రూ. 30 లక్షలు): రేణుకా ఠాకూర్, జెమీమా రోడ్రిగ్స్, షఫాలీ వర్మ, రిచా ఘోష్, రాజేశ్వరి గైక్వాడ్. **గ్రేడ్ 'సి' (రూ. 10 లక్షలు):** మేఘనా సింగ్, దేవిక వైద్య, సబ్బినేని మేఘన, అంజలి శర్వాణి, పూజ వస్త్రకర్, స్నేహ్ రాణా, రాధా యాదవ్, హర్లీన్ డియోల్, యస్తిక భాటియా.

క్వార్టర్ ఫైనల్లో సింధు



దుబాయ్: ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో మూడో పతకానికి భారత స్టార్ షట్లర్ పీవీ సింధు విజయం దూరంలో నిలిచింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధు 21–12, 21–15తో తొమ్మిదో ర్యాంకర్ హాన్ యువె (చైనా)పై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి చేరింది. హాన్ యువెపై సింధుకిది నాలుగో విజయం కావడం విశేషం. 2014, 2022లలో సెమీఫైనల్లో ఓడి కాంస్య పతకాలు నెగ్గిన సింధు నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో అన్ సె యంగ్ (దక్షిణ కొరియా)తో ఆడుతుంది. గతంలో అన్ సె యంగ్‌తో ఆడిన ఐదుసార్లూ సింధు ఓడిపోయింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ 21–16, 5–21, 21–18తో చికో ఔరా ద్వి వర్దాయో (ఇండోనేసియా)పై నెగ్గగా... కిడాంబి శ్రీకాంత్ 14–21, 22–20, 9–21తో కొడాయ్ నరోకా (జపాన్) చేతిలో ఓడిపోయాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో సియో సెయుంగ్ జే–చె యు జంగ్ (దక్షిణ కొరియా) జోడీ నుంచి సిక్కి రెడ్డి–రోహన్ కపూర్ (భారత్) జంటకు వాకోవర్ లభించడంతో క్వార్టర్ ఫైనల్ చేరింది. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం 21–13, 21–11తో జిన్ యోంగ్–నా సంగ్ సెంగ్ (కొరియా) జోడీపై గెలిచింది. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ జంట గాయం కారణంగా బరిలోకి దిగకుండా ప్రత్యర్థి జోడీకి వాకోవర్ ఇచ్చింది.

రాజస్తాన్ ధనాధన్

- చెన్నైపై 32 పరుగులతో జయభేరి
- మెరిపించిన యశస్వి
- కూల్చేసిన జంపా, అశ్విన్
- దూబే పోరాటం వృథా


యశస్వి


జైపూర్: అప్పుడు చెన్నైలో... ఇప్పుడు సొంత ఇలాకాలో రాజస్తాన్ రాయల్స్ తమ ఆధిపత్యాన్ని కొనసాగించింది. గురువారం జరిగిన ఐపీఎల్ పోరులో రాయల్స్ 32 పరుగుల తేడాతో చెన్నై సూపర్‌కింగ్స్‌పై జయభేరి మోగించింది. మొదట రాజస్తాన్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 202 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' యశస్వి జైస్వాల్ (43 బంతుల్లో 77; 8 ఫోర్లు, 4 సిక్సర్లు) రాణించగా, తుషార్ దేశ్‌పాండే 2 వికెట్లు తీశాడు. అనంతరం చెన్నై 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 170 పరుగులే చేసింది. శివమ్ దూబే (33 బంతుల్లో 52; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), రుతురాజ్(29 బంతుల్లో 47; 5 ఫోర్లు, 1 సిక్స్) దూకుడు కనబరిచారు. స్పిన్నర్ ఆడమ్ జంపా (3/22), అశ్విన్ (2/35) తిప్పేశారు.

విరుచుకుపడిన యశస్వి

రాజస్తాన్ ఇన్నింగ్స్‌ను ఓపెనర్ యశస్వి జైస్వాల్ తొలి బంతి నుంచే దూకుడుగా నడిపించాడు. ఆకాశ్ సింగ్ మొదటి ఓవర్లో మూడు బౌండరీలు బాదిన అతను మళ్లీ మూడో ఓవర్ వేసేందుకు వస్తే 4, 0, 6, 0, 4, 4లతో 18 పరుగులు పిండుకున్నాడు. బట్లర్ కూడా ఫోర్లు బాదడంతో పవర్‌ప్లేలో రాయల్స్ 64/0 స్కోరు చేసింది. ఏడో ఓవర్లోనే జైస్వాల్ ఫిఫ్టీ (26 బంతుల్లో) పూర్తయ్యింది. కాసేపటికి బట్లర్ (21 బంతుల్లో 27; 4 ఫోర్లు) అవుటైనా... సంజూ సామ్సన్ (17)తో కలిసి యశస్వి తన జోరుకొనసాగించాడు. అయితే 14వ ఓవర్లో తుషార్ వీరిద్దరిని అవుట్ చేయగా, హిట్టర్ హెట్‌మైర్ (8) విఫలమయ్యాడు. ఈ దశలో స్కోరు వేగం మందగించగా... మళ్లీ డెత్ ఓవర్లలో ధ్రువ్ జురెల్ (15 బంతుల్లో 34; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), పడిక్కల్ (13 బంతుల్లో 27 నాటౌట్; 5 ఫోర్లు) దంచేయడంతో స్కోరు 200 దాటింది.

చెన్నై చతికిల...

కొండంత లక్ష్యం ఛేదించాల్సిన జట్టుకు మెరుగైన ఆరంభం కావాలి. కానీ రుతురాజ్‌కు తోడుగా దిగిన ఓపెనర్ కాన్వే (8), టాపార్డర్‌లో వచ్చిన రహానే (15) విఫలమయ్యారు. 11వ ఓవర్లోనే 73 పరుగుల వద్ద అంబటి రాయుడు (0) రూపంలో నాలుగో వికెట్ పడిపోవడంతోనే చెన్నై చతికిల పడింది. ఆరంభంలో ఓపెనర్ రుతురాజ్ తన ధాటిని కొనసాగించాడు. ఆ తర్వాత వచ్చిన వారిలో ఒక్క దూబే తప్ప ఇంకెవరూ అలా ఆడలేక పోయారు. అయితే వీళ్లిద్దరి మెరుపులు అంతపెద్ద లక్ష్యానికి ఏ మాత్రం సరిపోలేదు. మొయిన్ అలీ (12 బంతుల్లో 23; 2 ఫోర్లు, 2 సిక్సర్లు), రవీంద్ర జడేజా (15 బంతుల్లో 23 నాటౌట్; 3 ఫోర్లు) మోస్తరు స్కోరే చేశారు.


జంపా

స్కోరు వివరాలు

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (సి) రహానే (బి) తుషార్ 77; బట్లర్ (సి) దూబే (బి) జడేజా 27; సామ్సన్ (సి) రుతురాజ్ (బి) తుషార్ 17; హెట్‌మైర్ (బి) తీక్షణ 8; ధ్రువ్ (రనౌట్) 34; పడిక్కల్ (నాటౌట్) 27; అశ్విన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 202. వికెట్ల పతనం: 1–86, 2–125, 3–132, 4–146, 5–194. బౌలింగ్: ఆకాశ్ 2–0–32–0, తుషార్ 4–0–42–2, తీక్షణ 4–0–24–1, జడేజా 4–0–32–1, మొయిన్ అలీ 2–0–17–0, పతిరణ 4–0–48–0.

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (సి) పడిక్కల్ (బి) జంపా 47; కాన్వే (సి) సందీప్ (బి) జంపా 8; రహానే (సి) బట్లర్ (బి) అశ్విన్ 15; దూబే (సి) బట్లర్ (బి) కుల్దీప్ 52; రాయుడు (సి) హోల్డర్ (బి) అశ్విన్ 0; మొయిన్ అలీ (సి) సామ్సన్ (బి) జంపా 23; జడేజా (నాటౌట్) 23; ఎక్స్‌ట్రాలు 2; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 170. వికెట్ల పతనం: 1–42, 2–69, 3–73, 4–73, 5–124, 6–170. బౌలింగ్: సందీప్ శర్మ 4–0–24–0, కుల్దీప్ యాదవ్ 3–0–18–1, హోల్డర్ 4–0–49–0, అశ్విన్ 4–0–35–2, ఆడమ్ జంపా 3–0–22–3, చహల్ 2–0–21–0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	8	5	3	10	0.939
గుజరాత్	7	5	2	10	0.580
చెన్నై	8	5	3	10	0.376
లక్నో	7	4	3	8	0.547
బెంగళూరు	8	4	4	8	-0.139
పంజాబ్	7	4	3	8	-0.162
కోల్‌కతా	8	3	5	6	-0.027
ముంబై	7	3	4	6	-0.620
హైదరాబాద్	7	2	5	4	-0.725
ఢిల్లీ	7	2	5	4	-0.961

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ x లక్నో (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

మదుష్కా, కుశాల్ మెండిస్ డబుల్ సెంచరీలు


మదుష్కా


మెండిస్

గాలె: ఐర్లాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌ను 3 వికెట్లకు 704 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 357/1తో నాలుగో రోజు ఆట కొనసాగించిన శ్రీలంక రెండు వికెట్లు చేజార్చుకొని 347 పరుగులు సాధించింది. నిషాన్ మదుష్కా (339 బంతుల్లో 205; 22 ఫోర్లు, 1 సిక్స్), కుశాల్ మెండిస్ (291 బంతుల్లో 245; 18 ఫోర్లు, 11 సిక్స్‌లు) కెరీర్‌లో తొలిసారి డబుల్ సెంచరీలు సాధించారు. వీరిద్దరు రెండో వికెట్‌కు 268 పరుగులు జోడించారు. ఏంజెలో మాథ్యూస్ (114 బంతుల్లో 100 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీ పూర్తి కాగానే లంక ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. టెస్టు ఇన్నింగ్స్‌లో శ్రీలంక 700 అంతకంటే ఎక్కువ పరుగులు చేయడం ఇది ఏడోసారి కావడం విశేషం. 212 పరుగులతో వెనుకబడిన రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఐర్లాండ్ ఆట ముగిసే సమయానికి 2 వికెట్లకు 54 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే మ్యాచ్ చివరిరోజు శుక్రవారం ఐర్లాండ్ మరో 158 పరుగులు చేయాలి.

'భారత్ పరువు పోతోంది'

- రెజ్లర్లకు క్రమశిక్షణ లేదు
- ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష వివాదాస్పద వ్యాఖ్యలు




వినేశ్, సాక్షి

న్యూఢిల్లీ: తమకు న్యాయం చేయాలంటూ దేశ రాజధానిలో ఐదు రోజులుగా నిరసన కొనసాగిస్తున్న అగ్రశ్రేణి రెజ్లర్లకు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) నుంచి అనూహ్య స్పందన ఎదురైంది. వారి తీరును తప్పుపడుతూ ఐఓఏ అధ్యక్షురాలు, దిగ్గజ అథ్లెట్ పీటీ ఉష వివాదాస్పద వ్యాఖ్యలు చేసింది. వారు వీధుల్లోకి వెళ్లకుండా ఉండాల్సిందని ఆమె సూచించింది. 'లైంగిక వేధింపులకు సంబంధించి ఫిర్యాదు చేసేందుకు ఐఓఏలో ఒక కమిటీతో పాటు అథ్లెటిక్స్ కమిషన్ కూడా ఉంది. వారంతా వీధుల్లోకి వెళ్లకుండా మా వద్దకు రావాల్సింది. కానీ వారు అలా చేయలేదు. కొంత క్రమశిక్షణ కూడా అవసరం. వారు చేస్తున్న పని ఆటకు మంచిది కాదు. ప్రపంచవ్యాప్తంగా భారత్‌కు మంచి పేరు ఉంది. ఇలాంటి నిరసనల వల్ల దేశం పరువు పోతోంది. ఈ తరహా ప్రతికూల ప్రచారం దేశానికి మంచిది కాదు. ఏదైనా చట్టప్రకారం ఉండాలి. వారంతా ధర్నాలో కూర్చొని రాజకీయ పార్టీల మద్దతు కోరడం నన్ను తీవ్రంగా నిరాశపరుస్తోంది' అని పీటీ ఉష అభిప్రాయపడింది. ఉష మాటలపై స్టార్ రెజ్లర్ బజరంగ్ పూనియా ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. 'ఆమె స్వయంగా ఒక అథ్లెట్. పైగా మహిళ కూడా. మేం ఆమె మద్దతు కోరుకున్నాం. కానీ ఆమె నుంచి ఇలాంటి తీవ్రమైన స్పందన ఊహించలేదు. రెజ్లర్ల చర్య వల్ల భారత్ పరువు పోతోంది అని భావిస్తే గతంలో తన అకాడమీలో కొందరు గూండాలు తనను వేధిస్తున్నారంటూ ఆమె అందరి ముందు ఏడవలేదా. అప్పుడేం జరిగింది' అంటూ బజరంగ్ గుర్తు చేశాడు.

వారికీ అవకాశమిచ్చాం: క్రీడల మంత్రి ఠాకూర్

రెజ్లర్ల సమస్యను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన కమిటీ నిష్పక్షపాతంగా విచారణ జరుపుతోందని కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. తమ వైపు నుంచి అన్ని విషయాలను వెల్లడించేందుకు రెజ్లర్లకు తగినంత అవకాశం ఇచ్చామని ఆయన స్పష్టం చేశారు. మూడు నెలల క్రితం తొలిసారి వారు నిరసన జరిపినప్పుడు తాను స్వయంగా 12 గంటల పాటు వారితో చర్చలు జరిపానని... విచారణ కమిటీ 14 సార్లు సమావేశాలు నిర్వహించి ఆటగాళ్ల తమ బాధలు చెప్పుకునే అవకాశం ఇచ్చిందని ఠాకూర్ అన్నారు.

యువర్స్

గేమింగ్

అదిగో అక్కడే ఉన్నారు!

ఫస్ట్–పర్సన్ షూటర్ వీడియో గేమ్ 'రెడ్ ఫాల్' మే2న విడుదల అవుతుంది. ఫిక్షనల్ ఐలాండ్‌లో జరిగే ఫస్ట్ పర్సన్ షూటర్‌గేమ్ ఇది. వ్యాంపైర్స్‌తో పోరాటం చేయడానికి విభిన్న నేపథ్యాలు, శక్తిసామర్థ్యాలు ఉన్న నాలుగు క్యారెక్టర్‌లలో ఒకటిని ప్లేయర్ ఎంచుకోవాలి. ఆ క్యారెక్టర్స్...

దెవిందర్ క్రాస్లే: ఇంటర్‌నెట్–ఫేమస్ పారానార్మల్ ఇన్వెస్టిగేటర్; **లైల్ల ఎలిసన్:** రెడ్‌ఫాల్ టెక్నికల్ యూనివర్శిటీ స్టూడెంట్; **జాకబ్ బోయర్:** మాజీ–మిల్ట్రీ షార్ప్ షూటర్ **రెమీ డెల రోజ్:** నేవీ రెస్క్యూ సర్వీస్‌లో పనిచేసే షార్ప్‌షూటర్. ఈ నాలుగు క్యారెక్టర్లకు ద్వీప పట్టణంతో తమదైన అనుభవాలు, అనుబంధాలు ఉంటాయి.



ప్లాట్‌ఫామ్: విండోస్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్
జానర్: ఫస్ట్–పర్సన్ షూటర్ **ఇంజిన్:** అన్ రియల్ ఇంజిన్ 4
మోడ్స్: సింగిల్ ప్లేయర్, మల్టీ ప్లేయర్

మ్యూజిక్ వరల్డ్

పాటల రెక్కలతో..


షల్మాలీ ఖోల్‌గాడే

ఎనిమిది సంవత్సరాల వయసులో తీయగా గొంతు సవరించి 'ఆహా' అనిపించింది ముంబైకి చెందిన షల్మాలీ ఖోల్‌గాడే. పదహారు సంవత్సరాల వయసులో సంగీత వేదికలపై పాడడం మొదలుపెట్టింది. ఇరవైలలో 'ఇష్క్‌జాదే' సినిమాతో బాలీవుడ్ ఆరంగేట్రం చేసింది. హిందీతో పాటు బెంగాలీ, మరాఠీ, తెలుగు, తమిళం... మొదలైన భాషలలో పాడింది.

చిన్న వయసులోనే సింగర్‌గా పెద్ద పేరు తెచ్చుకున్న షల్మాలీ ఇలా అంటోంది...

'ఫిల్మ్ మ్యూజిక్ వల్ల తక్కువ టైమ్‌లోనే సుపరిచితం అవుతాం. నాకు కూడా అలాగే పేరు వచ్చింది. దీని కంటే నాకు బాగా సంతోషం ఇచ్చే విషయం సొంతంగా రాయడం. సంగీతం సమకూర్చడం... మొదలైనవి'.

సినిమాలకు నేపథ్యగీతాలు ఆలపించడం ఒక ఎత్తయితే, లైవ్ ఈవెంట్స్‌లో ప్రేక్షకులను ఆకట్టుకోవడం మరో ఎత్తు. లైవ్ ఈవెంట్స్‌లో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయడంలో మంచి పేరు తెచ్చుకుంది షల్మాలీ.

'జనాల మధ్య పాడితే వచ్చే ఉత్సాహమే వేరు' అంటోంది.

అభిమానుల మాటలలో చెప్పాలంటే 'ఆమె పాటల రెక్కలతో అందమైన ఊహాలోకాల్లో సంచరించవచ్చు'.

సక్సెస్ స్టోరీ


హర్ష్ అగర్వాల్, నిఖిత తివారి

శుభప్రద శూల్

నేల గుండె చప్పుడు వింటే ఎన్నో సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయి. నిఖిత తివారి, హర్ష్ అగర్వాల్‌లు 'శూల్' అనే సెన్సర్‌కు రూపకల్పన చేశారు. తక్కువ సమయంలోనే రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపుతున్నారు. రైతుల ఆర్థిక భారాన్ని తగ్గిస్తున్నారు...

మనిషికి ఆరోగ్యం ఉన్నట్లే, భూమికి కూడా ఉంటుంది. అయితే దాని బాగోగుల గురించి పట్టించుకునే సంప్రదాయం మన దగ్గర తక్కువగా ఉంది.

వ్యవసాయరంగమే వెన్నెముక అయిన మన దేశంలో భూమి, పంటలకు సంబంధించిన శాస్త్రీయ అవగాహన చాలా తక్కువమంది రైతులకు మాత్రమే ఉంది. మన దేశంలో ఆన్–ఫీల్డ్ ఎనాలటిక్స్‌కు సంబంధించిన కంపెనీలు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నాయి. మరోవైపు ఆ సాంకేతిక జ్ఞానాన్ని అందిపుచ్చుకునే ఆర్థిక స్థోమత చాలామంది రైతులకు లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని 27 సంవత్సరాల హర్ష్ అగర్వాల్, 26 సంవత్సరాల నికిత తివారిలు 'నీర్‌ఎక్స్' అనే అగ్రిటెక్ స్టార్టప్‌కు శ్రీకారం చుట్టారు.

రాజస్థాన్‌లోని జైపుర్‌కు చెందిన హర్ష్ అగర్వాల్ గుజరాత్‌లోని అహ్మదాబాద్ నిర్మ యూనివర్శిటీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చేశాడు. సాంకేతిక విషయాలపై ఆసక్తి ఉన్న అగర్వాల్‌కు కాలేజి స్టూడెంట్ ఆర్గనైజేషన్‌కు వైస్–ప్రెసిడెంట్‌గా పనిచేయడంతో మేనేజ్‌మెంట్ స్కిల్స్ అలవడ్డాయి. అవి తన స్టార్టప్ నడకలో ఉపయోగపడ్డాయి.

ఛత్తీస్‌ఘడ్‌లోని అంబికాపూర్‌కు చెందిన నికిత తివారి రాయ్‌పూర్‌లోని 'నిట్'లో ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్‌లో బీటెక్ చేసింది.

గుజరాత్‌లోని అమ్రాపూర్‌లో జరిగిన 'సృష్టి–సమ్మర్ స్కూల్: ఇన్నోవేషన్' ఆ ఇద్దరిని ఒకరికొకరు పరిచయం అయ్యేలా చేసింది. గ్రాస్‌రూట్ లెవెల్లో ఇన్నోవేషన్‌పై ఆసక్తి కలిగించేలా చేసింది.

కాలేజీ ప్రాజెక్ట్‌లో భాగంగా మొదట ఇద్దరూ కలిసి 'శూల్' మొబైల్ అప్లికేషన్‌పై పనిచేశారు.

'వాతావరణంలో మార్పులు జరుగుతుంటాయి. కొన్నిసార్లు ఊహలకు అందవు. ఇలాంటి పరిస్థితులలో రియల్ టైమ్ అప్‌డేట్‌లను నిమిషాల వ్యవధిలో రైతులకు అందించాలనుకొన్నాం. మా కల ఫలించింది' అంటున్నాడు హర్ష్ అగర్వాల్.

'మా టెక్నాలజీలో ఎక్కువ శాతం అంతర్జాలం అవసరం లేకుండానే వాడుకోవచ్చు' అంటుంది నికిత తివారి.

భూసార పరీక్షకేంద్రాలతో ఫలితాలు తెలుసుకోవడానికి వారాలు పడుతుంది. అయితే శాటిలైట్ డాటా ద్వారా నిమిషాల వ్యవధిలోనే 'శూల్' ఫలితాలు అందిస్తోంది.

'శూల్ సెన్స్' యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్న రైతులకు ల్యాండ్ టోపాలజీ, వేసిన పంట, వాతావరణం, ప్రాంతం ఆధారంగా విలువైన సమాచారాన్ని అందిస్తోంది నీర్‌ఎక్స్.

> 'శూల్ సెన్స్' యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్న రైతులకు ల్యాండ్ టోపాలజీ, వేసిన పంట, వాతావరణం, ప్రాంతం ఆధారంగా విలువైన సమాచారాన్ని అందిస్తోంది నీర్‌ఎక్స్.

'సరియైన ఎరువులు వాడకపోవడం వల్ల భూమికి సంబంధించి సమస్యలు ఎదుర్కొన్నాను. ఈ సమయంలో నీర్‌ఎక్స్ మొబైల్ అప్లికేషన్ నాకు ఎంతో ఉపయోగపడింది' అంటున్నాడు ఛత్తీస్‌ఘడ్‌లోని బలరామ్‌పూర్‌కు చెందిన సంతోష్ పర్మార్ అనే రైతు.

కంపెనీ ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాలలోని ఎంతోమంది రైతులతో కలిసి పనిచేసింది. దీనితోపాటు 60 ఆర్గనైజేషన్స్, రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లతో కలిసి పని చేసింది. ఈ స్టార్టప్‌కు పెద్దగా ఫండింగ్ లేకపోయినప్పటికీ స్టార్టప్ అప్లికేషన్ స్కీమ్‌లో భాగంగా గుజరాత్ ప్రభుత్వం గ్రాంట్ అందించింది.

'గ్రాంట్ డబ్బు ద్వారా తయారీ ఖర్చు తగ్గించడం, డివైజ్ ఎక్కువమంది రైతులకు అందుబాటులోకి వచ్చేలా చేయడంపై దృష్టి పెడుతున్నాం' అంటున్నాడు అగర్వాల్.


టెక్... టాక్

గెలాక్సీ ఎన్‌హ్యాన్స్–ఎక్స్ ఫొటో ఎడిటింగ్ యాప్



గెలాక్సీ ఎస్23 సిరీస్‌లో భాగంగా శాంసంగ్ గెలాక్సీ ఎన్‌హ్యాన్స్–ఎక్స్ ఫొటో ఎడిటింగ్ యాప్‌ను విడుదల చేసింది. ఈ ఫొటో అప్‌స్కేల్డ్ అండ్ మ్యాజిక్ ఎడిటర్ హెచ్‌ఆర్‌డీ ఇమేజ్‌లకు, వాటిని బ్రైటెన్ చేయడానికి, ఫిక్స్ బ్లర్, షార్పెన్, షాడోస్ రిఫ్లెక్షన్ తొలిగించడానికి, లెన్స్ డిస్ట్రాక్షన్ ఫిక్స్ చేయడానికి, పోట్రాయిట్ మోడ్ క్రియేట్ చేయడానికి ఉపయోగపడుతుంది. దీనిలో ఫేస్–రీటచింగ్ ఫీచర్స్ కూడా ఉన్నాయి.

రియల్‌మీ సీ55



డిస్‌ప్లే: 6.72 అంగుళాలు ఓఎస్: ఆండ్రాయిడ్ 13; రిజల్యూషన్: 1080×2400 పిక్సెల్స్ ఫ్రంట్ కెమెరా: 8ఎంపీ (వైడ్)
మెమొరీ: 64జీబి 4జీబి ర్యామ్ 64జీబి 6జీబి ర్యామ్ 128జీబి 6జీబి ర్యామ్ 128జీబి 8జీబి ర్యామ్ 256జీబి 8జీబి ర్యామ్
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్ బరువు: 190గ్రా.

జీమెయిల్ లేబుల్స్




జీమెయిల్ లేబుల్స్ ద్వారా ఇమెయిల్స్‌ను రకరకాలుగా వర్గీకరించుకోవచ్చు. దీని ద్వారా ఇన్‌బాక్స్‌ను క్లీన్, క్లట్టర్ ఫ్రీగా చేసుకోవచ్చు. ఈజీ ఐడెంటిఫికేషన్ కోసం రంగులు ఇచ్చుకోవచ్చు.

కొత్త జీమెయిల్ లేబుల్ క్రియేట్ చేయడానికి (ఫ్రమ్ సైడ్ బార్): జీమెయిల్ డెస్క్‌టాప్ సైట్ లెఫ్ట్‌సైడ్‌బార్‌లో 'క్రియేట్ న్యూ లేబుల్ ఆప్షన్' కనిపిస్తుంది.

ఇమెయిల్స్‌కు లేబుల్స్ యాడ్ చేయడానికి (డెస్క్‌టాప్): ఇమెయిల్ ఓపెన్ చేసి టాప్‌లోని లేబుల్ ఐకాన్‌ను ట్యాప్ చేయాలి. లేబుల్ జాబితాలో నుంచి ఒకదాన్ని ఎంచుకొని క్లిక్ చేయాలి.

స్నాప్‌చాట్‌లో కొత్త టూల్స్



కాలిఫోర్నియాలో జరిగిన స్నాప్‌చాట్ సమ్మిట్ 2023లో కొత్త ఫీచర్స్, టూల్స్, ఇనోవేషన్‌లను ప్రకటించింది మల్టీ మీడియా ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్ స్నాప్‌చాట్. ట్రివ్య క్వశ్చన్‌లకు జవాబులు ఇచ్చే, రెసిపీలకు సంబంధించి సలహాలు ఇచ్చే, ప్లాన్‌ట్రిప్‌కు హెల్ప్ చేసే 'మై ఏఐ' ప్లేఫుల్ చాట్‌బాట్‌లో, వాయిస్, వీడియో కాలింగ్, స్టోరీస్, స్నాప్‌మ్యాప్... మొదలైన వాటిలో కొత్త ఫీచర్స్‌ను తీసుకురానున్నారు.

స్టోరీ టెల్లింగ్‌ను బెటర్‌మెంట్ చేయడానికి క్రియేటర్ కమ్యూనిటీ కోసం సినిమాటిక్ టూల్స్, సరికొత్త సంగీత అనుభవాన్ని దగ్గర చేయడానికి ప్రపంచ ప్రసిద్ధ డీజే కైజో భాగస్వామ్యంతో కైజో ఎక్స్ స్నాప్‌చాట్‌ను తీసుకురానున్నారు.

ఇంగ్లిష్ ఇడియమ్



బాయిల్ ది ఓషియన్
చాలా కష్టం, అసాధ్యం అనుకున్న ప్రాజెక్ట్‌ను టేకప్ చేసినప్పుడు వాడుతారు.

కట్ కార్నర్స్
ఏదైన పనిని సులువుగా, తక్కువ ఖర్చుతో చేయడం.

టేక్ ఏ రెయిన్ చెక్... ప్లాన్‌ను పోస్ట్‌పోన్ చేసుకోవడం.

ఏ బోల్ట్ ఫ్రమ్ ది బ్లూ... ఊహించని, అనుకోకుండా జరిగిన సంఘటన.

బ్యాక్ టు స్క్వేర్ వన్... మళ్లీ తిరిగి పని ప్రారంభించడం. **ఫార్టీ వింక్స్...** చిన్నగా కునుకుతీయడం

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
349	101
60,649	17,915

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	12,084	▲	230
డోజోన్స్	33,693	▽	392
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,832	▽	21
డాక్స్	15,800	▲	5
షాంఘై	3,286	▲	22
నికాయ్	28,458	▲	41

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారెట్)	60,515	▲	84
బంగారం (22 క్యారెట్)	60,273	▲	84
వెండి (కిలో)	74,415	▲	215

విప్రో లాభం ఫ్లాట్



క్యూ4లో రూ. 3,075 కోట్లు

న్యూఢిల్లీ: ఐటీ సేవల దిగ్గజం విప్రో లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరం (2022–23) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి (క్యూ4)లో నికర లాభం నామమాత్ర వెనకడుగుతో రూ. 3,075 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది (2021–22) ఇదే కాలంలో రూ. 3,087 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 11 శాతం వృద్ధితో రూ. 23,190 కోట్లను అధిగమించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి సైతం విప్రో నికర లాభం 7 శాతం క్షీణించి రూ. 11,350 కోట్లకు పరిమితమైంది. అయితే మొత్తం ఆదాయం 14 శాతం పైగా ఎగసి రూ. 90,488 కోట్లను తాకింది. క్యూ4లో 1,823 మంది ఉద్యోగులు తగ్గడంతో మొత్తం సిబ్బంది సంఖ్య 2,56,921కు పరిమితమైంది.

అంచనాలు వీక్..: 2023–24 తొలి త్రైమాసికం (ఏప్రిల్–జూన్)లో ఐఎస్ఆర్ఈ సహా.. ఐటీ సర్వీసుల బిజినెస్ నుంచి ఆదాయం త్రైమాసికవారీగా 3–1% మధ్య క్షీణించవచ్చని విప్రో తాజాగా అంచనా వేసింది. వెరసి 275.3–281.1 కోట్ల డాలర్ల మధ్య ఆదాయం సాధించవచ్చని గైడెన్స్ ప్రకటించింది. బీఎఫ్ఎస్ఐ, రిటైల్‌లో మందగమన పరిస్థితులున్నా, డీల్ పైప్‌లైన్ పటిష్టంగా ఉన్నట్లు విప్రో సీఈవో, ఎండీ థియరీ డెలాపోర్ట్ పేర్కొన్నారు.

షేర్ల బైబ్యాక్‌కు సై: సొంత ఈక్విటీ షేర్ల కొనుగోలు(బైబ్యాక్)కు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు విప్రో తాజాగా వెల్లడించింది. దీనిలో భాగంగా షేరుకి రూ. 445 ధర మించకుండా 26,96,62,921 షేర్లను బైబ్యాక్ చేయనున్నట్లు తెలియజేసింది. ఇవి కంపెనీ ఈక్విటీలో 4.91 శాతం వాటాకు సమానం కాగా..ఇందుకు రూ. 12,000 కోట్లవరకూ వెచ్చించనున్నట్లు వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో విప్రో షేరు ఎన్ఎస్ఈలో యథాతథంగా రూ. 375 వద్ద ముగిసింది.

హెచ్‌యూఎల్ లాభం ప్లస్

- క్యూ4లో రూ. 2,601 కోట్లు
- షేరుకి రూ. 22 డివిడెండ్



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 13% బలపడి రూ. 2,601 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో రూ. 2,307 కోట్లు ఆర్జించింది. అమ్మకాల పరిమాణం, మార్జిన్లు మెరుగుపడటం లాభాల వృద్ధికి దోహదపడింది. నికర అమ్మకాలు 11 శాతం పుంజుకుని రూ. 14,926 కోట్లకు చేరాయి. అంతక్రితం క్యూ4లో రూ. 13,468 కోట్ల అమ్మకాలు నమోదయ్యాయి. సర్వీసులతో కలిపి మొత్తం రూ. 15,375 కోట్ల నిర్వహణ ఆదాయం సాధించినట్లు కంపెనీ పేర్కొంది. అయితే మొత్తం వ్యయాలు రూ. 10,782 కోట్ల నుంచి రూ. 11,961 కోట్లకు పెరిగాయి. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 22 చొప్పున తుది డివిడెండును ప్రకటించింది.

విభాగాలవారీగా: క్యూ4లో హెచ్‌యూఎల్ హోమ్ కేర్ విభాగం ఆదాయం 19% వృద్ధితో రూ. 5,637 కోట్లను తాకింది. సౌందర్యం, వ్యక్తిగత సంరక్షణ ఆదాయం 11% పుంజుకుని రూ. 5,257 కోట్లకు చేరింది. ఇక ఫుడ్స్, రిఫ్రెష్‌మెంట్ నుంచి 3 శాతం అధికంగా రూ. 3,794 కోట్లు నమోదైంది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి హెచ్‌యూఎల్ కన్సాలిడేటెడ్ నికర లాభం 14% ఎగసి రూ.10,143 కోట్లను తాకింది. 2021–22లో రూ. 8,892 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం 15% పైగా జంప్‌చేసి రూ.59,443 కోట్లయ్యింది. అంతక్రితం రూ.51,472 కోట్ల టర్నోవర్ సాధించింది.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌యూఎల్ షేరు 1.7 శాతం క్షీణించి రూ. 2,469 వద్ద ముగిసింది.

నష్టాల్లోకి యాక్సిస్ బ్యాంక్

- క్యూ4లో రూ. 5,728 కోట్ల నష్టం
- సిటీఇండియా రిటైల్ కొనుగోలు ఎఫెక్ట్



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ గత ఆర్థిక సంవత్సరం (2022–23) చివరి త్రైమాసికంలో లాభాలను వీడి నష్టాలలోకి ప్రవేశించింది. జనవరి–మార్చి (క్యూ4)లో రూ. 5,728 కోట్ల నికర నష్టం ప్రకటించింది. అంతక్రితం ఏడాది (2021–2022 ఇదే కాలంలో రూ.4,118 కోట్ల నికర లాభం ఆర్జించింది. కాగా.. మొత్తం ఆదాయం రూ.22,000 కోట్ల నుంచి రూ.28,865 కోట్లకు ఎగసింది. వడ్డీ ఆదాయం సైతం రూ. 17,776 కోట్ల నుంచి రూ.23,970 కోట్లకు బలపడింది. బ్యాంకు బోర్డు వాటాదారులకు షేరుకి రూ.1 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన క్యూ4లో రూ. 5,361 కోట్ల నికర నష్టం నమోదైంది. అంతక్రితం ఏడాది క్యూ4లో రూ. 4,417 కోట్ల నికర లాభం ఆర్జించింది. సిటీఇండియా రిటైల్ బిజినెస్ కొనుగోలు నేపథ్యంలో నష్టాలు నమోదైనట్లు బ్యాంక్ పేర్కొంది. ఈ ప్రభావాన్ని (రూ. 12,490 కోట్లు) మినహాయిస్తే నికర లాభం 61% వృద్ధి సాధించినట్లని బ్యాంక్ సీఈవో అమితాబ్ చౌదరీ చెప్పారు.

ఎన్‌పీఏలు డౌన్

క్యూ4లో యాక్సిస్ బ్యాంక్ స్థూల మొండిబకాయిలు (ఎన్‌పీఏలు) 2.82 శాతం నుంచి 2.02 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు సైతం 0.73 శాతం నుంచి 0.39 శాతానికి దిగివచ్చాయి. మొండిరుణాలు తగ్గడంతో ప్రొవిజన్లు, కంటిజెన్సీలు రూ. 987 కోట్ల నుంచి తగ్గి రూ. 306 కోట్లకు పరిమితమయ్యాయి. నికర వడ్డీ మార్జిన్లు 0.73 శాతం మెరుగై 4.22 శాతానికి చేరాయి.

ఫలితాల నేపథ్యంలో యాక్సిస్ బ్యాంక్ షేరు 0.8 శాతం క్షీణించి రూ. 881 వద్ద ముగిసింది.

పికప్ వాహన విభాగంలో ఎంఅండ్ఎం 2 కొత్త మోడళ్లు



హైదరాబాద్: సరకు రవాణాకు సంబంధించిన (పికప్) వాహన విభాగంలో మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం) రెండు కొత్త మోడళ్లను ఆవిష్కరించింది. రూ.7.85 లక్షల నుంచి రూ.10.33 లక్షల శ్రేణిలో ధరలు ఉన్న ఈ బొలెరో మ్యాక్స్ సామర్థ్యం 2 టన్నుల వరకూ ఉందని ఈ మేరకు విడుదలైన ఒక ప్రకటన తెలిపింది. రూ.24,999 చెల్లించి వీటిని బుక్ చేసుకోవచ్చని కూడా ప్రకటన వెల్లడించింది. 1.3 నుంచి 2 టన్నుల వరకూ పేలోడ్ సామర్థ్యంతో ఈ కొత్త శ్రేణి వాహనాలను మార్కెట్‌లోకి విడుదల చేసినట్లు ప్రకటన వివరించింది. కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక పరిజ్ఞానం, సదుపాయాలతో ఈ వాహన శ్రేణి ఉత్పత్తి జరిగినట్లు వివరించింది. హెచ్‌డీ సిరీస్ (హెచ్‌డీ 2.0, హెచ్‌డీ 1.7, హెచ్‌డీ 1.3 లీటర్లు) , సిటీ సిరీస్ (సిటీ 1.3, 1.4 సీఎస్‌జీ) సిరీస్‌లలో వాహనాలు లభ్యం కానున్నట్లు తెలిపింది.

మార్కెట్లకు ఐటీ, టెలికం దన్ను

- నాలుగో రోజూ కొనసాగిన ర్యాలీ
- సెన్సెక్స్ 349, నిఫ్టీ 101 పాయింట్లు అప్



ముంబై: విదేశీ పెట్టుబడుల ప్రవాహం, ఐటీ.. టెలికం స్టాక్స్‌లో కొనుగోళ్లు తదితర సానుకూల అంశాలతో స్టాక్ మార్కెట్లలో నాలుగో రోజూ ర్యాలీ కొనసాగింది. గురువారం సెన్సెక్స్ 349 పాయింట్లు పెరిగి 60,649 వద్ద, నిఫ్టీ 101 పాయింట్లు పెరిగి 17,915 పాయింట్ల వద్ద క్లోజయ్యాయి. నెలవారీ ఎక్స్‌పైరీ రోజున మార్కెట్ పటిష్టంగా ట్రేడయ్యిందని, అర శాతం పైగా లాభాలతో ముగిసిందని రెలిగేర్ బ్రోకింగ్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా తెలిపారు. సూచీలు ముందు ఫ్లాట్‌గా ప్రారంభమైనప్పటికీ తర్వాత పుంజుకున్నాయని వివరించారు. రియల్టీ, ఐటీ, ఆటో తదితర రంగాల స్టాక్స్ లాభపడ్డాయని పేర్కొన్నారు.

ఇన్ఫీ, రిలయన్స్ అప్..: దిగ్గజాలైన ఇన్ఫోసిస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో కొనుగోళ్లు .. మార్కెట్ ర్యాలీకి దోహదపడ్డాయి. బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, భారతీ ఎయిర్‌టెల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎల్అండ్‌టీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టెక్ మహీంద్రా, టైటాన్ తదితర స్టాక్స్ లాభపడ్డాయి. హిందుస్తాన్ యూనిలీవర్, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, ఎస్‌బీఐ, విప్రో, ఏషియన్ పెయింట్స్ మొదలైనవి నష్టపోయాయి. క్యూ4లో లాభాలు సుమారు 22 శాతం క్షీణించిన నేపథ్యంలో వోల్టాస్ షేర్లు గురువారం దాదాపు 6 శాతం క్షీణించాయి. సూచీలవారీగా చూస్తే రియల్టీ 1.57 శాతం, టెలికం 1.16 శాతం, ఐటీ 1.15 శాతం, క్యాపిటల్ గూడ్స్ 0.72 శాతం మేర పెరిగాయి. అంతర్జాతీయంగా చూస్తే ఆసియా మార్కెట్లలో కొరియా, జపాన్, చైనా, హాంకాంగ్ సూచీలు లాభాల్లో ముగిశాయి. గురువారం విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) నికరంగా రూ. 1,653 కోట్లు, దేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐ) రూ. 97 కోట్ల మేర కొనుగోళ్లు జరిపారు.

మ్యాన్‌కైండ్ ఐపీవో సక్సెస్

15 రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్



గురువారం ముగిసిన మ్యాన్‌కైండ్ ఫార్మా పబ్లిక్ ఇష్యూకి 15.32 రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్ లభించింది. కంపెనీ 2.8 కోట్లకు పైగా షేర్లు ఆఫర్ చేయగా.. 42.95 కోట్లకు పైగా షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి. క్విబ్ విభాగంలో అత్యధికంగా 49.2 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 3.8 రెట్లు అధికంగా స్పందన లభించింది. రిటైల్ ఇన్వెస్టర్లు మాత్రం 92 శాతానికే దరఖాస్తు చేశారు. ఇష్యూకి ధరల శ్రేణి రూ.1,026–1,080కాగా.. తద్వారా కంపెనీ రూ. 4,326 కోట్ల సమీకరించింది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా కంపెనీ సోమవారం (24న) యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 1,298 కోట్ల పెట్టుబడులను సమకూర్చుకున్న సంగతి తెలిసిందే. ఒక్కో షేరుకీ రూ. 1,080 చొప్పున 1.2 కోట్ల షేర్లను జారీ చేసింది. మే 9న కంపెనీ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టకానున్నాయి.

బలహీన విధానాలతోనే
బ్యాంకింగ్ సంక్షోభం


- అమెరికాలో పరిణామాలకు ఇదే కారణం
- బలంగానే దేశీయ బ్యాంకులు
- ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్



ముంబై: బలహీన వ్యాపార విధానాలే అమెరికాలో బ్యాంకింగ్ సంక్షోభానికి కారణమై ఉండొచ్చని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ అన్నారు. ఈ నేపథ్యంలో దేశీయ బ్యాంకుల వ్యాపార విధానాలను తాము సునిశితంగా పరిశీలిస్తున్నట్టు చెప్పారు. అదే సమయంలో భారత బ్యాంకులు బలంగానే ఉన్నట్టు స్పష్టం చేశారు. అమెరికాలో ఇటీవలే సిలికాన్ వ్యాలీ బ్యాంకులో నిధుల సమస్య తలెత్తడం తెలిసిందే. డిపాజిటర్లలో అభద్రతకు దారితీసి, ఆ ప్రభావం ఇతర బ్యాంకులకూ విస్తరించడం తెలిసిందే. ఈ క్రమంలో శక్తికాంతదాస్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ''అమెరికాలో ఇటీవలి పరిణామాలు చూస్తే అక్కడ విడిగా ఒక్కో బ్యాంకుల వారీ వ్యాపార విధానాలు సరిగ్గానే ఉన్నాయా? లేవా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. భారత బ్యాంకుల వ్యాపార విధానాలను ఆర్‌బీఐ మరింత పరిశీలనగా చూడడం మొదలు పెట్టింది. ఒకవేళ లోపాలు ఉంటే అది సంక్షోభానికి దారితీయవచ్చు''అని శక్తికాంతదాస్ చెప్పారు. ముంబైలో ఓ అంతర్జాతీయ సదస్సును ప్రారంభించిన సందర్భంగా దాస్ ఈ అంశంపై మాట్లాడారు. ''బ్యాంకులు అనుసరించే వ్యాపార విధానాల వల్ల కొన్ని సందర్భాల్లో వాటి బ్యాలెన్స్ షీట్లలోని కొన్ని భాగాల్లో సమస్యలు ఏర్పడొచ్చు. అవి ఆ తర్వాత పెద్ద సంక్షోభానికి కారణం కావచ్చు. అమెరికా, యూరప్ బ్యాంకింగ్‌లో ఇటీవలి పరిణామాలు గమనిస్తే వాటి బ్యాలెన్స్ షీట్లలో సురక్షిత ఆస్తులు అనుకున్న వాటి నుంచే సమస్యలు ఎదురవుతున్నాయని తెలుస్తోంది''అని దాస్ పేర్కొన్నారు. అమెరికాలో సిలికాన్ వ్యాలీ బ్యాంకు సంక్షోభానికి ఆస్తుల, అప్పుల మధ్య అసమతుల్యత వల్లేనన్న అభిప్రాయం వ్యక్తం అవుతుండడం తెలిసిందే.

సినిమా

అటు యాక్షన్.. ఇటు డబ్బింగ్



• చిరంజీవి

హీరో చిరంజీవి బరిలోకి దిగి, విలన్లను రఫ్ఫాడిస్తున్నారు. ఇదంతా ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'భోళా శంకర్' కోసమే. మెహర్ రమేశ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో చిరంజీవికి జోడీగా తమన్నా నటిస్తున్నారు. చిరంజీవి చెల్లెలి పాత్రలో కీర్తీ సురేష్ కనిపించనుండగా, నటుడు సుశాంత్ లవర్ బాయ్ పాత్ర చేస్తున్నారు. క్రియేటివ్ కమర్షియల్స్‌తో కలిసి అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రామబ్రహ్మం సుంకర 'భోళా శంకర్'ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని ఇంటర్వెల్ ఫైట్ చిత్రీకరణను హైదరాబాద్‌లో ప్రారంభించింది యూనిట్. చిరంజీవి, షావర్ అలీ, వజ్ర అండ్ ఫైటర్స్, ఇతర ప్రముఖ తారాగణంపై ఈ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్నారు. మరోవైపు డబ్బింగ్ పనులకు కూడా గురువారమే శ్రీకారం చుట్టారు. ''భోళా శంకర్' 'కమర్షియల్ ఎంటర్‌టైనర్ మూవీ. ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్, యాక్షన్‌తో పాటు ఐఫీస్ట్ అనిపించే పాటలు ఉంటాయి. చిరంజీవిని స్టైలిష్ మాస్ అవతార్‌లో చూపిస్తున్నారు మెహర్ రమేశ్. జూన్‌లో షూటింగ్ పూర్తవుతుంది. ఆగస్టు 11న సినిమాని రిలీజ్ చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

క్యారెక్టర్ హీరో

టాలీవుడ్‌లో టాప్ క్యారెక్టర్ ఆర్టిస్టులు ఎవరంటే సీనియర్లలో రాజేంద్రప్రసాద్, వీకే నరేశ్, రావు రమేశ్, మురళీ శర్మ ఉంటారు. మంచి క్యారెక్టర్లు చేస్తున్న ఈ నటుల్లో రాజేంద్రప్రసాద్, నరేశ్ ఒకప్పుడు హీరోలుగా చేసిన విషయం తెలిసిందే. ఇన్నేళ్లు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా అలరిస్తున్న రావు రమేశ్ ఇప్పుడు హీరోగా చేస్తున్నారు. 'వీళ్లే చేయాలి' అనే తరహా లీడ్ రోల్స్‌లో ప్రస్తుతం రాజేంద్రప్రసాద్, నరేశ్, రావు రమేశ్ నటిస్తున్నారు. క్యారెక్టర్ ఆర్టిస్టులుగా మంచి పాత్రలు చేస్తున్న ఈ ముగ్గురూ 'క్యారెక్టర్ హీరో'గా చేస్తున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.



• రాజేంద్రప్రసాద్, అర్చన

రాజేంద్రప్రసాద్ షష్టిపూర్తి


తెలుగులో హాస్య కథా చిత్రాల హీరో అనగానే రాజేంద్ర ప్రసాద్ గుర్తుకొస్తారు. హీరోగా ప్రేక్షకులపై వినోదాల జల్లులు కురిపించిన ఆయన సెకండ్ ఇన్నింగ్స్‌లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా చేతిలో అరడజనుకు పైగా చిత్రాలతో దూసుకెళుతున్నారు. అడపా దడపా లీడ్ రోల్స్ కూడా చేస్తున్నారు రాజేంద్ర ప్రసాద్. ఆయన లీడ్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం 'షష్టిపూర్తి'. పవన్ ప్రభ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రాజేంద్ర ప్రసాద్‌కి జోడీగా అర్చన నటిస్తున్నారు. 'లేడీస్ టైలర్' (1986) తర్వాత ఈ ఇద్దరూ జంటగా నటిస్తున్న చిత్రం ఇదే కావడం విశేషం. షష్టిపూర్తి కథాంశంతో న్యూ ఏజ్ ఫ్యామిలీ డ్రామాగా ఈ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రంలో రూపేష్ కుమార్ చౌదరి మరో హీరోగా నటించడంతో పాటు నిర్మిస్తున్నారు. ఇళయ రాజా సంగీతం అందిస్తున్న ఈ చిత్రం జూలైలో రిలీజ్ కానుంది.



• నరేశ్, పవిత్ర

వీకే నరేశ్ మళ్ళీ పెళ్లి

హీరోగా వీకే నరేశ్‌కి ప్రత్యేక గుర్తింపు ఉంది. తనదైన హాస్యం, నటనతో ప్రేక్షకులను అలరించిన ఆయన క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గానూ వైవిధ్యమైన పాత్రలతో బిజీగా ఉంటున్నారు. కాగా నరేశ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'మళ్ళీ పెళ్లి'. ఎంఎస్ రాజు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వీకే నరేశ్, పవిత్రా లోకేశ్ జంటగా నటించారు. విజయకృష్ణ మూవీస్ బ్యానర్‌పై వీకే నరేశ్ స్వయంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. తెలుగులో 'మళ్ళీ పెళ్లి', కన్నడలో 'మత్తే మధువే' టైటిల్స్‌తో ఈ చిత్రం తెరకెక్కింది. మేలో ఈ చిత్రం విడుదల కానుంది. అందులో భాగంగా సురేశ్ బొబ్బిలి సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'ఉరిమే కాలమా..' అంటూ సాగే పాటని గురువారం విడుదల చేశారు. ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి పాడారు.



• రావు రమేశ్



• ఇంద్రజ

మారుతీనగర్‌లో రావు రమేశ్

విలక్షణమైన డైలాగ్ డెలివరీతో తనదైన శైలిలో విలనిజాన్ని పండించిన గొప్ప నటుడు రావు గోపాలరావు. తండ్రి వారసత్వంతో తెలుగు చిత్ర పరిశ్రమకి క్యారెక్టర్ ఆర్టిస్టుగా పరిచయమయ్యారు ఆయన తనయుడు రావు రమేశ్. విలన్, కమెడియన్, తండ్రి.. ఇలా పాత్ర ఏదైనా పరకాయ ప్రవేశం చేసి, విలక్షణ నటుడిగా గుర్తింపు పొందారు. ఇప్పుడు 'మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం' సినిమాలో కథానాయకుడిగా నటిస్తున్నారు రావు రమేశ్. 'హ్యాపీ వెడ్డింగ్' ఫేమ్ లక్ష్మణ్ కార్య ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో రావు రమేశ్‌కి జోడీగా ఇంద్రజ నటిస్తున్నారు. పీబీఆర్ సినిమాస్ పతాకంపై ఈ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రంలో నడి వయసులో ఉన్న ఒక మధ్య తరగతి నిరుద్యోగి పాత్రలో రావు రమేశ్ కనిపిస్తారు. ఆయన జీవితంలో క్షణ క్షణం జరిగే ట్విస్టులే చిత్ర కథాంశం. క్యారెక్టర్ ఆర్టిస్టుగా ప్రేక్షకులను అలరిస్తున్న రావు రమేశ్ తొలిసారి కథను నడిపే నాయకునిగా చేస్తున్న ఈ చిత్రంపై అంచనాలు ఉన్నాయి.

క్యారెక్టర్ ఆర్టిస్టులు కథానాయకులుగా చేస్తున్న ఈ మూడు చిత్రాలు ఇప్పుడు టాక్ ఆఫ్ ది టాలీవుడ్‌గా నిలిచాయి.

ఆ ఆఫర్ స్కామ్ అనుకున్నాను
– సాక్షీ వైద్య



''**తె**లుగులో నా తొలి సినిమా 'ఏజెంట్'. మంచి సినిమాతో పరిచయం కావడం ఆనందంగా ఉంది'' అన్నారు సాక్షీ వైద్య. అఖిల్ హీరోగా సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఏజెంట్'. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో సాక్షీ వైద్య మాట్లాడుతూ – ''వృత్తి రీత్యా నేను ఫిజియోథెరపిస్టుని. కోవిడ్ సమయంలో ఖాళీగా ఉండటం ఇష్టం లేక సోషల్ మీడియాలో కొన్ని రీల్స్ చేశాను. అవి వైరల్ అయ్యాయి. ఆ తర్వాత నా స్నేహితుల సలహా మేరకు కొన్ని ఆడిషన్స్ ఇచ్చాను. కొన్ని అవకాశాలు వచ్చినా నచ్చలేదు. కాగా 'ఏజెంట్' ప్రొడక్షన్ టీమ్ నుంచి ఒకరు ఫోన్ చేసి హీరోయిన్ చాన్స్ గురించి చెప్పారు. ఈ ఆఫర్‌ను నేను మొదట్లో స్కామ్ అనుకున్నాను. కానీ ముంబైలో ఉన్న ఓ కాస్టింగ్ డైరెక్టర్ ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పెద్ద బేనర్ అని, పెద్ద దర్శకుడు, పెద్ద స్టార్ అని చెప్పగానే హైదరాబాద్ వచ్చి ఆడిషన్స్ ఇచ్చాను. 'ఏజెంట్' కంప్లీట్ యాక్షన్ థ్రిల్లర్. ఈ చిత్రంలో పైలెట్ పాత్రలో కనిపిస్తాను. 'ఏజెంట్' నాకు మంచి అనుభూతిని ఇచ్చింది. ప్రస్తుతం వరుణ్ తేజ్‌తో 'గాండీవ దారి అర్జున' చేస్తున్నాను'' అన్నారు.

వినోదాల సామజవరగమన



• శ్రీవిష్ణు, రెబా మోనికా, రామ్ అబ్బరాజు, అనిల్ సుంకర, రాజేష్ దండా

శ్రీవిష్ణు హీరోగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సామజవరగమన'. రెబా మోనికా జాన్ హీరోయిన్. అనిల్ సుంకర సమర్పణలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం మే 18న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో శ్రీవిష్ణు మాట్లాడుతూ– ''సామజవరగమన' చాలా మంచి కథ. హిలేరియస్‌గా ఉంటుంది. ఫ్యామిలీ బ్యాక్‌డ్రాప్‌లో చాలా సినిమాలొచ్చాయి. కానీ ఈ చిత్రంలో ఫ్యామిలీ ఎలిమెంట్స్‌ను డీల్ చేస్తూనే ఓ కొత్త కాన్సెప్ట్‌ను చెప్పే ప్రయత్నం చేశాం. సెకండాఫ్‌లో వచ్చే ట్వంటీ మినిట్స్ కామెడీ హైలైట్‌గా ఉంటుంది'' అని అన్నారు. ''శ్రీవిష్ణు కథల ఎంపిక ప్రత్యేకంగా ఉంటుంది. కొత్త కాన్సెప్ట్‌తో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను తప్పక అలరిస్తుంది. సినిమా స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకూ ఆడియన్స్ నవ్వుతూ ఉంటారనే గ్యారంటీ ఇవ్వగలం'' అన్నారు అనిల్ సుంకర. ''ఫ్యామిలీ అంతా కలిసి చూసే ఫన్ మూవీ ఇది'' అన్నారు రామ్ అబ్బరాజు. ''ఈ సినిమా కథ విన్నప్పుడు ఎంజాయ్ చేశాను. రామ్ చెప్పిన కథను చెప్పినట్లు తీశాడు'' అన్నారు రాజేష్ దండా.

అప్పుడు భయం వేసింది
– మిర్నా మీనన్



''**నా** చిన్నతనం నుంచే నేను యాక్టర్‌ని కావాలనుకున్నాను. యాక్టింగ్ క్లాసులకు వెళ్లాను. అయితే కెరీర్‌ను స్టార్ట్ చేసిన తక్కువ సమయంలోనే రజనీకాంత్, మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్ వంటి సూపర్ స్టార్స్‌తో నటించే అవకాశం రావడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు హీరోయిన్ మిర్నా మీనన్. 'నాంది' తర్వాత హీరో 'అల్లరి' నరేశ్, దర్శకుడు విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'ఉగ్రం'. ఈ చిత్రంలో మిర్నా మీనన్ హీరోయిన్‌గా నటించారు. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించిన ఈ చిత్రం మే 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో మిర్నా మీనన్ మాట్లాడుతూ– ''క్రేజీఫెలో' చిత్రంతో తెలుగులో ఎంట్రీ ఇచ్చాను. రజనీకాంత్‌గారి 'జైలర్' సినిమాలో ఓ కీ రోల్ చేస్తున్నాను. సెట్స్‌లో రజనీగారు చాలా డౌన్ టు ఎర్త్ ఉంటారు. ఆ మాట, నడక అన్నింటిలో ఓ స్టైల్ ఉంటుంది. ఆయన స్టైల్‌తోనే పుట్టి ఉంటారనుకుంటున్నాను. ఈ సినిమాలో నటిస్తున్నప్పుడే నాకు 'ఉగ్రం'కి అవకాశం వచ్చింది. ఈ చిత్రంలో నేను కాలేజీ అమ్మాయిలా, గృహిణిలా, ఓ బిడ్డకు తల్లిలా పలు షేడ్స్‌లో కనిపిస్తాను. ఒకే సినిమాలో విభిన్న రకాల లుక్స్‌తో కనిపించడం చాలెంజింగ్‌గా అనిపించింది. ఈ సినిమాలోని ప్రతి సీన్‌కు ఓ మీనింగ్ ఉంటుంది. 'ఉగ్రం' కోసం దాదాపు 70 రోజులు వర్క్ చేశాను. ఇందులో 55 రోజులు నైట్ షూట్ చేశాం. కంటిన్యూస్‌గా 15 రోజులు నైట్‌షూట్‌లో పాల్గొన్నాను. ఓసారి బ్రేక్ లేకుండా 48 గంటలు వర్క్ చేశాను. ఇదో డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్. ట్రైలర్‌లో చూసిన కారు యాక్సిడెంట్ సీన్ మేం రియల్‌గానే చేశాం. ఆ సమయంలో నాకు చాలా భయం వేసింది. నరేశ్‌గారికి చిన్నపాటి గాయాలు కూడా అయ్యాయి. ప్రస్తుతం అమీర్‌గారి డైరెక్షన్‌లో ఓ తమిళ సినిమా చేస్తున్నాను. మలయాళంలో ఓ సినిమా కమిట్ అయ్యాను'' అన్నారు.

మదర్ థెరిస్సా సేవలతో..



• బనితా

భారతదేశంలో పేదలు, రోగులు, అనారోగ్యంతో మరణానికి దగ్గరైన వారికి 1940 మధ్యకాలంలో మదర్ థెరిస్సా అందించిన సేవల నేపథ్యంలో రూపొందిన చిత్రం 'మదర్ థెరిస్సా అండ్ మీ'. ఈ సినిమాలో భారత సంతతికి చెందిన బ్రిటిష్ మహిళ కవిత కథను కూడా ఆవిష్కరించారు. జాక్వెలిన్ ఫిట్షి కోర్నాజ్, బనితా సంధు, దీప్తి నావెల్ ప్రధాన పాత్రలు చేశారు. మదర్ థెరిస్సాగా జాక్వెలిన్ నటించగా, కవితగా బనితా సంధు కనిపిస్తారు. 'కర్రీ వెస్ట్రన్, మిలియన్స్ కెన్ వాక్' ఫేమ్ కమల్ ముసలే దర్శకత్వం వహించారు. క్రౌడ్ ఫండింగ్‌తో ఈ సినిమాను నిర్మించామని, వచ్చే లాభాలను స్వచ్ఛంద సేవా సంస్థలకు అందిస్తామని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాను తొలుత హిందీ, ఇంగ్లిష్ భాషల్లో, ఆ తర్వాత స్పానిష్‌లో డబ్ చేయాలనుకుంటున్నారు.

క్లుప్తంగా...

30 వరకు ఇగ్నో జూన్-23 టర్మ్ ఎండ్ పరీక్ష ఫీజు గడువు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) జూన్ – 2023 టర్మ్ ఎండ్ పరీక్షకు రూ.1,100 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 30 వరకు గడువును పొడిగించినట్లు ఇగ్నో విజయవాడ ప్రాంతీయ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ సుమలత తెలిపారు. అసైన్‌మెంట్ సమర్పించే తేదీని 30 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఇగ్నో స్నాతకోత్సవానికి సంబంధించి ఒరిజినల్ డిగ్రీని స్వయంగా తీసుకోవటానికి రూ.600 ఇగ్నో విజయవాడ పేరున డీడీ, ఐడీ కార్డ్ తీసుకొని, ప్రాంతీయ కార్యాలయం పని వేళల్లో సంప్రదించాలని తెలిపారు. పూర్తి వివరాలకు విజయవాడ కొత్తపేటలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని, లేదా 0866–2565253 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వందే భారత్ రైలుపై రాళ్లదాడి

- ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్న ఆర్‌పీఎఫ్

గూడూరు: తిరుపతి జిల్లా గూడూరు సమీపంలో గురువారం దుండగులు వందే భారత్ రైలుపై రాళ్ల దాడిచేశారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్టు ఆర్‌పీఎఫ్ సీఐ సందీప్ తెలిపారు. గురువారం సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళుతున్న రైలు మధ్యాహ్నం గూడూరు దాటిన తరువాత కొండగుంట స్టేషన్ ప్రాంతానికి చేరుకుంటున్న సమయంలో కొందరు రాళ్లతో దాడిచేసినట్లు చెప్పారు. ఈ దాడిలో రైలు అద్దాలు పగిలాయని, లోపలి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగలేదని తెలిపారు. విషయం తెలిసిన వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని వివరాలను సేకరించి ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఆర్‌పీఎఫ్ సీఐ చెప్పారు.

నాపై కేసు కొట్టేయండి

- హైకోర్టులో ఎమ్మెల్సీ సాబ్జీ పిటిషన్
- విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి : ఫోర్జరీ ఆధార్ కార్డులతో భక్తులను తిరుమల శ్రీవారి దర్శనానికి తీసుకొస్తున్నారన్న ఆరోపణలపై టీటీడీ విజిలెన్స్ అధికారుల ఫిర్యాదు మేరకు తనపై తిరుమల పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి గురువారం విచారణ జరిపారు. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

యుద్ధ విమానం స్వదేశీ గర్జన!



2028లో తొలి దేశీయ యుద్ధ విమానం ఎగరనుంది

2028 నాటికి ఏఎంసీఏ ఫేజ్ -1 ఎయిర్‌క్రాఫ్ట్ సిద్ధం

- అత్యాధునిక జీఈఎఫ్ 414 ఇంజన్‌తో తయారీ
- ఎలైట్ క్లబ్ ఆఫ్ నేషన్స్‌లో భారత్ చేరడం గర్వకారణం
- నేవల్ బాలిస్టిక్ మిసైల్ ప్రయోగం విజయవంతం కావడం శుభపరిణామం
- రక్షణ రంగంలో స్టార్టప్‌లకు ప్రోత్సాహం
- స్పేస్‌టెక్ రంగంలో ఎంఎస్‌ఎంఈలు, ప్రైవేట్ సంస్థలకు ఆహ్వానం
- 'సాక్షి'తో డీఆర్‌డీవో చైర్మన్ సమీర్ వి.కామత్



డీఆర్‌డీవో చైర్మన్ సమీర్ వి.కామత్

సాక్షి, విశాఖపట్నం: రక్షణ పరిశోధన సాంకేతిక రంగంలోకి ప్రైవేట్ సంస్థలను ఆహ్వానిస్తున్నట్లు డీఆర్‌డీవో చైర్మన్ సమీర్ వి.కామత్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్పేస్ పాలసీలో భాగంగా రక్షణ రంగంలో ప్రధానంగా స్పేస్ టెక్‌లో ప్రైవేట్ పరిశ్రమలు, పరిశోధన సంస్థలకు అవకాశాలు కల్పించినట్లు వివరించారు. విశాఖలో ని నేవల్ సైన్స్ అండ్ టెక్నలాజికల్ లేబొరేటరీ (ఎన్‌ఎస్‌టీఎల్)లో గురువారం ప్రారంభమైన కండిషన్ మానిటరింగ్ జాతీయ సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ఆయన 'సాక్షి'తో పలు అంశాలపై మాట్లాడారు.

అంతరిక్ష పరిశోధనలపై దృష్టి

స్పేస్ పాలసీలో భాగంగా పరిశోధనలపై దృష్టి సారించాం. ముఖ్యంగా రక్షణ శాఖతో పాటు అంతరిక్ష పరిశోధనలపై దృష్టి పెట్టాం. రాకెట్ లాంచింగ్, శాటిలైట్స్ అభివృద్ధి.. ఇలా ఎలాంటి హద్దులు లేకుండా ప్రైవేట్ సంస్థలు ముందుకు రావచ్చు. దీనిద్వారా అగ్ర దేశాలతో పోటీ పడే స్థాయికి వేగంగా చేరుకుంటాం. అంతరిక్ష ఆధారిత నిఘా, అంతరిక్ష పరిస్థితులపై మన అవగాహన సామర్థ్యాలు మెరుగుపడుతున్నాయి.

అంకుర సంస్థలకు ప్రోత్సాహం

రక్షణ రంగంలో స్టార్టప్స్‌ని ప్రోత్సహిస్తున్నాం. డిఫెన్స్ సిస్టమ్, టెక్నాలజీపై పని చేస్తున్న స్టార్టప్స్‌కు ప్రాధాన్యమిస్తున్నాం. పరిశోధన అభివృద్ధి(ఆర్ అండ్ డీ) బడ్జెట్‌లో 25 శాతం వరకూ పరిశ్రమలు, స్టార్టప్స్, విద్యారంగానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించడం శుభ పరిణామం. అందుకే స్టార్టప్స్, ఎంఎస్‌ఎంఈలకు అవకాశాలు కల్పిస్తున్నాం.

మేక్ ఇన్ ఇండియాలో భాగంగా మన సాయుధ బలగాల్లో చాలా వ్యవస్థలు స్వదేశీ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోనున్నాయి. ఇందులో భాగంగా ఎల్‌సీఏ ఎంకే–2 ఇండక్షన్‌కు సిద్ధమవుతున్నాం. జీఈఎఫ్ 414 ఇంజన్‌తో కూడిన ఏఎంసీఏ (అడ్వాన్స్‌డ్ మీడియమ్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్) ఫేజ్–1 యుద్ధ విమానాన్ని 2028లో ఎగురవేసేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నాం. ఇది పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారవుతోంది. దీనికి సంబంధించి అనుమతుల కోసం వేచి చూస్తున్నాం.

17 వేల అడుగుల ఎత్తు వరకు 'యూఏవీ'

మానవ రహిత వైమానిక వాహనం (యూఏవీ)పై ప్రధానంగా దృష్టి సారించాం. ఇందుకోసం గైడెన్స్ కిట్, సీట్ ఎజెక్షన్ సిస్టమ్, పైరోటెక్నిక్ కాట్రిడ్జ్ అభివృద్ధి చేసే పనిలో ఉన్నాం. 'యూఏవీ తపస్' కోసం 180 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన ఇంజన్‌ను దేశీయంగా అభివృద్ధి చేశాం. దీని ద్వారా యూఏవీ 17 వేల అడుగుల ఎత్తువరకూ ఎగరగలదు.

ఎలైట్ క్లబ్‌లో చేరడం గర్వకారణం

ఇటీవల 'సీ బేస్డ్ ఎండో అట్మాస్ఫియరిక్ ఇంటర్‌సెప్టర్ మిసైల్' తొలి విమాన ప్రయోగం విజయవంతం కావడంతో రక్షణ సామర్థ్యాల విషయంలో మన దేశం చరిత్రాత్మక మైలురాయిని అధిగమించింది. నేవల్ బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్ (బీఎండీ) సామర్థ్యంలో అగ్రదేశాల సరసన నిలిచి ఎలైట్ క్లబ్ ఆఫ్ నేషన్స్‌లో చేరడం గర్వకారణం. యుద్ధ నౌకలు, ఉపరితలం నుంచి బాలిస్టిక్ క్షిపణులను నిలువరించే సామర్థ్యాన్ని భారత్ అభివృద్ధి చేసింది. అంతకుముందే భూ ఆధారిత క్షిపణి ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించాం. ఈ జంట విజయాలతో సుదూర అణు క్షిపణులు, హైపర్ సోనిక్ మిసైల్స్, గ్లైడర్స్, శత్రు విమానాల్ని అడ్డుకోగల సామర్థ్యాన్ని మన దేశం సొంతం చేసుకుంది.

సామాజిక మౌలిక సదుపాయాల అభివృద్ధి అద్వితీయం

- సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి ప్రశంసించిన క్రికెటర్ అంబటి రాయుడు
- నార్పలలో దివ్యదీపిక ప్రసంగం వీడియోను ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన రాయుడు
- సీఎం చేసిన అభివృద్ధికి ఆ విద్యార్థిని ప్రసంగమే నిదర్శనమని ట్వీట్

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రముఖ క్రికెటర్, ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) జట్టు ఆటగాడు అంబటి రాయుడు మరోసారి ప్రశంసలవర్షం కురిపించారు. రాష్ట్రంలో విప్లవాత్మక సంస్కరణల ద్వారా విద్యా రంగం ముఖచిత్రాన్ని సీఎం వైఎస్ జగన్ సమూలంగా మార్చివేశారని ప్రశంసించారు. అనంతపురం జిల్లా నార్పలలో బుధవారం జగనన్న వసతి దీవెన పథకం కింద రూ.912.71 కోట్లను విద్యార్థుల తల్లుల ఖాతాల్లో సీఎం వైఎస్ జగన్ జమ చేశారు. ఈ సందర్భంగా నార్పలలో నిర్వహించిన సభలో అమ్మ ఒడి, విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాల ద్వారా నిరుపేద పిల్లలను ఉన్నత విద్యావంతులుగా సీఎం వైఎస్ జగన్ తీర్చిదిద్దుతున్నారంటూ దివ్య దీపిక అనే విద్యార్థిని ఉద్వేగపూరితంగా ప్రసంగించింది. నార్పల సభలో దివ్య దీపిక ప్రసంగం వీడియోను అంబటి రాయుడు గురువారం ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. 'రాష్ట్రంలో సామాజిక మౌలిక సదుపాయాల అభివృద్ధిలో సీఎం వైఎస్ జగన్ కృషి అద్వితీయం. నిజాయితీతో ఉద్వేగపూరితంగా దివ్య దీపిక అనే విద్యార్థిని చెప్పిన మాటలే సీఎం వైఎస్ జగన్ చేసిన అభివృద్ధికి నిదర్శనం' అని ట్వీట్ చేశారు.

ఇంటర్ ఫలితాలల్లో సత్తా చాటిన శశి వేలివెన్ను

ఉండ్రాజవరం: తూర్పు గోదావరి జిల్లా శశి వేలివెన్ను క్యాంపస్‌కు చెందిన విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ గురువారం తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు గానూ మట్టా నవ్యశ్రీ, యాతం లక్ష్మీప్రసన్న 988 మార్కులు, పులిగెడ్డ రామ తేజశ్రీ 987 మార్కులు, బైపీసీ విభాగంలో జేజీఎస్‌కె.ప్రసన్న 984 మార్కులు, ఎం.మృదులేశ్వరీ 983 మార్కులు సాధించారని తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను కరణం యశ్వంత్ నాయుడు, వై.శ్యామల సుధ, బి.పార్వతి, ఎ.రత్న రిషిక, కె.సాయి ప్రకాష్ 465 మార్కులు సాధించారని, బైపీసీ విభాగంలో 440 మార్కులకు గానూ కె.బాలకృష్ణ 434 మార్కులు, ఆర్.కుసుమ 433 మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని శశి విద్యాసంస్థల వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మీసుప్రియ అభినందించారు.

బాలికపై హత్యాచారం కేసులో నిందితుడికి యావజ్జీవం

చిలకలపూడి(మచిలీపట్నం): తొమ్మిదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడి ఆపై హత్య చేసిన వ్యక్తిపై నేరం రుజువు కావడంతో యావజ్జీవ శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి డాక్టర్ మొహమ్మద్ షేక్ ఫజులుల్లా గురువారం తీర్పు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం కీసర గ్రామంలో 2022 ఫిబ్రవరి 7న గ్రామంలోని సుబాబుల్‌తోటలోకి మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన పడాల సైదులు తీసుకువెళ్లి అత్యాచారం, హత్య చేశాడు. 9న బాలిక మృతదేహాన్ని చూసి స్థానికులు వీఆర్వోకు సమాచారం ఇచ్చారు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచికచర్ల పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి అప్పటి పోక్సో కోర్టు స్పెషల్ పీపీ వడ్డి జితేంద్ర 18 మంది సాక్షులను విచారించారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో చనిపోయే వరకు యావజ్జీవ జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

మార్గదర్శి ఆడిటర్ శ్రవణ్‌కు మధ్యంతర బెయిల్

- హైకోర్టు ధర్మాసనం ఉత్తర్వులు

సాక్షి, అమరావతి : మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిధుల మళ్లింపు వ్యవహారంలో సీఐడీ అరెస్టు చేసిన ఆడిటర్ కుదరవల్లి శ్రవణ్‌కుమార్‌కు రిమాండ్ విధిస్తూ విజయవాడ మూడో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు తప్పుపట్టింది. శ్రవణ్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. సెషన్స్ జడ్జి సంతృప్తి మేరకు రూ.50 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని, దర్యాప్తునకు సహకరించాలని శ్రవణ్‌ను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్ ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. డిపాజిటర్ల పరిరక్షణ చట్టం ప్రత్యేకమైనదని, ఈ చట్టం కింద నమోదు చేసిన కేసులో నిందితులను మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టు ముందు హాజరుపరచాలని ధర్మాసనం తెలిపింది. సీఐడీ అధికారులు మాత్రం శ్రవణ్‌ను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారని ఆక్షేపించింది. ఇది ప్రత్యేక చట్టం కింద నమోదైన కేసు అన్న విషయాన్ని మేజిస్ట్రేట్ పరిగణనలోకి తీసుకోలేదని, యాంత్రికంగా రిమాండ్‌కు పంపారని తెలిపింది. రిమాండ్‌ను సవాలు చేస్తూ శ్రవణ్ దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌కు విచారణార్హత ఉందని చెప్పింది.

1న పాలిటెక్నిక్ కాలేజీల్లో ఉద్యోగ విజయోత్సవం

మురళీనగర్ (విశాఖ ఉత్తర): పాలిటెక్నిక్ కాలేజీల్లో మే 1న ఉద్యోగ విజయోత్సవం నిర్వహించాలని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి ఆదేశించారు. ఈ ఏడాది ఉద్యోగాల కల్పనకు సంబంధించి ప్రత్యేకంగా నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో అనూహ్యమైన ఉత్తమ ఫలితాలు వచ్చాయని తెలిపారు. పాలిటెక్నిక్ కాలేజీలతోపాటు, క్లస్టర్ల వారీగా నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌ల కారణంగా రాష్ట్రంలో 3,500 మంది పాలిటెక్నిక్ విద్యార్థులు పలు కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మే 1న జాబ్ అచీవర్స్ డే నిర్వహించాలని పాలిటెక్నిక్ కాలేజీలకు ఉత్తర్వులు పంపారు. ఆరోజు ఉద్యోగాలు పొందిన వారికి ఆయా కంపెనీల నుంచి వచ్చిన నియామక పత్రాలు అందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలకు మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, కంపెనీల ప్రతినిధులు, పూర్వ విద్యార్థుల సంఘం తల్లిదండ్రులను ఆహ్వానించాలని సూచించారు. విద్యార్థులందరూ కాలేజీ యూనిఫాంలతో (ఏకరూప దుస్తులు) హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసులో సీఐడీ దూకుడు

ఏడుగురు కీలక అధికారుల విచారణ

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమ వ్యవహారాల కేసులో సీఐడీ దూకుడును గురువారం మరింతగా పెంచింది. చందాదారుల సొమ్ము నిబంధనలకు విరుద్ధంగా మళ్లింపు, అక్రమ డిపాజిట్ల వ్యవహారాల్లో ఏ1 చెరుకూరి రామోజీ రావు, ఏ 2 చెరుకూరి శైలజాకిరణ్‌కు సహాయకారిగా వ్యవహరించిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఏడుగురు కీలక అధికారుల విచారణ చేపట్టింది. ఈ అధికారులు మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఏపీలోని చందాదారుల నిధుల అక్రమ మళ్లింపులో సాధనంలా వ్యవహరించారు. నిధుల మళ్లింపునకు చెక్‌పవర్ కలిగిన మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లోని వైస్ ప్రెసిడెంట్‌లు సీహెచ్ సాంబమూర్తి, రాజాజీ, పి.మల్లికార్జున రావు, ఫైనాన్స్ డైరెక్టర్ వెంకట స్వామి, ఫైనాన్స్ జనరల్ మేనేజర్ టి.హరగోపాల్, జనరల్ మేనేజర్లు ఎల్.శ్రీనివాసరావు, జె.శ్రీనివాసరావును విచారించి ముఖ్యమైన ఆధారాలను రాబట్టినట్టు సమాచారం. కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం ప్రకారం సంబంధిత బ్రాంచి మేనేజర్ (ఫోర్‌మెన్)కు చెక్ పవర్ ఉండాలి. కానీ, మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో బ్రాంచి మేనేజర్లకు రూ.500 వరకు మాత్రమే చెక్ పవర్‌ను పరిమితం చేయడం గమనార్హం. మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజ కిరణ్‌తో పాటు మరో 11 మందికి నిబంధనలకు విరుద్ధంగా చెక్ పవర్ కేటాయించి నిధుల అక్రమ బదిలీకి పాల్పడ్డారు. అందులో ప్రధాన భూమిక పోషించిన ఈ ఏడుగురిని విచారించి కీలక ఆధారాలు రాబట్టడంతో పాటు వారి స్టేట్‌మెంట్ సీఐడీ నమోదు చేసుకుంది.

ప్రశాంత నిలయాలు.. శ్మశాన వాటికలు

ఆహ్లాదకరంగా రుద్రభూములు

దాతలు, ప్రభుత్వాల సహకారంతో శ్మశానాలకు కొత్త రూపు



ఆకివీడులోని వెలంపేట వద్ద దాతల సహకారంతో అభివృద్ధి చేసిన హిందూ శ్మశాన వాటిక

ఆకివీడు: శ్మశాన వాటికలు.. ఒకప్పుడు అటు వైపు వెళ్లాలంటే జనం భయపడేవారు. పుర్రెలు, ఎముకలు, చెత్తచెదారంతో అటు వైపు వెళ్లేందుకు జంకేవారు. కొందరైతే బహిర్భూమిగా వాడేవారు. అలాంటి రుద్రభూమి నేడు స్వర్గధామాల్ని తలపిస్తున్నాయి. పల్లెల నుంచి పట్టణాల వరకూ ఆధునిక వసతులతో, అందమైన శ్మశానాల్ని నిర్మిస్తున్నారు. శవంతో శ్మశానానికి వెళ్లిన వ్యక్తులకు ఆ ప్రాంతాన్ని చూస్తే ఒక రకమైన ఆందోళనకర వాతావరణం కనిపించేది. నేడు శ్మశాన భూములు ప్రశాంత వాతావరణంతో, పచ్చగా, పరిశుభ్రతతో ఉంటున్నాయి. కోటీశ్వరుడైనా, బికారైనా ఆఖరి మజిలీ ఇక్కడే. ప్రతి ఒక్కరికీ మోక్షం ఇక్కడే అని భావించి శ్మశాన వాటికల అభివృద్ధికి జిల్లాలోని పలు గ్రామాల్లోని దాతలు ఇటీవల ముందుకు వస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని 409 గ్రామ పంచాయతీల పరిధిలో రెండు, మూడు శ్మశాన వాటికలున్నాయి. వీటిలో సుమారు 120 నుంచి 150 స్మశాన వాటికల్ని ఇటీవల అభివృద్ధి పరిచారు.

స్వర్గధామంగా రుద్రభూమి

రుద్రభూములు స్వర్గధామాలుగా కన్పిస్తున్నాయి. గ్రామాల్లో దేవాలయాల అభివృద్ధి వలే దాతలు రుద్రభూముల అభివృద్ధికి విరాళాలిస్తున్నారు. లోతట్టులో ఉన్న రుద్రభూములలో ప్రభుత్వ నిధులతో పూడిక పనులు పూర్తి చేశారు. ఎంపీ లాడ్స్, ఉపాధి హామీ నిధులు, ఇతరత్రా నిధులతో రుద్ర భూములు అందంగా కన్పిస్తున్నాయి. రుద్రభూముల అభివృద్ధికి గ్రామాల్లో పెద్ద పీట వేస్తున్నారు. హిందూ, క్రైస్తవ శ్మశాన వాటికల అభివృద్ధితో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శ్మశాన వాటికల్లో చుట్టూ ప్రహరీ గోడలు నిర్మించి మొక్కలు పెంచుతున్నారు. పంచాయతీ పరిధిలో కుళాయి సౌకర్యం కల్పిస్తున్నారు. గార్డెన్లు పెంచుతున్నారు. సుందరవనాలుగా తీర్చిదిద్దుతున్నారు. శవ దహన కార్యక్రమాలకు వచ్చే బంధుమిత్రులు వేచి ఉండే గది, స్నానాదులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నారు. రుద్రనేత్రుడు, కాటికాపరిల విగ్రహాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. అంతిమ మజిలీకి మోక్ష ధామంగా శ్మశానాలు ఉన్నాయని పలు గ్రామాల్లో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఆకివీడులోని దొరగారి చెరువు వద్ద క్రైస్తవ శ్మశాన వాటిక

శ్మశానాల్లో అన్ని సౌకర్యాలు

కొల్లేరు తీరంలోని పెద కాపవరంలో నాలుగేళ్ల క్రితమే కుటీరాన్ని తలపిస్తూ శ్మశాన భవనాన్ని నిర్మించారు. శవ దహనాలు చేసిన అనంతరం ఆ ప్రాంతాన్ని శుభ్రపరచడంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం పూర్తయ్యింది. విశ్రాంతి భవనం, స్నానాలకు సౌకర్యం ఉంది. 26బీవీఆర్ఎంఎకెవీ05–కళారి రామకృష్ణ(రాము), పెద కాపవరం, ఆకివీడు మండలం

క్రైస్తవ శ్మశానాల్ని అభివృద్ధి చేయాలి

క్రైస్తవ స్మశాన వాటికల్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. దాతల సహకారంతో ఆకివీడులో ప్రహరీ గోడ నిర్మించాం. స్థల పూడికకు ఉపాధి హామీ నిధులు ఇచ్చారు. అన్ని గ్రామాల్లోని క్రైస్తవ స్మశాన భూముల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలి.

–జీ.జోసఫ్‌రాజు,
సీటీసీఎస్‌సీ టౌన్ చర్చి కార్యదర్శి, ఆకివీడు

ప్రయాణం.. ప్రశాంతం

మండే ఎండల్లో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను సౌకర్యవంతంగా శ్రీవారి చెంతకు చేర్చేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆర్టీసీకి దిక్సూచి కానుంది. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రయాణికులకు మెరుగైన వసతులు అందించాలన్న లక్ష్యంతో అలిపిరి డిపో కేంద్రంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత ఏడాది సెప్టెంబర్ 27న విద్యుత్ బస్సులను లాంఛనంగా ప్రారంభించారు. మన అవసరాలకు ఈ బస్సులు చక్కగా సరిపోతాయని ఈ ఆరు నెలల్లో నిర్ధారించుకున్న తర్వాత తిరుపతి నుంచి మరో 224 బ్యాటరీ బస్సులు నడపాలని ఆర్టీసీ నిర్ణయించుకుంది.





అలిపిరి డిపోలో విద్యుత్ బస్సులు

- పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా విద్యుత్ బస్సులు
- ప్రమాదాలకు దూరంగా అత్యాధునిక పరికరాలు
- శ్రీవారి భక్తుల కోసం వంద బస్సులు
- తిరుపతి నుంచి మరో 224 విద్యుత్ బస్సులు నడిపేందుకు చర్యలు
- రాష్ట్రంలో తొలి విద్యుత్ బస్సు డిపో అలిపిరి

ఏపీ నెట్‌వర్క్ : బ్యాటరీతో నడిచే బస్సు ఖరీదు ఒక్కోటి రూ.2 కోట్లకు పైమాటే. ఒకేసారి పెద్దమొత్తంలో బస్సుల కొనుగోలుకు ఆర్టీసీకి ఆర్థిక స్తోమత లేకపోవడంతో ప్రైవేటు భాగస్వామ్యంతో వీటిని ప్రవేశ పెడుతోంది. ప్రస్తుతం 12 ఏళ్లపాటు వంద బస్సులు నడిపేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇప్పటికే 95 బస్సులు తిరుపతికి చేరుకున్నాయి. వీటిలో 50 తిరుమలకు, మరో 14 రేణిగుంట విమానాశ్రయానికి నడుస్తున్నాయి. మిగిలిన 31 బస్సులు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఉన్నాయి. మరో ఐదు బస్సులు రావాల్సి ఉంది. ఒక్కో విద్యుత్ బస్సు ద్వారా కి.మీకు రూ.90 ఆదాయం వస్తుంది. అందులో రూ.58 ప్రైవేటు ఆపరేటర్‌కు చెల్లిస్తారు. మిగిలిన రూ.32 ఆర్టీసీకి చెందుతుంది. బస్సు డ్రైవర్ జీతభత్యాలను ప్రైవేటు ఆపరేటర్ భరిస్తారు. కండక్టర్లు, లోడింగ్ కంట్రోలర్లు, చార్జింగ్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది వేతనాలతో పాటు విద్యుత్ చార్జీలను ఆర్టీసీ భరించాల్సి ఉంటుంది. నిర్వహణ, చార్జింగ్ పాయింట్ల ఏర్పాటు, రిపేర్లు తదితరాలు ప్రైవేటు ఆపరేటర్లదే బాధ్యత. 12 ఏళ్ల తర్వాత కొత్త సర్వీసులు ఏర్పాటు చేయాలి. మూడేళ్లకు ఒకసారి బ్యాటరీలు మార్చు చేయాల్సి ఉంది. ప్రస్తుతం 50 సర్వీసులు ఇప్పటివరకు 3.5 లక్షల కిలోమీటర్లు తిప్పారు.

ప్రత్యేకంగా చార్జింగ్ పాయింట్లు



విద్యుత్ బస్సుల్లో ఉపయోగించే బ్యాటరీల చార్జింగ్ కోసం అలిపిరి డిపోలో 45, తిరుపతి బస్‌స్టాండ్‌లో 10 చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. మరో 60 చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయనున్నారు. వీటిలో సగం ఫాస్ట్ చార్జింగ్ పాయింట్లు ఉన్నాయి. ఫాస్ట్ చార్జింగ్ పాయింట్ల ద్వారా కేవలం 1.20 గంటల సమయంలోనే పూర్తిగా చార్జింగ్ అవుతుంది. సాధారణ చార్జింగ్ పాయింట్ల ద్వారా అయితే 3.20 గంటల సమయం పడుతుంది. ఒక బస్సులో ఉపయోగించే బ్యాటరీలు పూర్తిగా చార్జింగ్ చేస్తే 180 కి.మీ. ప్రయాణం చేయవచ్చు. ఒక బ్యాటరీ సుమారు మూడేళ్ల వరకు పనిచేస్తుంది. ఆ తర్వాత బ్యాటరీ మార్చాల్సి ఉంటుంది.

అత్యాధునిక టెక్నాలజీతో విద్యుత్ బస్సు





మామూలు బస్సులకు గేర్ సిస్టం ఉంటుంది. ప్రతి టర్నింగ్‌లో గేర్ మార్చుకోవాల్సి ఉంటుంది. విద్యుత్ బస్సులో గేర్లు ఉండవు. ఎంత వేగంగా వెళ్తున్నా వెంటనే కంట్రోల్ చేసే సిస్టం ప్రత్యేకం. డ్రైవింగ్‌లో లోపాలను సైతం బస్సులోని టెక్నాలజీ గుర్తించి హెచ్చరికలు చేస్తుంది. బస్సు చుట్టుపక్కల ప్రాంతాలన్నింటినీ డ్రైవర్ సులభంగా గమనించేలా మిర్రర్స్, కెమెరాలు ఉంటాయి. అసలు శబ్దమే లేని మోటారు, సౌకర్యవంతమైన సీట్లు, కుదుపులు లేని ఎయిర్‌కండిషన్ వాతావరణంలో ప్రయాణం ప్రజలకు మంచి అనుభూతినిస్తోంది.



చార్జీలో తేడా..

సాధారణ బస్సులకు, ఏసీ విద్యుత్ బస్సులకు చార్జి విషయంలో కేవలం రూ.30 మాత్రమే తేడా ఉండడంతో అంతా విద్యుత్ బస్సులో ప్రయాణించేందుకే ఆసక్తి చూపుతున్నారు. 36 సీట్లతో ఉన్న విద్యుత్ బస్సులో మెరుగైన సౌకర్యాలు ఉండడంతో ప్రయాణికులు తొలి ప్రాధాన్యత విద్యుత్ బస్సులకే ఇస్తున్నారు. విద్యుత్ బస్సులు నడిపేందుకు 120 మంది డ్రైవర్లను ఎంపిక చేసి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం 70 మంది డ్రైవర్లు పని చేస్తున్నారు. సాధారణ బస్సులతో పోలిస్తే విద్యుత్ బస్సు నడపడం సులభంగా ఉందని డ్రైవర్లు చెబుతున్నారు.

శ్రీవారి పాదాల చెంతనే తొలి విద్యుత్ బస్‌స్టాండ్

రాష్ట్రంలో తొలి విద్యుత్ బస్టాండ్‌ను వెంకన్న పాదాల చెంత అలిపిరిలో ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని డిపో మేనేజర్ హరిబాబు తెలిపారు. వారం క్రితం మరో 224 బస్సులను మంజూరు చేశారని ఆయన చెప్పారు. టెండర్ల ప్రక్రియ ముగిసిన వెంటనే ఆపరేటర్లను ఎంపిక చేస్తారని, కొత్తగా వచ్చే బస్సులను చుట్టుపక్కల ఉన్న పుణ్యక్షేత్రాలను కలిపేలా నడిపేందుకు ప్రణాళిక తయారు చేస్తున్నట్లు చెప్పారు. మరోవైపు తిరుపతి నుంచి బెంగుళూరు, చెన్నై, విజయవాడ, విశాఖపట్టణం మధ్య సైతం నడిపేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్త బస్సులను తిరుపతి మంగళం డిపో కేంద్రంగా ఆపరేట్ చేస్తారని ఆయన చెప్పారు.

కాలుష్య నివారణకు విద్యుత్ బస్సులు



శబ్ద, వాయు కాలుష్య నివారణ కోసం ప్రభుత్వం విద్యుత్ బస్సులను ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి–తిరుమలకు ఎంపిక చేసింది. ఆ మేరకు అలిపిరి డిపో నుంచి ఆపరేట్ చేస్తున్నాం. అదనంగా మరో 224 విద్యుత్ బస్సులు రానున్నాయి. వాటిని మంగళం డిపోతో పాటు జిల్లాలో అవసరం అయిన చోట నుంచి ఆపరేట్ చేస్తాం. తిరుమల కొండతో పాటు రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌కు, మదనపల్లి, నెల్లూరు, కడపకు తిరుపతి నుంచి సర్వీసులు ఏర్పాటు చేయనున్నాం.

–చెంగల్‌రెడ్డి,
జిల్లా ప్రజా రవాణా అధికారి, తిరుపతి

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943